
వెన్నెల వేట
యర్రంశెట్టి శాయి

# వెన్నెల వేట

అగర్వాల్ అగర్వాల్ కంపెనీ బెజవాడలో గవర్నరుపేట సెంటర్లో వుంది. పద్దెనిమిదేళ్ళు క్రమశిక్షణకు అలవాటుపడిన ఆ కంపెనీ గత పదిరోజులుగా గాడితప్పినట్లు మేనేజర్ బంగారయ్యకు అనుమానంగా వుంది. తను ఏ సమయంలో ఆఫీసుకొచ్చినా తలలు వంచుకుని నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ కనిపించే స్టాఫ్ గత పదిరోజులుగా తన మేనల్లుడు భవానీశంకర్ చుట్టూచేరి గట్టిగా నవ్వులు, అరుపులతో నానా గొడవగా తయారయ్యారు. అలా ఇంకోసారి జరిగితే సహించేది లేదని భవానీశంకర్ ని తను హెచ్చరించాడుగానీ ఏమీ లాభం కనిపించటంలేదు. ఆఫీస్ సూపర్నెంట్ చలపతి రోజూ తనకు భవానీశంకర్ నడత గురించి పితూరీలు చేస్తూనే వున్నాడు.

బంగారయ్య నిశ్శబ్దంగా ఆఫీస్ మెట్లెక్కాడు. అద్దాల్లోనుంచి కనబడుతోన్న దృశ్యం అతనికి పిచ్చెక్కించేసింది.

భవానీశంకర్ ఓ టేబుల్ మీద కూర్చుని ఏదో ఉత్సాహంగా చెబుతున్నాడు. మిగతా స్టాఫ్ అంతా అతని చుట్టూ చేరి పగలబడి నవ్వుతున్నారు.

"ఒక గొడుగులో ఆరుగురు నిలబడ్డారు. అయినా ఒక్కరు కూడా తడవలేదు. ఎందుకని? ఎవరయినా చెప్పగలరా?" అడిగాడు భవానీశంకర్.

అందరూ ఓ క్షణం ఆలోచించారు. గాని ఏమీ తట్టటంలేదు.

"ఓ.కే. నేనే చెప్పేస్తాను. ఎందుకు తడవలేదంటే అసలు వర్షం లేదు కాబట్టి"

అందరూ ఘొల్లున నవ్వేశారు.

″దటీజ్ సిల్లీ″ అంది వసుంధర.

″ఆల్ రైట్ ఇంకోటి చెప్పండి! చీకట్లో చూస్తే అసలేమాత్రం కనిపించనంత నలుపురంగు వ్యక్తి ఓ రోడ్డుమీద వస్తున్నాడు. దానికితోడు నల్ల డ్రస్ వేసుకున్నాడు. మరోవేపు నుంచి ఎదురుగ్గా నల్లని కారు వస్తోంది. ఆ కారుకి హెడ్ లైట్స్ లేవు. సౌండ్ ప్రూఫ్__ అయినాగానీ ఆ వ్యక్తి తేలిగ్గా తప్పుకోగలిగాడు. ఎలా?″

అందరూ మళ్ళీ ఆలోచనలో పడ్డారు.

″వెరీ బాడ్ మైడియర్ ఫ్రెండ్స్! మీ ఐక్యూ_ జీరో అని తెలిసిపోయింది. ఎలా తప్పుకోగలిగాడు. ఆమాత్రం ఊహించలేరా? వెరీ ఈజీ బ్రదర్స్ అది రాత్రి కాదు పట్టపగలు! అంచేత తప్పుకోగలిగాడు...″

″ఓ! సిల్లీ″ అంది వసుంధర మళ్ళీ.

″ఆల్ రైట్. ఏనుగులు ఏ విషయమూ మర్చిపోవట! ఎందుకనో చెప్పగలరా? ఓ.కే. ఎందుకంటే అసలు ఏనుగులకెవ్వరూ ఏమీ చెప్పారు కాబట్టి_″

మళ్ళీ నవ్వులు.

″ఓ.కే. రెండు చేతులు, రెండు రెక్కలు, ఎనిమిది కాళ్ళు, రెండు తోకలు, మూడు తలలు, మూడు శరీరాలు __ వేటికుంటాయో చెప్పగలరా?″

″తెలీదు...″

″ఆ మాత్రం తెలీదా? ఓ పావురాయిని చేత్తో పట్టుకుని, గుర్రం ఎక్కిన మనిషికి?″

బంగారయ్య ఇంక సహించలేకపోయాడు. నెమ్మదిగా లోపలికొచ్చి భవానీశంకర్ దగ్గరగా నిలబడ్డాడు.

"వన్ మినిట్ అంకుల్! అయిపోవచ్చింది. బైదిబై కొంచెంకూడా తడవకుండా సముద్రాల మీద ప్రయాణించిన బస్ ఏదో చెప్పగలవా అంకుల్?"

బంగారయ్య మొఖం ఎర్రబడిపోయింది.

"చెప్పలేవుకదూ! ఆ బస్ పేరు క్రిస్టోఫర్ కొలంబస్ అంకుల్"

"పోనీ ఇది చెప్పండి ఎవరయినా చూద్దాం! ఫ్రైడే థర్స్ డే కంటే ముందెప్పుడు వస్తుందో తెలుసా?"

"భవానీ..." కోపంగా అన్నాడు బంగారయ్య.

"నీకు తెలీదు కదంకుల్. నేనే చెప్పేస్తాను. డిక్షనరీలో వస్తుంది."

అంతా నవ్వులు.

"భవానీ_ ఇలా రా ఒకసారి_" తన రూమ్ లోకి నడిచాడు బంగారయ్య. భవానీశంకర్ అతని రూమ్ లోకెళ్ళాడు చిరునవ్వుతో.

"యస్ అంకుల్! ఎనీ ప్రాబ్లమ్?"

"భవానీ నీకు మొన్నే చెప్పాను! ఆఫీస్ అవర్స్ లో ఎవరినీ డిస్టర్బ్ చేయగూడదని_"

"అఫ్ కోర్స్ చెప్పావంకుల్! కానీ నా పాలసీ వేరు. స్టాఫ్ ఎంత సరదాగా నవ్వుతూ వుంటే ఆఫీస్ పని అంత త్వరగా అయిపోతుంది. వెస్ట్ జర్మనీలో

విల్సన్ మూండ్సే అనే పెద్ద ఫరమ్ ఎగ్జిక్యూటివ్ కనిపెట్టాడంకుల్ ఈ పద్ధతి. ఈ పాలసీ ప్రకారం రెండ్రోజుల్లో చేసేపని ఒక రోజులో చేసేస్తారు."

"భవానీ! వర్క్ కంటే నాకు డిసిప్లిన్ ముఖ్యం. నన్ను పద్దెనిమిదేళ్ళు ట్రాన్స్ ఫర్ లేకుండా అగర్వాల్ ఇక్కడే ఎందుకుంచారో తెలుసా? నేను మెయింటెయిన్ చేసే డిసిప్లిన్ వల్ల"

"అఫ్ కోర్స్_ అగర్వాల్ కి విల్సన్ మూండ్సే ఎక్స్ పెరిమెంట్ గురించి తెలిసి వుండదంకుల్. తెలిస్తే తప్పక ఆ పాలసీకి షిఫ్టయిపోయేవాడే!"

వెన్నెల వేట పేజి 2

"నీకిది లాస్ట్ వార్నింగ్ భవానీ? నీవల్ల నా భవిష్యత్తు పాడుచేసుకోవటం నాకిష్టంలేదు."

"ఓ.కే. అంకుల్! ఓ.కే."

"అసలీ ఉద్యోగం నీకివ్వటమే పెద్ద రిస్క్ నాకు_"

"టేకిట్ ఈజీ అంకుల్_ఏ జాబ్ అయినా తేలిగ్గా చేసేస్తాను"

"వెళ్ళిక"_ చిరాగ్గా అన్నాడు బంగారయ్య.

భవానీశంకర్ బయటికొచ్చేశాడు. తన సీట్లో కూర్చుని సిగరెట్ వెలిగించుకునేసరికి ప్యూన్ వెంకటేశం వచ్చాడు.

"సార్!"

"యస్ మైడియర్ వెంకటేశం! ఎనీ ప్రాబ్లమ్?"

″సూపర్నెంట్ గారు పిలుస్తున్నారండి!″

″ఆ గుంటనక్కకు వేరే పనేమీలేదా డియర్?″

″గట్టిగా అనకండి సార్″

″ఏంపర్వాలేదు బ్రదర్! అయ్ కెన్ టాకిల్ దట్ గూన్″ అంటూ లేచి చలపతి టేబుల్ దగ్గరకు నడిచాడు.

″యస్ మైడియర్ సూపర్నెంట్ పిలిచారట!″

″అలా మైడియర్ సూపర్నెంట్ అని అనొద్దని చెప్పాను_″

″చెప్పారా?″

″అవును″

″ఎప్పుడు?″

″రోజూ″

″ఐసీ_అందులో అభ్యంతరం ఏమిటసలు?″

″బాస్ ని పిలిచే పద్ధతి కాదది″

″ఏమిటి? కాదా? అయామ్ వెరీ సారీ మైడియర్ సూపర్నెంట్! ఇలా పిలవడమే లేటెస్ట్ ఫాషన్! అంతెందుకు? అమెరికాలో ప్రెసిడెంట్ ని ఎలా అడ్రస్ చేస్తారో తెలుసా? మిస్టర్ ప్రెసిడెంట్ అంటారు. మన ఇండియాలోనే ఇంకా పాతపద్ధతులు పురాతన వస్తు శిథిలాల్లా అలా వుండిపోయాయ్ మిష్టర్ చలపతీ!″

చలపతి అదిరిపడ్డాడు.

"నన్నలా పేరుపెట్టికూడా పిలవొద్దు" అన్నాడు కోపంగా.

"వెరీ బాడ్ డియర్! వెరీ బాడ్! సూపర్నెంట్ అనకూడదు_ పేరుపెట్టి పిలవకూడదు_ ఇంక మిగిలింది ఏయ్_ఓయ్ అనేపదాలు బ్రదర్! వాటిని వాడటం నాకిష్టంలేదు ఫ్రెండ్! తప్పదనేటట్లయితే వాడతాను_"

"అవేమీకాదు 'సర్' అని పిలవాలి"

"సర్ అనా?"

"అవును"

"మిమ్మల్ని చూస్తుంటే నాకు మరింత విచారంగా ఉంది మైడియర్ సూపర్నెంట్! 'సర్' అంటే అర్థం ఏమిటో తెలుసా మీకు? అది ఒక బిరుదు! ఏమయినా అద్భుతాలు చేసినవారికి క్వీన్ ఎలిజబెత్ ఆ బిరుదు ప్రధానం చేస్తుంది ఫ్రెండ్! అంతేకాని అడ్డమైనవాడినీ 'సర్' అనకూడదు"

"భవానీశంకర్" విసుగ్గా అడ్డుపడ్డాడు చలపతి.

"యస్."

"నువ్వు నన్నేమీ పిలవక్కర్లేదుగానీ_ నీకో విషయం చెప్పటానికి పిలిచాను."

"కారీ ఆన్ డియర్! ఏమిటది?"

"ఆఫీస్ లో సిగరెట్ తాగకూడదని ఇదివరకు చెప్పాను."

"చెప్పారా?"

"యస్. అరడజనుసార్లు_"

"అన్నిసార్లు చెప్పటం మంచి పాలసీ కాదు మైడియర్ చలపతీ! విల్సన్ మూండ్సే పాలసీ ఏమిటో తెలుసా? స్టాఫ్ కి పదేపదే చెప్పిందే చెప్పకూడదు. దానిని మార్చి కొత్త పద్ధతుల్లో, కొత్త పదాల్లో వివరించాలి డియర్! అప్పుడే వాళ్ళు దానిని ప్లెజెంట్ గా అమలుపరుస్తారు."

"ఓ.కే_ యూ కెన్ గో" చిరాగ్గా అన్నాడు చలపతి.

"థాంక్యూ డియర్! థాంక్యూ" భవానీశంకర్ మళ్ళీ తన సీట్ చేరుకున్నాడు.

* * * *

భవానీశంకర్ తలొంచుకుని ఎకౌంట్స్ రాసుకుంటున్నవాడల్లా "గుడ్ మాణింగ్ గురూ" అన్న డైలాగ్ విని తలెత్తి చూచాడు.

ఎదురుగ్గా చిరునవ్వుతో నిలబడివున్నాడు శివానందం.

"గుడ్ మాణింగ్ బ్రదర్!"

శివానందం భవానీశంకర్ చెవి దగ్గరకు వంగాడు.

"ఓ చిన్న హెల్ప్ చేయాలి గురూ_"

"డెఫినెట్ లీ బ్రదర్! ఏం కావాలి?"

"అయిదొందలు కాష్_ రేపు మాణింగ్ ఇచ్చేస్తాను. ఆఫీస్ కాష్ లో నుంచి ఇచ్చేసెయ్"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

తన అంకుల్ పదిరోజుల క్రితమే తనకీ కాషియర్ ఉద్యోగం ఇచ్చేప్పుడు స్పష్టంగా చెప్పాడు. ఆఫీస్ డబ్బులో ఒక్క పైసకూడా వ్యక్తిగతంగా వాడకూడదని.

"ఆఫీస్ క్యాషా?"

"డోంట్ వర్రీ గురూ! ఇవాళ ఏం పరిగెడుతోందో తెలుసా? రెడ్ స్టార్! ఒందర్ ఫుల్ గుర్రం! ఇవాళది దున్నేయటం ఖాయం!"

"కానీ ఆఫీస్ కాష్..."

"అసలు రెడ్ స్టార్ మదర్ ఎవరో తెలుసా నీకు? బ్లూ బర్డ్! కలకత్తాలో ఆరుసార్లు గెలిచింది! ఇవాళ రెడ్ స్టార్ కావటం మాత్రం షూర్!"

"నిజమేననుకో... కానీ..."

"రెడ్ స్టార్ అమ్మమ్మ ఎవరో తెలుసా? ఎల్లోఫీవర్! బాంబేలో నాలుగుసార్లు వరుసగా చెరిగేసింది. చూస్తూండు! సాయంత్రానికి యాభయ్ వేలు_ నేను గెలవాలని నీకు లేదూ?"

"యాభయ్ వేలే?"

"ఆరుసార్లు మిస్సయ్యాను ఆ ఎమౌంట్! ఎందుకని అడగవేం?"

"ఎందుకని?"

"సమయానికి అప్పిచ్చేవాడు లేక! ఇంతకు ముందున్న కాషియర్ పరమ ముసురు వెధవ అవటంవల్ల_"

భవానీశంకర్ కి అతనిమీద జాలివేసింది. అయిదువందలు పెట్టుబడి లేక

శివానందం అలా ఏడోసారి కూడా యాభైవేలు సంపాదించలేకపోవటం అతనికి నచ్చలేదు.

"రేపు తప్పకుండా ఇచ్చేస్తావు కదూ?"

"పువ్వుల్లో పెట్టి! యాభయ్ వేలొస్తుంటే అయిదొందలలో లెక్కా?"

భవానీశంకర్ సేఫ్ తెరచి అయిదువందలు లెక్కపెట్టి అతనికిచ్చేశాడు. శివానందం ఆనందంతో వెలిగిపోయాడు.

"థాంక్యూ గురూ! యూ ఆర్ ఎ గ్రేట్ ఫ్రెండ్! అన్నట్లు ఇదిగో_ నా లీవ్ లెటర్. మన సూపర్నెంటుగారికిచ్చేసెయ్. రేపు ఏకంగా రాజీనామాయే వాడి మొఖాన్న కొడతాను."

"రాజీనామా చేస్తావా?"

"అవును మరి! యాభయ్ వేలతో సొంత బిజినెస్ పెట్టుకుంటానుగానీ ఇంకా ఈ వెధవ ఉద్యోగం ఎందుకు చేస్తాను?"

అతను వెళ్ళిపోయాక భవానీశంకర్ చాలాసేపు రేసుల గురించి ఆలోచిస్తూండిపోయాడు. రేసుల్లో భలే సరదాలు జరుగుతాయని తెలుసు గానీ ఇలా గుర్రాల తాలూకు అమ్మలూ, అమ్మమ్మల్ని కూడా స్టడీ చేస్తారని తెలీదు.

హఠాత్తుగా అతనికి ఏదో గుర్తుకొచ్చినట్లయింది. చప్పున లేచి తన పాంట్ జేబులోనుంచి ఓ నలిగిపోయిన కాగితం తీశాడు. సీట్లో కూర్చుని జాగ్రత్తగా దాని మడత విప్పి చూశాడు.

ఆ అమ్మాయి నవ్వుతోంది. అందంగా, గుండెల్లో పూర్తిగా నిండిపోయేలా__

ఎంత అందం? అది ఫోటో అవకపోయినట్లయితే_ అంత అందమయిన అమ్మాయి ఉంటుందని నమ్మేవాడేకాదు.

ఇంత అందమయిన అమ్మాయిని ప్రేమించకుండా ఎలా ఉండటం? మళ్ళీ ఆమె ఫోటోవంక చూశాడు. ఏదో తెలుగు పత్రికలో ఫోటోఫీచర్ అది! ఫోటో కింద కవిత్వం ఉంది.

వెన్నెల వేట పేజి 3

"నీ చిక్కటి అనుభూతుల చీకటిలోనే

నే పురివిప్పిన వెన్నెల నవుతా!"

నిజంగా ఆ అమ్మాయే మాట్లాడుతున్నట్లుంది. నిజంగా ఎవరి జీవితంలోనయినా సరే ఆ అమ్మాయి వెన్నెలే అవుతుంది.

ఎప్పటికయినా, ఎన్నాళ్ళకయినా సరే ఆ వెన్నెలను కలుసుకోవాలి. ఆ అందాన్ని యావజ్జీవం సొంతం చేసుకోవాలి.

టైపిస్ట్ వసుంధర వచ్చింది.

ఆమెకు భవానీశంకర్ తో మాట్లాడడం చాలా థ్రిల్లింగ్ గా వుంది. అంతకు ముందెప్పుడూ అంత సరదాగా, అంత చక్కగా మాట్లాడే యువకులు తారసిల్ల లేదు. అంచేత ఏదొక పని కల్పించుకుని అతనితో మాట్లాడుతూనే ఉంటుంది సాయంత్రం వరకూ.

"ఏమిటి ఆ బొమ్మవంక అలా చూస్తున్నారు?"

భవానీశంకర్ కొంచెం సిగ్గుపడ్డాడు.

"మళ్ళీ ఎవరితోనూ అనరుకదా!"

"ఏ విషయం?"

"ఇదే_ ఈ బొమ్మ విషయం."

"ఏమిటి ఆ బొమ్మ విషయం?"

"ఈ ఫోటోలో అమ్మాయిని నేను ప్రేమించాను."

ఆమె నవ్వాపుకుంది.

"ఎవరా అమ్మాయ్?"

"అదే తెలీదు! నిన్నే దొరికిందీ కాగితం! బఠానీలవాడు ఇందులో బఠానీలు కట్టి యిచ్చాడు. చాలా అందంగా లేదూ?"

"అందంగా కనబడినవన్నీ ప్రేమించేయటమేనా?"

"అనీ కాదు మేడమ్! ఓన్లీ దిస్ గాళ్! ఇంత అందం ఇంకెక్కడా కనిపించలేదు నాకు! నిజంగా వెన్నెలే! కదూ"

వసుంధరకు కొంచెం కోపం వచ్చింది. ఎదురుగ్గా వున్న అందాలు వదిలేసి అలా పాత పుస్తకంలోని ఓ పేజీ పట్టుకుని ప్రేమించాననే వారినేమనాలి?

సరిగ్గా అప్పుడే చలపతి పిలవడంతో అక్కడినుంచి వెళ్ళిపోయిందామె. ఫోటోవంకే మళ్ళీ చూడసాగాడు భవానీశంకర్. చూస్తున్నకొద్దీ ఆ అమ్మాయి అందం పెరిగిపోతున్నట్లనిపించ సాగింది. దాంతోపాటు అతనిలో అశాంతి కూడా పెరిగిపోతోంది. ఎన్నాళ్ళిలా ఈ ఫోటోవంక చూస్తూ కూర్చోవటం? ఎన్నాళ్ళిలా

ఈ దిక్కుమాలిన కాషియర్ ఉద్యోగం చేయటం? తనలాంటి డైనమిక్ యంగ్ ఫెలో హైద్రాబాద్ లో ఉంటేనేగానీ షైనవడని తన ఫ్రెండ్ జయకర్ చెప్పాడు. అదీగాక ఈ ఫోటోలోని అమ్మాయి వివరాలు కావాలంటే హైద్రాబాద్ లోనే దొరకవచ్చు. తెలుగు మాగజైన్స్ లో ఎక్కువభాగం అక్కడే ఉన్నాయ్.

తన జీవితధ్యేయం ముందా అమ్మాయి వివరాలు తెలుసుకుని ఆమెను కలుసుకోవటం! అంతేగానీ ఈ అగర్వాల్ అండ్ అగర్వాల్ కంపెనీలో కాష్ లెక్కపెడుతూ రోజులు గడపటంకాదు.

"హలో_"

పలుకరింపు విని తన కెదురుగ్గా కుర్చీలో కూర్చున్న ఆకారాన్ని చూశాడు.

"గుడీవినింగ్" అందా ఆకారం మళ్ళీ. అతన్నంతకు ముందు చూసిన గుర్తురావటం లేదు.

"గుడీవినింగ్"

"మీ దగ్గరున్న కాష్ చెక్ చేయడానికొచ్చాను" అందా ఆకారం మళ్ళీ.

"కాష్ చెక్ చేస్తారా?"

"అవును"

"ఎందుకు?"

"అది నా డ్యూటీ. నేను హెడ్డాఫీస్ నుంచి వచ్చాను."

భవానీశంకర్ కి అర్థమయింది. హెడ్డాఫీస్ నుంచి ఇన్ స్పెక్షన్ కి ఎవరయినా

వచ్చినప్పుడు కాష్ చెక్ చేస్తారని తనకు మామయ్య ముందే చెప్పాడు.

"వెల్ కమ్ మైడియర్ ఫ్రెండ్! వెల్ కమ్!" అన్నాడు చిరునవ్వుతో.

అతను సేఫ్ లోని డబ్బు తీసుకుని లెక్కపెట్టాడు.

"అయిదువందలు తక్కువగా వుంది" అన్నాడు చిరునవ్వుతో.

"తక్కువగా వుందా?" ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు భవానీశంకర్.

"అవును. కావాలంటే మీరూ లెక్కపెట్టండి."

"నో...నో...అక్కర్లేదు. మీ మాటమీద నాకు సెంట్ పర్సెంట్ నమ్మకం వుంది. మీకు తెలుసో తెలీదో అయ్ బిలీవ్ పీపుల్."

"అయిదువందలూ ఏమయిందో చెబితే..."

"డూ యూ నో సారధి? కాలేజీలో మా బెంచిలోనే కూర్చునేవాడు. వాడిని ఎవ్వరూ నమ్మేవాళ్ళు కాదు. అంత మోసం చేసేవాడు కాని నేను మాత్రం వాడిని నమ్మేవాడిని. వాడేం చెప్పినా ఓ.కే. అనేవాడిని. అంచేత ఏమయిందో తెలుసా? వాడు సెంట్ పర్సెంట్ పెద్దమనిషిగా మారిపోయాడు.

"అయిదువందలూ ఏమయినట్లు?" వినిపించుకోకుండా అడిగాడతను.

భవానీశంకర్ ఓ క్షణం ఆలోచించి ఠక్కున గుర్తొచ్చినట్లు అతని భుజంమీద చరిచాడు.

"అహ్హాహ్హాహ్హా, గుర్తుకొచ్చేసింది. చూశారా! మన బ్రెయిన్ ఎంత షార్ప్పో? ఎప్పుడూ ఇంతే. ఎన్ని సంవత్సరాలయినా క్రితం విషయమైనా సరే ఠకీమని

గుర్తుకొచ్చేస్తూంది. అందాకా యెందుకు? హైస్కూల్లో చదివేప్పుడు ఫోర్తు బెంచీలో కూర్చునే రాజేశ్వర్ గాడు మొన్న మార్కెట్లో కనబడ్డాడు. వాడు నన్ను మర్చిపోయాడుగానీ నేను వాడిని వీపుమీద లాగికొట్టేశాను."

"అయిదువందలూ ఏమయిందో చెప్తే?"

భవానీశంకర్ అతనివేపు ఆశ్చర్యంగా చూశాడు.

"అయిదువందలా? ఏ అయిదువందలు?"

"కాష్ తక్కువున్న ఎమౌంట్."

"ఓ! మీరింకా ఆ విషయం గురించే మాట్లాడుతున్నారన్నమాట! ఆ అయిదువందలూ శివానందం కిచ్చాను."

"శివానందానికా?"

"యస్! పూర్ ఫెలో! యాభయ్ వేలు గెల్చుకునే ఛాన్స్ ఆరుసార్లు మిస్సయిందట. ఎందుకో తెలుసా? ఇంతకుముందున్న కాషియర్ వట్టి ముసరుగాడు అవటం వల్ల. అలాంటి కసాయి వెధవల్ని కాషియర్ గా ఎట్లా ఎపాయింట్ చేస్తారో తెలీదు"

"నేనే ఇంతకుముందు కాషియర్ని..." జేవురించిన మొఖంతో అన్నాడతను.

భవానీశంకర్ కు ఓ క్షణం మాట రాలేదుగానీ చప్పున తేరుకుని చిరునవ్వు నవ్వాడు.

"మీరా? అయితే శివానందం డెఫినెట్ గా మిమ్మల్ని అపార్థం చేసుకుని వుంటాడు. అయిదువందలు అతగాడి కివ్వకపోవటానికి అద్భుతమయిన

కారణమేదో మీకు వుండే వుంటుంది."

"ఆఫీస్ కాష్ ఇలా దుర్వినియోగం చేయకూడదని..."

"తెలుసు బ్రదర్! తెలుసు. రూల్స్ వున్నాయ్. కానీ ఈ అర్థంలేని రూల్స్ వల్ల ఎన్ని ఘోరాలు జరిగిపోతున్నాయో చూడండి! శివానందం యాభయ్ వేలు సంపాదించే ఛాన్స్ ఆరుసార్లు మిస్సయ్యాడు. ఎంత అమానుషమో ఆలోచించండి? అందుకే నేను ఈ రూల్స్ ని పక్కకు నెట్టి..."

అతను లేచి నిలబడ్డాడు. "ఈ విషయం నేను హెడ్డాఫీసుకి తెలియజేస్తున్నాను"

"అజ్ఞానం బ్రదర్! ఇది కేవలం మనిద్దరికే సంబంధించిన విషయం! మధ్యలో హెడ్డాఫీసు ఎందుకొస్తుంది? రాకూడదు! మనమంతా ఒక్కటి. "ఒకేజాతి_ ఒకే ప్రజ" అన్న ఎడ్వర్టయిజ్ మెంట్ టి.వి.లో చూళ్ళేదూ?"

"అయామ్ సారీ!" అనేసి తిన్నగా మేనేజర్ బంగారయ్య రూంలో కెళ్ళాడతను.

మరికాసేపట్లో వెంకటేశం వచ్చి నిలబడ్డాడు.

"సార్! మేనేజర్ గారు పిలుస్తున్నారు."

"బహుశా ఆ హెడ్డాఫీస్ పక్షి డబ్బు తక్కువుందని అశుభం పలికి వుంటాడు."

"అవున్సార్!"

"ఇలాంటి పక్షుల్ని ఏం చేయాలంటావ్?"

"రోడ్డుమీద ఒక్కడే కనిపించినప్పుడు ఫట్ ఫట్ లాడించెయ్యాలండి"

"ఒండర్ ఫుల్ అయిడియా మైడియర్ వెంకటేశం! ఎప్పుడయినా ఉపయోగించావా ఇది?"

"ఇంతకుముందు ఉద్యోగం చేసినచోట దొంగబిల్లులు తీసుకొచ్చినందుకు మేనేజర్ నన్ను డిస్ మిస్ చేస్తే బయట వాడిని తుక్కు రేగ్గొట్టేశాన్సార్! వారం రోజులు గవర్నమెంట్ హాస్పటల్లో వున్నాడు."

"సూపర్బ్ మైడియర్ వెంకటేశం! నీ చరిత్ర గవర్నమెంటు టెక్ట్స్ బుక్స్ లో లిఖింపతగింది"

బంగారయ్య గదిలోనుంచి మళ్ళీ బెల్ మోగింది.

భవానీశంకర్ లేచి అతని గదిలోకెళ్ళాడు.

"భవానీ_యూ ఆర్ డిస్ మిస్ డ్" అన్నాడు బంగారయ్య కోపంగా.

"డిస్ మిస్ డా? వెరీ స్ట్రేంజ్ అంకుల్! ఆఫ్టరాల్ అయిదొందలు తక్కువున్నందుకు డిస్ మిస్ లు చేస్తారా? వెరీ బాడ్_వెరీ బాడ్! విల్సన్ మూండ్సే ఇలాంటి సమయాల్లో అమలుచేస్తోన్న పాలసీ ఏమిటో తెలుసా మీకు?"

"భవానీ ఇంక నువ్వు వెళ్ళవచ్చు."

"అయిదొందలు తక్కువున్నందుకు ఆ కాషియర్ ని పిలిచి తన జేబులో నుంచి అయిదువందలిచ్చి అతని భుజం తడతాడు, "మిస్టర్ కాషియర్! భవిష్యత్తులో డబ్బు కావాలంటే నన్నడుగు! నేనిస్తాను. అంతే కానీ కాష్ లో తీసుకోకండి!" అంటాడు చిరునవ్వుతో. ఎంత సూపర్బ్ గా వుందో ఒక్కసారి ఆలోచించు

అంకుల్!"

"ఇంక నువ్వు వెళ్ళిపో ఇంటికి."

భవానీశంకర్ ఇంక వాదించదల్చుకోలేదు.

వెన్నెల వేట పేజి 4

నెమ్మదిగా ఆఫీసులోనుంచి బయటికొచ్చాడు. ఒక్కసారిగా ఎక్కడ లేని ఉత్సాహమూ ఆవరించిందతనిలో.

వెధవ అకౌంట్ పుస్తకాలూ, డబ్బు లెక్కపెట్టుకోవటం ఈ రెండింటి బెడదా తప్పిపోయింది. ఎవరో రిటైరయిపోయినవాళ్ళు, నడవడానికి శక్తిలేనివాళ్ళూ కూర్చుని చేసే ఉద్యోగాలవి. తనలాంటి డైనమిక్ యంగ్ ఫెలోస్ కోసం కాదు.

రోడ్డుమీదకొచ్చి నెమ్మదిగా గవర్నరుపేట సెంటర్ వేపు నడవసాగాడతను. ఆఫీస్ టైమయిపోవడంచేత అందరూ వెనకేవచ్చి అతనిచుట్టూ మూగారు.

"ఆ శివానందాన్ని నమ్మవద్దూ అని ముందే చెప్పాం!" అన్నాడు రాఘవులు.

"మాకు రేపట్నుంచి టైమ్ పాస్ అవటం చాలా కష్టం" అన్నాడు రాజు.

అందరూ వెళ్ళిపోయాక వసుంధరతోపాటు బస్ స్టాప్ వేపు నడవ సాగాడతను.

"మీ ఉద్యోగం పోవటం నాకెంతో బాధగా వుంది!" అంది వసుంధర.

"నాకెంతో సంతోషంగా వుంది!" నవ్వుతూ అన్నాడు భవానీశంకర్.

ఆమె తెల్లబోయింది.

"రియల్లీ?"

"అవును! కారణం ఏమిటో తెలుసా? ఇక్కడే కూర్చుని ఉద్యోగం చేస్తూంటే ఈ లవ్ గాడెన్ ని వెతుక్కునేదెప్పుడు?" జేబులో నుంచి చిత్తు కాగితం తీసి అందులోని అమ్మాయి ఫోటో చూపుతూ అన్నాడతను.

వసుంధర అతనివేపు సందిగ్ధంగా చూసింది.

"మీరు...నిజంగానే...ఆ బొమ్మని ప్రేమిస్తున్నారా?" నమ్మలేనట్లుగా అడిగింది.

"ఇది బొమ్మ కాదు మేడమ్! ఫోటో_వెన్నెల."

"అయినాగానీ అలా చిత్తుకాగితంమీద ఫోటోని చూసి ప్రేమించటం..."

"లవ్ ఈజ్ బ్లయిండ్ అన్నారు మేడమ్. బహుశా నాలాంటివాళ్ళను చూసే అని వుంటారు_"

ఆమెకు ఉక్రోషం, కోపం రెండూ వస్తున్నాయ్.

"యూ ఆర్ మాడ్" అంది హేళనగా.

భవానీశంకర్ నవ్వాడు.

"యస్! అయామ్ మాడ్ ఆఫ్టర్ దిస్ గాళ్"

ఆమె బస్ స్టాప్ దగ్గర ఆగిపోయింది.

"ఓ.కే. వసుంధరాజీ. మళ్ళీ ఎప్పుడో, ఎక్కడో కలుసుకుందాం" ఆ కాగితం జేబులో పెట్టుకుంటూ అని ముందుకి నడిచాడతను. నాలుగడుగులు వేశాడో లేదో శివానందం రోడ్డుపక్కనే సోడా తాగుతూ కనిపించాడు.

"హలో గురూ! సమయానికి కనిపించావ్. ఇంకో అయిదొందలు కొట్టగలవా? రేపు మాణింగ్...సారీ ఈవెనింగ్ ఇచ్చేస్తాను మొత్తం."

"నా దగ్గరెక్కడిది?"

"తాళం చేతులు నీ దగ్గరే ఉంటాయ్ గా! ఆఫీస్ కాష్ పట్టుకురా! రేపు 'స్టాబెర్రీ' పరుగెడుతోంది. బెంగుళూరులో దున్నేసిందది! దాని జాకీ ఎవరో తెలుసా? జానీ."

"నా ఉద్యోగం పోయింది. నీకు అయిదొందలు ఇచ్చినందుకు"

శివానందం ఆశ్చర్యపోయాడు.

"పోయిందా?"

"యస్."

"రాటెన్_పోతేపోనీ! నేను పట్టే బిజినెస్ లో ఇస్తానులే. ఇంతకూ ఇప్పుడు నాక్కావలసిన అయిదొందల సంగతేమిటి? మీ అంకుల్ ని అడిగి చూడరాదూ? అనవసరంగా యాభయ్ వేలు పోగొట్టుకోవటం నాకిష్టంలేదు."

భవానీశంకర్ అక్కడినుంచి బయలుదేరాడు ఇక లాభంలేదని.

"హలో ఫ్రెండ్! అలా వెళ్ళిపోతే ఎలా గురూ. అయిదొందలు... గురూ_గురూ"

భవానీశంకర్ ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే బంగారయ్య హాల్లో కూర్చుని అతనికోసం ఎదురుచూస్తున్నాడు.

"రా! నీకోసమే చూస్తున్నాను. ఇలా కూర్చో."

భవానీశంకర్ అతనికెదురుగ్గా కూర్చున్నాడు.

"భవానీ_ నిజంగా చెప్తున్నాను. నీతో ఫెడప్ అయిపోయాను. నువ్వు బాగుపడాలంటే నీ జీవితం నువ్వు గడుపుకోవాలి. నీ మంచిచెడ్డలు, నీ కష్టనష్టాలు అన్నీ నువ్వే చూసుకోవాలి."

"కానీ యిప్పుడు అన్నీ సవ్యంగానే వున్నాయ్ కదంకుల్?"

"మధ్యలో మాట్లాడకు! నిన్నగాక మొన్నేకదా వాడెవడికో దొంగ వెధవకి నువ్వు చిట్ ఫండ్ షూరిటీ ఉన్నావని వాళ్ళు వచ్చి నా సామానంతా లాక్కుపోతుంటే నేను రెండువేల ఆరొందలు కట్టింది?"

"వాడు దొంగవెధవ కాదంకుల్! థరో జెంటిల్మెన్. ఎటొచ్చీ కొంచెం ఫైనాన్స్ ఎడ్జస్టవక చిట్ కట్టలేకపోయాడట. మన డబ్బు మనకి పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తానన్నాడు. నేనే అక్కర్లేదని చెప్పాను. ఆఫ్టరాల్ రెండువేల ఆరొందలు మా అంకుల్ కి ఓ లెక్క కాదని చెప్పాను.

"సిగ్గు లేకపోతే సరి!" కోపంగా అన్నాడు బంగారయ్య.

"ఎందుకని అంకుల్?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"నా బొందకని! సరే పాతవన్నీ వదిలేసెయ్. ఇప్పుడు తవ్వుకుంటే నా గుండె పగిలిపోతుంది."

"ఓ.కె. అంకుల్! నా పాలసీ కూడా అదే! పాస్ట్ ఈజ్ పాస్ట్! అందుకే ఎప్పటికప్పుడు పాతవన్నీ మర్చిపోతుంటాను."

"మధ్యలో మాట్లాడకు__ నువ్వు ఈ రాత్రికి హైద్రాబాద్ వెళుతున్నావ్..."

"హైద్రాబాదా?" ఆనందంగా అడిగాడు భవానీశంకర్.

"అవును! అక్కడ నా ఫ్రెండ్ సాంబమూర్తిని కలుసుకో! అతను నీకు ఏదొక ఉద్యోగం ఇప్పిస్తాడు. ఆ ఉద్యోగం సరిగ్గా చేసుకుంటావో, లేదో నీ ఇష్టం! కానీ ఏ పరిస్థితుల్లోనూ నీ మొఖం నాకు చూపించకు మళ్ళీ తెలిసిందా?"

"అప్పుడప్పుడూ..."

"మధ్యలో మాట్లాడకు! ఇదిగో! ఈ కవర్లో సాంబమూర్తికి నేను రాసిన లెటర్ ఉంది! ఈ రెండో కవరులో నీకు ఓ నెలరోజులు ఖర్చులకుగాను వెయ్యిరూపాయలు ఇస్తున్నాను. నేను చెప్పినదంతా అర్థమయిందా?"

"అయిందంకుల్."

"అయితే ఇంక రడీ అవ్! నువ్వెంత త్వరగా ఈ ఇల్లు వదిలితే నాకు అంత మనశ్శాంతిగా ఉంటుంది."

"ఓకే అంకుల్! థాంక్యూ!..."

భవానీశంకర్ లేచి కవర్లు అందుకుని తన గదిలోకెళ్ళాడు. మరో గంటలో బస్ స్టాండ్ లో ఉన్నాడతను. అతనికిప్పుడు అపరిమితమయిన ఆనందంగా ఉంది. హైద్రాబాద్ లో ఒండర్ ఫుల్ లైఫ్ గడుపబోతున్నాడు తను. ఎందుకంటే తన జీవితం తాలూకూ వెన్నెల అక్కడే ఉండి ఉంటుందని తన నమ్మకం.

* * * *

హైద్రాబాద్ బస్ స్టాండ్ లో దిగుతూనే మురికితోనూ, చెత్తతోనూ నిండిపోయిన రోడ్డు చూశాడు భవానీశంకర్. ఆ చెత్తపైన 'సుందరమైన నగరం

మనది' అన్న బోర్డ్ కనబడుతోంది. ఆటోవాళ్ళు అతనిని చుట్టుముట్టేశారు.

"అచ్చా లాడ్జింగ్ కో లే జాయేంగేసాబ్" అంటూ హడావుడి చేసేస్తున్నారు.

చివరకు ఓ డ్రైవర్ సూట్ కేస్ లాక్కుని తన ఆటోలో పెట్టుకునేసరికి భవానీశంకర్ ఆ ఆటో ఎక్కక తప్పలేదు.

కొద్దినిముషాల్లో కోఠీలోని ఓ హోటల్ ముందాగింది ఆటో. వంద రూపాయలు అడ్వాన్స్ కట్టి రూమ్ తీసుకున్నాడతను.

స్నానం చేస్తూండగా తలుపు తట్టిన చప్పుడయింది. టవల్ కట్టుకుని వెళ్ళి తలుపు తెరచాడు.

వెన్నెల వేట పేజి 5

"హల్లో హల్లో హల్లో_ ఎంతకాలానికి చూశాన్రా నిన్ను_" ఆనందంగా లోపలికొస్తూ అన్నాడు ఓ వ్యక్తి.

అతనిని కొంచెం కష్టంమీద గుర్తుపట్టాడు భవానీశంకర్.

"నువ్వు...నీ పేరు...భరద్వాజ్ కదూ?"

"ఎగ్జాక్ట్ లీ! ఎగ్జాక్ట్ లీ! అయితే పేరు కూడా మర్చిపోయావన్నమాట! అవునులే_ రెండేళ్ళు చాలా ఎక్కువే... వెరీగుడ్, వెరీగుడ్_" మంచంమీద పడుకుంటూ అన్నాడతను.

"నువ్వేం చేస్తున్నావిక్కడ?"

"బిజినెస్ బ్రదర్! బిజినెస్."

"ఏం బిజినెస్?"

"ఏదొకటి? ఎప్పుడుకప్పుడు మార్చేస్తుంటాను."

"నేనిక్కడ ఉన్నట్లు నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

సిక్త్స్ సెన్స్ బ్రదర్! మన ఫ్రెండ్స్ ఎప్పుడెవరు హైద్రాబాద్ వచ్చినా తెలిసిపోతుంది మనకు? నువ్వు స్నానం కంప్లీట్ చేసిరా! తర్వాత మాట్లాడుకుందాం!"

భవానీశంకర్ స్నానంచేసి వచ్చాడు.

"కమాన్ బ్రదర్! ఆకలి! త్వరగా ఆర్డర్ చేసెయ్ భోజనం_ భోజనం చేసి రెండ్రోజులయింది.

భవానీశంకర్ మళ్ళీ ఆశ్చర్యపోయాడు "రెండ్రోజులా?"

"అవును బ్రదర్! 48 గంటలు."

"ఎందుకని?"

"ఆర్థిక పరిస్థితి బ్రదర్! మన ఫైనాన్స్ మినిష్టర్ బడ్జెట్, మన బడ్జెట్ ఒకటే విపరీతమయిన లోటు."

భవానీశంకర్ ఇద్దరికీ భోజనం ఆర్డర్ చేశాడు.

భరద్వాజ్ వారంరోజులుగా భోజనం లేనివాడిలా త్వరత్వరగా తినేశాడు.

"థాంక్యూ బ్రదర్! ఇంతకూ నువ్ దేనికొచ్చినట్లు?"

"భవానీశంకర్ జేబులో నుంచి కాగితం తీసి మడతవిప్పి అందులోని

అమ్మాయిబొమ్మ చూపించాడు.

"ఎలా వుందీ అమ్మాయి?"

"సినిమా తార లాగుంది. ఎవరీ పిల్ల?"

"అది తెలుసుకోడానికే ముఖ్యంగా ఇక్కడికొచ్చాను."

"విష్ యూ బెస్టాఫ్ లక్! అన్నట్టు నా బిజినెస్ కి అర్జంటుగా కొంత హెల్ప్ కావాలి బ్రదర్. ఓ వెయ్యి రూపాయలు సర్దగలవా?"

"ఊహు! సారీ!"

"పోనీ అయిదొందలు?"

"కుదరదు."

"ఆల్ రైట్, పాతిక రూపాయలయినా, బిజినెస్ కాపిటల్ ఆ మాత్రమయినా లేపోతే"

"సరే" ఒప్పుకున్నాడు భవానీశంకర్.

"థాంక్యూ బ్రదర్? ఇంతకూ ఆ కాగితం మీదమ్మాయి గురించి ఎందుకు తెలుసుకోవటం?"

"ఆమెను ప్రేమించాను."

"వెరీగుడ్! ఆ మాత్రం కర్టెసీ వుండాల్సిందే. నేనూ అంతే. అందమయిన ఆడపిల్ల కనిపించినప్పుడల్లా ప్రేమించినట్లు నటిస్తాను. లేపోతే పాపం వాళ్ళు 'హర్ట్' అవుతారు. అన్నట్లు యింకొక పాతిక చూడకూడదూ?"

"సారీ?"

"ఆల్ రైట్! పాతికతోనే ఎడ్జస్ట్ అవుతాన్లే. డోంట్ వర్రీ! 'హా'! నిద్రొస్తోంది. నిద్రపోయి నాలుగురోజులయింది బ్రదర్. నన్ను సాయంత్రం వరకూ నిద్రలేపకు" అంటూ మంచంమీద వరిగిపోయాడతను.

"ఇక్కడ మనవాళ్ళింకెవరయినా కనిపించారా?" అడిగాడు భవానీశంకర్.

"ఒకళ్ళేమిటి? మొత్తం మన క్లాస్ లోని జనాభా అంతా ఇక్కడే తిరుగుతున్నారు. డూ యూనో దీపక్? వాడు మారిస్ బిస్కెట్స్ లో ఆఫీసర్. కానీ ఉపయోగం లేదు. కేవలం పద్నాలుగు రూపాయలు యిచ్చాడు నేను అయిదువేల రూపాయలు అడిగితే. హోప్ లెస్ ఫెలో. ఓ.కే. నిద్రొస్తోంది. హా!" అంటూ ఆవలించి మరుక్షణంలో గుర్రుపెట్టసాగాడు.

భవానీశంకర్ డ్రస్ చేసుకుని హోటల్ గదినుండి బయటికొచ్చాడు.

రోడ్డంతా చాలా బిజీగా వుంది. అందమయిన అమ్మాయిలు కొంగల్లా నెమ్మదిగా నడుస్తూ షాపింగ్ చేసేస్తున్నారు. భవానీశంకర్ వాళ్ళందరినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

తన జేబులో కాగితం మీదున్న అమ్మాయి ఎక్కడోచోట హఠాత్తుగా తటస్థ పడవచ్చు.

కొద్దిదూరం నడిచాక ఆటో పిలిచాడతను.

"దేవతా పబ్లికేషన్స్ ఆఫీస్" అన్నాడు ఆటోడ్రైవర్ తో.

పావుగంటలో ఓ పెద్ద భవనం ముందు ఆగింది ఆటో.

'దేవతా పబ్లికేషన్స్' అన్న పెద్ద బోర్డు కనబడుతోంది దానిముందు. లోపలకు నడుస్తోంటే వాచ్ మెన్ ఆపేశాడు.

″ఛీఫ్ ఎడిటరు సాంబమూర్తిని కలుసుకోవాలి బ్రదర్!″

″రిసెప్షన్ లోకెళ్ళి అపాయింట్ మెంట్ తీసుకోవాల్సార్.″

″అది మిగతావారందరికీ బ్రదర్. మనక్కాదు. నేనూ, సాంబమూర్తిగాడూ బెస్టు ఫ్రెండ్స్. నీకు తెలుసా?″

వాచ్ మెన్ కొంచెం జంకాడు.

″అలాగా సార్?″

″అలాగా ఏమిటి నీ తలకాయ. వాడి బట్టతలమీద ఎప్పుడూ లాగి కొడుతూండేవాడిని.″

వాచ్ మెన్ ఆశ్చర్యపోయాడు. ″కానీ ఆయనకు బట్టతల లేదు కదండీ?″

″లేదా?″

″కొంచెం కూడా లేద్సార్″

″అలాగా? అదివరకుండేది మరి. ఈమధ్య జుట్టు పెంచాడేమో మళ్ళీ దొంగవెధవ. వస్తా″ అనేసి లోపలికి నడిచాడతను.

ఈసారి వాచ్ మెన్ అతనిని అడ్డగించలేదు.

* * * *

'దేవతా పబ్లికేషన్స్' సంస్థ నుంచి చాలా పత్రికలు వెలువడుతుంటాయ్. ఓ

దినపత్రిక, ఓ వారపత్రిక, ఓ స్త్రీల మాసపత్రిక, ఓ కుటుంబ మాసపత్రిక, ఓ సినిమా పత్రిక, ఓ పిల్లల పత్రిక ఇలా ఎన్నో పత్రికలు. అయితే వీటన్నిటిలోకీ వారపత్రిక ఒక్కటే ఆ సంస్థకు లాభాలు సమకూరుస్తుంటుంది. మిగతావన్నీ అంతంతమాత్రమే. అంచేత ఛీఫ్ ఎడిటర్ సాంబమూర్తి దృష్టి ఎక్కువగా వారపత్రికఅమీద కేంద్రీకరింపబడి వుండటంలో ఆశ్చర్యం లేదు. అప్పుడే ప్రింటవుతోన్న ఆనాటి వారపత్రిక తెప్పించుకుని పేజీలు తిరగేయసాగాడతను. అలా పేజీలు తిరగేస్తున్నప్పుడు ఎవ్వరినీ లోపలకు పంపగూడదని తన ఆఫీస్ ప్యూన్ కి ఖచ్చితమయిన ఆదేశాలు జారీచేశాడు.

ఐదో పేజీలోని ఎనౌన్స్ మెంట్ చూస్తూనే ఉలిక్కిపడ్డాడతను.

"త్వరలోనే ప్రారంభం. ఆంధ్రా ఇర్వింగ్ వాలెస్ గానూ, ఆంధ్రా ఫ్రాయిడ్ గానూ ప్రసిద్ధికెక్కిన శ్రీకుమార్ కలంనుంచి మరో అద్భుతమయిన సీరియల్ తేదీకై ఎదురుచూడండి.

గమనిక : దయచేసి ఈ సీరియల్ ను ఒంటరిగా చదవకండి."

వెంటనే బెల్ నొక్కాడతను. ప్యూన్ పరుగుతో వచ్చాడు.

"మన వీక్లీ ఎడిటర్ ని రమ్మను త్వరగా."

మరుక్షణంలో వీక్లీ ఎడిటర్ వినయంగా వచ్చి కూర్చున్నాడు.

"ఏమిటండీ ఇది? ఏమిటీ ఎనౌన్స్ మెంట్? ఆంధ్రా ఇర్వింగ్ వాలెస్ ఎవరు?"

"ఇంకెవరండీ మన ఆస్థాన రచయిత శ్రీకుమార్."

సరిగ్గా ఆ సమయంలోనే భవానీశంకర్ ప్యూన్ ని తప్పించుకుని అతనికి

దొరక్కుండా పరుగెత్తుకొచ్చేశాడు లోపలకు.

సాంబమూర్తి అతనివంక కోపంగా చూశాడు.

"హల్లో! గుడ్ మాణింగంకుల్! మీ ఆరోగ్యం ఎలా వుందంకుల్?" ఆనందంగా పలుకరించాడు భవానీశంకర్.

"ఎవర్నువ్వు" కోపంగా అడిగాడు సాంబమూర్తి.

వెన్నెల వేట పేజి 6

"నేనే అంకుల్. భవానీశంకర్ ని. బంగారయ్య అంకుల్ మేనల్లుడిని ఎప్పుడో చిన్నప్పుడు చూశానంకుల్ మిమ్మల్ని. తెగ లావయిపోయారిప్పుడు."

"నీకేం కావాలి?" కోపం అణచుకుంటూ అడిగాడతను.

"ఇదిగో అంకుల్ ఈ ఉత్తరం ఇచ్చారు మీకు."

సాంబమూర్తి ఉత్తరం అందుకుని త్వరగా చదివేసి "అలా కూర్చో. తర్వాత మాట్లాడతాను" అన్నాడు. భవానీశంకర్ కుర్చీలో కూర్చున్నాడు.

సాంబమూర్తి మళ్ళీ ఎడిటర్ వేపు తిరిగాడు.

"అదేంటండీ. ఆంధ్రా ఇర్వింగ్ వాలెస్ అనే పేరు రంగరాజు అనే రచయిత కిచ్చాంగా ఆ మధ్య. మళ్ళీ ఇప్పుడు శ్రీకుమార్ కిస్తే ఎలా?"

"ఇతనుకూడా అదే పేరు కావాలని పేచీ పెట్టాడండీ. అంచేత మన ఆస్థాన రచయిత గదాని ఇచ్చేశాను"

"సరే పెడితే పెట్టావ్. అక్కడితో ఆగక ఆంధ్రా ఫ్రాయిడ్ అన్నావెందుకు

మళ్ళీ?"

భవానీశంకర్ చప్పున కల్పించుకున్నాడు.

"మియర్ వేస్టు అంకుల్! ఇలా ఒక్కొక్క తెలుగు రచయితకూ రెండేసి ఇంగ్లీష్ రచయితల పేర్లు వాడితే చాలా కష్టం. చివరకు బోలెడు మంది తెలుగు రచయితలు అసలేమీ ఇంగ్లీష్ రచయితల పేర్లు మిగలక దెబ్బతినేస్తారు."

సాంబమూర్తికా పాయింట్ నచ్చింది.

"కరెక్ట్! అంచేత ఒక్కొక్క తెలుగు రచయితకూ ఒక్కొక్క ఇంగ్లీష్ రచయిత పేరే వాడండి. వచ్చేవారం మన శ్రీకుమార్ కేవలం ఆంధ్రా ఇర్వింగ్ వాలెస్ యేనదీ, ఆంధ్రా ఫ్రాయిడ్ అని పొరపాటున ప్రచురించడం జరిగిందనీ ఎనౌన్స్ చేయండి."

రంగారావ్ భవానీశంకర్ వేపు కోపంగా చూసి "సరేనండీ!" అన్నాడు సాంబమూర్తితో. సాంబమూర్తి మళ్ళీ పేజీలు  తిప్పసాగాడు.

"అరె! ఇదేమిటి?" ప్రముఖ రచయిత్రి కుమారి విమలారాణి సెన్సేషనల్ సీరియల్! వచ్చేవారం నుంచే ప్రారంభం" ఈవిడ ప్రముఖ రచయిత్రా? అసలీమె పేరే వినలేదే నేను?" రంగారావ్ కొంచెం తడబడ్డాడు.

"అహహ_ఆవిడ రచయిత్రే సార్! మన పత్రికలోనే నాలుగు వారాలక్రితం ఉత్తరాల శీర్షికలో బహుమతి పొందిన ఉత్తరం రాసింది! ఆ ఉత్తరం చాలా అద్భుతంగా ఉందనీ, ఆమెతో సీరియల్ వెంటనే రాయించకపోతే మన పత్రిక ఆఫీస్ ముందు ఆమరణ నిరాహారదీక్ష జరుపుతామనీ కరీంనగర్, జగిత్యాల, మిర్యాలగూడ, బెల్లంపల్లి, శ్రీకాకుళం పాఠకులు బెదిరింపు ఉత్తరాలు రాశారు. అదీకాకుండా ఆ అమ్మాయి నాకు బాగా కావలసిన అమ్మాయ్" సాంబమూర్తి

నిరాకుపడ్డాడు.

"ఆల్ రైట్ ఇదే లాస్ట్ అవకాశం మీకు! నాకు తెలీకుండా ఇంకెవరివీ సీరియల్స్ వేయకండి!"

"అలాగేనండీ!"

మరోపేజీ తిప్పాడతను.

"ఇదేమిటి? ఈ వారం వారఫలాలు వేయటంలేదా? ఎందుకని?"

"అవి రాసే అయన ఊరెళ్ళాడండీ!"

భవానీశంకర్ ఘొల్లున నవ్వేశాడు.

"వారఫలాలు అసలు ఎవరో రాయటమేమిటి గురూజీ! వెరీబాడ్! ఇలాంటి చిన్న చిన్న శీర్షికలన్నీ ఎడిటరే రాస్తూండాలి! రచయిత సీరియల్ తరువాయి భాగం ఇవ్వటం ఆలస్యమయితే మనమే రాసేయాలి! పాఠకుల ప్రశ్నకు డాక్టర్ జవాబులు సమయానికి అందకపోతే మనమే హెల్త్ గైడ్ దగ్గర పెట్టుకుని జవాబులిచ్చేయాలి! పాఠకులు ఉత్తరాల శీర్షికకు మనకు కావలసిన విధంగా ఉత్తరాలు రాయకపోయినా మనమే రాసేయాలి."

సాంబమూర్తి భవానీశంకర్ వేపు మెచ్చుకోలుగా చూశాడు.

"నీకివన్నీ ఎలా తెలుసోయ్?"

"ఇంకా బోలెడు తెలుసంకుల్! ఇప్పుడెందుకులే అని చెప్పలేదు"

"ఈ ఫీల్డులో నీకు చాలా అనుభవం ఉన్నట్లుంది."

"అనుభవమా? రష్యన్ ట్రాక్టర్ తో దున్నినట్లు దున్నేయటమే! ఓ సారి మా ఫ్రెండ్ వాళ్ళ ఫ్రెండ్ పత్రికలో ఓ రచయిత సీరియల్ పంపటం ఆలస్యమయితే నేనే రాసిచ్చాను. అంతే! పాఠకులు తెగ ఉత్తరాలు రాశారు. మొత్తం సీరియల్లో నేను రాసిన భాగమే అద్భుతంగా ఉందని! తమాషా ఏమిటంటే రచయిత అది తనే రాశాననుకున్నాడు."

సాంబమూర్తికి అతనిమీద గురి కుదిరిపోయింది.

"చూశావుటోయ్ రంగారావ్! ఎడిటరంటే ఇంత డాషింగ్ గా ఉండాలి! అంతేగానీ, అన్నిటికీ తలక్రిందులయిపోకూడదు. ఆల్ రైట్ భవానీశంకర్! నువ్వు మా వారపత్రికలోనే సబ్ ఎడిటర్ గా చేరిపో."

భవానీశంకర్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"థాంక్ యూ అంకుల్!"

"దట్సార్ రైట్_రేపు ప్రొద్దున జాయిన్ అయిపో."

"ఓ.కే. అంకుల్."

భవానీశంకర్ బయటికొచ్చేశాడు అలా అద్భుతమయిన ఉద్యోగం దొరికింది అనుకోకుండా! తన టాలెంట్స్ అన్నీ బ్రహ్మాండంగా ప్రదర్శించవచ్చు.

గేటు దగ్గర కొచ్చాక వాచ్ మెన్ ఎందుకయినా మంచిదని సెల్యూట్ కొట్టాడు.

అతని భుజం తట్టాడు భవానీశంకర్.

"నువ్ చెప్పింది నిజమేనోయ్. మా సాంబమూర్తిగాడి కిప్పుడు జుట్టు మొలిచింది గుండుమీద."

"అవున్సార్."

భవానీశంకర్ రోడ్డుమీద నడుస్తూ తన జేబులోనుంచి ఆ కాగితం తీసి మరోసారి చూచాడు అమ్మాయి ఫోటోవంక.

"దేవతా! నీ కోసం వేట మొదలుపెట్టాను ఇవాళే" అనుకున్నాడు ఉత్సాహంగా.

* * * *

హోటల్ రూమ్ చేరుకునేసరికి సాయంత్రం నాలుగయిపోయింది. అప్పటికి ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు భరద్వాజ. హోటల్ గది బాల్కనీలో కూర్చుని రోడ్డుమీద వచ్చేపోయే అమ్మాయిల మొఖాలను చూస్తూ చాలాసేపు గడిపేశాడు భవానీశంకర్. ఆ ఫోటోలో అమ్మాయి ఏదొకరోజు అకస్మాత్తుగా కనబడుతుందని నమ్మకంగా ఉంది.

రాత్రి ఎనిమిదింటికి "హలో ఫ్రెండ్!" అన్న కేకవిని బాల్కనీలో నుంచి గదిలోకి నడిచాడు భవానీశంకర్ భరద్వాజ నిద్ర లేచాడు.

"ఆకలి బ్రదర్! అర్జంటుగా భోజనం తెప్పించు."

భవానీశంకర్ భోజనం ఆర్డర్ చేశాడు.

"అబ్బ! నిద్రలో బ్రహ్మాండమయిన కలొచ్చింది గురూ! వాడెవడో. జేబులో ఓ మాగజైన్ లో ఓ పాత పేజీ తీసుకుని అందులో ప్రింటయిన అమ్మాయి ఫోటోని ప్రేమించి గోడవెంబడి తిరుగుతున్నాడట. పిచ్చివెధవ ఫెంటాస్టిక్ గా లేదూ?"

"లేదు!" అన్నాడు భవానీశంకర్.

"లేదా?"

"ఏ మాత్రం లేదు!"

"ఎందుకని?"

"నేనే ఆ కాగితం జేబులో పెట్టుకుని తిరుగుతున్నాను కాబట్టి!"

భరద్వాజ్ ఆశ్చర్యపోయాడు "నువ్వా!"

"అవును!"

"ఏదీ ఆ కాగితం చూపించు!"

భవానీశంకర్ ఆ కాగితం అతనికిచ్చాడు.

"వెరీ లవ్ లీ గాళ్! ఇంత అందమయిన అమ్మాయికోసం అలా పిచ్చివెధవలా తిరిగినా తప్పులేదు" అన్నాడు మెచ్చుకోలుగా.

భోజనం తెచ్చాడు బాయ్.

ఇద్దరూ భోజనం చేయసాగారు.

"ఆ కాగితం ఏ మాగజైన్ లోది?" అడిగాడు భరద్వాజ్.

"తెలీదు. పై పోర్షనూ, కింద పోర్షనూ కూడా చిరిగిపోయింది."

"వెరీబాడ్! అయినా ఫర్లేదు. ఆ అమ్మాయిని కనుక్కోవటం కష్టమేమీ కాదు. ప్రతిరోజూ ఓ బస్ స్టాప్ దగ్గర నిలబడు. ఏదొక బస్ స్టాప్ కి తప్పక వస్తుంది కదా."

భవానీశంకర్ కి ఉత్సాహం కలిగింది.

″సిటీలో ఎన్ని బస్ స్టాప్ వుంటాయ్?″

″ఓ వెయ్యి పైన వుంటాయ్?″

వెన్నెల వేట పేజి 7

″అంటే రోజుకో బస్ స్టాప్ చొప్పున వెతికితే మూడేళ్ళు పడుతుందా?″ అన్నాడు నిరాశగా.

″మూడేళ్ళు పెద్ద ఎక్కువేమీ కాదు! అదేదో నవల్లో హీరో తను చిన్నప్పుడు ప్రేమించిన అమ్మాయి కోసం ముప్ఫయ్ ఏళ్ళు తిరుగుతాడు. అప్పటికా అమ్మాయి బాగా ముసల్ది అయిపోయి కర్రసాయంతో నడుస్తూంటుంది. దాంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటాడు. కనుక″ భోజనం ముగించి మళ్ళీ మంచంమీద వాలిపోయాడతను.

″విష్ యూ బెస్టాఫ్ లక్″ అనేసి గుర్రుపెట్టేసి నిద్రపోసాగాడు.

భవానీశంకర్ బట్టలు మార్చుకుని నేలమీద దుప్పటి పరచుకుని నిద్రలోకి జారిపోయాడు. తిరిగి మెలకువ వచ్చేసరికి ఉదయం ఎనిమిది అయిపోయింది. మంచంమీద భరద్వాజ్ కనిపించలేదు. బాత్ రూంలోనూ లేడు.

లేచి టూత్ బ్రష్ కోసం సూట్ కేస్ దగ్గర కెళ్ళాడతను. కానీ సూట్ కేస్ కూడా ఎక్కడా కనిపించలేదు. ఆశ్చర్యపోయి గదంతా వెతికాడు. సూట్ కేస్ తో పాటు తను రాత్రి హేంగర్ కి తగిలించిన బట్టలు కూడా లేవు. టేబుల్ మీద గాజుగ్లాసు కింద ఓ కాగితం రెపరెపలాడుతోంది గాలికి. దానికింద తను భద్రంగా దాచుకున్న అమ్మాయి బొమ్మ_ఆ కాగితం చేతిలోకి తీసుకున్నాడు.

"మైడియర్ బ్రదర్!

బిజినెస్ కాపిటల్ కి డబ్బు చాలక నీ సూట్ కేస్ లో కాష్ పట్టుకెళ్తున్నాను. బట్టలు కూడా నాకు చాలా తక్కువగా ఉండటం వల్ల నీ బట్టలన్నీ తీసుకెళుతున్నాను. ఇందువల్ల నీకేమీ ట్రబులుండదని నాకు తెలుసు. ఎందుకంటే మీ బంగారయ్య మావయ్య ఓ బంగారు పిచ్చుక కదా! ఓ టెలిగ్రాం పట్టుకుని ఆయన్ని బాదితే_అరడజను మనీయార్డర్లు రాల్తాయ్! నీ రుణం వీలయినంత త్వరలో తీర్చుకుంటాను. అంతవరకూ శెలవ్_నీ ప్రాణమిత్రుడు భరద్వాజ్.

షరా : నీ ప్రియురాలి ఫోటోవున్న ఆ పత్రిక పేజీ మాత్రం నీకే వదలివెడుతున్నాను. ఆ పిల్లను వెతుక్కోడానికి అది నీకు చాలా అవసరం కదా! విష్ యూ గుడ్ లక్!

భవానీశంకర్ భయంగా తన వంటిమీద బట్టలు చూచుకున్నాడు. బనీనూ_చారల పైజమా అవే మిగిలాయి కొద్దిసేపు ఏమి చేయటానికీ తోచలేదు. ముందు హోటల్ ఖాళీ చేసేసి ఎక్కడయినా రూమ్ తీసుకోవాలి. ఓ జతయినా రెడీమేడ్ డ్రస్ తీసుకోవాలి. ఈ రెండింటికి కనీసం నాలుగయిదువందలయినా కావాలి. మావయ్యకు టెలిగ్రామిచ్చినా, అరచి గీపెట్టినా_ఒక పైసకూడా పంపడు. ఇప్పుడేమిటి చేయటం? ఎవరున్నారిక్కడ తనకు సహాయం చేయడానికి? హఠాత్తుగా దీపక్ గుర్తుకొచ్చాడతనికి. వాడు ఇక్కడే మారిస్ బిస్కెట్ ఫాక్టరీలో పనిచేస్తున్నాడట! తనూ వాడూ క్లాస్ మేట్సే కాదు. ఆఖరి బెంచ్ మేట్స్ కూడా! వాడొక్కడే తనకు ప్రస్తుతం దిక్కు. హోటల్ లో మేనేజర్ దగ్గరకు నడిచాడతను.

"రూమ్ ఖాళీ చేస్తున్నాను."

అతను భవానీశంకర్ డ్రస్ వేపు విచిత్రంగా చూసి_లెక్కచూసి ముప్పయ్ రూపాయలు తిరిగి ఇచ్చేశాడు. భవానీశంకర్ రోడ్డుమీద కెళ్తోంటే "సార్ మీ డ్రస్సూ, లగేజి..." అంటూ ఏదో చెప్పబోయాడతను.

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఇదే లేటెస్ట్ ఫాషన్ బ్రదర్ బనీనూ_పైజమా"

మేనేజర్ తనలోతను నవ్వుకున్నాడు "ఇది మెంటల్ కేస్" అనుకున్నాడు.

* * * *

దీపక్ కి అప్పుడే రాత్రి పట్టించిన మందు ప్రభావం తగ్గటం మొదలుపెట్టింది. అది పూర్తిగా తగ్గుతేనేకానీ అతనికి జ్ఞాపకశక్తి పూర్తిగా చేకూరదు. రాత్రుళ్ళు మందు ఎక్కువగా కొట్టేస్తే మర్నాడు ఆఫీస్ విషయం కూడా మర్చిపోయి ఎక్కడెక్కడో ఇంటికి చేరుకున్న రోజులున్నాయ్.

త్వరగా రడీ అయి ఫాక్టరీకి చేరుకున్నాడతను. ఫాక్టరీ బిల్డింగ్ గేటు దగ్గర వాచ్ మెన్ అన్నీ ఎక్కడో, ఎప్పుడో చూసినట్లు గుర్తుకొస్తున్నాయ్. తన రూమ్ కెళ్ళి కూర్చున్నాడతను. బెల్ కొట్టి బాయ్ ని పిలిచాడు.

"యస్సార్" పరుగుతో వచ్చాడు బాయ్.

"నేను కూర్చుంది నా రూమ్ లోనేనా?" అడిగాడు దీపక్ అనుమానంగా.

"అవున్సార్!"

"అయితే ఓ.కె. నువ్వు వెంటనే ఓ అనాసిన్ టాబ్ లెట్, ఓ కాఫీ తీసుకురా"

"రడీగానే ఉన్నాయి సార్"

"రడీగా ఉన్నాయా?"

"అవున్సార్!"

"అవి నాక్కావాలని నీకెలా తెలుసు?"

"రాగానే ఆ రెండూ మీకివ్వాలని మీరే రోజూ చెప్తుంటారు సార్__"

"ఐసీ_ఓ కే_ ఓ కే_" అంటూ అనాసిన్ నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగబోతూ గోడవంక చూసి ఉలిక్కిపడ్డాడు.

"బాయ్"

"యస్సార్?"

"అదేమిటక్కడ? ఏదో చిలుక లోపలికొచ్చి వాలినట్లుంది"

"చిలుక బొమ్మ సార్! అలంకారం కోసం అలా పెట్టారు"

"ఎప్పుడు?"

"అయిదారు నెలలయిందండి అలాంటివి అన్ని గదుల్లోనూ పెట్టి_"

"మరి నాకెప్పుడూ కనిపించలేదేం?"

"మీరు రోజూ అడుగుతూనే ఉన్నారండి దాన్ని గురించి"

దీపక్ కాఫీ తాగేశాడు. నెమ్మది నెమ్మదిగా స్పృహలో కొచ్చేస్తున్నట్లనిపిస్తోందతనికి.

అప్పుడే ఫోన్ మోగింది.

"హలో! దీపక్ హియర్!"

"మీకోసం భవానీశంకర్ అనే అతను వచ్చాడండి"

"భవానీశంకరా?"

"యస్సార్"

"భవానీశంకర్_భవానీశంకర్" అని అరడజను సార్లనుకున్నాడతను. ఆ పేరు ఎక్కడో విన్నట్లే వుంది.

"ఆల్ రైట్ రమ్మను"

మరికొద్ది క్షణాల్లో గదిలోకి భవానీశంకర్ అడుగుపెట్టాడు.

"హలో__హలో__దీపక్! హౌ ఆర్ యూ ఫ్రెండ్! చాలా రోజుల తరువాత కలుసుకున్నాం" అతనితో చేతులు కలిపాడు భవానీశంకర్.

దీపక్ అతని డ్రస్ వంక తేరిపారచూశాడు తరువాత భవానీశంకర్ మొఖంవంక గుచ్చిచూశాడు. క్రమేపీ గుర్తుకొచ్చేసింది. వాడు తన క్లాస్ మేట్!

"హలో భవానీ! నువ్వా?"

"యస్ ఫ్రెండ్! నేనే!"

"ఇంకెవరో అనుకుంటున్నాను"

"కాదు గురూ! నేనే! ఓల్డు క్లాస్ మేట్ అండ్ బెంచ్ మేట్"

″లాస్ట్ బెంచ్ మేట్స్″ మరిన్ని వివరాలు గుర్తుకొచ్చేస్తున్నాయ్ నిషా పూర్తిగా దిగిపోతున్నకొద్దీ.

″ప్రతి శుక్రవారం ఫిజిక్స్ ప్రాక్టికల్ క్లాస్ ఎగ్గొట్టి ఇంగ్లీష్ పిక్చర్ కెళ్తూండేవాళ్ళం″

″కరెక్ట్! కరెక్ట్! ఎప్పుడొచ్చావ్ హైద్రాబాద్ కి?″

″నిన్నే! దేవతా పబ్లికేషన్స్ లో ఉద్యోగం వచ్చింది.″

″గుడ్! బావుంది!″ అంటూ మరోసారి భవానీశంకర్ వేసుకున్న బనీనూ చారల పైజమావేపు చూశాడు. ″బైదిబై నీకు భరద్వాజ్ కలిశాడా?″

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు. ″నీకెలా తెలుసు″

″నీ పైజమా బనీను చూసి!″

″అంటే వాడి సంగతి నీకూ తెలుసా?″

″ఓసారి నేనూ పైజమా బనీనుతో తిరిగాక తెలిసింది″

″అంటే నీ బట్టలూ, డబ్బూ కూడా″

″కొట్టేశాడు″

వెన్నెల వేట పేజి 8

″ఫన్నీ ఫెలో! కదూ?″

″వెరీ ఫన్నీ! ఆ తరువాత ఎక్కడయినా కనబడతాడేమోనని తెగ వెతికాను″

″స్నేహంలో కనీసం ఒక జత బట్టలయినా వదుల్తే బావుంటుంది″

"వాడు కనిపించినప్పుడు మన బట్టలన్ని ఒకదానిమీద ఒకటి వేసేసుకుని నిద్రపోవాలట! మన క్లాస్ మేట్ చిరంజీవిగాడు అలాగే చేశాడు!"

"ఒండర్ ఫుల్ అయిడియా"

"ఇప్పుడు నీకు అర్జంటుగా బట్టలు కావాలి! అవునా?"

"అంతేకాదు! కొంచెం కాష్ కూడా కావాలి"

"డోంట్ వర్రీ బ్రదర్! అన్నీ ఇస్తాను అసలు నీకు వేరే రూమ్ కూడా అవసరంలేదు. నాతోనే వుండు"

"అంటే నీకింకా మారేజ్ కాలేదా!"

"పిల్లనిచ్చేందుకు ఎవరికీ ధైర్యం చాలటంలేదు"

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"అంతా పిరికివెధవలు! మందంటే చాలు భయపడి పారిపోతున్నారు! మందుకొడితే నేను అన్నీ మర్చిపోతానట!"

"పిచ్చి వెధవలు!"

"అదే నాకు వళ్ళుమండే విషయం! ఓ.కే. నువ్వు వెంటనే మనింటి కెళ్ళిపో! ఇదిగో తాళంచెవి_ ఇంట్లో నా బట్టలున్నాయ్. వేసేసుకో! ఆఫీస్ బాయ్ తో మధ్యాహ్నం కారియర్ పంపిస్తాను_ భోజనం చేసి పడుకో! సాయంత్రం నేను ఇంటికొచ్చాక అన్నీ మాట్లాడదాం! ఇదిగో ఇంటి అడ్రస్! కనుక్కోవడం వెరీ ఈజీ."

"ఓ కే"

భవానీశంకర్ ఆటోలో దీపక్ ఇల్లు చేరుకున్నాడు. ఇల్లంతా చిందర వందరగా వుంది. ఓ గదిలో అన్నీ బ్రాందీ సీసాలు గుట్టగా పడి వున్నాయ్. స్నానం చేసి అల్మారాలో నుంచి ఓ జత ఇస్త్రీ బట్టలు తీసి తొడుక్కున్నాడు. మరికాసేపట్లో కారియర్ తీసుకుని వచ్చేశాడు కుర్రాడు.

భోజనాలు చేసేసరికి మధ్యాహ్నం ఒంటిగంటయిపోయింది. అప్పుడిక వెళ్ళి ఉద్యోగంలో జాయినవటం సబబుగా కనిపించలేదు భవానీశంకర్ కి. ఆ మర్నాడు జాయినవాలని నిశ్చయించుకుని మంచంమీద వాలిపోయాడు.

తిరిగి మెలకువ వచ్చేసరికి సాయంత్రం అయిదయింది. దీపక్ కోసం ఎదుర్చూస్తూ కూర్చున్నాడతను. రాత్రి పదయిపోయినా అతని జాడ కనిపించలేదు. ఓ పక్క ఆకలి మొదలయిపోయింది మళ్ళీ మిగిలిన ముప్పయ్ రూపాయల్లో_ ఆటో ఛార్జీలు పోను మరో నాలుగు రూపాయలు మిగిలింది. ఆ పూటకు భోజనం మిస్ కొట్టేయాలని నిర్ణయించుకుని మళ్ళీ పడుకున్నాడు మంచంమీద పదకొండు గంటలకు తలుపు తట్టిన చప్పుడయింది.

తలుపు తెరచాడు భవానీశంకర్. దీపక్ తూలుతూ లోపలికొచ్చాడు.

"హలో! నీకోసం సాయంత్రం నుంచీ ఎదుర్చూస్తున్నాను బ్రదర్! భోజనం కూడా చేయలేదు."

దీపక్ ఠక్కున ఆగిపోయి భవానీశంకర్ వేపు చూశాడు ఆశ్చర్యంగా.

"ఎవర్నువ్వు?"

భవానీశంకర్ విస్తుపోయాడు "నేనేరా! భవానీశంకర్ ని"

"భవానీశంకర్? వుచ్ భవానీశంకర్?"

"అదేరా! నీ క్లాస్ మేట్ భవానీశంకర్ ని."

"వుచ్ క్లాస్?"

"నేనే గురూ! మనం కాలేజీలో"

"లెట్ ది కాలేజ్ గో టూ హెల్! నువ్వెవరు?"

"అదేమిట్రా మనం పొద్దున్న కలుసుకున్నాంగా?"

"పొద్దున్నా? నో పొద్దున్న నేనెవ్వరినీ కలుసుకోలేదు"

"కలుసుకోకపోవటమేమిటి నీ తలకాయ్! నువ్వేగా ఇంటికెళ్ళమని తాళంచెవి ఇచ్చిందీ?"

"నేనెవ్వరికీ తాళాలివ్వలేదు__ గెటౌట్ వన్_టూ_త్రీ_ఫోర్_ఫైవ్_"

"ఒరేయ్. మనిద్దరం లాస్ట్ బెంచీలో కూర్చునేవాళ్ళం."

"నేనెప్పుడూ లాస్ట్ బెంచీలో కూర్చోలేదు."

"ఫిజిక్స్ ప్రాక్టికల్స్ క్లాస్ ఎగ్గొట్టి ఇంగ్లీష్ పిక్చర్ కెళ్ళేవాళ్ళం."

"అసలు నేను కాలేజ్ కే వెళ్ళలేదు ఎప్పుడూ_ త్వరగా బయటకు పద_వన్_టూ."

"ఒరేయ్_ స్నేహితుడిని పట్టుకుని ఇలా 'గెటౌట్' అనడం అన్యాయం!"

"స్నేహితుడివా? అసలు నీ మొఖం ఇంతకు ముందెప్పుడూ చూడలేదు

నేను."

"అస్సలు చూళ్ళేదా నన్ను?"

"నో. నెవర్! గెటౌట్ వన్_టూ_త్రీ_ఫోర్."

"ఇంత రాత్రప్పుడు ఎక్కడికెళ్ళన్రా?"

"ఎక్కడికయినా పో! అడ్డమైనాడూ 'దీపక్' అంటూ ఇంట్లో జొరబడిపోవటం. కాలేజ్ మేట్. బెంచ్ మేట్_ అంటూ మకాం పెట్టేయడం పెద్ద నాన్సెన్స్ అయిపోయింది. మర్యాదగా బయటకు వెళతావా, లేదా. వన్_టూ_త్రీ_ఫోర్_ఫైవ్_సిక్స్."

భవానీశంకర్ కేం మాట్లాడాలో తోచటంలేదు.

"కమాన్! క్విక్! బయటకు పద! నేను నిద్రపోవాలి. వన్_టూ_త్రీ__"

భవానీశంకర్ అయోమయంగా ఇంట్లోనుంచి బయటికొచ్చాడు.

దీపక్ వెంటనే తలుపులు భళ్ళున మూసేసుకున్నాడు. మరుక్షణంలో లోపల లైటారిపోవటం "జీవితం ఏమిటి? వెలుతురు, చీకటి" అంటూ అతని పాట అపస్వరాలతో వినిపించటం మొదలయింది. పక్కింటి పెద్ద మనిషి ఆప్యాయంగా భవానీశంకర్ భుజం తట్టాడు.

"మందుకొట్టేస్తే కొంచెం ట్రబులిస్తాడు. మామూలే_ ఖంగారేం లేదులే! వస్తా!" అంటూ తనింట్లోకి వెళ్ళి తలుపేసుకున్నాడు.

భవానీశంకర్ కేం చేయాలో తోచలేదు. ఆరాత్రి ఎక్కడికి వెళ్ళలేడు. జేబులో డబ్బులేదు. బయట అరుగుమీదే పడుకుండిపోయాడు. తిరిగి మెలకువ

వచ్చేసరికి బాగా ఎండెక్కిపోయింది. ఛటుక్కున లేచి తలుపు కొట్టాడు ఆశగా.

పది నిమిషాల తర్వాత తలుపు తెరిచాడు దీపక్.

భవానీశంకర్ ఏదో మాట్లాడేలోపలే మళ్ళీ మంచంమీద పడి నిద్రలో మునిగిపోయాడు.

భవానీశంకర్ త్వరత్వరగా మొఖం కడుక్కుని రడీ అయిపోయాడు.

దీపక్ నిద్రలేస్తే మళ్ళీ ఏం పేచీ పెడతాడోనని భయంగా వుంది. ఇలాంటి మందూభాయ్ దేశాయ్ తో ఈ ఇంట్లోనే ఉండటం అసాధ్యం. అతనికి పిల్లనివ్వటానికి అందరూ ఎందుకు భయపడుతున్నారో అర్థం అయిపోయిందతనికి. పొద్దుగూకేసరికి పెళ్ళాన్ని చూచి "ఎవర్నువ్వు?" అని బయటకు గెంటేస్తాడు.

తను వెంటనే మరో గది చూచుకోవాలి! లేపోతో రోజూ అరుగుమీదే నిద్రపోవాల్సి వస్తుంది. కానీ ఇంకోగది తీసుకోవాలన్నా, తనకు మొదటినెల జీతం వచ్చేవరకూ తిండికి గడవాలన్నా డబ్బెక్కడిది? ఆ భరద్వాజ్ గాడు...

హఠాత్తుగా భవానీశంకర్ మెదడులో మెరుపు మెరిసినట్లయింది. అవును! తనూ భరద్వాజ్ పద్ధతిలోనే తనక్కావలసిన కాపిటల్ సంపాదిస్తే సమస్య పరిష్కారమయిపోతుంది.

దీపక్ వంక చూశాడు భవానీశంకర్. పూర్తిగా మత్తులో వున్నాడతను.

అతని సూట్ కేస్ తెరచి చూశాడు. డబ్బేమీ కనిపించలేదు. అల్మారా తెరచి చూశాడు. అందులోనూ కనిపించలేదు. హాంగర్ కి తగిలించివున్న దీపక్ పాంట్

జేబులో వెతికాడు. పర్స్ దొరికింది. అందులో వందనోట్లు చాలా ఉన్నయ్.

పది నోట్లు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు భవానీశంకర్. ఆ పక్కనే టేబుల్ మీదున్న పాడ్ మీద నోట్ రాశాడు త్వరత్వరగా.

"డియర్ ఫ్రెండ్,

అర్జంటుగా వెయ్యి రూపాయలు అవసరమయి_ నీ జేబులో డబ్బు తీసుకున్నాను. మళ్ళీ వీలయినంత త్వరలో ఈ డబ్బు తిరిగి ఇచ్చేస్తాను.

నీ ప్రియమయిన స్నేహితుడు

భవానీశంకర్"

వెన్నెల వేట పేజి ౧

తలుపులు దగ్గరకు వేసి ఆనందంగా బయటికొచ్చేశాడు భవానీశంకర్.

* * * *

"గుడ్ మాణింగ్ అంకుల్" అన్నాడు భవానీశంకర్ పొద్దున్నే సాంబమూర్తి ఆఫీస్ లోకొచ్చి కుర్చీలో కూర్చుంటూ.

"గుడ్ మాణింగ్" అన్నాడు సాంబమూర్తి "నిన్న నువ్వు జాయినవ్వలేదని చెప్పాడు ఎడిటర్ రంగారావు."

"నిన్న కుదర్లేదంకుల్. బనీను, పైజామాతో రావడం బాగుండదు కదా! అందుకని_"

"బనీను, పైజమా ఏమిటి?"

″డ్రస్ అంకుల్ నా నైట్ డ్రస్! అన్నట్లు ఇవాళ రాగానే మన వీక్లీ మొత్తం తిరగేశానంకుల్! అందులో చాలా అయిటమ్స్ అవుట్ డేటెడ్ అంకుల్! నా చిన్నప్పటినుంచీ ఆ శీర్షికల్ని చూస్తున్నాను. అవన్నీ మార్చేయాలని నా ప్లాన్!″

″ఏమిటవి?″ ఆసక్తిగా అడిగాడు సాంబమూర్తి.

″మొదటిది సినిమా ఫీచర్ ఫలానా ప్రొడక్షన్స్ వాళ్ళు ఫలానా చిత్రం తాలూకూ షూటింగ్ జరిపారు. ఫలానా నటీనటులు వీర నటన ప్రదర్శించారు. ఇంకొంచెం ప్రదర్శించే లోపుగానే డైరెక్టర్ ″కట్″ అంటూ అరచాడు లేదా ఫలానా సినిమా షూటింగ్ సమయంలో ఫలానా తార లేక తారడు కాఫీ తాగుతూ ఛలోక్తి విసిరారు అంటూ పరమ చెత్త జోకు రాయటం. ఫలానా సినిమా ఈ వారం రిలీజయింది. కథ, కథనం, అదనం అన్నీ మోతెక్కిపోయాయని రివ్యూ రాయటం.″

″అఫ్ కోర్స్″ అన్నాడు సాంబమూర్తి సాలోచనగా.

″అయిటమ్ నెంబర్ టూ. వారఫలాలు. ఇది నిజంగా హారిబుల్ ఫీచర్ అంకుల్. ఎన్ని సంవత్సరాలయినా ఎవరి జాతకమూ ఎటూ తేలదు. అలా కాకుండా బాగా డైనమిక్ గా రాయాలంకుల్. దీనికి శాస్త్రజ్ఞులు అవసరం లేదంకుల్. నేనే లాగించేస్తాను. ఉదాహరణకు ఫలానా వృశ్చికం తాలూకూ ప్రజలు ఈ వారం అటూ ఇటూ తేల్చేసుకుంటారు. పెళ్ళికాని వాళ్ళు ప్రేమించినమ్మాయినికానీ, అబ్బాయినికానీ లేవదీసుకు వెళ్ళిపోతారు. పెళ్ళయినవాళ్ళు భార్యకు విడాకులిచ్చేయడమో, విడాకులివ్వాలనుకుంటున్న వాళ్ళు ఆ ఆలోచన కాన్సిల్ చేసేసుకుని భార్యను తెచ్చేసుకోడమో ఏదొకటి చేసేస్తారు.″

సాంబమూర్తికి అతని మాటలు భయం కలిగించడం ప్రారంభించినయ్.

"అయిటమ్ నెంబర్ త్రీ. డాక్టర్ సలహాలు. మోస్ట్ హోప్ లెస్ థింగ్ అంకుల్ ఇది. చాలామంది డాక్టర్లు వారాలకొద్దీ పేషెంట్లను పరీక్షించి, రకరకాల పరీక్షలు చేయించినా కూడా అసలయిన జబ్బేమిటో ఖచ్చితంగా నిర్ధారించలేకపోతున్నారు. అలాంటిది అక్కయ్యా! కుడి చెయ్యి, ఎడమకాలు తెల్లారుజామున ఏడింటికి మూడు నిమిషాలపాటు చలనం లేకుండా వుంటున్నాయ్. ఏంచేయాలి అంటే, బి.సి. ఫోర్టీ మింగమనడం."

సాంబమూర్తి నవ్వాడు.

"ఆ ఫీచర్ అసలు కారణం పాఠకుల రోగాలకు మందులివ్వటం కాదోయ్"

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"తెలుసంకుల్! డాక్టర్ సలహాల ద్వారా సెక్స్ సంబంధమున్న ప్రశ్నలు_జవాబులు రాయించి, అందులో బూతు జొప్పించి పాఠకుల నాకట్టుకొనాలని మీ అభిప్రాయం. అవునా? అయ్ నో దట్. కానీ ఈ పద్ధతి అవుట్ డేటెడ్ అంకుల్ డైరెక్టుగా సెక్స్ గురించి ఆర్టికల్స్ రాస్తే మహా క్రేజీగా వుంటుంది. అసలు నన్నడిగితే ఇప్పుడు చేస్తున్న ముసుగులో సెక్స్ విన్యాసాలు ఆపి వాత్సాయన కామసూత్రాలు ఫోటోలతో సహా ప్రచురిస్తే ఎక్కువ పాపులర్ అవొచ్చు."

"అఫ్ కోర్స్" అన్నాడు సాంబమూర్తి ఆలోచిస్తూ.

"అయిటమ్ నెంబర్ ఫోర్."

"సాంబమూర్తి టైమ్ చూచుకున్నాడు.

"ఆల్ రైట్! ఇంకోసారి మాట్లాడదాం. నాకిప్పుడు వేరే పనుంది" అన్నాడు చిరునవ్వుతో.

"ఓ.కే. అంకుల్! రేపు మాణింగ్ కలుస్తాను" అనేసి తన సీట్ దగ్గరకు నడిచాడు భవానీశంకర్.

ఎడిటర్ రంగారావ్ అతనివంక అయిష్టంగా చూశాడు.

"అన్నీ అంకుల్ తో డిస్కస్ చేశాను మైడియర్ రంగారావ్! ఫైనల్ డెసిషన్ రేపో, ఎల్లుండో తీసుకుంటానన్నారు మీన్ వైల్. 63 పేజీలో వెంకులక్ష్మి కవితలు నాకేం నచ్చలేదు. వచ్చే సంచిక నుంచీ తీసేస్తున్నాను."

రంగారావ్ అదిరిపడ్డాడు.

"అది తియ్యటానికి వీల్లేదు" అన్నాడు కంగారుగా.

"ఎందుకని బ్రదర్?"

"దానికి చాలా రెస్పాన్స్ వస్తోంది పాఠకుల నుంచీ."

"పొరబాటు మిస్టర్ రంగారావ్! నేను గత వారం రోజులుగా వచ్చిన ఉత్తరాలన్నీ చెక్ చేశాను. అది ఆపెయ్యమని బూతులు తిడుతున్నారు జనం. ఆ ఉత్తరాలన్నీ ప్రత్యేకంగా ఓ కట్టకట్టి సాంబమూర్తి అంకుల్ కి పంపిస్తున్నానిప్పుడే."

రంగారావ్ మొఖం పాలిపోయింది.

"ప్లీజ్! అలా చేయకు. అది నా పర్సనల్ ఆబ్లిగేషన్" అన్నాడు దీనంగా.

"ఏమిటది?"

"చెప్పాల్సిందేనా?"

"యస్ మైడియర్ రంగారావ్! సబ్ ఎడిటర్ గా నాకు ఫాక్ట్స్ అండ్ ఫిగర్స్ తెలియాలి బ్రదర్! కమాన్, క్విక్."

"వెంకులక్ష్మి భర్త బ్యాంకులో పెద్ద ఆఫీసరు. ఆమె కవితలు ప్రచురిస్తే మా బామ్మర్దికి పదిహేను లక్షలు లోన్ శాంక్షన్ చేస్తానన్నాడు"

"అయితే ఆ కవితలు కేవలం వ్యాపార కవితలన్నమాట."

"షుమారుగా అంతే."

"ఓ.కే. మైడియర్ రంగారావ్! ఇలా ఎంతకాలం వేయాలి?"

"ఆమెకు రాసేందుకు ఓపిక వున్నంతకాలం."

"వెరీబాడ్ మిస్టర్ రంగారావ్! టైం లిమిట్ లేకుండా యావజ్జీవ రచయితలను పోషించటం నావల్ల కాదు. నేను ఒప్పుకోను. వెంటనే ఒక టైమ్ లిమిట్స్ ఫిక్స్ చేసెయ్యండి."

రంగారావ్ బుర్ర గోక్కున్నాడు.

"ఆల్ రైట్! ఇంకా అయిదేళ్ళు."

"నో, నో, నో. అంత టైమ్ స్పేర్ చెయ్యలేను బ్రదర్! ఇదేం పంచవర్ష ప్రణాళికా? నో. ఇంకా అయిదు సంచికలవరకూ టైమిస్తున్నాను అంతే. ఓ.కే."

"పోనీ ఆరు సంచికలు."

"నో! నథింగ్ మోర్! ప్లీజ్! ఓన్లీ ఫైవ్" ఖచ్చితంగా చెప్పాడు.

రంగారావ్ దిగాలుపడి కూర్చుండిపోయాడు.

భవానీశంకర్ లేచి మాసపత్రిక సెక్షన్ లో కొచ్చాడు. అసిస్టెంట్ ఎడిటర్ మిసెస్ చందన అతనిని చూసి చిరునవ్వు నవ్వింది.

"హలో!"

"హలో చందనాజీ!"

"మీ దగ్గరకే వద్దామనుకుంటున్నాను" అందామె.

"అక్కర్లేదు మేడమ్! కాకితో కబురుచేయండి. చాలు. వచ్చేస్తాను" అన్నాడతను ఆమె కెదురుగా కుర్చీలో కూర్చుంటూ.

"నాకో చిన్న హెల్ప్ కావాలి?"

"అడగండి మేడమ్! ఇక్కడంతా కేవలం బిజినెస్. అంతే. మీకు నా సహాయం కావాలంటే మీరూ నాకో సహాయం చేయాల్సి వుంటుంది."

"ఓ.కే. ఒప్పుకుంటాను" చిరునవ్వుతో అందామె.

"అయితే చెప్పండి మీకేం కావాలో?"

"టి.వి. స్టేషన్ డైరెక్టర్ తో ఇంటర్వ్యూ మీ వీక్లీలో ప్రచురించాలి" భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? మన టి.వి. అంటేనే తెలుగు ప్రజలకు ఎలర్జీ కదా? అలాంటి దిక్కుమాలిన ప్రోగ్రామ్స్ తయారుచేసే స్టేషన్ డైరెక్టరు ఇంటర్వ్యూ వేయటమా?"

"ఆ ఇంటర్వ్యూ వేస్తే మా కజిన్ ఒకమ్మాయికి టి.వి.లో ఉద్యోగం ఇస్తానన్నాడు."

"ఐసీ! ఇది ఓ 'జీవి' ఉద్యోగానికి సబంధించిన వ్యవహారం అన్నమాట."

"అవును."

"ఇంటర్వ్యూ ప్రచురించకపోతే మీ కజిన్ కి ఉద్యోగం రాదు."

"కరెక్టు"

"ప్రచురిస్తే ఉద్యోగం వస్తుంది."

"యస్!"

"ఆల్ రైట్! సరే ఒక వారం రిస్క్ తీసుకుందాం. దాని ప్రభావం వల్ల అయిదారు వారాలు సర్క్యులేషన్ దెబ్బతింటుందనుకోండి. అయినా సరే."

"థాంక్యూ భవానీశంకర్ గారూ! ఇప్పుడు మీకోసం నేనేం చేయాలో చెప్పండి"

భవానీశంకర్ జేబులో నుంచి కాగితం తీసాడు. దాని మడతను విప్పి అమ్మాయి బొమ్మను చందన ముందుంచాడు.

"నాకు అర్జంటుగా ఈ అమ్మాయి వివరాలు కావాలి. ఇది ఏ మాగజైన్ లో పబ్లిషయిందో తెలీదు."

ఆమె కాగితం అందుకొని రెండువేపులా పరికించి చూసింది.

"కాని అసలెందుకా వివరాలు?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ అమ్మాయిని ప్రేమించాను"

ఆమె విరగబడి నవ్వసాగింది.

"ఎందుకలా నవ్వుతారు?"

"కాగితాల మీద బొమ్మలను చూసి ప్రేమించానంటే నవ్వొస్తోంది."

"ఇది ఆర్టిస్టు గీసిన బొమ్మకాదు_ ఫోటో_"

"అయితే అయుండవచ్చు."

"ఫోటోలో వ్యక్తుల్ని ప్రేమించడం మనకు కొత్తేమీ కాదు గదా! పురాణ కాలం నుంచి ఉంది."

ఆమె ఇంక నవ్వుతూనే వుంది. "ఆల్ రైట్! మన మాసపత్రికలన్నీ తీసిచూస్తాను. ఏ సంగతి మీకు సాయంత్రం తెలియచెప్తాను"

"థాంక్యూ మేడమ్! మీ వివరాలమీద ఓ జీవి ప్రేమ ఆధారపడి ఉందని గుర్తుంచుకోండి!"

"ఓ.కే_"

భవానీశంకర్ వచ్చేశాడక్కడినుంచి!

సాయంత్రం వరకూ ఆతృతగా ఆమె ఫోన్ కోసం ఎదురుచూస్తూ గడిపాడతను. చివరకు సాయంత్రం మళ్ళీ తనే ఆమెదగ్గరికెళ్ళాడు.

చందన తన టేబుల్ చుట్టూ పాత మాసపత్రికల బౌండ్స్ పేర్చుకుని కూర్చుంది.

"అయామ్ సారీ! మీ ప్రియురాలి ఫోటో మన మంత్లీలో పబ్లిష్ అవలేదు. గత

నాలుగేళ్ళుగా వచ్చిన సంచికలన్నీ వెతికాను″

భవానీశంకర్ నిరుత్సాహపడ్డాడు.

″అయితే ఇంకేమిటి దారి?″

″ఇది తప్పకుండా ఏదొక తెలుగు మాసపత్రికలో ప్రచురించబడిందే! ఎందుకంటే ఈ సైజులో వచ్చేవి మాసపత్రికలే! కనుక అన్ని మాసపత్రిక ఆఫీసులకూ వెళ్ళి వెతకాల్సిందే!″

″అయితే ఆ పని చేయండి! మన మాసపత్రికల పేర్లూ, అడ్రస్ లూ అన్ని రాసిస్తే వేట ప్రారంభిస్తాను″

″ఇప్పుడే ఇస్తాను″ అంటూ ఓ పెద్ద పుస్తాం తెరచి అందులోని అడ్రస్ లన్నీ ఓ కాగితంమీద రాసిచ్చింది.

″థాంక్యూ! మీకు చాలా శ్రమ ఇచ్చాను″

″ఏంపర్వాలేదు. కానీ మీకో విషయం చెప్పమంటారా?″

″చెప్పండి!″

″ఈ అమ్మాయి కోసం అంత శ్రమపడటం అనవసరం అని నా అభిప్రాయం. ఇంతకంటే అందమయిన అమ్మాయిలు మీరు కావాలనుకుంటే దొరుకుతారు″

భవానీశంకర్ నవ్వాడు.

″కాని మీకు పెళ్ళయిపోయిందికదా″

చందన సిగ్గుపడిపోయింది.

యూ ఆర్ టూ స్మార్ట్" అంది చిరుకోపంతో.

భవానీశంకర్ అక్కడనుంచి బయటకొచ్చేశాడు. పార్కు చేరుకొని ఎవరూ లేనిచోట కూర్చుని చందన ఇచ్చిన అడ్రస్ ల లిస్ట్ ఓసారి చూశాడు మళ్ళీ. రెండు మాసపత్రికలు మద్రాస్ నుంచి వస్తున్నాయ్. మూడు విజయవాడ నుంచి, ఆరు హైద్రాబాద్ నుంచీ, ఒకటి మచిలీపట్నం నుంచీ.

వీటన్నిటిని ఎప్పటికి వెతకగలడు? ఆ అమ్మాయి ఫోటో అతన్ని చూసి నవ్వుతున్నట్లనిపించింది_ హేళనగా.

భవానీశంకర్ కి ఎక్కడలేని పట్టుదలా వచ్చింది.

"ఏమయినా సరే! ఈ అమ్మాయిని కనుక్కోవలసిందే"

నిజానికి ఈమెను కనుక్కోవటం చాలా తేలిక! ఇంత అందమైన అమ్మాయి ప్రపంచంలో ఇంకెక్కడా ఉండదు కనుక!

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకల్లా "విజేత" మాసపత్రిక ఆఫీస్ కి చేరుకున్నాడతను. చాలా చిన్న ఆఫీసది. ఇద్దరు యువకులు కూర్చుని ఏదో రాసుకుంటున్నారు.

"హలో బ్రదర్స్!" చిరునవ్వుతో పలకరించాడతను.

వాళ్ళు ఆశ్చర్యంగా చూశారతనివేపు.

"నా పేరు భవానీశంకర్! నేను చంద్రిక వారపత్రికలో ఎడిటర్ని"

"రండిసార్ కూర్చోండి" అన్నాడొకతను వినయంగా.

"అర్జంటుగా మీ ఎడిటర్ని కలుసుకోవాలి బ్రదర్! ఉన్నారా?"

"ఓ! లోపలికెళ్ళండి"

భవానీశంకర్ లోపలకు నడిచాడు. ఓ లావుపాటి వ్యక్తి కూర్చుని ఉన్నాడక్కడ. తనను తను పరిచయం చేసుకున్నాడతను.

"అదేమిటి? ఆంధ్రదీపిక ఎడిటరు రంగారావ్ కదా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

నిన్నటివరకూ మైడియర్ సర్! నిన్నటివరకూ! ఇవాల్టినుంచీ భవానీశంకర్.

"ఎందుకింత సడెన్ గం మార్చేశారు?"

"టాలెంట్ బ్రదర్! మన టాలెంట్ చూసి సాంబమూర్తికేం చేయాలో అర్థంకాలేదు. అసలు తనే రిజైన్ చేసి ఛీఫ్ ఎడిటరు నాకివ్వాలని ఆశ పడ్డాడుగానీ నేను ఒప్పుకోలేదు. లివ్ అండ్ లెట్ లివ్ అనేది మన పాలసీ! అంచేత ఇంక నెక్ట్స్ బెస్ట్ పోస్టు వీక్లీది కనుక రంగారావ్ ని నా అసిస్టెంట్ గా వేసి నాకా పోస్ట్ ఇచ్చారు."

"ఐసీ"

"ఇంతకూ నేను వచ్చిన పనేమిటంటే_ఇదిగో_ఈ అమ్మాయి ఫోటో ఉన్న ఈ పేజీ మీ "విజేత" మాసపత్రికలోదే అని నా అనుమానం! ఈ అమ్మాయి అడ్రసూ, వివరాలూ అర్జంటుగా కావాలి గురూగారూ."

అతను ఆశ్చర్యపోయాడు.

"ఎందుకూ?"

"ఎందుకంటే__ఎందుకంటే...ఈ అమ్మాయి మా ఫ్రెండొకతనికి బాగా ఫ్రెండట. ఇద్దరు ప్రేమించుకున్నారట చాలా కాలం క్రితం. అందుకని."

"ఓ.కే. అర్థమయింది" నవ్వుతూ అన్నాడతను.

"కొంచెం మీరీ సహాయం చేశారంటే..."

"ఓ.యస్. నో ప్రాబ్లెమ్...మా వాళ్ళతో అన్ని సంచికలూ వెతికిస్తాను."

"థాంక్యూ! నేను సాయంత్రం వస్తాను."

"అన్నట్లు మీరుకూడా ఓ చిన్న సహాయం చేస్తే..."

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఎవరిదయినా ఇంటర్వ్యూ మా వీక్లీలో వేయాలా?"

"అబ్బే...అలాంటివన్నీ మా పత్రికలోనే వేసుకుంటాం! అది కాదు! నా నవల ఒకటి మీ వీక్లీలో సీరియల్ గా వేస్తే."

"నవలా?" ఖంగారుగా అన్నాడు భవానీశంకర్.

"అవును! ఊరికే కాదులెండి. మీరుకూడా ఓ నవల మా మాసపత్రికలో సీరియస్ గా రాయవచ్చు"

"ఐసీ."

"ఎలావుంది అయిడియా?"

"చాలా బాగుంది! ఎటొచ్చీ మీరింకో సహాయం చేయాల్సి ఉంటుంది."

"ఏమిటది?"

"నా పేరుమీద సీరియల్ కూడా మీరే రాయాలి. నాకు టైముండదు..."

"ఆల్ రైట్ ఎగ్రీడ్."

భవానీశంకర్ లేచి వచ్చేశాడు.

సాయంత్రానికి విజేత ఎడిటర్ దగ్గర్నుంచీ ఫోన్ వచ్చిందతనికి.

"సారీ! ఆ అమ్మాయి ఫోటో మా మాగజైన్ లో పబ్లిష్ అవలేదు. అయిదేళ్ళ క్రితంవరకూ వచ్చిన సంచికలన్నీ వెతికించాను."

"థాంక్యూ బ్రదర్! మీ ఋణం ఉంచుకోను."

"మరి నా సీరియల్."

"సారీ బ్రదర్! రేపటినుంచి నా పోస్ట్ మారిపోతోంది. నన్ను చిన్నపిల్లల మాసపత్రికలో ఎడిటర్ గా వేశారు_అంచేత"

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

"హలో" అతని గదిలోకి జొరబడిందొకామె.

"హలో! కూర్చోండి!" అన్నాడు భవానీశంకర్.

ఆమె అతనికెదురుగా కూర్చుంది.

"నా పేరు వెంకులక్ష్మి అండీ! కవితలు రాస్తూంటాను."

"ఓ! మీరా! వండర్ ఫుల్! నేను మీ ఫాన్ ని మేడమ్! ఎప్పటినుంచో మిమ్మల్ని కలుసుకోవాలనీ, మీ ఆటోగ్రాఫ్ తీసుకోవాలనీ కలలు కనేవాడిని! ఇన్నాళ్ళకు నా కలలు ఫలించినయ్."

ఆమె ఉప్పొంగిపోయింది.

"ఓ నన్ను ఎక్కువగా పొగిడేస్తున్నారు" అంది సిగ్గుగా.

"పొగడ్తా! నో నెవర్ మేడమ్. నేనెప్పుడూ ఎవ్వరినీ పొగడను. కేవలం నిజాలు మాత్రమే మాట్లాడతాను."

"థాంక్యూ" అందామె ఆనందంగా.

"మీ గురించి మొన్నే రంగారావ్ గారు చెప్పారు మేడమ్. వెంకులక్ష్మి కవితలు అంటే మా పాఠకులు చెవులు కోసేసుకుంటున్నారనీ, కళ్ళు పీకేసుకుంటున్నారనీ."

"థాంక్యూ! కానీ రంగారావ్ గారు ఓ విషయం చెప్పారు"

"ఏమిటది వెంకులక్ష్మిగారూ! చెప్పండి ఫర్లేదు."

"నా కవితల్ని అయిదు వారాలకు మించి మీరు ప్రచురించవద్దన్నారట."

"ఓ! అదా! దటీజ్ టెంపరరీ బాన్ మేడమ్! కేవలం తాత్కాలిక నిషేధం! అఫ్ కోర్స్! పాఠకుల కోరికపై."

"కానీ ఎలాగయినా వంద కవితలు ప్రచురిస్తే ఆ తరువాత నేను వాటిని పుస్తకంగా రిలీజ్ చేయాలని నా ఆలోచన! ఆ పుస్తకం వేయటానికి కూడా కారణం ఉంది!"

"ఏమిటి మేడమ్?"

"ఆ పుస్తకం రిలీజవగానే దానికి సాహిత్య అకాడమీ బహుమతి వస్తుంది."

"వస్తుందా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"అవును! ఆ ఏర్పాట్లన్నీ మావారు చేశారు"

"సూపర్బ్ హజ్బెండ్ మేడమ్! ప్రతి స్త్రీ కోరుకునేది అలాంటి భర్తనే! భర్తలందరికీ ఆదర్శప్రాయుడు."

ఆమె మళ్ళీ సిగ్గుపడింది.

"కనుక మీరు నా కవితలు ఆపకుండా వేస్తే..."

"మీ కోరిక తప్పక పరిశీలించడం జరుగుతుంది. వెంకుమాంబాజీ! కాకపోతే కొన్ని నెలలు గాప్ ఇచ్చాక అప్పుడు."

"ప్లీజ్" అతని చేతిని హఠాత్తుగా తనచేత్తో పట్టుకుందామె. "మీరేం చేయమన్నా చేస్తాను. కానీ కవితలు మాత్రం ఆపకుండా..."

భవానీశంకర్ తన చేతిని వెనక్కు లాగేసుకున్నాడు.

"ఓ.కే. ఓ.కే ఈ విషయం చాలా సీరియస్ గా ఆలోచిస్తానని హామీ ఇస్తున్నాను మైడియర్ ఫ్రెండ్. ఇంక మీరు వెళితే..."

ఆమె లేచి నిలబడింది.

"థాంక్యూ! మీరు మా ఇంటికోసారి రాకూడదూ? చాలా హ్యాపీగా ఉంటుంది నాకు."

"తప్పక వస్తాను మేడమ్."

"ఇదిగో మా అడ్రస్, ఫోన్ నెంబరు."

"థాంక్యూ_థాంక్యూ_"

ఆమె వెళ్ళిపోయింది.

"హమ్మయ్య" అనుకున్నాడు భవానీశంకర్ తేలికగా.

మర్నాడు 'తేజస్సు' మాసపత్రిక ఆఫీస్ ని చేరుకున్నాడతను.

ఓ అందమయిన అమ్మాయి కూర్చుని ఉంది.

"హలో హలో_నమస్కారం! అయామ్ భవానీశంకర్" అన్నాడతను చిరునవ్వుతో.

ఆ అమ్మాయి సీరియస్ గా చూసింది "ఏం కావాలి?"

"మీ మాసపత్రికలో ఈ అమ్మాయి బొమ్మ ప్రచురించబడింది డియర్! ఈ అమ్మాయి వివరాలు కావాలి."

"నన్ను డియర్ అనకండి" కోపంగా అందామె.

"అనకూడదా?"

"అనకూడదు"

"ఆల్ రైట్_మీకు అభ్యంతరమయితే ఓ.కే."

"మీక్కావలసిన వివరాలు కూడా దొరకవు."

"ఎందుకని మైడియర్...సారీ ఫ్రెండ్?"

"ఎవరికీ ఎలాంటి వివరాలూ ఇవ్వవద్దని మా ఎడిటరుగారు చెప్పారు."

"ఎందుకని?"

"ఒకతను ఇలాగే వివరాలు తీసుకుని ఓ రచయిత్రికి ప్రేమలేఖ రాశాడు."

"రాస్తే తప్పేముంది డియర్! ప్రేమకు స్వేచ్ఛ అవసరం! ప్రేమించే హక్కు, ప్రేమను తెలియజేసేహక్కు ప్రతి ప్రాణికీ ఉంది. అసలు ప్రేమలేఖలు అందమయిన అమ్మాయిలకు కాంప్లిమెంట్స్. ఆ రచయిత్రి ఎందుకు కంప్లైంట్ చేసిందో అర్థం కావటంలేదు."

"ఆమె కాదు కంప్లెయింట్ చేసింది."

"మరి?"

"ఆమె భర్త!"

"ఓ!" అర్థమయినట్లు అన్నాడతను. "అదా సంగతి!"

"అవును!"

"పాపం అతనికి ఆ ప్రేమలేఖ అంతగా నచ్చి వుండదు."

"ఏమాత్రం నచ్చలేదు"

"అఫ్ కోర్స్ అతని మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు."

"కనుక మీరింక వెళితే..."

"కానీ నా కేస్ అదికాదు డియర్."

"డియర్ అనవద్దని ఇంతకుముందోసారి చెప్పాను."

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు "చెప్పారా?"

"అవును!"

"ఎప్పుడు?"

"ఇంతకుముందే!"

"ఐసీ! మర్చిపోయి ఉంటాను! ఓ.కే. భవిష్యత్తులో తప్పక గుర్తుంచుకుంటాను డియర్! ఇంతకూ నేను చెప్పేదేమిటంటే_ ఇప్పుడీ అమ్మాయికి నేను ప్రేమలేఖ రాయబోవటం లేదు కదా?"

"ఆ రచయిత్రికి ప్రేమలేఖ రాసినతను కూడా అచ్చం మీలాగానే చెప్పాడు."

"ఐసీ!"

"చెప్పి పదహారు పేజీల ప్రేమలేఖ రాశాడు."

"మైగాడ్! పదహారు పేజీలా?"

"ఇంకో అరపేజీ కూడా ఉందట!"

"ఫూలిష్ ఫెలో, బహుశా తెలుగు మాతృభాష అయుంటుంది వాడికి. అందుకే ఎక్స్ ప్రెషన్ చాలా 'వీక్'గా ఉండి అన్ని పేజీల మేటర్ రాశాడు. నేనయితే రెండే రెండు లైన్లు రాస్తాను. ఉదాహరణకు నీచిక్కటి అనుభూతుల చీకటిలో_నే పురివిప్పిన వెన్నెలనవుతా! అంతే."

వెన్నెల వేట పేజి 12

"అంటే ఇప్పుడీ ఫోటోలోని అమ్మాయికి మీరు రాస్తారన్న మాట!" దొంగను పట్టేసినట్లు అందామె.

"రాస్తానంటే ఇప్పుడు రాస్తానని కాదు డియర్! మన టెరిఫిక్ సామర్థ్యం, భాష మీదున్న కమాండ్ గురించి మాట్లాడుతున్నాను."

"నో. సారీ? నమ్మటానికి వీల్లేదు మగాళ్ళను!"

"వెరీబాడ్ డియర్. ఇలా మగాళ్ళందరినీ ఒకటిగా."

"ఇంక మీరు వెళితే నా పని చేసుకుంటాను."

"పోనీ ఇంకో విషయం మాట్లాడదాం. టాపిక్ ఛేంజ్."

"ఏమిటది?"

"మీకెప్పుడయినా, ఎవరయినా ప్రేమలేఖలు రాశారా?"

"మీ కనవసరం."

"అక్కడే మీరు పొరబడ్డారు డియర్! దానినిబట్టే నేను మీ సైకాలజీ స్టడీ చేయటానికి వీలుంటుంది. ఉదాహరణకు మీకు బోలెడుమంది ప్రేమలేఖలు గుప్పించేశారనుకోండి. దాంతో మీ అందం మీద మీకు ఆత్మవిశ్వాసం పెరిగిపోయి_ ప్రేమలేఖలు రాసే వాళ్ళందరినీ ఎంకరేజ్ చేసేస్తారు. ఉదాహరణకు మీకు అస్సలెవరూ ఒక్క ప్రేమలేఖ కూడా రాయలేదనుకోండి! దాంతో మీకు మీ ఎట్రాక్షన్ పవర్ మీద ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోయి_ ప్రేమలేఖలు రాయాలనుకునే వారందరికీ అడ్డుపడిపోతుంటారు కనుక_"

"మీరు వెళతారా లేదా?" కోపంగా అందామె. భవానీశంకర్ బయటికొచ్చేశాడు. ఆ రోజు మధ్యాహ్నం ఆఫీస్ లో కూర్చుని 'వెన్నెల' అడ్రస్ ఎలా సంపాదించటమా అని ఆలోచిస్తూంటే మిసెస్ చందన వచ్చిందతని దగ్గరకు.

"ఏమండోయ్ ప్రేమికుడుగారూ? ఎనీ సక్సెస్?"

"లేదు మేడమ్! నిన్న తేజస్సు ఆఫీస్ కెళితే ఓ ప్రేమంటే తెలీని పిల్ల తరిమి కొట్టింది."

"అందరూ నాలాగా మంచివాళ్ళుండరు." నవ్వుతూ అందామె.

"ఇప్పుడు నాకేం దారి మేడమ్? ఆ రాకాసి పిల్లను ఎలా మంచి చేసుకోవటం?" దిగులుగా అడిగాడు భవానీశంకర్.

"ముందాపిల్లనే ప్రేమించండి! అప్పుడు సహాయం చేస్తుంది"

"ఏడ్చినట్లుంది"

"లేకపోతే ఇంకోపని చేద్దాం! ఆ కాగితం నాకివ్వండి. నేను రేపొక రోజు శెలవుపెట్టి హైద్రాబాద్ లో మాసపత్రికల ఆఫీసులన్నీ తిరిగి చెక్ చేసుకొస్తాను"

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"ఇందుకు ప్రతిఫలంగా నేనేంచేయాలి? వీక్లీ కవర్ మీద ముఖచిత్రం మీది వేయాలా?"

చందన అతని భుజం మీద చరిచింది నవ్వుతూ.

"ఏమీ అక్కర్లేదులే. కేవలం మీమీద జాలి! అంతే."

"నిజంగానా?"

"యస్! అయ్ నో వాటీజ్ లవ్! నేనూ ఒకప్పుడు ప్రేమలో పడ్డదాన్నే"

"థాంక్యూ మేడమ్! మీరీ సహాయంచేస్తే జీవితాంతం మీకు రుణపడి ఉంటాను"

"అనెసిసరీ" అందామె.

మర్నాడంతా ఆమె దగ్గర్నుంచి ఎప్పటికప్పుడు ఫోన్ వస్తుందేమోనని ఎదురుచూస్తూ గడిపాడతను. సాయంత్రం అయిదయిపోయినా ఫోన్ రాలేదు.

ఆఫీస్ నుంచి రూమ్ కి బయల్దేరుతుంటే రోడ్డు మీద ఎదురువచ్చిందామె.

"అయామ్ సారీ! సిటీ నుంచే వచ్చే మాసపత్రికలు వేటిలోనూ లేదా పేజీ"

భవానీశంకర్ నిరుత్సాహపడిపోయాడు.

"ఓ.కే. మేడమ్. రేపే నేను విజయవాడ, మద్రాస్ కూడా వెళ్ళి వస్తాను"

"అంతకంటే గత్యంతరం లేదనుకుంటాను"

"ప్రేమ గుడ్డిది, ప్రేమ పిచ్చిది అంటూ ఏవేవో అన్నారుగానీ ప్రేమ ఇంత కష్టమైనది అని ఎవరూ అనలేదెందుకనంటారు?"

"సక్సెస్ అయ్యాక ఆ కష్టం తెలీదు కాబట్టి"

"ఓ.కే. థాంక్యూ మేడమ్_వస్తాను"

"సీ యూ_"

ఆ రాత్రంతా భవానీశంకర్ కి నిద్రపట్టలేదు. మర్నాడు సాంబమూర్తి దగ్గరకెళ్ళి శెలవు తీసుకుని విజయవాడ వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడతను. అక్కడ అంకుల్ కి కనబడకుండా మాసపత్రికల ఆఫీస్ లన్నీ తిరిగి అదే రాత్రికి మద్రాస్ వెళ్ళిపోవాలి. వీటన్నిటికి తన దగ్గరున్న డబ్బు చాలదు ఎలా? ఏంచేయడానికి తోచలేదతనికి. ఉండుండి ఆ అమ్మాయి రూపమే కళ్ళముందు కనబడుతోంది.

చివరకు తాను పడుతున్న శ్రమంతా వృధా కాదుగదా! తీరా తనా అమ్మాయిని కనుక్కోగలిగాక ఆ అమ్మాయికి పెళ్ళయిపోయి ఉంటే లేదా ఆ అమ్మాయి ఇంకెవరినయినా ప్రేమించి ఉంటే.

ఆ ఆలోచనలంతగా నచ్చటం లేదతనికి. ఆ అమ్మాయి ఎక్కడో చోట ఇదే అందంతో, ఇంకా కన్యగానే ఉండి ఉంటుందనిపిస్తోంది.

తన ప్రేమను అంగీకరిస్తుందని తనను వివాహం చేసుకుంటుందని ఆశ. తెల్లారుజామున మూడింటికి నిద్ర పట్టిందతనికి. నిద్రపోయిన ఆ కాసేపూకూడా ఆ అమ్మాయే కలల్లో విహరించింది.

"నీకోసమే ఎదుర్చూస్తున్నా భవానీ" అని చెవిలో చెప్పినట్లనిపించసాగింది.

* * * *

మర్నాడు ఆఫీస్ కెళ్ళేసరికి ఆలస్యమయిపోయిందతనికి. అప్పటికే సాంబమూర్తి నుంచి రెండుసార్లు పిలుపు వచ్చిందతనికి. తిన్నగా సాంబమూర్తి రూమ్ కి చేరుకున్నాడు.

"హల్లో భవానీ! వీక్లీలో నువ్ చేసిన మార్పులు చూశాను" అన్నాడతను ఆనందంగా.

″డాక్టర్ సలహాలు తీసేసి దాని స్థానంలో వాత్సాయన కామసూత్రాలు ప్రచురించబోతున్నామన్న ప్రకటన సూపర్బ్_నాకు ఇప్పటికిప్పుడే బోలెడుమంది ఫోనులు చేసి అభినందనలు చెప్తున్నారు″

″థాంక్యూ అంకుల్_ ఇది మన టాలెంట్స్ లో మచ్చుక మాత్రమే! ఇంకా చాలా చేయాల్సి ఉంది.″

″కారీ ఆన్ డియర్! కారీ ఆన్! ఆ రంగారావ్ ఏంచెప్పినా పట్టించుకోకు! అతను ఇకనుంచి పేరుకే ఎడిటర్ గానీ ప్రాక్టికల్ గా నువ్వే అన్నీ చూచుకో″

″ఓ కే. అంకుల్ అన్నట్లు నాకు రెండురోజులు లీవ్...″

″నోనోనో లీవ్ మాత్రం అడగకు. చేరిన మూడు నెలల వరకూ ఎవ్వరికీ లీవ్ ఇవ్వరిక్కడ″

″కాని మరి...″

″కొంపలు మునిగినా సరే! నో_లీవ్″

″ఒకవేళ జ్వరమొస్తే అంకుల్?″

″అది వేరేవిషయం″

″థాంక్యూ అంకుల్″ అనేసి లేచి తన గదిలో కొచ్చాడతను. అర్జంటుగా ఓ డాక్టర్ దగ్గరకు వెళ్ళి తనకు జ్వరం వచ్చినట్లు ఓ సర్టిఫికెట్ తీసుకోవాలి. అంతే లీవ్ శాంక్షన్ అయిపోతుంది.

″హలో గుడ్ మాణింగ్ సర్″ ఓ గిరజాల యువకుడు హడావుడిగా వచ్చి భవానీశంకర్ కెదురుగ్గా కూర్చున్నాడు.

"యస్, మైడియర్ యంగ్ మాన్!"

"నా పేరు రాజు! నేను పొయిట్రి  రాస్తాను"

"ఓ! అలాగా! చాలా సంతోషం బ్రదర్ రాయండి! జాతీయ సమైక్యత మీద రాస్తారనటంలో నాకేమాత్రం అనుమానం లేదు"

"పొరబాటు పడ్డారు సార్! నేను గవర్నమెంట్ కవినికాదు! ప్రైవేట్ పొయిట్! అన్నిటిమీదా కవిత్వం రాస్తాను. ఒక్క ప్రభుత్వం గురించి తప్ప! ఎక్కువగా ప్రేమ మీద రాస్తాను"

"ఐసీ_అయితే మీరు ప్రేమేరా జీవితం టైప్ అన్నమాట!"

"అవును సార్! ఇవిగో ఇదివరకు నేను రాసిన ప్రేమ కవితలు_విరహ కవితలు" భవానీశంకర్ వాటిని దూరంగా నెట్టేశాడు.

"ఇప్పుడు మన వీక్లీలో వాటికి చోటులేదు బ్రదర్! హౌస్ ఫుల్ అయిపోయింది కనుక"

వెన్నెల వేట పేజి 13

"నేను అద్భుతమయిన గేయాలు రాశాను సార్! గేయాల పోటీలో కన్సొలేషన్ బహుమతి కూడా వచ్చింది. అయితే ఆ పత్రికవాళ్ళు బహుమతి మొత్తం ఎగ్గొట్టారు కొడుకులు"

"కంగ్రాచ్యులేషన్స్ అలాగే కేవలం పోటీల్లో పాల్గొంటూండు బ్రదర్! ఏదొకరోజు నీ కీర్తి ప్రపంచమంతా వ్యాపించేస్తుంది.

"పోనీ ఫోటో ఫీచర్ కయినా కవితలు రాయనీయండి సార్! సగం పేజీచాలు!"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమన్నావ్! ఫోటో ఫీచరా?"

"అవున్సార్! ఇంతకుముందు చాలా మాసపత్రికల్లో రాశాను"

"మాసపత్రికల్లో రాశావా"

"యస్సార్! అన్ని మాసపత్రికల్లో కొన్నాళ్ళు మెయింటెయిన్ చేశాను"

భవానీశంకర్ గుండెలు వేగంగా కొట్టుకున్నయ్.

తన జేబులోనుంచి పాత మాసపత్రిక కాగితం తీశాడు.

"ఇదిచూడు ఈ ఫోటో కిందున్న కవిత్వం నీదేనా?"

అతను ఓక్షణం ఆ కవిత్వం చూశాడు.

"అవును ఇది నేను రాసిందే"

భవానీశంకర్ మనసంతా ఆనందంతో నిండిపోయింది. అమాంతం లేచి అతనికి షేక్ హాండిచ్చాడు.

"సూపర్బ్ బ్రదర్! నిన్ను కలుసుకోవటం నిజంగా అద్భుతం_యూ ఆర్ రియల్లీ గ్రేట్"

"అవున్సార్! ఈ పొయిట్రీ చదివిన వారందరూ ఎంతో పొగిడారు"

"నేననేది ఈ పొయిట్రీ గురించి కాదు బ్రదర్! నువ్వు దొరకటం నా అదృష్టం"

"అలాగా సార్?"

"అవును! నాకు సహాయం చేస్తావా?"

"మీకా! మీరడిగితే చేయకపోవటం ఏమిటిసార్! ఆజ్ఞాపించండి అంతే!"

"నాకు ఈ ఫోటోలో అమ్మాయి వివరాలు కావాలి బ్రదర్! ఇదే పత్రికలోది? ఈ అమ్మాయి ఎవరు? ప్రస్తుతం ఈమె అడ్రస్ ఏమిటి? ఇవన్నీ చెప్పావంటే నీ ఋణం ఉంచుకోను."

"ఇది 'మల్లెలు' మాసపత్రికలోది సార్! నాకు బాగా గుర్తు. అందులో పనిచేసిన అమ్మాయి ఫోటోనే ఇది. ఆమె పేరు కన్యక."

"కన్యక! ఒండర్ ఫుల్ నేమ్ బ్రదర్! కన్యక అడ్రస్ ఏమిటి?"

"అది తెలీదు సార్!"

"పోనీ ఈ 'మల్లెలు' మాసపత్రిక ఎక్కడుంది?"

"అదికూడా తెలీదు సార్!"

"అంటే?"

"ఈ పత్రిక మూసేసి సంవత్సరం అయిపోయింది."

భవానీశంకర్ నిరుత్సాహపడిపోయాడు మళ్ళీ.

"కొంపముంచావ్ బ్రదర్!"

"కనీ ఈ పత్రిక ప్రొప్రయిటర్ ఇల్లు తెలుస్సార్! ఆయన దగ్గరకెళ్తే ఆ అమ్మాయి వివరాలు తెలియవచ్చు."

"అయితే పద. వెంటనే వెళ్దాం."

ఇద్దరూ ఆటోలో బయల్దేరారు.

"కానీ ఆ అమ్మాయి అడ్రస్ ఎందుకు సార్ మీకు?"

"జీవితమంతా ప్రేమ కవితలు రాశానన్నావ్! ఆ మాత్రం ఊహించలేవూ?"

"అతను ఓ క్షణం ఆలోచించి గలగల నవ్వేశాడు.

"అమ్మమ్మమ్మ అర్థమయింది సార్! అర్థమయింది."

* * * *

శరత్ బాబు ఎదురుగ్గా కూర్చున్న రాజునీ, భవానీశంకర్ నీ కొద్దిక్షణాలు పరిశీలనగా చూశాడు.

"మీరు కవిత్వం కూడా రాస్తారా?" అడిగాడతను భవానీశంకర్ ని.

"నో, నో! నెవర్ సార్! కేవలం ప్రజలకు అవసరమయినవే రాస్తాను."

"ఐసీ! 'మల్లెలు' మాసపత్రిక ద్వారా నేను ఎంతోమంది రచయితలను తయారుచేశాను. మీకు తెలుసో, తెలీదో వెంకుమాంబ అనీ ఒకావిడ మా పత్రికలోనే....."

"ఈయన కన్యక గురించి వివరాలు కనుక్కోవాలని వచ్చారండీ" అన్నాడు రాజు.

"ఓ! కన్యక! వెరీగుడ్ గాళ్! సింప్లీ ఒండర్ ఫుల్! ఆఫీస్ లో అన్ని పనులూ తనే చేసుకునేది. ఒకసారి నేను కలకత్తా వెళ్ళి నెలరోజులుండిపోయాను. అప్పుడు ఆ నెల సంచికను తనే తీసుకొచ్చేసింది. వెరీ ఇంటెలిజెంట్ గాళ్..."

"ఆ అమ్మాయి అడ్రస్..."

"అడ్రసా?"

"అవున్సార్."

"ఎందుకు?"

"ఫోటోఫీచర్ వీరి వీక్లీలో ప్రారంభిస్తున్నారట...అందుకని" అబద్ధం చెప్పేశాడు రాజు.

"సూపర్బ్ ఫేస్! ఫోటోజెనిక్. అందుకే మన పత్రికలో వేశామది. ఈమధ్యే ఓసారి మాట్లాడాను కూడా."

"ఆమె అడ్రస్..."

"అడ్రసా?"

"అవునండీ"

"అడ్రస్ తెలీదు."

"తెలీదు?"

"నో!"

"మరి ఈమధ్యే ఆమెతో మాట్లాడానన్నారు?"

"అఫ్ కోర్స్! మాట్లాడాను. కాని అడ్రస్ తెలీదు."

"మరి ఎక్కడ మాట్లాడారు?"

"మా ఇంటికొచ్చిందామధ్య. పాపం వాళ్ళ ఫాదర్ కి ఏదో జబ్బుట. అంచేత వాళ్ళ ఆర్థిక పరిస్థితి బావుండలేదనీ, ఎక్కడయినా ఏదయినా ఉద్యోగం చూపించమనీ అడిగింది."

భవానీశంకర్ నిరుత్సాహపడిపోయాడు.

"ఆమెను ఇప్పుడు కలుసుకోవాలంటే ఎలా సార్? ఏమయినా మార్గం వుందా?"

"ఉండే వుంటుందిగానీ మనకు తెలీదు."

ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"థాంక్యూ సార్! వస్తాం" అన్నాడు రాజు.

"కన్యకకు మీ పత్రికలో ఏదయినా ఉద్యోగం ఉంటే చూడండి" అన్నాడతను.

భవానీశంకర్ ఆతృతగా అతనివేపు చూశాడు.

"ఉద్యోగమా! నా దగ్గరే సబ్ ఎడిటర్ ఉద్యోగం తెగ ఖాళీగా వుంది సార్! అదేకాదు, ఆమె కనిపించాలేగాని పూలమీద నడిచే ఉద్యోగం ఏదొకటి ఇస్తాను. కానీ ఈ విషయం ఆమెకెలా తెలుస్తుంది?"

"ఎందుకు తెలీదు? నేను చెప్తాను కదా?"

"ఎలా చెబ్తారు? ఆమె అడ్రస్ లేదన్నారుగా!"

అతను నిరుత్సాహంగా చూశాడు. "అఫ్ కోర్స్! ఆ మాట నిజమే. దటీజ్ ప్రాబ్లమ్."

ముగ్గురూ కొద్దిసెకన్లు మౌనంగా ఆలోచిస్తూండిపోయారు.

"పోనీ ఓ పని చేద్దాం" అన్నాడు శరత్ బాబు ఉత్సాహంగా.

"ఏమిటది?"

"కన్యకకు ఫోన్ చేద్దాం."

భవానీశంకర్ ఆనందంగా లేచి నిలబడ్డాడు. "ఆమెకు టెలిఫోన్ ఉందా?"

"లేదు కానీ ఆమె ఫ్రెండ్ వాళ్ళింట్లో వుంది."

"ఫోన్ నెంబరెంత?" ఆతృతగా అడిగాడతను.

"అఫ్ కోర్స్! అది మనదగ్గరలేదు" నిరుత్సాహంగా అన్నాడతను. ఇంక అతనితో మాట్లాడి లాభంలేదనిపించింది భవానీశంకర్ కి. హఠాత్తుగా అతని దృష్టి గోడకున్న ఓ ఫోటో ఫ్రేమ్ మీద పడింది. ఆ గ్రూప్ ఫోటోలో కన్యక ఓమూల నిలబడి వుంది.



"అదుగో కన్యక" అన్నాడతను ఆనందంగా. శరత్ బాబు చటుక్కున బయట గేటువేపు చూశాడు.

"అక్కడ కాదాసార్! ఆ ఫోటోలో."

"అదా! అది 'మల్లెలు' ప్రధమ సంచిక ఆవిష్కరణ సమయంలో తీసింది."

"ఆ ఫోటో ఒకటి నాకిస్తారా?"

"ఎన్ని కావాలంటే అన్ని యిస్తాను. ఆల్బమ్ నిండా అవే" లోపలికెళ్ళి

అయిదునిమిషాల తర్వాత ఓ గ్రూప్ ఫోటో తెచ్చియిచ్చాడతను. అందులో కన్యక మరింత అందంగా, దగ్గరగా కనబడుతోంది.

"థాంక్యూ సార్! కన్యక మీ దగ్గరకొస్తే నాకు ఫోన్ చేయటం మర్చిపోరు కదూ?"

"మర్చిపోను."

"థాంక్యూ సార్" అన్నాడు రాజు కూడా లేచి నిలబడుతూ.

ఇద్దరూ బయటకొచ్చేశారు.

"గురూగారూ! మరి నా కవితలు..."

"డోంట్ వర్రీ మైడియర్ ఫ్రెండ్! వచ్చేవారం నుంచే ఆంధ్రదీపిక అశేషాంధ్ర పాఠకుల కోరికపై ప్రారంభం. 'కవితల రాజు' మిస్టర్ రాజు కవితలు అన్న ఎనౌన్సు కొడుతున్నాను ఈ వారమే."

"థాంక్యూ సార్!"

"డోంట్ మెన్షన్!"

అతను వెళ్ళిపోయాడు. భవానీశంకర్ ఫుట్ పాత్ మీద నడువసాగాడు. రోడ్డుమీద జనం వరదొచ్చిన నదిలా ప్రవహిస్తున్నారు. "ఇన్ని లక్షలమందిలో ఏ ఒక్కరూ కన్యక ఎందుకవలేదు?" అనుకున్నాడు అతను విచారంగా. ఎదురుగా వస్తున్న పెద్దవాన్ ఆగింది. అందులోనుంచి దీపక్ దిగాడు. "హలో బ్రదర్! ఆరోజు ఆఫీస్ కొచ్చి మళ్ళా కనిపించకుండా పోయావేమిటి?"

భవానీశంకర్ గతుక్కుమన్నాడు.

″దేవతా పబ్లికేషన్స్ జాబ్ లో చేరాను కదా! అందుకని...″

″లెట్ ది జాబ్ గో టు హెల్! జాబ్ వచ్చినంత మాత్రాన మన ఫ్రెండ్ షిప్ అలా ఎండిపోవాలా? నో! వీల్లేదు! అసలు నిన్ను మా ఇంట్లోనే ఉండమన్నాను కదా! ఎందుకు రాలేదు మా ఇంటికి?″

″రాకపోవటం ఏమిట్రా! ఆ రోజే వచ్చాను″

″మరి నాక్కనిపించలేదేం?″

″ఎందుక్కనిపించలేదు? ఆ రాత్రి నువ్వు తాగివచ్చి నన్ను గెంటేశావ్.″

″నేనా?″ ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

″అవును.″

″గెంటేశానా?″

″యస్! ఫిజికల్ గా!″

″నేన్నమ్మను_″

″నేను నమ్ముతాను_″

″నా బెస్ట్ ఫ్రెండ్ భవానీగాడిని బయటకు గెంటడమా? కలలో కూడా జరగదది.″

″కలలో జరగకపోవచ్చుగానీ_నిజంగా మాత్రం జరిగింది.″

″ఇంపాజిబుల్! మన బాచ్ వాళ్ళందరూ ఇలాగే అబద్ధాలు చెపుతున్నారు. నేనెందుకు గెంటుతాను మనాళ్ళను? అయ్ లవ్ దెమ్.″

″కాదనటం లేదు″

″ఆల్ రైట్. పాస్ట్ ఈజ్ పాస్ట్! వానెక్కు! ఇంటికెళదాం.″

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు ″మళ్ళీనా?″

″యస్! యూ ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్! నా దగ్గరే ఉండాల్సిందే! పద.″

″నేను వేరే రూమ్ తీసుకున్నానులే గురూ.″

″లెట్ ది రూమ్ గో టూ హెల్! త్వరగా వాన్ ఎక్కు.″

భవానీశంకర్ ని బలవంతంగా వాన్ లోకి లాగేయబోయాడతను.

″ఆల్ రైట్. ఇప్పుడు కుదరదు. సాయంత్రం ఆఫీసయ్యాక వస్తాను.″

″నిజంగా వస్తావా_ ఇలా చెప్పి తప్పించుకుందామనా?″

″నిజమేరా? తప్పకుండా వస్తాను. నీకెప్పుడయినా అబద్ధాలు చెప్పానా?″

″ఒకసారి చెప్పావ్!″

″ఎప్పుడు?″

″కాలేజ్ లో ఉండగా శ్రీదేవిని నేను ప్రేమిస్తే_ ఆ అమ్మాయికి పెళ్ళయిపోయిందని అన్నావ్.″

″కాలేదా?″

″ఇంతవరకూ కాలేదట!″

″మరారోజు ఆమె ఓ పాపాయి నెత్తుకుని సినిమాకొచ్చింది కదా! ఆ

పాపెవరు?"

"ఆమె పాపే కానీ ఆమెకు అప్పటికి పెళ్ళవలేదింకా!"

"అయ్ సీ! అయితే అయామ్ సారీ!"

"దట్సాల్ రైట్! సాయంత్రం తప్పకుండా మా ఆఫీస్ కొస్తున్నావ్! అవునా?"

"అవును."

"ఎన్ని గంటలకు?"

"అయిదింటికి."

"ఓ.కే."

"అన్నట్లు నీకో విషయం చెప్పాలి."

"ఏమిటది?"

"నీ దగ్గర నేనారోజు వెయ్యిరూపాయలు తీసుకున్నాను. నీకు చెప్పకుండా_"

"ఛట్! నేనెవ్వరికీ ఇవ్వలేదు."

"నువ్ నిద్రపోతూంటే నేనే తీసుకున్నాను."

"ట్రాష్! నేన్నమ్మను."

"నిజం బ్రదర్! బిలీవ్ మీ."

"నో. అయ్ డోన్ట్! ఇది కూడా నీకారోజు వచ్చిన కలే అయుంటుంది."

భవానీశంకర్ కేం మాట్లాడాలో తోచలేదు.

"ఓ.కే. సాయంత్రం మా ఆఫీస్ కొస్తున్నావ్! అంతేగదా."

"అంతే."

అతను వెళ్ళిపోయాడు వాన్ లో. భవానీశంకర్ ఆఫీస్ కి చేరుకున్నాడు. సాయంత్రం అయిదవకుండానే దీపక్ హడావుడిగా వచ్చేశాడు.

"సారీ బ్రదర్! మధ్యాహ్నమంతా ఆలోచిస్తూంటే గుర్తుకొచ్చింది. ఆ రోజు రాత్రి నేనెవర్నో గెంటేసిన మాట నిజమేగానీ నిన్నేనని తెలీలేదు. నిజంగా నిన్నే గెంటానా?"

"అవును"

"ఎందుగెంటాను?"

"తెలీదు."

"దట్ వజ్ టూ మచ్__పోనీ మనం కాలేజీలో చదివిన విషయం గుర్తుచేయకపోయావా?"

"చేశాను_ అసలు నువ్వు కాలేజ్ లోనే చదవలేదన్నావ్."

"వెరీ బాడ్." పశ్చాత్తాపపడుతూ అన్నాడతను. "పోనీ మనిద్దరం ప్రాణస్నేహితులమనీ_ లాస్ట్ బెంచీలో కూర్చునేవాళ్ళమనీ చెప్పావా?"

"చెప్పాను. అసలు నన్ను నీ జన్మలో చూడలేదన్నావ్."

"ఎంత నికృష్టం?"

"చాలా నికృష్టం!"

"ఆల్కహాల్ మూలాన ఇన్ని నష్టాలున్నాయన్నమాట."

"ఇంకా చాలా ఘోరమయిన నష్టాలున్నాయ్."

"మరా విషయం ఈ టి.వి. వాళ్ళూ, రేడియోవాళ్ళూ చెప్పిచావరేం? ఎప్పుడూ తాగినవాడు గుండెజబ్బుతోనో, లేక మరో జబ్బుతోనో చచ్చిపోతాడనీ, లేదా పెళ్ళాన్ని చావగొట్టినట్టూ_ ఇవే నష్టాలుగా చూపిస్తారెందుకని? మనిద్దరిమధ్యా వున్న అద్భుతమయిన స్నేహం కూడా ఈ తాగుడు వల్ల మర్చిపోయి, స్నేహితుడిని ఇలా ఇంట్లోనుంచి అర్ధరాత్రి గెంటివేసే ప్రమాదం కూడా ఈ తాగుడువల్ల జరుగుతుందని ఎందుకు చూపించరు?"

వెన్నెల వేట పేజి 15

"బహుశా మందు ప్రభావంవల్లే వాళ్ళూ ఇంకేమీ గుర్తు తెచ్చుకోలేక పోతూండి వుంటారు."

"తాగుడు నిజంగా ఇంత హారిబుల్ అని నేననుకోలేదు బ్రదర్!"

"నేను మొన్నే అనుకున్నాను."

"నన్నడిగితే అసలు తాగుడు బాన్ చేయాలంటాను."

"కనీసం హైద్రాబాద్ లోనయినా బాన్ చేయాలి."

"ఓ.కే. పద వెళదాం."

"ఎక్కడికి?"

"ఇవాళ నువ్ నా గెస్ట్ వి."

భవానీశంకర్ అతనితోపాటు నడిచాడు. ఇద్దరూ ఆటోలో బయలుదేరారు.

ఆటో క్రిస్టల్ బార్ ముందాగింది.

"పద_" అన్నాడు దీపక్ దిగి.

"ఎందుకు?"

"మందు కొడదాం బ్రదర్!"

"కానీ..." అనుమానంగా అన్నాడు భవానీశంకర్.

"ఇవాళ నేనే పార్టీ ఇస్తాను బ్రదర్! ఆ రోజు నా గదిలో నుంచి నిన్ను గెంటివేసినందుకు విచార సూచకంగా_ కమాన్, కమాన్_" అతని చేయి పట్టుకుని లోపలకు లాక్కెళ్ళిపోయాడు దీపక్.

విస్కీ ఫుల్ బాటిల్ తెచ్చిపెట్టాడు బేరర్. బేరర్ మొఖం ఎక్కడో చూసినట్లనిపించిందిగానీ ఎక్కడ చూశాడో గుర్తురావటంలేదు భవానీశంకర్ కి. ఆ డ్రస్, తలకు తెల్లటోపీ చీకటి వల్ల గుర్తించడం సాధ్యం కావటంలేదు.

"నినెక్కడో చూశాను..." అన్నాడు భవానీశంకర్.

"చూసే వుంటారు సార్! ఈ బార్ లో చేరి వారం రోజులయింది."

"కమాన్_కమాన్_తాగ్గురూ! తాగు__ బేరర్లనూ, మేనేజర్లనూ గుర్తుపట్టటానికి కాదు మనం వచ్చింది! ఓల్డ్ ఫ్రెండ్స్ కలుసుకున్న సందర్భంలో మందు కొట్టేయటానికొచ్చాం."

భవానీశంకర్ ఓ గ్లాస్ తాగేలోపల మూడు గ్లాసులు తాగేశాడు దీపక్.

"నీకు మన బాచ్ లో నరసింహారావుగాడు తెలుసా?"

"తెలుసు. ఎక్కడున్నాడు వాడు?"

"మిలటరీలో మేజర్. ఆ మధ్య కనిపించాడు. ఇద్దరం బార్ కెళ్ళాం. తమాషా యేమిటంటే_ఓ గ్లాస్ తాగాక చూస్తే వాడు కనిపించలేదు."

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"ఏమయ్యాడు?"

"తెలీదు. బార్ అంతా వెతికాను. మేనేజర్ని అడిగితే తెలీదన్నాడు. తమాషాగా లేదూ?"

"చాలా తమాషాగా వుంది."

భవానీ మళ్ళీ ఓ గ్లాస్ తాగేలోపల తను మూడు గ్లాసులు తాగేశాడు దీపక్.

బాటిల్ ఖాళీ అయిపోయింది.

"బేరర్!"

"యస్సార్!"

"బ్రాందీ హాఫ్ బాటిల్."

"ఆల్ రైట్ సర్!"

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు. "ఫుల్ బాటిల్ చాల్లేదా?"

"మన కోటా ఒకటిన్నర గురూ!"

మరో గంటలో బ్రాందీ బాటిల్ కూడా ఖాళీ అయిపోయింది. కొద్దిక్షణాలు తల సోఫా మీదకు వాల్చేశాడతను.

భవానీశంకర్ టైం చూసుకున్నాడు. పదవుతోంది. ఆకలి!

"దీపక్!" పిలిచాడతను.

దీపక్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

"ఎవరు నన్ను పిలిచింది?"

"నేనే"

"నువ్వా!"

"అవును."

"నువ్వెవరు?"

భవానీశంకర్ నిర్ఘాంతపోయాడు.

"నేనేరా! భవానీశంకర్ ని!"

"ఏ భవానీశంకర్?"

"అదేమిట్రా? మన కాలేజీలో..."

"లెట్ ది కాలేజ్ గో టూ హెల్. నువ్వెవరు?"

"నువ్వేగదరా నన్ను యిక్కడికి తీసుకువచ్చావ్, ఓల్డ్ ఫ్రెండ్స్ అని."

″నువ్వు నా ఓల్డ్ ఫ్రెండ్ వి కాదు.″

″అయితే మరెందుకు నన్ను తీసుకొచ్చావ్?″

″నేనెవర్నీ తీసుకురాలేదు.″

″దిసీజ్ టూమచ్″ అన్నాడు భవానీశంకర్.

″యస్! దిసీజ్ టూమచ్! ఎవరెవరో వచ్చి నీ ఫ్రెండ్ నిరా అని చెప్పేసి నా మందంతా తాగేయడం అలవాటయిపోయింది. నేను తాగినంత మాత్రాన ఫ్రెండెవడో, ఎవడు కాదో తెలీదనుకుంటారు. అహ్హాహ్హాహ్హా! అయామ్ టూ క్లవర్ మిస్టర్!″

భవానీశంకర్ లేచి నిలబడ్డాడు. ″ఆల్ రైట్! రేపు మాణింగ్ మాట్లాడతాన్లే.″

″ఎందుకు మాట్లాడటం?″

″ఊరికే.″

″అవసరం లేదు.″

″సరే.″

″ఏమిటి సరే?″

″ఏమీలేదు.″

″ఏమీ లేకపోతే 'సరే' అనికూడా అనొద్దు.″

″ఓ.కే.″

"ఓ.కే. అనికూడా అనొద్దు."

భవానీశంకర్ నాలుగడుగులు వేశాడు. "ఆగు" అరిచాడు దీపక్.

భవానీశంకర్ ఆగిపోయాడు.

"బేరర్! బిల్లులో ఇద్దరికీ చెరో సగంవేసి పట్టుకురా" బేరర్ తో అన్నాడు దీపక్.

"ఆల్ రైట్ సర్" వెళ్ళిపోయాడు బేరర్.

"అదేమిట్రా? సగం బిల్లు నేను కట్టాలా?"

"అవును. నా మందు నువ్వే తాగేశావ్ కాబట్టి బిల్ సగం కట్టాల్సిందే. మొత్తం బిల్లు నేను కట్టను."

భవానీశంకర్ మళ్ళీ వచ్చి అతనికెదురుగా కూర్చున్నాడు.

బేరర్ రెండు బిల్లులు తీసుకొచ్చి ఇద్దరిముందూ ఉంచాడు. భవానీశంకర్ గుండెలు ఝల్లుమన్నాయ్. ఇద్దరికీ చెరో నూట పదిరూపాయలూ ఉంది బిల్. తనదగ్గర జేబులో యాభయ్ రూపాయలకంటే ఎక్కువ లేదు.

దీపక్ చప్పున లేచి తన బిల్ కట్టేసి తూలుకుంటూ బయటికెళ్ళిపోయాడు.

భవానీశంకర్ దిగులుగా బేరర్ వంక చూశాడు.

"బేరర్" నెమ్మదిగా పిలిచాడతను.

"యస్సార్!"

"నా దగ్గర ఇంత డబ్బు లేదు."

″అలాగా సార్!″

″వాడు మా ఫ్రెండే. వాడే నన్ను ఇక్కడకు తీసుకొచ్చి, బలవంతంగా తీసుకొచ్చి మందు కొట్టేయడంవల్ల అంతా మర్చిపోయి ఇంతపని చేశాడు.″

″ఇలాంటి సంఘటనలు చాలా కామన్ సార్ బార్స్ లో.″

″నువ్వు చాలా బార్స్ లో పనిచేశావు కదూ?″

″పధ్నాలుగు బార్స్ లో చేశాన్సార్.″

″ఇలా నేనున్న పరిస్థితుల్లో మేనేజ్ మెంట్ ఏంచేస్తుంది సాధారణంగా?″

″ఒకో బారులో ఒకో ప్రాక్టీస్ వుంటుంది సార్! అసలు నేను మొట్టమొదట బేరర్ గా పనిచేయాల్సి వచ్చింది అచ్చం ఇలాంటి పరిస్థితిలోనే సార్!″

వెన్నెల వేట పేజి 16

″ఐసీ!″

″అవున్సార్?″

″నిన్ను కూడా నీ బిల్లు కట్టుకోమని నీ ఫ్రెండ్ వెళ్ళిపోయాడా?″

″సగం బిల్లయితే కట్టుకునేవాడినే సార్! మొత్తం బిల్లు టేబుల్ మీదుంచి కిళ్ళీ తెచ్చుకుంటానని వెళ్ళిపోయాడు సార్! మళ్ళీ ఇంతవరకూ కనిపించలేదు.″

″చాలా క్లిష్టమయిన పరిస్థితి కదూ?″

″ఇంతకన్నా అసహ్యకరమయిన పరిస్థితి యింకోటి వుండదు సార్!″

″ఇంతకూ ఈ హోటల్ మేనేజ్ మెంటు యిప్పుడేం చేస్తుందంటావ్?″

″బిల్లు మొత్తాన్నిబట్టి పదిహేనురోజులో, నెలరోజులో రకరకాల పనులు చేయిస్తారండీ.″

″ఉదాహరణకు?″

″మసాలా నూరే ఉద్యోగం మహా కష్టమయినదండీ. అదిగానీ, కూరగాయలు కోసే ఉద్యోగంగానీ.″

భవానీశంకర్ కౌంటరు దగ్గర కూర్చున్న మీసాల వ్యక్తివేపు చూశాడు. అతని వళ్ళు జలదరించింది.

″మీరు నన్ను గుర్తుపట్టారా సార్!″ అడిగాడు బేరర్ చిరునవ్వుతో.

″నిన్నా?″ ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

″అవును గురూ! ఈ డ్రస్ లో గుర్తుపట్టలేదు కదూ?″

″ఎక్కడో చూచినట్లు అనిపిస్తోంది...″

″నీ బిల్ నేను కట్టేస్తాను గురూ! డోంట్ వర్రీ!″

″నువ్వు కట్టేస్తావా?″

″యస్ బాస్! జస్ట్ ఈ విధంగా నా కృతజ్ఞత తెలియజేసుకుంటాను.″

″నీ పేరేమిటి?″

″పేరెందుకులే గురూ! బిల్ కట్టేస్తాను.″

"థాంక్యూ వెరీమచ్ మైడియర్ ఫ్రెండ్! రేపొద్దున్నే నీ డబ్బు పువ్వుల్లో పెట్టి తెచ్చిస్తాను."

"అక్కర్లేదు గురూ! నేనే నీకు చాలా డబ్బు బాకీ వున్నాను"

"బాకీ ఉన్నావా?"

"అవును గురూ! వెయ్యి రూపాయలు"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు. "నువ్వు భరద్వాజ్ వి కదూ?"

"అవును గురూ!"

భవానీశంకర్ ఆనందంగా కరచాలనం చేశాడతనితో.

"సమయానికి నువ్వు లేకపోతే చాలా ఇబ్బంది అయ్యేది ఫ్రెండ్"

"నీ డబ్బు అలా కాజేసికెళ్ళిపోయినందుకు కోపం లేదా గురూ?"

"నో నో నెవర్! డబ్బు కోసం కాదు బ్రదర్! బట్టలు తీసుకుపోయినందుకు కోపం వచ్చింది"

"మీ మావయ్య లక్షాధికారి అని నాకు తెలుసు గురూ! టెలిగ్రాం కొడితే బోలెడు డబ్బు పంపుతాడు గదాని బట్టలు కూడా తీసుకెళ్ళిపోయాను"

"మళ్ళా మొఖంకూడా చూపించవద్దని పంపించేశాడు మా మావయ్య. ఇంక యం ఓ. ఎందుకు పంపుతాడు?"

"అలాగా! అయామ్ సారీగురూ! ఆ సంగతి తెలిస్తే ఓ జత బట్టలు వదిలేసేవాడిని"

"పోనీ! జరిగిందేదో జరిగిపోయింది."

"అయితే, నామీద ఏమీ కోపంలేదు అంతేనా?"

"అంతే."

"ఓ.కే. గురూ! నువ్వెళ్ళిపో బిల్లు నా జీతంలో ఎడ్జస్ట్ చేసేసుకుంటాను"

"థాంక్యూ భరద్వాజ్! చాలా గడ్డు సమయంలో సహాయం చేస్తున్నావ్!"

"అన్నట్లు ఆ పిల్ల ఏమయింది గురూ! కనిపించిందా? జేబులో కాగితం పెట్టుకుని తిరిగావ్ కదా? వెన్నెల_వెన్నెల"

"ఇంకా దొరకలేదు బ్రదర్_వేటలోనే ఉన్నాను"

"ఆ పిల్లను పట్టుకోవాలంటే ఒకే ఒక బెస్ట్ అయిడియా ఉందిగురూ"

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు భవానీశంకర్.

"ఆ పిల్ల ఫోటో పేపర్లో వేయించేసి అర్జంటుగా భవానీశంకర్ అనే వ్యక్తికి ఫోన్ చేయమంటే సరిపోతుంది"

భవానీశంకర్ ఉప్పొంగిపోయాడు.

"కానీ మనదగ్గర ఫోటోలేదుగా?"

"నీదగ్గరున్న కాగితం మీద ఫోటోచాలు! బ్రహ్మాండంగా ప్రింటవుతుంది"

"థాంక్యూ భరద్వాజ్. రెండు సహాయాలు చేశావు ఇప్పటికిప్పుడే_"

"డోంట్ మెన్షన్ గురూ!"

భవానీశంకర్ గదికి బయలుదేరాడు.

భరద్వాజ్ చెప్పిన ఉపాయం బాగానే ఉంది. కానీ న్యూస్ పేపరులో ఫోటో వేస్తే ఆ అమ్మాయి చూస్తుందా అనేది తెలియటంలేదు.

హఠాత్తుగా అతనికి మరో ఆలోచన వచ్చింది.

కన్యక ఫోటో తమ వీక్లీలో కవర్ పేజీగా వేసేస్తే? అన్ని సెంటర్స్ లో అన్ని దుకాణాల్లో తన ఫోటో కనిపించేసరికి కన్యక తమ ఆఫీస్ కే రావచ్చు. లేదా ఆమె తల్లిదండ్రులుగాని, ఇంకెవరయినాగానీ అభ్యంతరం తెలియజేయడానికయినా ఆఫీస్ కొస్తారు.

బోలెడు ఉత్సాహం వచ్చేసిందతనికి. విజిల్ వేసుకుంటూ ముందుకి నడవసాగాడు వడివడిగా.

* * * *

మర్నాడు రంగారావ్ హడావుడిగా భవానీశంకర్ దగ్గరకొచ్చాడు.

"ఏమిటిది? ఈ అమ్మాయి ఎవరిదో ఫోటో మనవచ్చే సంచికలో కవరుపేజీగా వేయాలన్నారట" అన్నాడు ఆశ్చర్యంగా.

"యస్ మైడియర్ రంగారావ్! ఎప్పుడూ సినిమా తారల ముఖాలు చూచి చూచి పాఠకులు విసుగెత్తిపోతున్నారు డియర్. అంచేత వెరైటీ కోసం అందమయిన అమ్మాయిల ముఖచిత్రాలు వేస్తున్నాను"

"కానీ ఇది పత్రిక పాలసీకి..."

"డోంట్ వర్రీ ఎబౌట్ పాలసీ ఫ్రెండ్! ఏ పత్రికకయినా 'వెరైటీ' పాలసీగా ఉండాలి

బ్రదర్! అదిలేకే మన వీక్లీ సర్క్యులేషన్ పెరగటంలేదు"

రంగారావ్ కేం మాట్లాడాలో తెలీలేదు.

"అయినా బ్లాక్ అండ్ వైట్ లో కవర్ పేజీ వేయటం"

"అదే వెరైటీ బ్రదర్. పాఠకులంతా మన సంచిక చూడగానే 'స్టన్' అయిపోవాలి! తరువాత కోలుకుని అమ్మాయి మొఖంవంక చూస్తారు. "అబ్బ! ఏం అందం" అనుకుంటారు. ఆ క్షణం నుంచీ ఉత్తరాలూ, టెలిగ్రాములూ గుప్పించేస్తారు ముఖచిత్రం అద్భుతం అంటూ_"

"ఈ ఫోటో వేయడానికి ఈ అమ్మాయి అంగీకారం తీసుకున్నారా మరి?"

"అదంతా నాకొదిలెయ్ ఫ్రెండ్! మీరు ప్రూఫ్ రీడింగ్ సరిగ్గా చూసుకోండి! కిందటి సంచికలో 26వ పేజీలో 'హ'కు బదులు 'భో' అని పడింది. గమనించారా? బోలెడుమంది పాఠకులు ఆ విషయం ఉత్తరాలు గుప్పించేశారు."

రంగారావ్ నెమ్మదిగా అక్కడనుంచి జారుకున్నాడు. మరో రెండు రోజుల్లో కన్యక ముఖచిత్రంతో వారపత్రిక రిలీజయిపోయింది.

* * * *

"ఏమయింది? కాయా, పండా?" అడిగింది రాధ ఆత్రుతగా.

"వాడు వట్టిరోగ్" అంది కన్యక నీరసంగా కుర్చీలో కూలబడుతూ.

"ఏమన్నాడు?"

"ఉద్యోగం ఇవ్వనేలేదు. అప్పుడే వెకిలిచేష్టలు మొదలుపెట్టాడు. సాయంత్రం

సినిమాకెళదామా అన్నాడు ఇడియట్..."

"మరి నువ్వేం చేశావ్?" నవ్వుతూ అడిగింది రాధ.

వెన్నెల వేట పేజి 17

"సినిమాకు రావటం కుదరదు. మా ఇల్లు కుకట్ పల్లి కాలనీలో ఉంది. అక్కడకు రమ్మని చెప్పి నోటికొచ్చిన ఓ నెంబర్ చెప్పాను. ఇప్పుడుంటుంది తమాషా! రాత్రంతా వెతుకుతాడు ఆ నెంబరు కోసం. ఆ నెంబరు గల ఇల్లు నిజంగానే ఉంటే మరీ ఫార్స్ గా ఉంటుందిలే. ఇంట్లోకెళ్ళి 'కన్యకా' అని పిలుస్తాడు"

ఇద్దరూ నవ్వుకుంటూండగానే రాధ తమ్ముడు పరుగుతో ఇంట్లోకొచ్చాడు.

"అక్కా కన్యకాంటీ ఫోటో వీక్లీ మీద వేశారు" అంటూ వారపత్రిక ఆమెకిచ్చాడు.

అది చూస్తూనే కన్యక, రాధ ఇద్దరూ విస్తుపోయారు.

"అబ్బ! ఎంత బావున్నావే. ఈ పుస్తకం మీద. ఎప్పుడిచ్చావ్ వాళ్ళకీ ఫోటో?" ఆశ్చర్యంగా అడిగింది రాధ.

"బాగుంది. నేనెందుకిస్తాను. నాకేం అర్థంగావటం లేదు. అసలు నా ఫోటో వీళ్ళకెలా దొరికింది. దొరికినా వీళ్ళిలా ఎందుకు ప్రచురిస్తారు"

రాధ లోపలిపేజీ చూసింది.

"ముఖచిత్రం మిస్ కన్యక. మల్లెలు మాసపత్రిక సౌజన్యంతో"

విజ్ఞప్తి కుమారి కన్యక అడ్రస్ మాదగ్గర లేకపోవటంవల్ల ఆమెకి పారితోషికం

పంపటానికి వీల్లేకపోయింది. ఆమె వెంటనే మా కార్యాలయానికి వచ్చి చెక్ తీసుకోవచ్చు. లేదా ఓ కార్డ్ వ్రాసినా ఆ అడ్రస్ కి పంపగలం_ఎడిటర్"

"ఓ! ఇది శరత్ బాబుగారు చేసిన పని అయుంటుంది" అంది రాధ.

"కాని నన్నడగకుండా ఆయనిలాంటి పనిచేయరే" ఆలోచిస్తూ అంది కన్యక.

"ఆయన దగ్గరకెళితేగానీ అసలు సంగతి తెలీదు."

"ఒకవేళ ఆయన నా ఫోటో ఇచ్చారే అనుకో! అయినా వాళ్ళిలా కవర్ పేజీలో ప్రచురించటం ఏమిటి. సినిమా నటిలాగా!"

"నువ్వు మాత్రం తక్కువేముందే? సినిమాల్లో కెళ్ళాలేగానీ నెంబర్ వన్ అవటం ఎంతసేపు!"

"ఆ అదొక్కటే తక్కువయింది." నవ్వుతూ అంది కన్యక. ఆమెకు చాలా ఎగ్జయిటింగ్ గా ఉంది. తన ఫోటో అలా వారపత్రిక మీద కనిపించటం, చాలా ఆనందంగానూ ఉంది. మరోపక్క భయంగానూ ఉంది. అదిచూచి కుర్రకారు తనవెంట పడటం, ప్రేమలేఖలు గుప్పించడం ఎక్కువయిపోతుందేమో.

ఇప్పటికే ప్రేమికుల బెడద ఎక్కువగా వుంది.

వారం రోజుల క్రితమే శాంతారామ్ అసభ్యకరంగా ప్రవర్తిస్తే వాళ్ళింట్లోనే చెంపదెబ్బ కొట్టింది.

అసలు తనకు రాన్రాను మగజాతి అంటేనే చికాకు పుడుతోంది. కొంచెం ముక్కు, కన్నూ తీరుగా వున్న ఆడపిల్ల కనబడితేచాలు అంతకు ముందు ప్రేమించిన ప్రియురాళ్ళనూ, పెళ్ళాలను అందరినీ మర్చిపోయి_ఎగబడిపోతారు.

రాన్రాను కొత్తబట్టలు కొనుక్కుని పాతవి విసిరికొట్టినట్లు కొత్తగా పరిచయమయిన అమ్మాయిలను కూడా ట్రీట్ చేస్తున్నారు. సెక్స్ ఒక్కటే వాళ్ళకు ముఖ్యంగా కనబడుతోందిగానీ_ ప్రేమకి అసలు స్థానమేలేదు.

"వస్తానే" లేచి నిలబడింది కన్యక.

"అప్పుడే?"

"అవునే. ఆ శరత్ బాబుగారు_లేనిపోయింది ఈ కవర్ పేజీ ఒకటి నా నెత్తిమీదకు తెచ్చిపెట్టారుగా! వెళ్ళి నాలుగు చివాట్లు వేస్తేగానీ సంగతేమిటో తెలీదు."

"నా ఫోటో అలా వేసివుంటే థాంక్స్ చెప్పేదాన్ని."

"అవున్లే. నీకు ఎగతాళిగానే వుంటుంది."

కన్యక అక్కడినుంచి బయల్దేరింది. ఆమె దృష్టి అంతా రోడ్డుమీద పుస్తకాల షాపులమీదే వుంది. ఏ షాప్ దగ్గర చూచినా తన ఫోటో ఉన్న పత్రిక కాపీలే వరుసగా వేలాడుతున్నాయ్.

"హాయ్ బ్యూటీ. అరే వెంకటేష్. ఇదిగో_ఈ పోరి ఫోటోయే ఈ పత్రిక మీదున్నది." ఎవరో గట్టిగా అరిచాడు. మరుక్షణంలో నలుగురయిదుగురు యువకులు పరుగుతో ఆమెదగ్గర కొచ్చారు.

కన్యకకేం చేయాలో తెలీలేదు. ఆ పక్కనే ఖాళీగా వున్న రిక్షాలో కూర్చుని 'త్వరగా పోనీ' అంది రిక్షావాడితో.

రిక్షా వేగంగా చౌరాస్తా దాటేయటంతో వాళ్ళు ఆగిపోయారు.

"హమ్మయ్య" అని తేలిగ్గా గాలి పీల్చుకుందామె. పది నిమిషాల్లో శరత్ బాబు ఇల్లు చేరుకుందామె. శరత్ బాబు ఆమెను చూస్తూనే ఆశ్చర్యపోయాడు.

"నీ గురించే అనుకుంటున్నానమ్మా! పొద్దున్నే వీక్లీ మీద నీ ఫోటో చూశాను నేను చెప్పలేదూ? చాలా ఫోటోజెనిక్ ఫేస్ నీది."

"అది సరేనండీ__ అసలు నా ఫోటో వాళ్ళకెందుకిచ్చారు?" కోపంగా అడిగిందామె.

"నేనిచ్చానా? నేనివ్వట మేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"మరి లోపల 'మల్లెలు' మాసపత్రిక సౌజన్యంతో అని ఎందుకు రాశారు?"

"అలా రాశారా?"

"అవును. మా ఫ్రెండ్ ఇంట్లో చూశానా పత్రిక"

శరత్ బాబు ఓ క్షణం ఆలోచించాడు. "ఆ! గుర్తుకొచ్చింది. మన 'మల్లెలు' ఆవిష్కరణోత్సవం సమయంలో తీసిన ఫోటో ఒకటి చూసి అతను కావాలని అడిగితే యిచ్చాను"

"ఎవరతను?"

"వీక్లీ ఎడిటర్. పేరేమిటో గుర్తులేదు."

"నా ఫోటో అతనికెందుకిచ్చారు?"

"అతను నీ కోసమే వెతుక్కుంటూ వచ్చాడు మనాఫీసుకి__"

కన్యక ఆశ్చర్యపోయింది.

"నా కోసమా?"

"అవును."

"ఎందుకు?"

"అడెడెడె_ ఆ విషయం అడగటం మర్చిపోయాను."

కన్యక చిరాకుగా చూసిందతనివేపు.

"ఆ! అన్నట్లు గుర్తుకొచ్చింది. వెంటనే అతనిదగ్గరకెళ్ళాలి నువ్వు! నీకేదో ఉద్యోగం కూడా ఇస్తానన్నాడు. ఏం ఉద్యోగమంటే_ఏం ఉద్యోగమంటే. ఆ! పువ్వుల్లో నడిచే ఉద్యోగం అంట. ఏమిటబ్బా అది."

కన్యకకేమీ పాలుపోవటం లేదు.

"మాష్టారూ. మనిద్దరిలో మతి ఎవరికి పోయిందో తెలీటంలేదు." అంది కుర్చీలో కూలబడుతూ.

"ఎందుకమ్మా. ఏం జరిగింది?" ఆదుర్దాగా అడిగాడు శరత్ బాబు.

"లేకపోతే ఏమిటండీ? అతనెవరో మీకు తెలీదు. అతను నా కోసం ఎందుకు వెతుకుతున్నాడో తెలీదు. నాకు ఉద్యోగం ఎందుకిస్తానన్నాడో తెలీదు. నా ఫోటో ఎందుకడిగాడో తెలీదు. మీరు ఫోటో ఇచ్చేశారు. అతను కవర్ పేజీమీద పబ్లిష్ చేసేశాడు. మీకిది దారుణంగా కనిపించటంలేదూ?"

శరత్ బాబు ఆమెవేపు జాలిగా చూశాడు.

"అవునమ్మా! నీ ఫోటో చూసి ముచ్చటపడితే యిచ్చానేగానీ__ అతనిలా

ప్రింట్ చేస్తాడనుకోలేదు. పద_ ఎవర్నడిగి వేశాడో తేల్చుకుందాం. నీ అంగీకారం లేకుండా వేసేందుకు అతనికేమీ హక్కులేదు."

"పదండి. ఆ విషయం తెల్సుకోవాలనే నేనూ వచ్చాను."

ఇద్దరూ అరగంటలో "దేవతా పబ్లికేషన్స్" చేరుకున్నారు.

* * * *

కన్యకను ఎదురుగా చూడగానే భవానీశంకర్ మొదటి రియాక్షన్ నిశ్చేష్టుడవటం. ఆ తరువాత కొద్ది క్షణాలకు తేరుకుని హోరున ఆశ్చర్యపోయాడు. కళ్ళు నులిమి, చేయి గిల్లి టెస్ట్ చేసుకున్నాడు.

అయితే కన్యక ఇదేమీ పట్టించుకునే స్థితిలోలేదు. తన చేతిలోని వారపత్రికను అతని టేబుల్ మీద లాగికొట్టి "వాటీజ్ దిస్" అంది కోపంగా.

"యస్! ఎవర్నడిగి ప్రింట్ చేశారు?" అన్నాడు శరత్ బాబు కుర్చీలో కూర్చుంటూ.

వెన్నెల వేట పేజి 18

భవానీశంకర్ స్పృహలో కొచ్చాడు.

"దయచేసి కూర్చోండి మిస్ కన్యకా! ఆప్ ఆయే, బహురాయే! మీ రాకతో మా ఆఫీస్ పావనమయిపోయింది" అన్నాడు ఆనందంగా.

"నేను కూర్చోటానికి రాలేదు!" అంది కన్యక మరింత కోపంగా.

"మీరెందుకొచ్చినా కూర్చోబెట్టటం మా ఆంధ్రదీపిక ఆచారం కన్యకాజీ!

దయచేసి మీరు అయిదు నిమిషాలు కూర్చున్నారంటే మీకు చెక్ అందజేస్తాము."

"నేను చెక్ కోసం రాలేదు" మండిపడుతూ అందామె.

"చెక్ కోసం కాదా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"నో! మీరు నా ఫోటో ఎవర్నడిగి ప్రచురించారని అడగటానికొచ్చాను."

"ఓ! అదా! అలా ప్రచురించినందుకు నన్ను అభినందించడానికి వచ్చారని నాకు తెలుసు"

"అభినందించడానికి కాదు. మీ పత్రిక మీద కేసు పెట్టటానికి" అన్నాడు శరత్ బాబు.

"వాట్? కేసా? నో! మిస్ కన్యకలాంటి అందమయిన అమ్మాయిలు అలాంటి రాతిగుండె పనులు చేయరు మైడియర్ ఫ్రెండ్! మీరలాంటి పని ఎన్నటికీ చేయరని పందెం కడతాను."

"అసలు కన్యక ఫోటో కవర్ పేజీమీద ఎందుకు వేసినట్లు?" కోపంగా అడిగాడు శరత్ బాబు.

"లోపలి పేజీల్లో వేస్తే ఆమె అందానికి అన్యాయం చేసినట్లవుతుంది గురూజీ! అందుకే కవర్ మీద వేశాను."

శరత్ బాబు రెండు చేతులతో తలపట్టుకున్నాడు.

"అసలు ఎక్కడయినా గానీ నా ఫోటో వేయాల్సిన అవసరమేమొచ్చింది?"

"అదేమిటి మిస్? ఇంత అద్భుతమయిన అందాన్ని అలా మరుగున పడేసి

ఉంచడం ఎంత అన్యాయం? ఎంత అమానుషం? అందువల్ల సౌందర్యాన్ని ఆరాధించే ప్రాణులకు ఎంత నష్టం? సౌందర్యం ఏ రూపంలో ఉన్నా తక్షణం అది అందరి కనులకూ విందు కలిగించాలి డియర్! అది నాలాంటి ఎఫిషియెంట్ ఎడిటర్ల విధి! తాజ్ మహల్ బీబీ కామక్ బారా_ ఇవన్నీ ఏమిటి? సౌందర్యాన్ని..."

"ఆపు!" అతని ప్రవాహానికి అడ్డుపడ్డాడు శరత్ బాబు.

భవానీశంకర్ ఆపేశాడు "ఎందుకలా అరచారు? అద్భుతమయిన 'ఫ్లో'తో మాట్లాడుతున్నప్పుడు అలా అడ్డుపడకండి. జీవితంలో చాలా తక్కువసార్లు వస్తుంది ఇంత చక్కటి వాక్ ప్రవాహం."

"లేకపోతే మేమడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అవన్నీ ఎందుకయ్యా?"

"ఏమిటి మీరడిగింది?"

"కన్యక ఫోటో ప్రచురించే హక్కు మీకెవరిచ్చారు?"

"పిచ్చి ప్రశ్న. అజ్ఞానంతో కూడిన ప్రశ్న మైడియర్ శరత్ జీ! మనందరికీ శ్రవణానందం కలిగించే కోకిల పాటలు వినే హక్కు మనకెవరిచ్చారు? తనకోసం, తన ఆనందం కోసం ప్రైవేట్ గా డాన్స్ చేసుకునే నెమలి నృత్యం చూసే అధికారం మనకెవరిచ్చారు? పూల తోటలో సువాసనలతో నిండిన గాలిని పీల్చే హక్కు మనకు ఎవరిచ్చారు..."

కన్యక రెండు చేతుల్తో తల పట్టుకుంది.

"విల్ యూ ప్లీజ్, కన్ ఫైన్ టు ది సబ్జెక్ట్?" అంది చిరాకుగా.

"విత్ ప్లెజర్ మేడమ్! ప్రస్తుతం నేను చేస్తోందదే కనుక మీ ఫోటో 'ఆంధ్ర దీపిక' కవర్ పేజీగా వేయటంలో తప్పు చేయలేదు మైడియర్ యంగ్ గాళ్! స్టాఫ్ ఫోటోలు సరదాగా మాగజైన్ లో ప్రచురించే ఆనవాయితీ మీ 'మల్లెలు' పత్రికే ప్రారంభించింది కదా!"

కన్యక ఆశ్చర్యంగా చూసిందతనివేపు. "నేను ఆంధ్రదీపిక స్టాఫ్ మెంబర్నా?"

"అఫ్ కోర్స్! ఇంతకుముందు అయి వుండకపోవచ్చు. కానీ మీరు 'ఊ' అంటే చాలు, ఈ క్షణం నుంచే ఆంధ్రదీపిక సబ్ ఎడిటర్. మీరూ నేనూ పాలూ, నీరులా కలిసిపోయి, ఆంధ్రదీపిక బాగోగులే మనిద్దరి కంబైన్డ్ వూపిరిగా జీవితాంతం శ్రమిస్తూ ఆనందంగా గడిపేద్దాం డియర్!"

"నా కక్కర్లేదా ఉద్యోగం."

భవానీశంకర్ ఆమెవేపు ఆశ్చర్యంగా చూశాడు. "ఉద్యోగం వద్దా?"

"నో! నో! నో!"

"కానీ మీకు అర్జంటుగా ఉద్యోగం కావాలన్నారు గదా శరత్ బాబుగారు!"

"అంటే అని వుండవచ్చు. కానీ మీ పత్రికలో అక్కర్లేదు."

"ఆర్ యూ ష్యూర్?"

"వెరీ ష్యూర్!"

"ఓ.కే. ఈ పత్రికలో ఉద్యోగం ఇష్టంలేకపోతే మనిద్దరం కలిసి స్మాల్ స్కేల్

ఇండస్ట్రీ ఏదయినా ప్రారంభిద్దాం. నేను మేనేజరు, మీరు అసిస్టెంట్ మేనేజరు."

"అవసరం లేదు"

"పోనీ మీరు మేనేజరు, నేను అసిస్టెంట్ మేనేజరు."

"యూ ఆర్ మాడ్" అంది కన్యక విసిగిపోయి.

"అఫ్ కోర్స్! ఇంతకుముందు వసుంధర కూడా యిదే డైలాగ్ అంది. అప్పుడు కేర్ చేయలేదుగానీ ఇప్పుడు మీరుకూడా అంటుంటే చెక్ చేయించుకోవాలని వుంది. బై ది బై మీకు తెలిసిన మంచి సైక్రియాట్రిస్ట్..."

కన్యక అసహనంగా లేచి నిలబడింది.

"మాష్టారూ! మనం ఇతనితో మాట్లాడి లాభంలేదు"

"ఆల్ రైట్! ఛీఫ్ ఎడిటర్ సాంబమూర్తితోనే మాట్లాడదాం" అన్నాడు శరత్ బాబు.

"పద్ధతి మంచిదేగానీ, లోపం ఎక్కడుందంటే సాంబమూర్తిగారే కవర్ పేజీ అద్భుతంగా వుందని ఇంతకుముందే టెలిగ్రామిచ్చారు."

"అంటే ఆయనిక్కడ లేరా?"

"నో! మద్రాస్ లో సన్మానానికెళ్ళారు. అంతవరకూ కన్యకగారు ఇక్కడే ఉద్యోగంలో జాయినయితే..."

"మాష్టారూ! మనం వెళ్దాం పదండి" అంది కన్యక.

"అంటే మీ ఉద్యోగం రిజైన్ చేస్తున్నారా?" అడిగాడు భవానీశంకర్

ఆశ్చర్యంగా.

"నేనసలు జాయినవందే రిజైన్ చేయటమేమిటి?"

"నేను మీకు ఉద్యోగం ఇవ్వాలి అని అనుకున్న క్షణం నుంచే మీరు ఉద్యోగంలో వున్నట్లు లెక్క మిస్ కన్యకా!"

కన్యక, శరత్ బాబు ఆఫీస్ బయటకి నడిచారు.

"హలో కన్యకాజీ! మీ అడ్రస్ ఇస్తే చెక్ పంపటానికి..." వెంబడి నడుస్తూ అన్నాడతను.

"నాకేం అవసరం లేదు."

"పోనీ చెక్ అవసరం లేకపోయినా మీ అడ్రస్ ఇస్తే..."

"నా అడ్రస్ ఎందుకు?"

భవానీశంకర్ గతుక్కుమన్నాడు. "ఎందుకా? ఎందుకంటే... ఎందుకంటే...మీ ఇంటర్వ్యూ వచ్చేవారం పబ్లిష్ చేయాలికదా! అఫ్ కోర్స్, మీరు ఒప్పుకుంటేనే."

"ఏమీ అక్కర్లేదు"

"పోనీ నాక్కాబోయే భర్త ఎలా వుండాలి శీర్షికలో పాల్గొంటారా?"

"షటప్!"

ఇద్దరూ లిఫ్టులో కెళ్ళి డోర్ మూసేశారు. భవానీశంకర్ మెట్లు దిగి పరుగెత్తేటప్పటికి వాళ్ళు ఎక్కిన ఆటో ఆ రోడ్డు మలుపు తిరుగుతూ కనిపించింది.

కొద్దిక్షణాలు అక్కడే నిలబడి, వెనక్కు తిరిగి నిరుత్సాహంగా తన గదిలోకొచ్చి కూర్చున్నాడు.

మిస్ వెన్నెల కనిపించింది. కానీ వెన్నెల అడ్రస్ తెలీలేదు.

* * * *

రెండురోజులు గడిచిపోయినాయ్. ఆ రెండురోజులూ ఆంధ్రదీపిక వారపత్రిక ఆఫీస్ చాలా నిస్తేజంగా వుంది. భవానీశంకర్ మొఖంలో కళ తగ్గిపోయింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ కన్యక అడ్రస్ ఎలా సంపాదించాలా అన్న ఆలోచనే.

వెన్నెల వేట పేజి 19

ఆరోజు ఉదయం అతను ఆఫీస్ కొచ్చేసరికి తన రూమ్ లో ప్రముఖ రచయిత దీప్ చంద్ కూర్చుని వున్నాడు.

"హల్లో మైడియర్ దీప్ చంద్!" ఆనందంగా పలుకరించాడు భవానీశంకర్. "నిన్నింత ప్రొద్దున్నే చూడటం చాలా ఆనందంగా వుంది డియర్! మీ సీరియల్ అద్భుతంగా వుందని ఉత్తరాల వర్షం కురుస్తోంది డియర్! త్వరలో అది సైక్లోన్ గా కూడా మారవచ్చని నా అనుమానం" దీప్ చంద్ లో ఉత్సాహం కనిపించింది.

"అప్పుడే ఏమయింది? వచ్చేవారం సీరియల్లో బ్రహ్మాండమయిన మలుపు లాక్కొస్తున్నాను. అది చదివారంటే పాఠకులకు పిచ్చెక్కిపోతుంది."

"ఏమిటా మలుపు బ్రదర్?"

"ఎప్పుడూ దేముడిని పూజిస్తూ, భర్తను ఆరాధిస్తూ, భర్త పాదాలు రోజూ

కళ్ళకద్దుకుంటూ గడిపే మహాలక్ష్మి పాత్ర వుంది చూడు! ఆ మహాలక్ష్మి హఠాత్తుగా సెక్స్ మానియాక్ అయిపోతుంది... కనపడ్డవాడినల్లా పడగ్గదిలోకి లాక్కెళ్ళిపోతుంది."

"ఒండర్ ఫుల్ బ్రదర్! తెలుగు సాహితీరంగంలో నీ నవల ఆ మహాలక్ష్మి పాత్ర చిరకాలం నిలిచిపోతాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అది సరేగానీ యింత పెందలాడే 'ఆంధ్ర దీపిక' ఆఫీస్ కి రావడంలోగల ఆంతర్యమేమిటి బ్రదర్?"

దీప్ చంద్ మొఖంలోకి నీడ వచ్చేసింది.

"ఇవాళ నిద్ర లేవగానే ఓ మాజీ మంత్రిగారి మొఖం చూశాను" విచారంగా అన్నాడతను.

"మాజీ మంత్రి మొఖమా?"

"అవును."

"ఎవరా మాజీమంత్రి ఫ్రెండ్?"

"అప్పల్రాజు."

"కానీ మాజీ మంత్రుల మొఖాలు పొద్దున్నే చూడటం అపశకునమని నేనెక్కడా వినలేదే?"

"ఐ హేట్ దట్ ఫెలో!" ద్వేషంతో అన్నాడు దీప్ చంద్.

"ఎందుకని?"

"వాడు ఎన్టీఆర్ ఫాన్ అట! ఎంత దారుణమో చూడు!"

"అందులో దారుణమేముంది బ్రదర్? ఎవరిష్టం వారిది. మనది డెమోక్రసీ."

"కానీ నేను ఎన్టీఆర్ ద్వేషిని."

"ఓ! అర్ధమయింది. ఫండమెండల్ డిఫరెన్స్."

"ఎగ్జాక్ట్ లీ."

"కానీ అతను అంత పొద్దున్నే నీకు తన మొఖం ఎందుకు చూపించినట్లు?"

"ఆ మధ్య తన ఆత్మకథ రాయటానికి_ ఓ రచయిత కావాలని పేపరులో ప్రకటించాడు. నెలరోజులు తంటాలుపడితే పాతికవేల రూపాయలు వస్తాయికదా అని అప్లయ్ చేశాను. ఇవాళ నన్ను వాళ్ళ ఊరు తీసుకెళ్ళిపోవటానికి వచ్చాడు. రేపట్నుంచే ఆ వర్క్ మొదలుపెట్టాలట కానీ ఆ పక్షితో పావుగంట మాట్లాడేసరికి ఇంక జన్మలో వాడి మొఖం చూడకూడదని నిర్ణయించుకున్నాను."

"తొందరపాటు నిర్ణయం బ్రదర్! మాజీ మంత్రులు మళ్ళీ ఏదొకరోజు మంత్రి అవకా తప్పదు. మనం వాళ్ళ మొఖాలు న్యూస్ పేపర్స్ లో చూడకా తప్పదు.

దీప్ చంద్ ఓ క్షణం ఆలోచించాడు.

"అఫ్ కోర్స్. నీ పాయింట్ కరక్టే. ఇప్పుడు ఓ పెద్ద సమస్య వచ్చిపడింది గురూ!"

"ఏమిటది బ్రదర్! త్వరగా బయటపెట్టు. రచయితల సమస్యలు తీర్చటానికే ఎడిటర్లున్నారు."

″సాయంత్రం నేను ఆ అప్పల్రాజు బసచేస్తున్న హోటల్ ఎమరాల్డ్ కొస్తున్నాననీ, అక్కడినుంచీ వాళ్ళ ఊరికి ప్రయాణం అవ్వచ్చనీ ప్రామిస్ చేశాను. కానీ నేను అసలు వాడికి వర్క్ చేయగూడదని నిశ్చయించుకున్నాను కాబట్టి_ ఇంకో రచయితను వెతుక్కోమని నువ్వు వెళ్ళి వాడికి చెప్పాలి.″

″నేనా?″

″అవును! వాడి మొఖం చూడటం కూడా నాకిష్టంలేదు. ప్రతి మాటకూ ముందు ఎన్టీఆర్ ని పొగిడేవాడితో ఎలా మాట్లాడడం?″

″చాలా కష్టం.″

″ఎంతసేపూ రెండ్రూపాయలకు కిలోబియ్యం, విధవలకు పెన్షన్, ఉచిత మధ్యాహ్న భోజనం, కౌన్సిల్ రద్దు అంటూ ఒకటే మోత! ఇడియట్.″

″హారిబుల్!″

″అవన్నీ కేవలం ఎలక్షన్ గిమిక్స్ అని తెలీనివాడి ఆత్మకథ నేనెందుకు రాయాలి?″

″ఛస్తే రాయకూడదు.″

″అందుకే రాయటంలేదు.″

″సూపర్బ్ డెసిషన్.″

″ఇంక నేను వెళ్తాను గురూ! సాయంత్రం నాలుగులోపల వాడితో చెప్పేస్తావ్ కదూ?″

"షూర్ బ్రదర్."

"లేకపోతే వాడు మళ్ళీ నా రూమ్ కొస్తాడు. నేను మళ్ళీ వాడి మొఖం చూడాల్సి వస్తుంది."

"చాలా భయంకరమయిన పరిస్థితి."

"వాడికి చెప్పెయ్ గురూ! లక్షరూపాయలిచ్చినా వాడి ఆత్మకథ రాయననెప్పుడు. అన్నట్టు వాడు హోటల్ ఎమరాల్డ్ లో రూమ్ నెంబర్ 314లో ఉన్నాడు."

"ఓ.కే."

దీప్ చంద్ వెళ్ళిపోయాడు.

మరికాసేపట్లో భవానీశంకర్ కి సాంబమూర్తి నుంచి కబురొచ్చింది. అతని రూమ్ కి చేరుకున్నాడతను.

"హలో అంకుల్! మీ సన్మానం అద్భుతంగా జరిగిందని పేపర్లో చదివాను."

"థాంక్ యూ_ అది సరేగానీ..."

"ఇప్పుడే సన్మానం చేసినందుగ్గాను వాళ్ళకు మీరేమయినా ప్రత్యుపకారం చేయాలా అంకుల్. ఎందుకడుగుతున్నానంటే_ చాలా పత్రికల్లో ఈ పద్ధతి చాలా ఫేమస్ అని తెలిసింది."

"అఫ్ కోర్స్. ఆ సన్మాన సంఘం అధ్యక్షుడు 'నా పెరూ యాత్ర' మన వీక్లీలో సీరియల్ గా వేయాలి" అన్నాడు సాంబమూర్తి.

″పెరూ యాత్రా?″

″అవును! ఆ మధ్యన పెరూ అనే దేశం వెళ్ళాడట ఏదో పనిమీద. ఆ విశేషాలు పాతిక వారాలపాటు సీరియల్ గా వేస్తే బావుంటుంది కానీ ఎవరికీ ఆసక్తి కలిగించని ఆ ఆర్టికల్ ఎందుకు వేస్తున్నారని మన ప్రొప్రయిటర్ అడిగితే ఏం చెప్పాలా అని...″

″ఏం ఫర్వాలేదంకుల్_ లాగించేద్దాం. పెరూ అనే దేశం గురించి తెలుగు పాఠకులు తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నట్లు. ముందు ఓ వంద దొంగ ఉత్తరాలు ప్రచురిద్దాం! తరువాత పాఠకుల కోరిక మేరకు మన వారపత్రిక ఎంతో కృషిచేసి ఫలానా సన్మానసంఘం అధ్యక్షుడు జరిపిన 'పెరూయాత్ర'ను సీరియల్ గా ప్రచురించబోతున్నామని ప్రకటిస్తే.″

సాంబమూర్తి భవానీశంకర్ వంక విచారంగా చూశాడు.

″నువ్వు నిజంగా జీనియస్ వి భవానీ! అయామ్ ప్రౌడాఫ్ యూ! అది సరేగానీ...″

″మీ సన్మానం ఫోటోలకింద కాప్షన్ ఏమిటో తెలుసా అంకుల్? ఈ సన్మానం సాంబమూర్తిది కాదు. తెలుగు పాఠకులది! ఎలా వుందకుల్?″

″అద్భుతం. థాంక్యూ_ అది సరేగానీ... నిన్ను ప్రొప్రయిటర్ గారు ఇంతకుముందే డిస్మిస్ చేశారు భవానీ″ విచారంగా అన్నాడతను.

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

″డిస్మిస్ చేశారా?″

"అవును. మన వీక్లీ కవర్ మీద ఆ అమ్మాయి ఎవరిదో ఫోటో. ఆమె పర్మిషన్ లేకుండా వేశావుట. ఆ అమ్మాయి శరత్ బాబు అనే ఓ మాజీ ఎడిటర్ తో కంప్లెయింట్ చేయించింది."

వెన్నెల వేట పేజి 20

భవానీశంకర్ నిర్ఘాంతపోయాడు.

"కానీ అంకుల్ ఆ విషయాలన్నీ ఆ అమ్మాయితో మాట్లాడి ఎడ్జస్ట్ చేసేశాను కదా?"

"ఎడ్జస్ట్ అయితే, మళ్ళీ ఎందుకు ఫోన్ చేసినట్లు?"

"ఓ.కే. అంకుల్. ఎక్కడో ఏదో చిన్న పొరపాటు జరిగి వుంటుంది. ఆమెతో మాట్లాడితేగానీ తెలీదు."

"నీకు రావలసిన జీతం చెక్ రడీగా ఉంది. నీలాంటి డైనమిక్ యంగ్_ ఎడిటర్ని పోగొట్టుకోవటం చాలా బాధగా ఉంది"

భవానీశంకర్ కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు.

"ఆల్ రైట్ అంకుల్. నీ చేతిలో కూడా ఏమీలేదు పాపం."

"కరెక్ట్ భవానీ? ఉంటే నిన్ను వదులుకొంటానా?"

"పోనీ మన మాసపత్రికలో సబ్ ఎడిటర్ గా చేరితే."

"బాస్ డిస్మిస్ చేశాక మళ్ళీ నిన్ను చేర్చుకుంటే."

"పోనీ నా పేరు మార్చుకుంటాను."

"లాభంలేదు. తెలిసిపోతుంది."

"ఓ.కే. అంకుల్! కొన్నాళ్ళు అజ్ఞాతవాసం చేసి మళ్ళీ వస్తాను."

"దటీజ్ బెటర్."

భవానీశంకర్ చెక్ తీసుకుని ఆఫీస్ లోనుంచి బయటికొచ్చేశాడు. అతనికేమాత్రం నిరుత్సాహం కలుగలేదు. మిస్ కన్యక తన స్వంతమయ్యేవరకూ తనెన్ని కష్టాలుపడ్డా ఫర్వాలేదు.

ముందు తనోసారి కన్యకను కలుసుకుని, తనమీద ఆమెకున్న కోపం కరిగిపోయేలా చేయాలి.

ఆమె ఇల్లెక్కడో ఎలా తెలుసుకోవటం?"

తన గదికి చేరుకుని చాపమీద పడుకున్నాడతను. ఎంత ఆలోచించినా ఏమీ ఉపాయం దొరకటం లేదు.

హఠాత్తుగా దీప్ చంద్ తనకు అప్పుజెప్పిన పని గుర్తుకొచ్చింది. వాచీ చూసుకున్నాడు. మూడవుతోంది.

త్వరగా లేచి రడీ అయి హోటల్ ఎమరాల్డ్ కి చేరుకున్నాడతను. 314 రూమ్ బయట నిలబడి బెల్ మోగించాడు.

మరుక్షణంలో తలుపు తెరుచుకుంది. తెల్లగావున్న గుబురుమీసాలూ, బట్టతలతో ఓ ఆకారం ఎదురుగ్గా నిలబడింది.

"ఎవరు?" అడిగాడతను.

"నేను దీప్ చంద్ పంపిం..."

"ఓ దీప్ చంద్! కమాన్ రైటర్! కమాన్! పొద్దున్న చెప్పానుగదా కళ్ళజోడు ఇంట్లో మర్చిపోయి రావటంవల్ల ఎవరెవరు అనేదికూడా తెలీటంలేదు! నన్నడిగితే ఎన్ టిఆర్ వృద్ధులకు ఉచిత కళ్ళద్దాలు కూడా రేషన్ కార్డుమీద సప్లయ్ చేయాలంటాను వాట్డూ యూ సే?"

"చాలా మంచి స్కీమ్ సార్. నాపేరు భ..." లోపల సోఫాలో కూర్చుంటూ చెప్పబోయాడు.

"అద్భుతమయిన స్కీమ్! ఫెంటాస్టిక్ స్కీమ్! ఒక్కసారి ఊహించుకో! రాష్ట్రంలోని తెలుగు వృద్ధులందరూ రేషన్ కార్డుమీద లభించిన తెలుగు కళ్ళజోళ్ళు పెట్టుకుని తెలుగు రోడ్లమీద నడుస్తుంటే ఎంత బాగుంటుంది ప్రభుత్వానికి?"

"థ్రిల్లింగ్ గా వుంటుంది సార్"

"అవునా? మరా ఎమ్మెల్సీ కృష్ణారావ్ గాడు 'ఇది చెత్త స్కీమ్' అంటాడేమిటి!"

"వాడుట్టి ఇడియట్ కాబట్టి..."

అప్పల్రాజు మొఖంలో ఆనందం కనిపించింది. ఉదయం మాట్లాడినప్పుడు దీప్ చంద్ ప్రవర్తన మాటతీరు తనకు అంతగా నచ్చలేదు. కానీ ఇప్పుడుమాత్రం అతనిమీద అభిమానం కలిగింది.

"యూ ఆర్ కరెక్టు రైటర్! బైదిబై నువువ్ కాఫీ తాగుతావా, కూల్ డ్రింకా?"

"ఏమీ వద్దండి_ ఇంతకూ అసలు విషయం ఏమిటంటే...నన్ను దీప్ చంద్..."

"ఏదొకటి తాగు! మనం స్టార్టయ్యేసరికి ఎలాగూ ఇంకో అరగంట పడుతుంది. మిస్ కన్యక ఇప్పుడే ఫోన్ చేసింది. తను రావటం ఓ అరగంట ఆలస్యం అవుతుందని"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"మిస్ కన్యకా"

"యస్ రైటర్! పొద్దున్న చెప్పానుకదా! మనం రాయబోయే ఆత్మకథ పూర్తయ్యేవరకు ఆమె నా సెక్రటరీగా వుండి మనకు సహాయం చేస్తూంటుంది! వెరీ నైస్ గాళ్! నేను ఇంటర్వ్యూ చేసిన పాతికమంది అమ్మాయిల్లోనూ మోస్ట్ టాలెంటెడ్ గాళ్! అంతెందుకు? ఆమె స్త్రీల సమస్యల మీద రాసిన ఆర్టికల్స్ చాలా పత్రికల్లో ప్రచురించారట! నీకు తెలుసా ఆ విషయం?"

"ఆమె ఆర్టికల్స్ రాస్తుందా?"

"అదే నా గొప్పతనం! అంతర్గతంగా ఉన్న టాలెంట్స్ ని తెలుసుకోగలను"

భవానీశంకర్ మెదడులో స్విచ్ వేసినట్లు ఆలోచనల ప్రవాహం కదిలింది. మిస్ కన్యక అప్పల్రాజుకి సెక్రటరీగా పనిచేయబోతోందా? మిస్ కన్యక అంటే తను ప్రేమించిన కన్యకేనా అసలు? ఒకవేళ ఆమె అయితే నిజంగా ఎంతగొప్ప అవకాశమిది? ఆమెతోపాటు ఆ మాజీమంత్రి భవనంలో నెలరోజులపాటు కలసి గడిపే అద్భుత అవకాశం! దీప్ చంద్ నిజంగా అదృష్టవంతుడు. తనే దీప్ చంద్ అయితే ఎంత బావుండేది?

బేరర్ కూల్ డ్రింక్స్ తెచ్చి టీపాయ్ మీద ఉంచాడు.

"కమాన్ మిస్టర్ దీప్ చంద్ కమాన్_టేకిట్"

భవానీశంకర్ మెదడులో మెరుపు మెరిసింది. గుండెలు వేగంగా కొట్టుకున్నయ్. అవును తనే దీప్ చంద్ అని అనుకుంటున్నాడు అప్పల్రాజు. కళ్ళజోడు తేలేదుకాబట్టి అసలు దీప్ చంద్ ఎలా వుంటాడో అతనికి తెలీదు. దీప్ చంద్ ఎలాగూ ఏ పరిస్థితిలోనూ అప్పల్రాజు దగ్గరకెళ్ళడు. ఈ పరిస్థితిలో తనే దీప్ చంద్ గా అక్కడికెళితే.

"కమాన్ రైటర్! కమాన్! డోంట్ హెజిటేట్" బలవంతం చేశాడు అప్పల్రాజు.

భవానీశంకర్ కూల్ డ్రింక్ గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు. సరిగ్గా అప్పుడే డోరు బెల్ మోగింది.

"కమిన్!" గట్టిగా అరిచాడు అప్పల్రాజు. గది తలుపు తీసుకుని ఓ సూట్ కేస్ తోపాటు కన్యక లోపలికొచ్చింది. ఆమెవంక పరీక్షగా చూశాడు అప్పల్రాజు.

"ఎవరు మీరు?"

"నేను కన్యకనండి"

"హలో మిస్ కన్యకా! సారీ కళ్ళజోడులేదు. కమిన్! కాఫీ తాగుతారా, కూల్ డ్రింకా?"

కన్యక సోఫాలో కూర్చుంటూ "థాంక్స్! ఏమీవద్దండి!" అని ఎదురుగ్గా భవానీశంకర్ ని చూసి ఉలిక్కిపడింది.

"మిస్ కన్యకా! మీట్ మిస్టర్ దీప్ చంద్! ఫేమస్ తెలుగు రైటర్! ఈమె గురించి

మీకు చెప్పానుగదా దీప్ చంద్! మిస్ కన్యక..."

భవానీశంకర్ మొఖంలో ఆనందం వెలిగిపోయింది.

"హలో హలో మిస్ కన్యకా! మనం మళ్ళీ ఇలా కలుసుకోవటం నాకెంతో సంతోషంగా ఉంది. వేర్ దేరీజ్ లవ్ దేరీజ్ గాడ్! పవిత్ర ప్రేమకు పరమాత్ముని సహకారముండును"

"హలో" అంది కన్యక పొడిగా. ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. అతనే ప్రముఖ రచయిత దీప్ చంద్ అని ఆమెకు తెలీదు.

"అయితే మీకూ, మిస్ కన్యకకూ ముందే పరిచయం ఉందన్నమాట వెరీగుడ్! వెరీగుడ్" అన్నాడు అప్పల్రాజు.

"పరిచయమా? యూ ఆర్ మిస్టేకన్ మైడియర్ సర్! పరిచయం కంటే పవిత్రమయిన బంధుత్వం!"

"ఓ! రిలేషన్ షిప్! వండర్ ఫుల్ అయితే మన ఆత్మకథ ప్రాజెక్టు చాలా స్మూత్ గా, హ్యాపీగా సాగిపోతుందన్నమాట"

"అలా జరక్కపోతే పందెం కట్టండి! ప్రతి పేజీ ఒక కళాఖండం అయిపోతుంది"

కన్యకకేం మాట్లాడాలో తెలీటంలేదు. ఆమె మనసంతా కలవరపాటుతో నిండిపోయింది. తన ఫోటో అలా వారపత్రిక ముఖచిత్రంగా వేసిన వాడితోపాటు నెలరోజులు కలసి పనిచేయటం వాంఛనీయమేనా అన్న ఆలోచన ఆమెను సతమతంచేస్తోంది. ఈ విషయం ముందే తెలిసి ఉంటే తను ఖచ్చితంగా ఈ ఆఫర్ తిరస్కరించేదే! కానీ ఇప్పుడు ఇంతదూరం వచ్చాక అలా చేయటం

సమంజసంగా కనిపించటంలేదు. అదీగాక నెలరోజుల్లో అయిదువేల రూపాయలు తక్కువ మొత్తమేంకాదు. తనకు చాలా అవసరం ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో_

వెన్నెల వేట పేజి 21

"బాయ్ ఇంకో కూల్ డ్రింక్ తెచ్చి ఆమె ముందుంచాడు.

"కమాన్ మిస్ కన్యకా! కమాన్! టేకిట్_" అన్నాడు అప్పల్రాజు.

కన్యక గ్లాసు అందుకుంది. అప్పల్రాజు ఫోన్ అందుకున్నాడు. "హలో రిసెప్షన్! రూమ్ వెకేట్ చేస్తున్నాను, బిల్ పంపించండి! అర్జెంట్"

కారు డ్రైవరు లోపలికొచ్చి నిలబడ్డాడు.

"వచ్చావా! కారులో పెట్రోల్ పోయించేశావా?

"పోయించాను సార్"

"అయితే లగేజ్ తీసుకెళ్ళి కారులో పెట్టెయ్. మిస్ కన్యక సూట్ కేస్ అరె మీ లగేజ్ ఏది మిస్టర్ దీప్ చంద్?" ఆశ్చర్యంగా అడిగాడతను.

భవానీశంకర్ కేంచెప్పాలో తెలీలేదు. చకచకా ఆలోచించసాగాడు.

"నా లగేజా?"

"యస్_సూట్ కేస్, బాగ్ వగైరాలేమీ లేవా?"

"నో_నథింగ్" తాపీగా అన్నాడతను.

"మరి ఈ నెలరోజులూ మీకు బట్టలు?"

"వెళ్ళేప్పుడు రడీమేడ్ డ్రస్ కొంటాను. ఎందుకంటే ఒకసారి తొడిగిన బట్టలు నేను రెండోసారి తొడగను"

అప్పల్రాజుతో పాటు కన్యక కూడా అతనివేపు విస్మయంగా చూసింది.

"చాలా కాస్ట్ లీ హాబిట్ మిస్టర్ దీప్ చంద్! ఇంగ్లండ్ క్వీన్ కూడా ఇలా చేస్తుందనుకోను" అన్నాడతను.

బాయ్ బిల్ తెచ్చిఇచ్చాడు అప్పల్రాజుకి.

"కమాన్_లెటజ్ గో నౌ?" అంటూ బయటకు నడిచాడతను.

ముగ్గురూ హోటల్ ఆవరణలో ఉన్న టయోటాకారులో కూర్చున్నారు. కారు బయల్దేరింది.

"ఏ రడీమేడ్ షాప్ దగ్గర ఆపాలి మిస్టర్ దీప్ చంద్?" అడిగాడు అప్పల్రాజు.

"ఎనీ రేమండ్స్ షాప్!"

అప్పల్రాజుకి ఆశ్చర్యంగా వుంది. "రచయిత ఎంత ఖరీదయిన జీవితం అనుభవిస్తారు" అనుకుంటున్నాడతను.

కారు రేమండ్స్ షాప్ దగ్గర ఆగింది.

అప్పల్రాజూ, భవానీశంకర్ దిగి షాపులోకి నడిచారు. నాలుగు జతల బట్టలు సెలక్ట్ చేశాడతను. మొత్తం అన్నిటికీ కలిపి పన్నెండు వందలయింది బిల్. కౌంటర్ దగ్గరకెళ్ళాక జేబులు వెతకసాగాడతను.

"మైగాడ్! క్రెడిట్ కార్డ్ మర్చిపోయాను" అన్నాడతను అప్పల్రాజు వంక

చూస్తూ.

"డోంట్ వర్రీ దీప్ చంద్! నా క్రెడిట్ కార్డ్ వుంది" అంటూ క్రెడిట్ కార్డ్ పర్స్ లోనుంచి తీశాడతను.

డ్రైవర్ పాకెట్ తీసుకెళ్ళి కారులో పెట్టాడు. కారు మళ్ళీ బయలుదేరింది.

"కేవలం నాలుగ్గంటల ప్రయాణం మిస్ కన్యకా! మీకు ఆంధ్రప్రదేశ్ హౌస్ బాగా నచ్చుతుందనే అనుకుంటున్నాను"

"ఆంధ్రప్రదేశ్ హౌసా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీశంకర్.

"ఎస్! నేను మినిష్టర్ గా వున్నప్పుడు కట్టించానది. చాలా పెద్ద భవనం. ఆ రోజుల్లోనే పాతిక లక్షలు ఖర్చయింది. అప్పుడు అసెంబ్లీలో జరిగిన గొడవ గురించి మీకు తెలుసా?"

"ఏమిటది?" అడిగాడతను.

"ఒండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్ రైటర్! నేనా భవనం కట్టించాక అసెంబ్లీలో ప్రతిపక్షాలకు చెందిన చిన్నారావ్ చాలా రభస లేవదీశాడు. చిన్నారావ్ నీకు తెలుసుకదూ? రుక్మిణి హజ్బెండ్ ఎమ్మెల్సీగా చేసిందామె. వెరీ బ్యూటిఫుల్ వుమన్. ఓసారి మా పార్టీ ఎమ్మెల్యేలందరినీ కాకినాడలో దాచేసింది. ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెదకడానికెళ్తే అతను వెతక్కుండా డాన్స్ ప్రోగ్రామ్స్ ఏర్పాటుచేసింది. సీతాదేవి అనీ ఒండర్ ఫుల్ డాన్స్ ట్రూప్ వుందామెకి. స్టేజి ఎక్కారంటే జనం పక్షవాతం వచ్చినట్లు నోరు తెరచి చూస్తూండిపోడమే! సినిమాల్లో డాన్సులు ఏం పనికొస్తాయ్? ఆమెకిద్దరు భర్తలని అందరూ చెప్పుకునేవారుగానీ ఆ రెండో అతను భర్తకాదని తర్వాత తెలిసింది జస్ట్...పాత

ప్రియుడట. ఇద్దరూ పరిస్థితులవల్ల, అదేదో సినిమాలలోలాగా త్యాగం చేసి పెళ్ళి చేసుకోకుండా, ఈ రోజుల్లో అంతటి త్యాగం ఎవరికుంది? మా బామ్మరిది వర్ధనరావ్ డేంజరస్ ఫెలో! ఓసారి ఏంచేశాడో తెలుసా? ఉంగరం అమ్మేశాడు."

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు. "ఉంగరం అమ్మేశాడా?"

"ఎస్! శమంతకమణి ఉంగరం పోయిందని ఒకటే గొడవ. అఫ్ కోర్స్! ఉంగరం అమ్మడానికి అతనికుండే కారణాలేవో అతనికున్నాయ్. రజనీకాంత్ అనీ మా ఫ్రెండ్ కజిన్ బ్రదర్ కొడుకొకడు కూడా అంతే. అమెరికాలో అమెరికన్ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు."

భవానీశంకర్ కేమీ అర్థంకావటం లేదుగానీ చిరునవ్వు నవ్వుతూ వినసాగాడు. అందుకే అతనిమీద అభిమానం పెరిగిపోతోంది అప్పల్రాజుకి. ఇంతకుముందు తనేం చెప్పటం ప్రారంభించినా ఎవ్వరూ వినేవారు కాదు.

"మీ ఇద్దరికీ అతి ముఖ్యమయిన విషయం ఒకటి చెప్పదల్చుకున్నాను" అన్నాడు అప్పల్రాజు కొద్దిక్షణాలాగి.

"వెల్ కమ్ మైడియర్ సర్! కారీ ఆన్!"

"ఇప్పుడు నేను రాయబోతున్న అత్యంత ప్రాజెక్ట్ కి చాలా శ్రమపడాల్సి వస్తుంది మనం. గత పాతిక సంవత్సరాలనుంచీ నేను రాస్తున్న డైరీలు, నేను సంపాదించిన ఫోటోలు, ఎందరో రాసిన ఉత్తరాలు ఇవే నా ఆత్మకథకు ఆధారాలు. ఆత్మకథలో ఎక్కువభాగం నా రాజకీయ జీవితం గురించే వుంటుంది. ఆ డైరీలను చూచుకుంటూ, రాజకీయరంగంలో నాకు తెలిసిన వ్యక్తుల గురించి నోట్స్ లు తయారుచేసుకుంటే మన పని కొంచెం తేలికవుతుందని నా అభిప్రాయం."

"అదంతా నేనూ, మిస్ కన్యకా పాలూ, నీరులా కలిసిపోయి, చెట్టాపట్టాలేసుకుని ఆడుతూ పాడుతూ ఈజీగా చేసేస్తాం మైడియర్ సర్! టేకిట్ ఈజీ!" ఉత్సాహంగా అన్నాడు భవానీశంకర్.

కన్యక అతనివేపు కోపంగా చూసింది.

"ఇంతకూ నేను చెప్పదల్చుకున్న ముఖ్య విషయం ఏమిటంటే" అని గొంతు తగ్గించాడతను.

"ఈ ఆత్మకథలో ఎవరికీ తెలీని ఎన్నో రాజకీయ రహస్యాలను నేను రాసేయదల్చుకున్నాను. ఎవరు ఎలాంటి అవినీతి పనులు చేసిందీ, ఎంతెంత ఆస్తులు సంపాదించిందీ, ఎవరెవరికి ఎవరెవరితో అక్రమసంబంధాలున్నదీ, దీనిద్వారా వాళ్ళు పొందిన లాభాలు, సెక్రటరీలు వ్యతిరేకంగా నోట్ పుటప్ చేసినా దానిని ఎందుకు నిర్లక్ష్యం చేసి మంత్రులు శాంక్షన్ చేసిందీ, ఇలా ఎన్నో విషయాలు. ఈ పుస్తకం పబ్లిష్ అయితే ఎంతోమంది ముసుగులోని వ్యక్తులు వీధిన పడతారు. పడాలి కూడాను! కనుక పుస్తకం రిలీజయ్యేవరకూ మీకు తెలిసిన రహస్యాలు బయటకు పొక్కగూడదు. కేవలం మన ముగ్గురిమధ్యే ఈ రహస్యాలు మిగిలిపోవాలి. అందుకే ప్రాజెక్ట్ పూర్తి అయ్యేవరకూ ఎవరూ ఆంధ్రప్రదేశ్ హౌస్ వదలి బయటకు వెళ్ళకూడదన్న నిబంధన ఒకటి పెట్టాను కాంట్రాక్టులో."

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"డోంట్ వర్రీ మైడియర్ సర్! మీరు చెప్పే రహస్యాలలో ఒక అక్షరం కూడా బయటకు పొక్కదని నేనూ, మిస్ కన్యక సంయుక్తంగా హామీ ఇస్తున్నాం."

కన్యక అతనివేపు అసహనంగా చూసింది.

కారు మెయిన్ రోడ్ వదలి సన్నని రోడ్ వేపు తిరిగింది.

"అదిగో దూరంగా ఇళ్ళు కనబడుతున్నాయ్ చూశారా? అదే 'సింగారం' ఊరు. ఊరి మధ్యలో ఎత్తుగా భవనం కనబడుతోంది కదా! అదీ ఆంధ్రప్రదేశ్ హౌస్" చెప్పాడు అప్పల్రాజు.

వెన్నెల వేట పేజి 22

మరికొద్దినిమిషాల తర్వాత కారు సింగారం ఊళ్ళోకి చేరుకుంది. ఒకేఒక్క మెయిన్ రోడ్ అయినా రోడ్డుమీద రద్దీలేదు రెండు సినిమా హాళ్ళు, అరడజను హోటళ్ళు, రెండు బార్లు, కొన్ని షాపులు__అదే సింగారం.

ఊరికి కొంచెం దూరంగా వుంది ఆంధ్రప్రదేశ్ హౌస్.

కొన్ని ఎకరాల స్థలంలో పెద్ద పెద్ద గార్డెన్స్ చెట్లమధ్య ఉందా భవనం. కారు గేటు ముందాపి హారన్ మ్రోగించాడు డ్రైవర్. ఓ నౌకరు పరుగుతోవచ్చి గేటుతెరచి అప్పల్రాజుకి సెల్యూట్ కొట్టాడు. కారు భవనం ముందున్న పోర్టికోలో ఆగింది డ్రైవర్ దిగివచ్చి బాక్ డోర్ తెరచి పట్టుకున్నాడు. ముగ్గురూ కారు దిగారు.

"కమాన్! కమాన్! అన్నాడు అప్పల్రాజు భవనంలోకి నడుస్తూ.

భవానీశంకర్, కన్యక అతని వెనకే లోపలకు నడిచారు. చాలా పెద్దహాలు అది గోడలకు మంచి పెయింటింగ్స్ అమర్చిఉన్నాయ్. హాలు మధ్యలో నిలువెత్తున్న ఫ్లవర్ వాజ్, సోఫాలు, టీపాయ్ లూ.

ఓ మూల మేడమీదకు మెట్లున్నాయ్.

"శమంతకమణీ!" పిలిచాడు అప్పల్రాజు. హాలుకి చివర ఉన్న గది తలుపులు తెరచుకుని శమంతకమణి బయటికొచ్చింది.

"ఈమె శమంతకమణి! నా మిసెస్!" అన్నాడు అప్పల్రాజు. "ఈయనే దీప్ చంద్! ఫేమస్ రైటర్! ఈమె మిస్ కన్యక"

"నమస్తే" అంది శమంతకమణి.

"నమస్తే" అన్నారు భవానీశంకరు, కన్యకలు ఒకేసారి.

"మీ రచనలంటే నాకెంతో ఇష్టం" అందామె.

"థాంక్యూ!"

"ముఖ్యంగా "చీకట్లో మగపిల్లలు" అంటే మరీ ఇష్టం!"

"అలాగా! ఎందుకనో తెలీదుగానండీ, చాలామంది ఆ నవలే ఇష్టపడుతున్నారు" అన్నాడు భవానీశంకర్.

"అందులో మాలిని పాత్ర నిజంగా సూపర్బ్"

"ఐసీ!"

"ఆమె అసలు ఆఖరులో రాజేష్ వర్మను చేసుకోపోతే ఆ థ్రిల్ ఉండేదికాదు"

"అఫ్ కోర్స్! మీరన్నమాట నిజమే!"

"మాలిని శ్యామ్ నెందుకు చేసుకోలేదో మీరు కారణాలు చెప్పలేదే?" అడిగిందామె.

భవానీశంకర్ తడబడ్డాడు.

"అవును! కావాలనే చెప్పలేదు_"

"ఎందుకని?"

"ఎందుకంటే అసలు కారణాలేమీ లేవుగనుక!"

"లేకపోతే శ్యామ్ నే చేసుకోవచ్చుకదా?"

"చేసుకోవచ్చు__చేసుకోవచ్చు! అందులో ఏమాత్రం నష్టం లేదు"

"మరెందుకు చేసుకోలేదు?"

"ఏమో! నాకే తెలీదు. అయ్ మీన్ తెలుసుగానీ_ఆల్ రైట్. ఆమె శ్యామ్ నే చేసుకోవాలని మీరు గట్టిగా అనేట్లయితే ఎండింగ్ మార్చేస్తాను. సెకండ్ ఎడిషన్ లో ఆమె శ్యామ్ నే చేసుకున్నట్లు రాస్తాను."

శమంతకమణి అతనివేపు అనుమానంగా చూసింది.

"అదేమిటి? నేను చెప్పినంత మాత్రాన ఎండింగ్ మార్చేస్తారా"

"యస్ మేడమ్! మనది డెమొక్రసీ కదా! అంచేత పాఠకులు ఎలా కావాలని కోరితే నవలలాగే రాయాలని ప్రిన్సిఫుల్ పెట్టుకున్నాను. అంతెందుకు? ఇంకో నవల్లో హీరోయిన్ కాన్సర్ వల్ల చచ్చిపోయినట్లు రాశాను కానీ పాఠకులు ఒప్పుకోలేదు. తిరగబడ్డారు. మా ఇంటిముందు ధర్నా జరిపారు. నిరాహారదీక్ష శిబిరం వేశారు. చివరకు వాళ్ళమాట కాదనలేక ఆమెకు అకస్మాత్తుగా కాన్సర్ తగ్గిపోయినట్లూ ఆమె వారంరోజుల్లో మళ్ళీ మామూలు మనిషయిపోయినట్లు మార్చేశాను"

″కానీ కాన్సర్ అలా తగ్గదు కదా?″

″ఆమె ప్రియుడి దేవుడి పూజామందిరంలో ఆర్రోజులు రాత్రింబవళ్ళు పూజలు చేస్తాడు. అందుకని తగ్గిపోతుంది″

″శమంతకమణి వాళ్ళు ఇక్కడే నెలరోజులుంటారు కనుక నువ్వు తరువాత తీరిగ్గా మాట్లాడవచ్చు″ అన్నాడు అప్పల్రాజు కొంచెం చిరాకుగా.

″ఓ.కే. మీరిద్దరూ మేడమీదకు వెళ్ళండి! అక్కడే మీకు గదులు కేటాయించాను″ అని 'మారుతీరావ్' అంటూ పిలిచిందామె. బట్టతలఉన్న ఓ లావుపాటి వ్యక్తి వచ్చాడక్కడకు.

″దీప్ చంద్ గారికి, కన్యక గారికి రూమ్స్ చూపించు అందామె.

″ప్లీజ్ ఫాలోమీ సార్″ అన్నాడతను మెట్లెక్కుతూ.

″కమాన్ మిస్ కన్యకా!″ అన్నాడు భవానీశంకర్ చిరునవ్వుతో. కన్యక అతనిమాటలు వినిపించుకోకుండా మారుతీరావ్ తోపాటు మెట్లెక్కసాగింది. మేడమీద పొడుగాటి నడవా_దాని కిరువేపులా మూడు మూడు గదులూ ఉన్నాయ్. ఆ నడవా దాటగానే పెద్దహాలు.

మొదటిగది తలుపు తెరచి ″ఈ గది మిస్ కన్యక కోసం″ అన్నాడతను.

కన్యక గదిలోకెళ్ళి తలుపు మూసివేసింది.

ఆ పక్కనే ఉన్న గది తలుపు తెరచాడతను ″ఇదిమీది″ అన్నాడు భవానీశంకర్ తో.

″థాంక్యూ మిస్టర్ మారుతీరావ్″

"వెల్ కమ్ సార్! మీకెప్పుడు ఏంకావాలన్నా ఈ బెల్ నొక్కితే నౌకరు వస్తాడు"

"ఓ వండర్ ఫుల్ ఎరేంజ్ మెంట్స్ మైడియర్ మారుతీరావ్"

"మీకెలాంటి ఇబ్బంది కలిగినా ఇంటర్ కమ్ ఫోనులో నాకు రింగ్ చేయవచ్చు. రెడ్ కలర్ బటన్ నొక్కితే చాలు నేను ఫోన్ లో ఉంటాను"

"రాత్రింబవళ్ళు?"

"యస్సార్! రాత్రింబవళ్ళు"

"ఇరవై నాలుగ్గంటలూ డ్యూటీయే?"

"యస్సార్! ట్వంటీఫోర్ అవర్సు ఆన్ డ్యూటీ"

"ఆఫ్రికాలో కూడా నీలాంటి డ్యూటీకాంషన్ పీపుల్ లేరు మైడియర్ మారుతీరావ్! ప్లీజ్ కీపిటప్"

"థాంక్యూ సర్" వినయంగా అని తలుపు మూసుకుని వెళ్ళిపోయాడతను.

"హమ్మయ్య" అనుకున్నాడు భవానీశంకర్. గది మధ్యలోని మంచంమీద హాయిగా పడుకుని పక్కగదిలోనే కన్యక ఉందన్న విషయం అతనికి చాలా సంతృప్తి కలిగించింది. అన్నీ సవ్యంగా జరిగితే నెలరోజులు లేదా తను తల్చుకుంటే ఆపైన మరికొన్ని రోజులు కూడా అత్తగారింట్లో గడిపినట్లు గడపవచ్చు. ఇక్కడ తను దీప్ చంద్ కాదు అన్న విషయం ఎవరికీ తెలీదు. ఇకముందు తెలిసే అవకాశం కూడా లేదు.

* * * *

కన్యక తన రూమ్ లోనుంచి బయటికొచ్చి మెట్లుదిగి భవనం బయటికి నడిచింది. ఆ భవనం చుట్టూ ఉన్న అందమయిన ఉద్యానవనాలూ, దూరంగా అడవిగా కనబడుతున్న చెట్లూ_ఇవన్నీ ఆమెకు చాలా ఆహ్లాదం కలిగిస్తున్నాయ్. ఇక్కడే, ఈ భవనంలోనే శాశ్వతంగా ఉండిపోయే అవకాశం వస్తే ఎంత బావుండు అనుకుందామె.

"ఏమయినా సహాయం కావాలా మేడమ్?" వెనుకేవస్తూ అడిగాడు మారుతీరావ్.

"ఉహు ఏమీ అక్కర్లేదు. అలా కాసేపు గార్డెన్ లో తిరిగివద్దామని..." చిరునవ్వుతో చెప్పిందామె.

"వెల్ కమ్ మేడమ్! వెల్ కమ్! ఆంధ్రప్రదేశ్ హౌస్ గార్డెన్స్ మీకెంతో ఆనందం కలిగిస్తాయ్" అన్నాడతను.

ఆమె ముందుకి నడిచింది.

చీకటి పడిపోతోందప్పటికే. తోటలో నడుస్తూంటే చల్లని గాలి రకరకాల పూల సువాసనలతో గుబాళిస్తూ వీస్తోంది. ఓచోట పచ్చికలో కూర్చుందామె. "సిటీలో ఇలాంటి ఏకాంత ప్రదేశం ఎంత తపస్సు చేసినా దొరకదు" అనుకుందామె. తనకు ఇలా ప్రకృతి ఒడిలో ఏకాంతంగా గడపడం చాలా ఇష్టం.

"హలో" అన్న పలుకరింపు విని ఆశ్చర్యంగా చూసిందామె . భవానీశంకర్ వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు.

"ఈ మాజీమంత్రి చాలా టేస్ట్ ఉన్నాడిలా కనబడుతున్నాడు. ఆ బిల్డింగ్ ఆర్కిటెక్చర్, ఈ తోటలు. చాలా అద్భుతంగా ఉన్నాయ్! ఏమంటారు?"

వెన్నెల వేట పేజి 23

కన్యక జవాబివ్వకుండా లేవబోయింది.

"అరె! వెళ్ళిపోతున్నారా? నో మిస్ కన్యకా! ప్లీజ్ కూర్చోండి. మనం ఆంధ్రదీపిక ఆఫీస్ లో ఎంతో ఆనందకరంగా గడిపిన రోజులు మర్చిపోయారా?"

"రోజులా?"

"అఫ్ కోర్స్ అలా నిలదీస్తే ఒకే ఒక్కరోజు అనుకోండి! అయినా ఆ ఒక్కరోజులోనే యుగయుగాలు కలసి విహరించినట్లు మీకు అనిపించటం లేదూ?"

"లేదు."

"ఐసీ. లాక్ ఆఫ్ ఇమేజినేషన్! బహుశా ప్రస్తుతం మనసు బాగుండక మీరలా అంటున్నారు కానీ ఒంటరిగా మీ గదిలో పడుకున్నప్పుడు మీరు ఆనాటి తలపులన్నీ గుర్తుకు తెచ్చుకుని ఆనందంలో ఉక్కిరిబిక్కిరవుతూ మీలో మీరే నవ్వుకుంటూ సిగ్గుపడుతూ__"

కన్యకకు నవ్వాగలేదు గానీ బలవంతంగా ఆపుకుంది.

"అదంతా మీ ఊహ."

"అయుండచ్చు కన్యకగారూ! కానీ నేటి ఊహలే రేపటి నిజాలు అన్నాడు షేక్ స్పియర్."

"షేక్ స్పియర్ పుస్తకాల్లో నాకెక్కడా కనిపించలేదా మాట!"

"లేదా? వెరీ స్ట్రేంజ్! అయితే ఆ బెర్నార్డ్ షా పుస్తకం అయుంటుంది"

అతని మాటలు కన్యకను విపరీతంగా ఆకర్షిస్తున్నాయ్. ఇంత సరదాగా మాట్లాడే యువకులు తనకింతవరకూ తటస్థపడలేదు. అక్కడినుంచి వెళ్ళిపోవాలన్న కోరిక నెమ్మదిగా బలహీనమయి పోసాగింది అదీగాక తనూ, అతనూ కలసి నెలరోజులు_ఉద్యోగం చేయాల్సి ఉంది. తనకిష్టం లేకపోయినా సరే.

"నేనిక్కడకు రావటం మీకేం మాత్రం ఇష్టంలేదు కదూ?"

కన్యకకేం చెప్పాలో తెలీలేదు. అదేంలేదు ఎవరున్నా నాకొకటే! నేను నా ఉద్యోగం చేయడానికొచ్చాను" అంది కొద్దిక్షణాలాగి.

"బహుశా ఈ కవర్ పేజీ వ్యవహారం వల్ల మీకింకా కోపం ఉండి ఉంటుంది నామీద. కనీ అయామ్ హెల్ప్ లెస్ కన్యకాజీ! ఇంత అందం ఒకేసారి ఫోటోలో కనబడేసరికి..."

"ఆ విషయం ఇంక వదిలేయండి" అందామె.

"ఓ.యస్! నా పాలసీ కూడా అదే మిస్ కన్యకా! పాస్ట్ ఈజ్ పాస్ట్. అందుకే మీరు నన్ను ఆ ఉద్యోగంలోనుంచి డిస్మిస్ చేయించినా నేను పట్టించుకోలేదు. వెంటనే మర్చిపోయాను."

కన్యక చకితురాలయింది. "మిమ్మల్ని ఉద్యోగంలో నుంచి తీసేశారా?"

"అవును. మీ శరత్ బాబుగారు మా ప్రొప్రయిటర్ కి ఫోన్ చేసి ఆ విషయం కంప్లైంట్ చేశారట."

కన్యక కలవరపడింది. తన కోపంవల్ల అతని ఉద్యోగం పోతుందని ఊహించలేకపోయిందామె. ఈ రోజుల్లో ఉద్యోగం సంపాదించటం ఎంత కష్టమో తనకే అనుభవం ఉంది. అలాంటిది తనవల్ల ఓ యువకుని ఉద్యోగం పోవటం.

"అయామ్ సారీ" అందామె.

"నోనోనో. మీలాంటి అందమయిన అమ్మాయి అలా 'సారీ' ఫీలవకూడదు కన్యకగారూ! ఎప్పుడూ హ్యాపీగా, నవ్వుతూ, తుళ్ళుతూ, టయోటా కారులో తిరుగుతూ..."

"మీ ఉద్యోగం..."

"డోంట్ వర్రీ ఎబౌట్ మై జాబ్ మైడియర్ ఫ్రెండ్! ఆ ఉద్యోగం పోబట్టే కదా. మీతో ఇక్కడ గడిపే అవకాశం దొరికింది?"

కన్యక నవ్వింది.

"ఏదేమయినా మీరలా న ఫోటో కవర్ పేజీమీద వేయకుండా ఉండాల్సింది."

"వేయకపోవటం నేషనల్ క్రైమ్ కన్యకాజీ! ఇంత అందాన్ని ఎక్కడో మారుమూల మగ్గనీయటం దారుణం. దేశమంతా చూచి తరించాల్సిన అందం. ప్రతి ఇంట్లోనూ ఆ కవర్ పేజీని ఫ్రేమ్ కట్టించి దాచుకున్నారనటంలో ఎలాంటి సందేహంలేదు నాకు"

"ఇంక వెళతాను" లేచి నిలబడుతూ అందామె.

"అచ్చు పొరపాటు డియర్! 'వెళ్దాము' అనాలి" తను కూడా లేచి ఆమెతోపాటు ఇంటివేపు నడుస్తూ అన్నాడతను.

నాలుగడుగులు వేసేసరికి మారుతీరావ్ ఎదురొచ్చాడు.

"డిన్నర్ రడీ సార్!"

"థాంక్యూ మైడియర్ మారుతీరావ్. ఎవరెవరున్నారు డైనింగ్ టేబుల్ దగ్గర."

"అప్పల్రాజుగారూ, శమంతకమణిగారూ, వర్ధనరావ్ గారూ, మనోచిత్రగారూ ఉన్నారండీ."

"ఈ వర్ధనరావ్, మనోచిత్రా ఎవరు?"

"వర్ధనరావ్ గారు శమంతకమణిగారి తమ్ముడుగారండీ! మనోచిత్రగారు శమంతకమణిగారి అక్కయ్య కూతురు."

"అయితే ఇంచుమించుగా ఇల్లు 'హౌస్ ఫుల్' అన్నమాట."

"ఇప్పుడే కాదండీ! వచ్చేవారం శమంతకమణిగారు అధ్యక్షురాలిగా ఉన్న "టైగర్స్ క్లబ్" మీటింగ్ కోసం చాలామంది అతిథులు వస్తున్నారండీ. అప్పుడు హౌస్ ఫుల్ అయిపోతుంది."

"ఐసీ_"

ముగ్గురూ డైనింగ్ హాల్లో కొచ్చేశారు.

"రండి! రండి!" వారిని సాదరంగా ఆహ్వానించింది శమంతకమణి.

"ఇతను మా తమ్ముడు వర్ధనరావ్! ఈమె మనోచిత్ర! మా అక్కయ్య కూతురు ఎమ్.ఏ. పరీక్షలు రాసి శెలవులకు వచ్చింది. వీరే ప్రఖ్యాత రచయిత దీప్ చంద్? ఈమె కన్యక." అందరికీ పరిచయం చేసిందామె.

"నమస్తే. రచయితలంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు వర్ధనరావ్.

"థాంక్యూ!" అన్నాడు భవానీశంకర్.

"అయితే_ నేనెవరి రచనలూ చదవనులెండి"

"ఓ! మైగాడ్! వాటే సర్ ప్రైజ్. మీరు నా అభిమాన రచయితండీ." ఆనందంగా అంది మనోచిత్ర.

"థాంక్యూ"

"మా ఆంటీ ఇందాకట్నుంచీ నన్ను ఊరిస్తోంది. "నీకో ఇష్టమయిన వ్యక్తి"ని పరిచయం చేస్తానని! అయినా నాకు ఆశ్చర్యంగానే ఉంది. మిమ్మల్ని కలుసుకోవటం ఇంత తేలికగా కుదురుతుందని అనుకోలేదు."

"జస్ట్ పాజిబుల్"

"మీకు ఎనిమిది ఉత్తరాలు రాశాన్నేను కాలేజీ హాస్టల్ నుంచి! మీరు ఒక్కదానికి కూడా జవాబివ్వలేదు."

"అలాగా! అయ్ సీ. మా సెక్రటరీకి స్పష్టంగా చెప్పాను. అన్ని ఉత్తరాలకూ జవాబులు రాయాలని"

"ఒక్కదానికి కూడా రాయలేదతను."

"ఇంటికి వెళ్ళగానే డిస్మిస్ చేసేస్తాను వాడిని."

"పోనీండి పాపం. నా మూలంగా డిస్మిస్ చేయటం నాకిష్టం లేదు."

"నోనో. మీకు తెలీదు. నా అభిమాన పాఠకులనలా నిరుత్సాహపరచటం

నాకేమాత్రం సహించని విషయం"

"రండి. భోజనం చేస్తూ మాట్లాడుకుందాం" అన్నాడు అప్పల్రాజు.

అందరూ భోజనానికి కూర్చున్నారు.

"ఎప్పుడో ఓసారి నేను గోదావరి ఎక్స్ ప్రెస్ లో వైజాగ్ వెళ్తోంటే ఓ రచయితతో పరిచయం అయింది. వెరీగుడ్ ఫెలో! నాకు కాఫీ ఫలహారాలు అన్నీ సప్లయ్ చేశాడు ఫ్రీగా! నేను తను రాయబోయే కథ విన్నందుకు అంత కృతజ్ఞత చూపించాడు పాపం. అందుకే రచయితలంటే నాకిష్టం" అన్నాడు అప్పల్రాజు.

"అల్ప సంతోషులు మావాళ్ళు_" అన్నాడు భవానీశంకర్.

"యస్! మరోసారి ఇంకో రచయిత కలిశాడెప్పుడో _ 1968లోనో 84 లోనో గుర్తులేదు. ఎక్కడో కూడా గుర్తులేదు. చాలా మంచివాడు. రెండో మూడో ఫుల్ బాటిల్స్ తాగాడుగానీ కొంచెంకూడా గొడవ చేయలేదు" అన్నాడు అప్పల్రాజు.

వెన్నెల వేట పేజి 24

భోజనాలయిపోయాయ్.

"రేపు మార్నింగ్ ఎనిమిది గంటలకల్లా మన ప్రాజెక్టు వర్క్ స్టార్ట్ చేద్దాం" అన్నాడు అప్పల్రాజు.

"ఓ.యస్." అన్నాడు భవానీశంకర్.

"ఓ.కే." అంది కన్యక.

అందరూ లేచారు. భవానీశంకర్ తన గదిలోకి వచ్చేశాడు. బట్టలు

మార్చుకుంటూంటే ఇంటర్ కమ్ మోగింది.

"హలో... భవానీ... సారీ దీప్ చంద్ హియర్!"

"హలో దీప్ చంద్! నేను మనోచిత్రనండీ!"

"ఓ, మీరా?"

"ఇంకా నేను మీ గురించే ఆలోచిస్తున్నానండీ! ఇందాక భోజనాల టేబుల్ దగ్గర ఫ్రీగా మాట్లాడటం కుదరలేదు. మీ రూమ్ కి రావచ్చునేమో అని..."

"వెల్ కమ్ మైడియర్ యంగ్ గాళ్. వెల్ కమ్."

"థాంక్యూ. ఇప్పుడే వస్తున్నాను."

ఫోన్ డిస్కనెక్ట్ చేసి రెండు నిమిషాల్లో గది తలుపు తోసుకుని లోపలికొచ్చిందామె.

"కూర్చోండి!" అన్నాడు భవానీశంకర్.

"మీరు ఇప్పుడు రాస్తున్న సీరియల్ సూపర్బ్ గా ఉందండీ!"

"అప్పుడే ఏమయింది? వచ్చేవారం ఓ బ్రహ్మాండమయిన మలుపు తిప్పుతున్నాను. అది చదివారంటే అసలు పిచ్చెక్కిపోతుంది."

మనోచిత్ర ఉత్సాహంగా చూసింది "ఏమిటండీ ఆ మలుపు?"

"ఎప్పుడూ దేవుడిని పూజిస్తూ, భర్తను ఆరాధిస్తూ, భర్త పాదాలు రోజూ కళ్ళకద్దుకుంటూ గడిపే మహాలక్ష్మి పాత్ర ఉంది చూడండి. ఆ మహాలక్ష్మి హఠాత్తుగా సెక్స్ మానియాక్ అయిపోతుంది. కనడ్డవాడినల్లా పడగ్గదిలోకి

లాక్కెళ్ళిపోతుంది."

మనోచిత్ర ఉలిక్కిపడింది.

"అబ్బ! టెరిఫిక్ ట్విస్ట్!" అంది సంభ్రమంగా.

"ఇక నవలంతా అలాంటి ట్విస్ట్ లే! ఆడపిల్లల వెంబడిపడి రోజుకో ఆడపిల్లతో ప్రణయం జరిపే కృష్ణ పాత్ర ఉంది చూడండి. సడెన్ గా అతను సన్యాసుల్లో చేరిపోతాడు."

"అబ్బ! అన్ ఇమేజినబుల్" ఆనందంగా అందామె.

"యస్ మైడియర్ గాళ్. ఇమేజినేషన్ కు అందకుండా రాయటమే మోడ్రన్ టెక్నిక్"

ఆమె తన బాగ్ లోంచి ఓ చిన్న పుస్తకం తీసింది.

"ప్లీజ్! ఇందులో మీ ఆటోగ్రాఫ్ చేయరూ?"

భవానీశంకర్ పుస్తకం తీసుకుని 'దీప్ చంద్' అని సంతకం చేసి ఇచ్చాడు.

"థాంక్యూ వెరీమచ్! మళ్ళీ రేపొద్దున్న కలుసుకుందాం"

"షూర్ లీ డియర్ షూర్ లీ"

"రోజూ కొంచెంసేపు సరదాగా మీతో మాట్లాడడం మీకేమీ అభ్యంతరం ఉండదు కదూ?"

"నాటెటాల్ మిస్"

"థాంక్యూ..."

"గుడ్ నైట్"

"స్వీట్ డ్రీమ్స్"

ఆమె వెళ్ళిపోగానే తలుపులు మూసేసి 'అమ్మయ్య' అని గాలి పీల్చుకున్నాడతను.

* * * *

మర్నాడు పొద్దున్నే ఆరుగంటలకల్లా ఫోన్ మోగటం మొదలుపెట్టింది. నిద్రకళ్ళతో రిసీవర్ అందుకున్నాడు భవానీశంకర్.

"గుడ్ మాణింగ్ సర్! ఎనిమిది గంటలకల్లా ప్రాజెక్టు వర్క్ ప్రారంభిస్తే బాగుంటుందని అప్పల్రాజుగారి అభిప్రాయం సార్! అందుకని మీకు మెలకువ వచ్చిందో లేదోనని..." అన్నాడు మారుతీరావ్.

"వచ్చింది మైడియర్ మారుతీ! నిజం చెప్పాలంటే నేను గెడ్డం చేసుకుంటూండగా నీ ఫోన్ మోగింది."

"థాంక్యూ సర్..."

"అన్నట్లు నువ్వు తెల్లారుజామున అయిదింటికే లేవటం అలవాటనుకుంటాను"

"నాలుగ్గంటలకు సార్!"

"వెరీగుడ్ మారుతీ! అద్భుతమయిన సమయం నిద్రలేవటానికి! కీపిటప్"

"థాంక్యూ సర్!"

భవానీశంకర్ ఫోన్ డిస్కనెక్ట్ చేసి బాల్కనీ తలుపు తెరచి బాల్కనీలోకి వచ్చాడు ఆవులిస్తూ.

సరిగ్గా అప్పుడే కన్యకకూడా మాక్సీతో బాల్కనీలోకొచ్చింది.

"హలో గుడ్ మాణింగ్ కన్యకాజీ! మీ అందమయిన నిద్రను కూడా ఆ మారుతీరావ్ గాడు చెడగొట్టాడనడంలో ఎలాంటి సందేహం లేదు నాకు"

"అవును!" అంది కన్యక చిరునవ్వుతో.

"ఇంత ప్రశాంతమయిన వాతావరణంలో ఇంత రమణీయమయిన ప్రకృతి మధ్య__వీడో పెద్ద న్యూసెన్స్ అని నా అభిప్రాయం"

"పాపం అతని డ్యూటీ అతను చేస్తున్నాడు."

"అయ్ డౌట్ వెరీ మచ్ మైడియర్ ఫ్రెండ్! అన్నట్లు ఆ అద్భుతమయిన సీనరీ చూశారా! దూరంగా కనబడుతున్న పెద్ద చెరువూ_దానిమీద గొడుగులాపట్టిన మంచూ ఆ మంచు తెరవెనుక దాక్కున్న చెట్లు"

"మీరు కవిత్వం కూడా రాస్తారా?" నవ్వుతూ అడిగిందామె.

"మీరిలా పక్కనే ఉంటానని గ్యారంటీ ఇస్తే ఏది రాయమన్నా రాస్తాను. ఉదాహరణకు మీరు నా ఎదురుగ్గా రోజంతా కూర్చుంటానంటే మీ చిత్రం కూడా గీసి పారిస్ మ్యూజియమ్ కి పంపిస్తాను"

"మీకు బొమ్మలు వేయటం వచ్చా"

"ఇంతవరకూ రాదుకానీ మీరు ఎదురుగా ఉంటే?"

"మీరిలా మాట్లాడుతూంటే ఇక్కడే ఎనిమిదయిపోతుంది!" అంటూ లోపలికెళ్ళిపోయిందామె.

భవానీశంకర్ మరోగంట తర్వాత రడీ అయ్యేసరికి నౌకరు ఓ ప్లేట్లో పలహారం, ప్లాస్కులో కాఫీ తీసుకొచ్చి టేబుల్ మీదుంచాడు.

"కాఫీ ఫలహారం అయ్యాక తనువచ్చి అప్పల్రాజుగారి లైబ్రరీ రూమ్ కి మిమ్మల్ని తీసుకెళతానని మారుతీరావ్ గారు చెప్పారండి!" అన్నాడతను.

అతను చెప్పినట్లే కాఫీ ఫలహారాలు ముగించేసరికి మారుతీరావ్ వచ్చేశాడు.

కన్యకతోపాటు అప్పల్రాజు లైబ్రరీ రూమ్ చేరుకున్నాడు భవానీశంకర్. ఓ పెద్ద విశాలమయిన టేబుల్ వెనుక రివాల్వింగ్ చైర్ లో కూర్చున్నాడు అప్పల్రాజు.

"వెల్ కమ్ రైటర్! వెల్ కమ్" అన్నాడతను దీప్ చంద్ ను చూడగానే.

టేబుల్ కి భవానీశంకర్ ఓపక్క, కన్యక మరోపక్క కూర్చున్నారు.

"ఇది డయిరీ నెంబర్ వన్! మా తండ్రిగారు మొట్టమొదటిసారి ఎలక్షన్ లలో నిలబడిన రోజుల్లో మొదలుపెట్టాను నేనప్పుడు హైస్కూల్లో చదువుతున్నాను. ఇక్కడినుంచే ప్రారంభిద్దాం ఆత్మకథ! ఏమంటారు మిస్టర్ దీప్ చంద్?"

"గుడ్ అయిడియా సర్! ఏదయినా సస్పెన్స్ తో కూడిన సంఘటనతో ప్రారంభిస్తే మరింత బ్రహ్మాండంగా ఉంటుంది ఏమంటారు కన్యకగారూ?"

"అవును!" అందామె.

"అయితే మా తండ్రిగారు రాష్ట్రముఖ్యమంత్రి అవాల్సిన సమయంలో ఆయన గ్రూపులో ఉన్న ఎనిమిదిమంది అవతలి గ్రూపు వాళ్ళిచ్చిన డబ్బు

తీసుకుని వాళ్ళ నాయకుడిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్న సంఘటనతో ప్రారంభిద్దాం!"

వెన్నెల వేట పేజి 25

"ఎగ్జాక్ట్ లీ సర్! అంతకంటే అద్భుతమయిన సస్పెన్స్ మరొకటుండదు"

"అయితే ప్రారంభించి దీప్ చంద్! డిక్టేట్ చేస్తే కన్యక రాసుకుంటుంది"

భవానీశంకర్ ఆయన చేతిలోని డయిరీ తీసుకున్నాడు. వరుసగా కొన్ని పేజీలు  తిరగేశాక రూమ్ సీలింగువంక చూస్తూ చెప్పటం ప్రారంభించాడు.

"ఇది 1954వ సంవత్సరం!

అర్ధరాత్రి పన్నెండవుతోంది. చలి ఎముకలు కొరికేస్తోంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయ్. ఆ సమయంలో రెండు ముసుగు ధరించిన ఆకారాలు ఆ రోడ్డుమీద నిశ్శబ్దంగా నడుస్తున్నయ్."

అప్పల్రాజు పొంగిపోయాడు.

"అబ్బ! అచ్చం డిటెక్టివ్ కథలాగుంది."

భవానీశంకర్ అతని మాటలు పట్టించుకోలేదు.

"ఓ ఆకారం చేతిలో నాలుగులక్షల రూపాయలున్న లెదర్ బాగ్ ఉంది..."

మిస్ కన్యక చకచకా రాసేస్తోంది.

* * * *

సరిగ్గా అదే సమయంలో వర్ధనరావ్ సింగారం ఊళ్ళోని ఏకైక మైన్ రోడ్ లోని

వెంకటేశ్వరా బార్ లోకి నడిచాడు.

అప్పటికే లోపల కూర్చుని నాలుగో బీరు బాటిల్ ఖాళీచేస్తున్న ఓ లావుపాటి వ్యక్తి అతనిని చూసి ఆనందంగా లేచి నిలబడ్డాడు.

"రా గురూ! నీకోసం గంటసేపట్నుంచి వెయిట్ చేస్తున్నాను" అన్నాడతను. వర్ధనరావు అతని కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"లేటయిపోయింది గురూజీ! ఇవాళ్టినుంచి మన ఆపరేషన్ ప్రారంభించేశాను" అన్నాడు ఉత్సాహంగా.

"ముందు బీరుకొట్టు. తరువాత సబ్జెక్టులోకొద్దాం" అన్నాడతను ఓ బీరు గ్లాసు వర్ధనరావు ముందుకి తోస్తూ.

వర్ధనరావు బీరు మంచినీళ్ళలా తాగేశాడు.

"ఆ రచయిత ఎవరో వస్తాడన్నావ్ కదా వచ్చేశాడా?"

"ఓ! అతనిపేరు దీప్ చంద్! ఇవాళ అప్పుడే పనిమొదలుపెట్టేశారు కూడా!" లావుపాటి ఆకారం గతుక్కుమంది.

"స్క్రిప్ట్ వర్క్ మొదలుపెట్టేశారా!"

"ఆ! మా బావగారి సంగతి నీకు తెలీందేముంది? ప్రోగ్రామంటే ప్రోగ్రామే. మార్పులుండవ్."

"గురూ! నీ ప్లాన్ సక్సెస్ అవుతుందా లేక నా కొంప ముంచుతావా?" వర్ధనరావ్ నవ్వాడు.

"వినాయకరావ్! నా సంగతి నీకింకా తెలీదు. ఎలాగోలా మా బావగారి డైరీలు, ఫోటోలు దొంగిలించుకొచ్చే బాధ్యత నాది. అయితే ఈ కార్యక్రమం విజయవంతంగా నెరవేర్చటానికి నాకు ఇంకొక వ్యక్తి సహాయం కావాల్సివుంటుంది."

"వినాయకరావ్ ఉలిక్కిపడ్డాడు.

"ఇంకో వ్యక్తి కావాలా?"

"అవును."

"మరి మనం ఇంతకుముందు కలుసుకున్నప్పుడు నువ్వొక్కడివే వాటిని దొంగిలించుకొచ్చేస్తానన్నావుగా?"

"ఓవర్ కాన్ఫిడెన్స్! అప్పటినుంచీ ఆ ప్రయత్నంలోనే ఉన్నాను గానీ ఇప్పటికి తెలిసింది వాటిని బావగారు తన గదిలోని ఇనుప పెట్టెలో పెట్టి లాక్ చేస్తున్నారు. ఆ తాళంచెవులు ఆయన దగ్గరే వుంటాయ్. ఎవరికీ ఇవ్వరు."

"మరిప్పుడు నీకు తోడుదొంగగా యింకో వ్యక్తి ఎవరు దొరుకుతారు?"

"ఆ రచయిత దీప్ చంద్ ని కలుపుకుంటే మన పని చాలా తేలికయిపోతుందని నా ఉద్దేశం. ఎందుకంటే అతనికే ఆ డైరీలను రోజూ చూసి, చదివే అవకాశం వుంది. కనుక అతను తల్చుకుంటే వాటిని కాజేయటం చాలా ఈజీ."

వినాయకరావ్ వర్ధనరావ్ వంక చిరాగ్గా చూశాడు.

"కానీ ఆ రచయిత అలాంటి పని చేయడానికి ఎందుకొప్పుకుంటాడు? పైగా

పని పూర్తయితే మీ బావ అతనికి పాతికవేల రూపాయలు ఇస్తాడుక్ కదా?"

"ఆ డబ్బు మనమే ఇస్తేసరి" అన్నాడు వర్ధనరావ్.

వినాయకరావ్ మొఖంలోకి కళ వచ్చేసింది మళ్ళీ.

"అఫ్ కోర్స్! దానికి సమస్యేం లేదు. కానీ ఆ రచయిత ఒప్పుకుంటాడా అని?"

"నేను మాట్లాడిన దానినిబట్టి చూస్తే కొంచెం జాలీ టైప్ గానే వున్నాడు. కనుక మన ఆఫర్ పనిచేస్తుందని నా నమ్మకం."

"సరే, నీ ఇష్టం. ఎంతయినా ఖర్చవనీ. నేను సిద్ధమే. నాక్కావలసింది 'లంబోదరా పబ్లిషింగ్ హౌస్'కి మాత్రం ఆ స్క్రిప్ట్ ని పుస్తకంగా పబ్లిష్ చేసే ఛాన్స్ రాకూడదు. అంత సంచలనం రేపే ఆ పుస్తకం పబ్లిష్ చేసేడంటే ఆ నరహరిగాడు మాకంటే పెద్ద పబ్లిషర్ అయిపోతాడు. దాంతో మా పరువు ప్రతిష్టలు మట్టికొట్టుకుపోతాయ్. ఇన్ని సంవత్సరాలనుంచీ రాష్ట్రంలోని అతిపెద్ద పబ్లిషింగ్ హౌస్ అన్న పేరు కాస్తా తుడిచిపెట్టుకుపోతుంది."

"తెలుసు గురూ!"

"అంచేత ఏ పరిస్థితిలోనూ ఆ స్క్రిప్టు లంబోదరా పబ్లిషర్స్ కి చేరకూడదు."

"ఓ.కే. అన్నానుకదా."

"వినాయకరావ్ లేచి నిలబడ్డాడు. "ఇంక వెళ్దామా? హైదరాబాద్ కి బస్ ఇంకో పావుగంటలో వుంది."

"నువ్వు నిశ్చింతగా వెళ్ళు గురూ! ఆ దీప్ చంద్ ని ఎలాగోలా నేను మంచి చేసుకుంటాను."

అతను వెళ్ళిపోయాక తనూ బార్ నుంచి బయటికొచ్చాడు వర్ధనరావ్. ఇన్నిరోజులూ ఆ డయిరీలు, ఫోటోలు సంపాదించే పని చాలా తేలికనుకున్నాడు. కానీ ఇప్పుడు తెలుస్తోంది.

ఆ వినాయకరావ్ తనకు యాభైవేలు ఇస్తానన్నది వూరికే కాదు. చాలా క్లిష్టమయిన పని నిర్వహిస్తున్నందుకే అంతమొత్తం ఇస్తానన్నాడు. ప్రస్తుతం తను చేయాల్సిన మొదటి పని ఏమిటంటే ఆ రచయిత దీప్ చంద్ ని స్నేహం చేసుకోవటం. ఏ రచయిత నయినాసరే స్నేహం చేసుకోవాలంటే ఒకే ఒక్క మార్గం వుందీ ప్రపంచంలో. అదేమిటంటే అతని నవలలు గురించి పొగడటం. దీప్ చంద్ నవలల గురించి పొగడాలంటే తను కొన్నయినా చదివివుండాలి. కానీ తను ఒక్కటికూడా చదవలేదు. ఆ రోజంతా ఎలాగోలా కష్టపడి దీప్ చంద్ నవలలు చదవాలని నిశ్చయించుకున్నాడతను. కానీ ఆ నవలలు ఎవరిదగ్గరుంటాయ్?

ఎదురుగా బుక్ స్టాల్ కనిపించింది వర్ధనరావ్ కి. వెంటనే లోపలకు జొరబడ్డాడు.

"దీప్ చంద్ నవలలేమయినా వున్నాయా?" షాపతనిని అడిగాడతను.

"అవుటాప్ స్టాక్."

వర్ధనరావ్ నిరుత్సాహపడిపోయాడు.

"ఒక్క నవలకూడా లేదా?"

"ఒక్కటికూడా లేదు."

వర్ధనరావ్ కేంచేయాలో తెలీలేదు. తనే హైద్రాబాద్ వెళ్ళి అన్ని బుక్ స్టాల్స్

లోనూ వెతికితే దొరుకుతాయేమో!

"ఆ ఎదురుగ్గా అద్దె పుస్తకాల షాపుంది చూడండి. అందులో ప్రయత్నిస్తే దొరకవచ్చు" అన్నాడు షాపతను.

వర్ధనరావ్ వడివడిగా అద్దె లైబ్రరీ దగ్గరకు నడిచాడు.

"ఏం కావాలి సార్?"

"దీప్ చంద్ నవలలేమయినా వున్నాయా?"

వాడు చకచక తన దగ్గరున్న పుస్తకాలు చూశాడు.

"ఒకే ఒక్కటుంది సార్! ఇంకోటి సర్క్యులేషన్ లో వుంది."

"ఆ ఒక్కటీ చాల్లే ఇటివ్వు."

వెన్నెల వేట పేజి 26

ఆ కుర్రాడు ఓ లావుపాటి పుస్తకం తీసి అందించాడు.

"ఎంత ఇది?" అడిగాడు వర్ధనరావ్ ఆత్రుతగా.

"రోజుకి అర్థరూపాయి సార్!"

"నాకు అద్దెకు కాదు కావలసింది. కొనడానికి కావాలి."

వాడు ఓ క్షణం ఆలోచించాడు. "పన్నెండు రూపాయలు సార్!"

వర్ధనరావ్ పన్నెండు రూపాయలిచ్చి పుస్తకం తీసుకుని ఆనందంగా నడవసాగాడు. పుస్తకంలో పేజీలు  తిరగేశాక నవల వెనుకవేపు చూశాడు.

నడుస్తున్నవాడల్లా ఠక్కున నిలబడిపోయాడు.

వెనుక దీప్ చంద్ ఫోటో, కింద అతని వివరాలు.

ఆ ఫోటో వంక నిర్ఘాంతపోయి చూస్తూండిపోయాడతను. తమ ఆంధ్రప్రదేశ్ హౌస్ లో వున్నది ఆ ఫోటోలోని వ్యక్తి కాదు.

* * * *

మధ్యాహ్నం డిన్నర్ టేబుల్ చాలా హడావుడిగా వుంది. అప్పల్రాజు, తమ హెల్త్ మినిష్టర్ గా పనిచేసినప్పటి అనుభవాలు చెప్తున్నాడు. అతని మాటలు వినిపించుకోకుండా శమంతకమణి 'టైగర్స్ క్లబ్'లో కొత్తగాచేరి ఆ మీటింగ్ కోసం విచ్చేసిన కాకినాడ శ్యామలారాణితో క్లబ్ ఔన్నత్యం గురించి చెప్తోంది. మనోచిత్ర తదేకంగా భవానీశంకర్ వంక ఆరాధనతో చూస్తోంది. భవానీశంకర్ ప్రేమనంతా ఒలకబోస్తూ కన్యక వేపు చూస్తున్నాడు. వర్ధనరావ్ భోజనాలయ్యాక తను భవానీశంకర్ తో జరుపబోయే చారిత్రాత్మక సమావేశం ఎలా వుండాలో రిహార్సల్స్ వేసుకుంటున్నాడు.

"మీ నవలలంటే నాకు చాలా ఇష్టం దీప్ చంద్ గారూ" అంది శ్యామలారాణి హఠాత్తుగా.

"థాంక్యూ!" అన్నాడు భవానీశంకర్.

"ఒకసారి కొత్తగా పెట్టిన మా కాకినాడ టైగర్స్ క్లబ్ కి కూడా మీరు అతిథిగా వస్తే చాలా సంతోషం."

"తప్పక వస్తాను మేడమ్! ఎక్కడ ఆహ్వానముంటే అక్కడ నేనుంటాను."

ఇప్పుడు అప్పల్రాజు గొంతు మరికొంత పెద్దదయింది.

"...అప్పుడు ఆ డాక్టరేమన్నాడో తెలుసా? ఆపరేషన్ చేయాలంటే వెయ్యిరూపాయలు ఇవ్వాల్సుంటుందన్నాడు. సరేనని చెప్పి జేబులో నుంచి వెయ్యి రూపాయలు తీసి లెక్కపెట్టి ఇచ్చాను. అతను తీసుకొంటూండగా నా వెనక నిలబడ్డ యాంటీ కరప్షన్ వాళ్ళు అతనిని అరెస్టు చేశారు. అప్పుడు తెలిసింది ఆ డాక్టర్ కి నేను హెల్త్ మినిష్టరునని."

కొంచెం గాప్ ఇచ్చి అందరివంకా సగర్వంగా చూశాడతను. కానీ అతని మాటలెవరూ పట్టించుకోలేదు. ఆ గ్యాప్ ను ఆసరాగా తీసుకుని శమంతకమణి తమ 'టైగర్స్ క్లబ్' అనుభవాల్లో కొచ్చేసింది.

"ఓసారి నల్గొండలో మా క్లబ్ బ్రాంచివాళ్ళిలాగే స్కూల్ పిల్లలకు ఆటల పోటీలు కండక్టు చేయాలని ఫండ్స్ పోగుజేశారుగానీ ఆ పోటీలు నిర్వహించలేదని నాకు తెలిసింది. వెంటనే నేను అక్కడికి వెళ్ళి అప్పుడు ప్రెసిడెంట్ గా ఉన్న సీతాలక్ష్మిని డిస్మిస్ చేసిపారేసి యమునారెడ్డిని ప్రెసిడెంట్ చేసేశాను. రెండు రోజులు నేనక్కడే ఉండి ఆ పోటీలు నిర్వహించి బహుమతులు పంచిపెట్టాము."

"మీరు నవలలెలా రాస్తారు దీప్ చంద్ గారూ! కథలు ఎలా అల్లుతారు? ఎక్కడయినా జరిగిన సంఘటనల నుంచా లేక అంతా ఊహా కల్పనలేనా?" అడిగింది శ్యామలారాణి.

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"అనేక రకాలుగా ఉంటుందిలెండి అది! ఓసారి నేచురాలిటీ కోసం నెలరోజులు

చేపలుపట్టే వాళ్ళమధ్య_ వాళ్ళతోపాటు తిరుగుతూ తింటూ గడిపి_వాళ్ళ గురించి అన్నీ తెలుసుకుని నవలరాశాను. అది సహజత్వానికి దూరంగా ఉందని పాఠకులు కొట్టి పారేశారు. దాంతో వళ్ళుమండి ఇంకో నవల_ఏమాత్రం నేచురాలిటీ లేకుండా ఊహాలోకంలో విహరించేటట్లుగా రాశాను. హీరోయిన్ కి నాగదేవత ఇష్టదైవం. ఆమె భర్త క్లబ్ ల్లో, బార్స్ లో తిరుగుతూ ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. హీరోయిన్ పాముని ప్రార్థిస్తుంది. ఆ పెళ్ళి ఎలాగయినా ఆపమని వేడుకుంటుంది. నాగదేవత వెంటనే పెళ్ళిమండపం మీద ప్రత్యక్షమయి పెళ్ళిపీటల మీద కూర్చున్నవారిని పారిపోయేలా చేస్తుంది. దాన్ని కర్ర తీసుకుని కొట్టబోయినవారికి చేతులు పడిపోతాయ్. అంటే పక్షవాతం వచ్చేస్తుందన్నమాట. పెళ్ళికొడుక్కి కళ్ళు పోతాయ్. దాంతో ఆ అమ్మాయి అతనిని చేసుకోడానికి నిరాకరిస్తుంది. అప్పుడతను తిరిగి తన భార్యదగ్గరకెళ్ళి క్షమించమని వేడుకుంటాడు. ఈ నవల అద్భుతంగా, సహజత్వం ఉట్టిపడుతోందని లక్షల ఉత్తరాలొచ్చాయ్..."

మనోచిత్ర ఆశ్చర్యపడింది.

"అదేమిటి_ఆ నవల నేనే పత్రికలోనూ చదవలేదే?" అంది విస్తుబోతూ.

భవానీశంకర్ కేం చెప్పాలో తెలీలేదు.

"చదవలేదా?"

"చదవలేదు. మీ నవలలన్నీ నేను వదలకుండా చదివాను..."

"ఓ! అయితే ఇది డైరెక్ట్ నవల అయుంటుంది. సీరియల్ గా వచ్చి ఉండదు"

"ఆ నవల పేరేంటి?" ఆత్రుతగా అడిగిందామె.

"ప్రేమ పడగలు"

"మైగాడ్! మిస్సయ్యాను! రేపే హైద్రాబాద్ నుంచి తెప్పిస్తాను."

"నోనో...లాభం లేదు డియర్! అది అవుటాఫ్ స్టాక్! పద్నాలుగు ఎడిషన్లు ప్రచురించినా వారం రోజుల్లో కాపీలయిపోతున్నాయ్! దాంతో పాఠకుల మీద విసుగుపుట్టుకొచ్చి ఆ పబ్లిషర్ ఇంక అది ప్రచురించడం ఆపేశాడు..."

"ఓ!" నిరుత్సాహపడిపోయిందామె. "పోనీ మీ దగ్గరో కాపీ ఉంటుంది కదా! అది ఇస్తారా! రెండు గంటల్లో చదివి మీకిచ్చేస్తాను మళ్ళీ"

"ఓ! డెఫినెట్ లీ మైడియర్ ఫ్రెండ్! తప్పక తెప్పిస్తాను మా ఇంటి నుంచి."

భోజనాలు ముగిశాయ్.

తన గదిలోకి చేరాడు భవానీశంకర్. అయిదు నిమిషాలు కూర్చున్నాడో లేదో డోర్ బెల్ మోగింది.

"కమిన్"

వర్ధనరావ్ లోపలికొచ్చి అతనికెదురుగ్గా కూర్చున్నాడు.

"మీకిక్కడ అన్నీ సౌకర్యంగా ఉన్నాయా గురూజీ..."

"అత్తగారిల్లులా ఉంది."

"ఆతిథ్యం విషయంలో మా బావగారు మహా నిక్కచ్చిగా ఉంటారులెండి!"

"నన్నడిగితే ఆయనకు సన్మానం చేయాలి__ ఇంతకూ నువ్వేం చేస్తున్నావ్ బ్రదర్! ఇంకా చదువుతున్నావా?"

"లేదు గురూజీ! డిగ్రీ అయిపోయింది. ఏదయినా బిజినెస్ చేయాలని నా ప్లాన్! కానీ అక్కకీ బావకీ అదిష్టం లేదు..."

"ఎందుకని?"

"నేను డబ్బంతా ఆర్పేస్తానని వాళ్ళ అనుమానం..."

"వెరీబాడ్_"

"మీరే చెప్పండి! సినిమా తీస్తే మనం ఆరిపోతామా?"

"నెవర్ డియర్! మన సినిమా కొన్న ఏరియావాళ్ళు ఆరిపోతారు గానీ మనకేం ఫర్లేదు..."

"అదే చెప్తే మావాళ్ళు నమ్మటం లేదు..."

"పూర్ నాలెడ్జ్_"

"పోనీ రేసు గుర్రం ఒకటి కొని...రేసులో పరుగెత్తిస్తానన్నాను. దానికీ ఒప్పుకోవటం లేదు. మీరే చెప్పండి! రేసు గుర్రం పరిగెత్తితే ఎంత లాభం?"

"తెగలాభం అని విన్నాను బ్రదర్__"

"అవునా! దానికీ ఒప్పుకోవటం లేదు__"

"నిజం చెప్పాలంటే...అసలేపనీ చేయకుండా ఇలా జీవితాంతం గడిపేస్తే చాలా బావుంటుందని నా అభిప్రాయం..." అన్నాడు భవానీశంకర్.

"అది నాకూ ఇష్టమే గురూజీ! కానీ మరి శిరీషను మారేజ్ చేసుకోవటం ఎలా?"

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"శిరీషెవరు?"

వెన్నెల వేట పేజి 27

"మన గాళ్ ఫ్రెండ్! మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం గానీ వాళ్ళ డాడీ వప్పుకోవటం లేదు..."

"ఎందుకని?"

"నేను ఏదొక వ్యాపారమయినా, ఉద్యోగమయినా చేయాలిట! లేదా నా పేర ఎంతోకొంత ఆస్తి ఉండాలిట! అవేమీ లేకపోతే తనే నన్ను కూడా పోషించాల్సి వస్తుందని భయం...అయితే ఇందుకు మా ఫ్రెండొకడు మాంచి ఉపాయం చెప్పాడు."

"ఏమిటది?"

"ఇప్పుడు మీరు రాయబోతున్న ఆత్మకథ తాలూకూ డైరీలు, ఫోటోలు కాజేసి అతనికిస్తే అతను నాకు యాభయ్ వేలు ఇస్తానన్నాడు."

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"కాజేయటమా!"

"అవును! మీ సహాయం ఉంటే అదేమంత కష్టం కాదని నా అభిప్రాయం..."

"నా సహాయమా?"

"అవును గురూజీ! ఓ యంగ్ ఫెలో_ఓ చిన్న గుర్రాన్ని కొని వ్యాపారం

ప్రారంభించి జీవితంలో పైకివచ్చి కోటీశ్వరుడవ్వటం మీకిష్టం లేదూ?"

"అఫ్ కోర్స్! అవ్వాల్సిందే కానీ...ఇంతకుముందే గుర్రం పేరు చెప్పి సహాయం అడిగిన ఓ ఫ్రెండ్ కి సహాయం చేసి ఉద్యోగం పోగొట్టుకున్నాను..."

"ఉద్యోగం పోతేపోనీండి! మీరిప్పుడు నాకు సహాయం చేస్తే_మా బావగారిస్తానన్న పాతికవేలూ మా ఫ్రెండ్ మీకిస్తాడు_"

"కానీ మీ ఫ్రెండ్ కి ఆ డైరీలలో ఏమిటి పని?"

"మరేంలేదు. మా బావగారు ఆత్మకథ రాసి "లంబోదరా పబ్లికేషన్స్" వాళ్ళకి పబ్లిష్ చేసే హక్కులు ఇస్తానన్నాడట! మా ఫ్రెండ్ కది ఇష్టంలేదు. ఆ పుస్తకం పబ్లిష్ చేస్తే వాళ్ళ సంస్థ మా ఫ్రెండ్ వాళ్ళ పబ్లికేషన్స్ సంస్థ కంటే పెద్దదయిపోతుందని మా ఫ్రెండ్ అనుమానం! అందుకని ఆ పుస్తకం రాయనీకుండా ఆ డైరీలు, ఉత్తరాలు, ఫోటోలు కొట్టేస్తే..."

"అర్థమయింది బ్రదర్! అర్థమయింది! ప్రొఫెషనల్ జెలసీ అన్నమాట!"

"సెంట్ పర్సెంట్ కరెక్ట్!"

"అయామ్ సారీ మైడియర్ ఫ్రెండ్! ఆ పనిచేయటం నావల్ల కాదు! దొంగతనాలు చేయలేదనికాదు గానీ... ఆ ట్రాక్ వేరు. చిన్నప్పుడు సరదాగా మామిడి తోటల్లో కొబ్బరి తోటల్లో దొంగతనాలు చేసేముగానీ... ఇలా లార్జ్ స్కేల్లో_నో_అయాం ఎక్స్ ట్రీమ్లీ సారీ!"

"అంటే ఈ నవయువకుడి భవిష్యత్తు ఇలా ఆంధ్రప్రదేశ్ హౌస్ లోనే సర్వనాశనం అయిపోవాలని మీరు కోరుకుంటున్నారా? నేనూ శిరీషా విరహంతో

తపిస్తూ సైక్లోన్ లో చనిపోవాలని మీరు అనుకుంటున్నారా?"

"అలా కోరుకోవటంలేదుగానీ..."

"నేనూ, శిరీషా చిలకా గోరింకల్లా ఒకటయి ఆనందంగా జీవితం గడపాలని కోరటంలేదా?"

"కోరుతున్నాను కానీ, సారీ! ఆ పనిమాత్రం చేయను."

"సరే" అంటూ తన చేతిలో వున్న పాకెట్ విప్పి ఓ పుస్తకం బయటకు లాగాడతను. దాని కవర్ పేజీ భవానీశంకర్ వేపు తిప్పి చూపించాడు.

దానిమీద "విషసర్పం" అని వుంది. దానికిందే దీప్ చంద్ అన్న అక్షరాలు కనిపించినయ్.

"ఓ! నా నవల. ఎక్కడ దొరికింది నీకా పుస్తకం?"

"అద్దె లైబ్రరీలో"

"చదువు చాలా సస్పెన్స్ తో నిండివుంటుందా నవల. చాలా ఎప్లాజ్ వచ్చింది దానికి" అన్నాడు భవానీశంకర్ సర్దుకుంటూ.

"అందుకే మార్కెట్లో అవుటాఫ్ స్టాక్ అయుంటుంది."

"కరెక్ట్! మళ్ళీ ఇంకో ఎడిషన్ వేయాలని మా పబ్లిషర్ మొన్నే ఉత్తరం రాశాడు"

"వెంటనే వేయించండి. ఆలస్యం చేయవద్దు."

"ఓ తప్పకుండా."

"వర్ధనరావ్ పుస్తకం వెనకవేపు అట్ట భవానీశంకర్ కి కనిపించేట్లుగా

పట్టుకున్నాడిప్పుడు.

దానిమీద దీప్ చంద్ ఫోటో చూస్తూనే భవానీశంకర్ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ఈ ఫోటో కింద మీ వివరాలు చదివాను. మీర్రాసిన మొట్టమొదటి నవల 'వినువీధిలో పెనుగాలి' అటకదా."

"అఫ్ కోర్స్! కరెక్టు...కరెక్టు..." తడబడుతూ అన్నాడతను. అతనికి అర్థమయిపోయింది. తను వర్ధనరావ్ చేతిలో పట్టుబడిపోయాడు. ఇంక దొంగాట ఆడటం అనవసరం.

"సో, మైడియర్ ఫ్రెండ్! నేను దీప్ చంద్ ని కాదని తెలుసన్నమాట!" అన్నాడు చిరునవ్వుతో.

"కొద్దిసేపటి క్రితమే."

"చాలా ఆశ్చర్యపోయుంటా వనటంలో ఏమాత్రం సందేహం లేదు నాకు"

"తెగ ఆశ్చర్యపోయాను."

"భలే తమాషాగా వుందికదూ ఇలా జరగటం?"

"చాలా తమాషాగా వుంది."

"జీవితంలో ఇలాంటి తమాషాలు అప్పుడప్పుడూ జరుగుతుంటాయ్."

"అనే అనిపిస్తోంది."

"నిజం చెప్పాలంటే నేను ఇలా దీప్ చంద్ లా ఇక్కడికి రావాల్సి

వస్తుందనిగానీ, వస్తాననిగానీ నేనెప్పుడూ అనుకోలేదు."

"అలాగా?"

"అంతా అనుకోకుండా జరిగిపోయింది."

"ఐసీ!"

"ఇలా దీప్ చంద్ పేరుతో రావటానికి గల కారణం ఏమిటో చెప్తే నువ్వు మరీ ఆశ్చర్యపోతావు."

"అలాగా?"

"యస్! చాలా అనూహ్యమయిన సింపుల్ రీజన్."

"ఒకోసారి అంతే."

కొద్దిసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. వర్ధనరావు చిన్నగా దగ్గి భవానీశంకర్ వేపు చూశాడు"

"నా ప్రాజెక్టుకి సహాయం చేసే విషయంలో మీ అభిప్రాయం ఏమయినా మార్చుకున్నారా?"

భవానీశంకర్ ఓ క్షణం ఆలోచించాడు.

"మార్చుకోడానికి ఆస్కారం వుంది బ్రదర్! కానీ..."

"మీ ఇష్టం. బలవంతమేం లేదు."

"నో, నో! అదేంకాదు. నిజం చెప్పాలంటే నీలాంటి యంగ్ మెన్ కి అన్నివిధాల సహాయం చేయాలనేదే నా పాలసీ."

"చాలా మంచి పాలసీ మీది."

"ఇప్పుడు నేను నీతో సహకరించి ఆ డైరీలను, ఫోటోలను కాజేయాలి, అంతేకదా!"

"అంతే."

"అలాచేస్తే నా రహస్యం చాలా జాగ్రత్తగా కాపాడబడుతుంది?"

"ఇనుపపెట్టిలో ఉన్నట్లే"

"ఒకవేళ కాదు పొమ్మంటే నేను దీప్ చంద్ ని కాదన్న విషయం అందరికీ తెలిసిపోతుంది."

"క్షణాల్లో."

"చాలా డెలికేట్ పరిస్థితి కదూ?"

"టూ డెలికేట్" వప్పుకున్నాడు వర్ధనరావు.

"అయితే సరే. వప్పుకుంటున్నాను"

వర్ధనరావు ఆనందంగా లేచి భవానీశంకర్ ని కౌగిలించుకున్నాడు.

"యూ ఆర్ ఎ గ్రేట్ ఫ్రెండ్!"

"ఫ్రెండ్ షిప్ కి ప్రాణం ఇస్తాను."

"మన ఫ్రెండ్ షిప్ కి ప్రాణం అక్కర్లేదు. చిన్న ఎడ్జస్ట్ మెంట్ చేస్తే చాలు"

"అఫ్ కోర్స్! ఇంతకూ నేనేం చేయాలి?"

"మనిద్దరం కలిసి ఎలాగోలా ఆ డైరీలు, ఉత్తరాలు, ఫోటోలు కాజేయటానికి ఓ మంచి ఉపాయం ఆలోచించి చెప్పాలి. అది మనిద్దరం దిగ్విజయంగా అమలుపరుస్తాం. ఆ తరువాత వాటిని నేను మా ఫ్రెండ్ కందజేస్తే అతను నాకు యాభైవెలిస్తే, నేను గుర్రంకొని...బైదిబై! అతను నీకూ పాతిక వేలిస్తాడు."

"థాంక్స్! అక్కర్లేదు. ముందే చెప్పానుకదా! నేనొచ్చిన కారణం వేరు."

"ఓ.కే. గురూజీ! మళ్ళీ కలుస్తాను" అన్నాడు వర్ధనరావు.

"వెల్ కమ్ డియర్! వెల్ కమ్!"

అతను వెళ్ళిపోయాడు. భవానీశంకర్ ఆలోచనలో పడ్డాడు. ప్రస్తుత పరిస్థితి కొంతవరకూ చిరాకు కలిగించేదిగా కనిపించిందిగానీ, ఇలాంటి చిన్న చిన్న విషయాలు తను పట్టించుకోదల్చుకోలేదు. తనక్కావలసింది కన్యక. ఈ ఆత్మకథ పూర్తయ్యేలోగా ఆమెను తనదానిగా చేసుకోవాలి. ఆమెతో ప్రేమింపబడి, తనే ఆమె జీవిత సర్వస్వం అనుకునేలా చేయాలి. బాల్కనీలో నుంచి చల్లని గాలి ఆహ్లాదంగా వీస్తోంది. దూరంగా వినబడే పక్షుల కలకలారావాలు తప్పుతే మరేమీ శబ్దం వినిపించటంలేదు.

ఇలాంటి సమయంలో కన్యకతోపాటు ఆ చెట్లనీడలో పచ్చికలో పడుకుని సరదాగా కబుర్లు చెప్తూంటే ఎంత బాగుంటుంది?

ఫోన్ దగ్గరకు నడిచి బ్లూ బటన్ నొక్కాడు.

"హలో మనోచిత్రా!" అంది మనోచిత్ర గొంతు. గతుక్కుమన్నాడు భవానీశంకర్.

తన గొంతు విన్నదంటే ఇంక ఫోన్ వదలదు. ఠక్కున డిస్కనెక్ట్ చేశాడు.

ఈసారి ఆకుపచ్చ బటన్ నొక్కాడు.

"శమంతకమణి హియర్!" అందామె. మళ్ళీ డిస్కనెక్ట్ చేశాడు భవానీశంకర్.

తెల్లరంగు బటన్ నొక్కాడతను.

"హలో!" అంది కన్యక.

"హలో కన్యకాజీ! నేను భవానీశంకర్ ని"

"మీరా?"

"నేనే మైడియర్ ఫ్రెండ్! ఇంత అందమయిన, ఆహ్లాదకరమైన వాతావరణంలో మీరేం చేస్తున్నారో తెలుసుకుందామని..."

"ఇప్పుడే నిద్రపడుతోంది."

"నేషనల్ క్రైమ్ మైడియర్ గాళ్! ఈ సమయంలో దూరంగా కనబడుతోన్న ఆ అందమయిన చెట్లమధ్య మీరు కూర్చుని, ఎదురుగా వున్న అందమయిన యువకుడితో కబుర్లు చెపుతూ..."

"ఎవరతను?"

"ఇంకెవరున్నారు కన్యకగారూ? ది మోస్టు ఎట్రాక్టివ్ ఫెలో ఆన్ ది ఎర్త్ అని మా బాచ్ వాళ్ళందరూ ఎప్పుడూ అంటూండేవాళ్ళు. మీకలా అనిపించలేదా?"

"లేదు."

"బహుశా మరో నాలుగయిదు రోజుల్లో తప్పక అనిపిస్తుంది మైడియర్!

ఒకోళ్ళకు గ్రహింపుశక్తి కొంచెం తక్కువగా వుంటుంది. ఏం ఫరవాలేదు. కాలీఫాస్ 200 పొటెన్సీ ఆరేళ్ళపాటు వాడండి! చక్కని గుణం కనిపిస్తుంది"

"నాకేమీ అవసరంలేదు."

"ఆల్ రైట్! వదిలేయండి. మరింక వెళదామా మనం?"

"సారీ! మీరు ఉదయం డిక్టేట్ చేసినంతవరకు ఫెయిర్ చేయాలి"

"డోంట్ వర్రీ ఎబౌట్ దట్ వర్క్ డియర్! అదంతా నాకొదిలేయండి! గంటసేపట్లో నేనే ఫెయిర్ చేసి పారేస్తాను"

"సారీ! నాపని నేను చేసుకోవటమే నాకిష్టం"

"ఓ కే. డియర్ ఫ్రెండ్! అలాగయితే మీ గదికే వస్తాను. ఇక్కడే మాట్లాడుకుందాం"

ఆమె కంగారుపడింది.

"వద్దులెండి! సాయంత్రం వెళదాం!"

"థాంక్యూ డియర్! విష్ యూ గుడ్ స్లీప్"

"థాంక్యూ"

ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు భవానీశంకర్. కన్యకతో పరిచయం అలా నిమిష నిమిషాభివృద్ధి చెందటం అతనికెంతో ఆనందం కలిగిస్తోంది .

"హలో మే ఐ కమిన్?" గడపలో నిలబడి అడిగింది మనోచిత్ర.

"వెల్ కం మిస్ వెల్ కం..."

ఆమె లోపలికొచ్చి కూర్చుంది.

"మిమ్మల్ని నేను డిస్టర్బ్ చేయటంలేదుకదూ?"

"నాటెటాల్ మైడియర్ ఫ్రెండ్"

"మీతో కొంచెం మాట్లాడాలని..."

"స్పీకాన్ స్పీకాన్_డోంట్ హెజిటేట్"

"సంగతేమిటంటే నాకూ నవలలు రాయాలని చాలా ఇదిగా ఉంది" సిగ్గుపడుతూ అందామె.

"ఇంక ఆలస్యం చేయకండి మనోచిత్రాజీ! అంత 'ఇదిగా' ఉన్నప్పుడు ఆ 'ఇది'ని అణచివేయగూడదు! ఒక రీము తెల్లకాగితాలు పదహారు పెన్నులు ముందేసుకుని ప్రారంభించటమే డియర్!"

"అవన్నీ ఎప్పుడో కొన్నాను. కానీ ఎలా రాయాలో తెలీటంలేదు. మీరేమయినా గైడెన్స్ ఇస్తే నేనూ ఓ రచయిత్రి నవ్వాలని"

"బెటర్ లేట్ దెన్ నెవర్ డియర్! ఇప్పటికే చాలా ఆలస్యం చేశావ్! అయినా పర్లేదు అసలు నన్నడిగితే ప్రతి యువకుడూ, ప్రతి యువతీ రెండేళ్ళపాటు రచనలు చేయాలని ప్రభుత్వం ఓ నిబంధన పెట్టాలి! అప్పుడుగానీ మన సాహిత్యం మూడు పూలూ ఆరు కాయలుగా అభివృద్ధి చెందదు"

"ఒండర్ ఫుల్ అయిడియా"

"ఇలాంటివి ఇంకా లక్షా తొంభయ్ ఉన్నాయి మన మెదడులో"

"మీరు నిజంగా జీనియస్"

అంతకంటే గత్యంతరం లేకపోయింది డియర్!"

"మరి రచనలు చేయడానికి నాకు కొన్ని 'క్లూస్' ఇస్తే"

"క్లూసా? బహువచనం వాడకూడదు డియర్ 'క్లూ' అనాలి! ఎవరయినాసరే రచనలు చేయాలంటే ఒకే ఒక్క 'క్లూ' ఉంది మనదేశంలో!"

"ఏమిటది?" ఉత్సాహంగా అడిగిందామె.

"ఇంగ్లీష్ నవలలు చదవటం! చదివిన ప్రతి నవలనూ తెలుగులో రాసేయటం"

ఆమె ఉలిక్కిపడింది.

"కాపీ కొట్టాలా?"

"టట్ టట్ అలాంటి 'చీప్' పదాలు వాడకూడదు డియర్? దాన్ని కాపీ అనరు. 'ఇన్ స్పిరేషన్' అంటారు"

"కానీ ఇన్ స్పిరేషన్ వేరు కానీ వేరు"

"మన దేశానికి సంబంధించినంతవరకూ ఆ రెండూ ఒకటే డియర్. రెంటినీ కలిపే ఇన్ స్పిరేషన్ అంటారు. 'కాపీ' అనేపదం అసలు లేదు. ఉన్నా ఎవరూ ఉపయోగించకూడదు"

"అంటే మీరు ఇన్ స్పిరేషన్ తోనే నవలలు రాస్తారా"

"సంపూర్తిగా!"

"కానీ అలా రాస్తే ఆ ఇంగ్లీష్ నవలలు చదివిన వారికి తెలిసిపోతుంది కదా?"

″రచయితలు వాళ్ళ గురించి పట్టించుకోకూడదు మైడియర్ ఫ్రెండ్! రాసుకుంటూ వెళ్ళిపోవటమే″

″ఐసీ″

″ఇంకా దేనికోసం వేచియున్నావ్ డియర్! కమాన్ హరీఅప్! ఇంగ్లీషు నవలలు త్వరగా సంపాదించు! అనువాద కార్యక్రమం ప్రారంభించు జయంనీదే″

ఆమె ఆనందంగా లేచి నిలబడింది ″థాంక్యూ వెరీమచ్! కొంచెం రాసి మీకు చూపిస్తాను. ఏమయినా మార్పులు చేయాల్సి ఉంటే చెప్తారు కదూ!″

″ఓ!__″

ఆమె వెళ్ళబోయి మళ్ళీ వెనక్కు తిరిగింది.

″మీరు చెప్పిందంతా నిజమేకదూ? జోక్ చేస్తున్నారేమోనని అనుమానంగా ఉంది″

″నవలలు రాయబోయేవారితో జోక్ చేయటమా? అపరాధం డియర్, కళ్ళుపోతాయ్″

ఆమె ఉత్సాహంగా వెళ్ళిపోయింది.

భవానీశంకర్ మళ్ళీ ఫోన్ తీసుకుని తెల్ల బటన్ నొక్కాడు.

వెన్నెల వేట పేజి 29

″కన్యకా హియర్″

″ఇంకోసారి చెప్పండి డియర్! ఎన్నిసార్లు విన్నా తనివితీరడం లేదు మీ పేరు″

"దయచేసి నన్ను డిస్టర్బ్ చేయకండి! నేను స్క్రిప్ట్ ఫెయిర్ చేస్తున్నాను"

"ఆ స్క్రిప్టులో చిన్న ఆల్టరేషన్ చేయాలి ఫ్రెండ్! నన్ను మీ రూమ్ కి రమ్మంటారా? మీరే నాగదికొస్తారా?"

కన్యకకేం మాట్లాడాలో తెలీలేదు.

"సరే! మీరేరండి!" అంది కొద్దిక్షణాలాగి.

భవానీశంకర్ ఆనందంగా ఆమెగది చేరుకున్నాడు. టేబుల్ ముందు కూర్చుని స్క్రిప్టు రాస్తోందామె.

"చెప్పండి! ఏమిటి ఆల్టరేషన్"

"నిజం చెప్పాలంటే అంత పెద్ద మార్పేమీకాదు! చాలా చిన్నది. అంచేత ఆ విషయం తర్వాత మాట్లాడదాం! బైదిబై మీగురించి వివరాలు చెప్పండి డియర్! మీరే కాలేజీలో చదివారు! మీ అంతరంగిక సభ్యులెవరు?"

"అయామ్ సారీ! ముందు ఆఫీస్ వర్క్. లీజర్ దొరికినప్పుడే అవి__"

"ఐసీ ఇప్పుడు మీగురించి మాట్లాడడం మీకిష్టంలేదు"

"అవును!"

"పోనీ నాగురించి వినటంలో అభ్యంతరం ఏమయినా ఉంటుందా"

"ముందు అఫీషియల్ వర్క్"

"మీరు చాలా "డ్యూటీ కాంషస్" అనుకుంటాను"

"మీరెలాగయినా అనుకోండి"

"ఆల్ రైట్! మీరింత నిక్కచ్చిగా ఉంటే అలాగే కానీండి! ఎక్కడయినా ఒక్క పేజీలో 'అతడి' అని నేను చెప్పివుంటే దానిని మార్చి "అతని" అని రాయండి. దాంతో అఫీషియల్ వర్క్ అయిపోతుంది. ఆ తరువాత మనం లీజర్ గా అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు"

ఆమె నవ్వేసింది.

"నా గురించి చెప్పేందుకేమీలేదు. అమ్మా, నాన్నా, నేనూ అంతే! డిగ్రీ చదివాను. ఉద్యోగం కోసం వెతుకుతూ ఈ పార్ట్ టైం జాబ్ కొచ్చాను."

"మీ అంత అందమయిన అమ్మాయి ఉద్యోగం కోసం తిరగటం నాకిష్టంలేదు. మీరు అందమయిన డ్రస్ తో టయోటా కారులో తిరుగుతూ విమానాల్లో టూర్లు చేస్తూ అందమయిన భవనంలో ఎ.సి. రూమ్స్ లో వుంటూ ఉద్యానవనాల్లో విహరిస్తూ లిరిల్ సబ్బు ఎడ్వర్టయిజ్ మెంట్ సినిమాలోని అమ్మాయిలా జలపాతాల దగ్గర స్నానాలు చేస్తూ."

"ఇంక చాల్లెండి! పగటికలలు మంచివికావు"

"వ్వాట్? ఇవి పగటికలలా? నో నెవర్ డియర్! వాటిని నిజం చేసే బాధ్యతనాది!"

"అంటే?"

"అంటే అదే ఫ్రెండ్! మీకలాంటి జీవితం లభించేందుకు నేను సహాయం చేస్తాను"

"ఎలా?"

"ఎలాగేముంది? మిమ్మల్ని నా సెక్రటరీగా వేసుకుంటాను. ఒక్కొక్క "స్క్రిప్టు" లక్షరూపాయల చొప్పున అరవై "సినిమా స్క్రిప్టులు"రాసినందుకు వచ్చిన అరవై లక్షలు ఫిఫ్టీ ఫిఫ్టీ మీకు ముప్పయ్ లక్షలు. మనిద్దరి పేరునా జాయింట్ గా మిగతా ముప్పయ్ లక్షలు"

"మీరు అరవై సినిమాలకు రాశారా?"

"ఇంకాలేదు డియర్! మీరు నా సెక్రటరీగా వుండటానికి ఒప్పుకుంటే వారంరోజుల్లో రాసి అమ్మేస్తాను. నాకేం సందేహం లేదందులో"

కన్యకకు నవ్వాగలేదు.

"యూ ఆర్ మాడ్"

"అఫ్ కోర్స్ అందుకు కేవలం మీ అందమే కారణం!"

"నన్నింక వర్కు చేసుకోనిస్తే?"

"వర్కా? ఏం వర్క్?"

"స్క్రిప్టు ఫెయిర్ చేయటం!"

"ఓ! అదా! దాన్ని గురించి మర్చిపోండి! నేనే చేసేస్తాను మీ అందమయిన చేతులు కందిపోవటం నాకిష్టంలేదు"

"దయచేసి మీరిక వెళితే?"

"వెళ్ళటమా? ఎక్కడికి?"

"మీ గదికి"

"ఐసీ! డ్యూటీ ఫస్ట్ అనే పాలసీ అన్నమాట మీది!"

"అవును!"

"అయితే నేనిక వెళ్ళక తప్పదంటారు!"

"ఎగ్జాక్ట్ లీ"

"తిరిగి ఇంకోగంటలో ఉద్యానవనంలో కలుసుకుని పచ్చికమీద కూర్చుని కబుర్లు చెప్పుకునేందుకు మనం ఇంతకుముందు చేసుకున్న అగ్రిమెంట్ మర్చిపోలేదు కదూ?"

"మర్చిపోలేదు"

"ఇంకో గంటలో తప్పక వస్తారు!"

"అవును!"

"పోనీ అరగంటలోనే కలుసుకుంటే?"

"అయామ్ సారీ"

"పోనీ నలభై నిమిషాలు"

కన్యక చిరుకోపంతో చూసిందతని వంక.

"ఆల్ రైట్ గంటయ్యాకే కలుసుకుందాం? అంతవరకు ఎలాగోలా గడుపుతాను" బయటకు నడిచాడతను.

* * * *

"ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీస్" అనే బోర్డు గత రెండేళ్ళుగా అబిడ్స్ రోడ్ లోని ఓ పాతభవనం తాలూకు ఓ గదిముందు వేలాడుతోంది. ఆ సంస్థకు ఏకైక యజమాని అయిన కిరాతకరావ్ పేరుకి తగ్గట్లుగానే కనిపిస్తాడు. అతను అంతకుముందు ఏంచేసేవాడో ఎవరికీ తెలీదు. అసలావిషయం అతనిని అడగాల్సిన అవసరం ఎవరికీ ఉండేది కాదు. ఓసారి అతనిని చూస్తేచాలు అతని గతం స్పష్టంగా కళ్ళముందు కనిపిస్తుంది.

చూపు సరిగ్గా ఆనని వారెవరయినా అతని గతం గురించి ప్రశ్నిస్తే మాత్రం అతనెప్పుడూ ఒకే సమాధానం చెప్తుండేవాడు.

"మిలటరీ సర్వీస్"

మిలటరీ అన్నాక ఇంక వివరాలు ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండదు. ఎందుకంటే తెలుసుకున్న నిజానిజాలు రుజువు చేసుకునే అవకాశాలు చాలా తక్కువ కాబట్టి. పైబోర్డు పెట్టిన ఈ రెండేళ్ళలోనూ అతని డిటెక్షన్ కోసం వచ్చిన వాళ్ళ సంఖ్య బహు తక్కువ. అందుక్కారణం భారతదేశంలో ఎవరేం ఘాతుకాలు చేసినా పబ్లిగ్గానే చేసేయడం కావచ్చు.

ఏదేమయినా తన కస్టమర్ల సంఖ్యను చూసి అతనేమాత్రం నిరుత్సాహ పడలేదు. ఉదయం పదిగంటలనుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ తనాఫీస్ లో నిర్లిప్తంగా కూర్చునే ఉంటాడు.

ఆరోజు అతను ఆఫీస్ తెరచి పావుగంటయినా కాకముందే ఓ కారు వచ్చి ఆగింది. కారులోనుంచి ఖాదీ దుస్తుల్లో ఉన్న ఓ ఆకారం దిగి "ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీ" అన్న బోర్డు చూసిందోసారి. తరువాత నెమ్మదిగా మెట్లెక్కసాగింది.

అదిచూసి కిరాతకరావు బిజీ అయిపోయాడు. టేబుల్ మీద వైర్ కనెక్షన్స్ లేని టెలిఫోన్ ఎత్తి గట్టిగా మాట్లాడసాగాడు.

"హలో_యస్! ఇది ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీస్! యస్! నేనే ప్రొప్రయిటర్ని మాట్లాడుతున్నాను! ఎవరు? డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసా? గుడ్ మాణింగ్! చెప్పండి కోఠీ మర్డర్ కేసులో మీకు నా సహాయం కావాలా? ఓ డెఫినెట్ లీ సర్! మా అసిస్టెంట్స్ ని ఇప్పుడే పంపించి పరిశోధన చేయిస్తాను! నో_నో! థాంక్సెందుకు? మన మధ్య ఉన్న స్నేహాన్ని బట్టి చేస్తున్నానంతే! ఓ.కే. ఉంటాను" ఫోన్ పెట్టేశాడతను.

ఖద్దరు దుస్తుల్లో ఉన్న ఆకారం చిరునవ్వు నవ్వి "గుడ్ మాణింగ్" అంది. కిరాతకరావు నవ్వలేదు.



"కూర్చోండి! ఏమిటిపని?" అనడిగాడు వెనకవేపు అల్మారాలో ఉన్న ఓ ఫైలు తీసి చూస్తూ.

"నా పేరు భండారి! మాజీ ఎమ్మెల్యేని!"

"త్వరగా చెప్పండి! అట్టే టైమ్ లేదు" అన్నాడు కిరాతకరావు ముళ్ళులేని వాచి చూసుకుంటూ.

భండారి వెంటనే సబ్జెక్టులోకొచ్చేశాడు.

"మీరు నాకో సహాయం చేయాలి"

"సహాయాలు చేసే సంస్థ కాదిది! బిజినెస్ ఉంటే మాకు చెప్పండి! ఇంత అని

రేటు మాట్లాడుకున్నాక ఆ పని మా సంస్థే చేస్తుంది క్విక్!"

"పోనీ బిజినెస్సే అనుకోండి! నాక్కావలసిందేమిటంటే అప్పల్రాజు అనే మాజీమంత్రి గురించి వివరాలు కావాలి. అతను ఈ మధ్య "ఆత్మకథ" అంటూ ఓ పుస్తకం రాస్తున్నట్లు తెలిసింది. అందులో అతనికి పరిచయం ఉన్న రాజకీయ నాయకులందరి గురించి ఉన్నదున్నట్లు రాస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఆ మాట నిజమే అయినట్లయితే ఆ ఆత్మకథలో నా పేరు వస్తుందా? వస్తే నా గురించి ఏమేం రాస్తున్నాడు? ఈ వివరాలు కావాలి?"

కిరాతకరావ్ ఓ క్షణం ఆలోచించాడు.

"అందరు రాజకీయ నాయకుల గురించీ ఉన్నదున్నట్లు రాస్తున్నాడన్నారు కదా! ఇంక భయమేముంది?" అడిగాడతను.

భండారి ఆశ్చర్యపోయాడు. "అదేమిటి? ఉన్నదున్నట్లు_ ఎవరి గురించి రాసినా వాళ్ళకది ప్రమాదమే కదా! రాజకీయాల్లో ఒక్కమాట కూడా 'నిజం' అనేది రాకూడదు. వచ్చిందో, రాజకీయజీవితం గోవిందా" అన్నాడు వివరిస్తూ.

కిరాతకరావ్ కి అర్థమయింది.

"ఐసీ" అన్నాడు తలపంకిస్తూ.

"ఒకవేళ మీ గురించి ఉన్నదున్నట్లు రాస్తున్నట్లు తెలిస్తే ఏం చేస్తారు?"

భండారి వెంటనే చెప్పాడు. "స్క్రిప్ట్ కి సంబంధించినవన్నీ ఫోటోలతో సహా దొంగిలించుకు రావాలి."

కిరాతకరావ్ ఉలిక్కిపడ్డట్లు నటించాడు.

"దొంగిలించుకు రావాలా?"

"అవును?"

"దొంగతనం మా వృత్తికాదు. ఓన్లీ డిటెక్షన్."

"పదివేలు కాష్ ఇస్తాను."

"ఇరవై వేలిచ్చినా చేయను."

"పోనీ పాతికవేలు"

"నో ప్లీజ్."

"భండారి నిరుత్సాహంగా లేచాడు.

"అయితే మీకు కుదరదంటారు."

"ఏమాత్రం కుదరదు! నేను ఎక్స్ సర్వీస్ మెన్ ని! దొంగతనాల్లాంటివి మా ప్రొఫెషన్ కి ఏమాత్రం సరిపడదు."

భండారి వెళ్ళిపోయాడు.

కిరాతకరావ్ మొఖంలో ఆనందం కనిపించింది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న అవకాశం ఇన్నేళ్ళకు లభించింది. అప్పల్రాజు అనే మాజీమంత్రి రాస్తున్న ఆ స్క్రిప్ట్, ఫోటోలు అన్నీ తను కాజేస్తే_భండారి లాంటి రాజకీయ నాయకులు బోలెడుమందిని బ్లాక్ మెయిల్ చేయవచ్చు. ఒక్కొక్కరికీ కనీసం లక్షరూపాయల చొప్పున_పదిమంది దగ్గర పిండినా గాని పదిలక్షలు హార్డు కాష్. ప్లస్. దానిని అప్పుడప్పుడు తిరిగి వాడుకునే అవకాశం.

వెంటనే తన ప్లాన్ ని అమలులో పెట్టేందుకు బయల్దేరాడతను.

మొట్టమొదటిసారిగా_ "ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీస్" తన రెండేళ్ళ చరిత్రలో తెరిచిన గంటసేపట్లో మూసి వేయబడింది.

* * * *

మర్నాడు భోజనాల సీను యధాప్రకారం హడావుడిగా జరుగుతోంది. అప్పల్రాజు అసెంబ్లీలో లేచిన ఓ వివాదం గురించి ఉత్సాహంగా వర్ణిస్తున్నాడు.

"...అవినీతి ఆరోపణలున్న ఎమ్మెల్యేలిద్దరికి నేను వార్నింగ్ ఇచ్చాను. వెంటనే వాళ్ళు చేసిన అవినీతిని ఒప్పుకుని రాజీనామా చేయాలని! కానీ వాళ్ళను ముఖ్యమంత్రి కూడా సపోర్టు చేసేసరికి నాకు వళ్ళుమండిపోయింది. వెంటనే అవినీతిని చట్టసమ్మతం చేస్తూ ఓ ఆర్డినెన్స్ పాస్ చేస్తేనేగానీ నేనూరుకోనని గొడవచేసి_ అసెంబ్లీ బయట నిరాహారదీక్ష ప్రారంభించాను."

అందరూ ఘొల్లున నవ్వారు.

శమంతకమణికి భర్త రాజకీయ విన్యాసాల మీద ఏమాత్రం ఆసక్తిలేదు.

"మీకెవరికయినా సినీ డైరెక్టర్ కరుణాకర్ తెలుసా?" అడిగిందామె.

"అబ్బ! గొప్ప డైరక్టర్ ఆంటీ! బ్రహ్మాండమయిన పిక్చర్స్ తీశాడు" అంది మనోచిత్ర.

"ఒండర్ ఫుల్ ఫెలో! బెజవాడలో నాటకాలు డైరక్ట్ చేస్తూండేవాడు! నాకు బాగా తెలుసు" అన్నాడు భవానీశంకర్.

"బాగా తెలుసా?"

ఆశ్చర్యంగా అడిగింది శమంతకమణి.

"అవును" తన పొరబాటు గ్రహిస్తూ అన్నాడు భవానీశంకర్.

"ఇవాళ పొద్దున్న మద్రాస్ నుంచి ఫోన్ చేశాడు నాకు."

అందరూ ఆశ్చర్యపోయారు.

"నీకా?" అడిగింది మనోచిత్ర.

"అవును"

"ఎందుకూ?"

"మన ఆంధ్రప్రదేశ్ హౌస్ లో వాళ్ళ సినిమా ఏదో షూటింగ్ చేసుకోవాలనుకుంటున్నారట. అనుమతి ఇస్తే రేపే బిల్డింగ్ చూచుకోడానికి వస్తానన్నారు. నేను ఓ షరతు పెట్టాను."

భవానీశంకర్ గతుక్కుమన్నాడు.

"ఏమిటది?" అడిగింది శ్యామలారాణి.

"వచ్చేవారం జరుగుతోన్న మన 'టైగర్స్ క్లబ్' మీటింగ్ కి ముఖ్య అతిథిగా ఉండటానికి ఒప్పుకునేట్లయితే షూటింగ్ చేసుకోవచ్చని చెప్పాను. వెంటనే ఒప్పుకున్నాడు."

భవానీశంకర్ కేం చేయాలో తోచలేదు. తనకు కరుణాకర్ తో పరిచయం ఉందిగానీ_తనిక్కడ దీప్ చంద్ పేరుతో ఉన్నాడు కదా!

"అంటే...రేపు అతనొస్తున్నాడా?" అడిగాడతను గాబరా అణచుకుంటూ.

"అవును ఎలాగూ బాగా తెలుసు అంటున్నారు కదా! నాతోపాటు రిసీవ్ చేసుకోటానికి మీరూ స్టేషన్ కొస్తే బాగుంటుంది."

భవానీశంకర్ ఇరుకున పడిపోయాడు.

"రేపు ఆత్మకథలో చాలా ముఖ్యమయిన భాగం తయారుచేస్తున్నాం! అంచేత నేను రావటం కుదరదు మేడమ్. తరువాత కలుసుకుంటాను వాడిని."

"అవును. రేపు మార్నింగ్ చాలా ముఖ్యమయిన ఎపిసోడ్ రాసేస్తున్నాం" అన్నాడు అప్పల్రాజు.

అక్కడితో ఆ టాపిక్ ముగిసిపోయింది.

భవానీశంకర్ తన గది చేరుకొని తీవ్రమయిన ఆలోచనలో పడ్డాడు. ఆ కరుణాకర్ ని_ ఏకాంతంగా కలుసుకుని తనిక్కడ దీప్ చంద్ గా నటిస్తున్నట్లూ. కనుక తనను భవానీశంకర్ పేరుతో పిలువకూడదనీ_ హెచ్చరించాడు. అప్పుడుగానీ తన పొజిషన్ క్షేమముగా ఉండదు.

ఆ ఆలోచన వచ్చాక భవానీశంకర్ మనసు తేలికయిపోయింది. హుషారుగా విజిల్ వేయబోతూంటే గది తలుపులు దభేల్ మని తోసుకుని లోపలకు పరుగుతో వచ్చాడు వర్ధనరావు.

"గురూ! కొంప మునిగింది."

"ఎవరిది బ్రదర్?"

"మనదే గురూ! అట్టే మాట్లాడితే నీది"

భవానీశంకర్ ఛటుక్కున లేచి నిలబడ్డాడు.

″ఏమిటి? ఏం జరిగింది″

″ఆ మారుతీరావుగాడికి నీమీద అనుమానం కలిగింది.″

″అనుమానమా?″

″అవును. నువ్వు రచయిత దీప్ చంద్ వి కాదని వాడి అనుమానం.″

″ఎందుకొచ్చింది వాడికా అనుమానం?

వెన్నెల వేట పేజి 31

″ఆ ఒరిజినల్ దీప్ చంద్ గాడు__ అనివార్య కారణాలవల్ల తనీ ఆత్మకథ రాసే అగ్రిమెంట్ రద్దుచేసుకుంటున్నాడని లెటర్ రాశాడు.″

భవానీశంకర్ కి పోయిన ధైర్యం తిరిగి వచ్చేసింది.

″ఇంతేనా? అందులో అనుమానించాల్సిన అంశం ఏదీలేదు బ్రదర్! అంతగా వాడడిగితే నేను కొన్ని కారణాల వల్ల అలా లెటర్ రాసి పోస్ట్ చేశానని__ కానీ తరువాత మనసు మార్చుకుని వచ్చాననీ విజయవంతంగా బొంకవచ్చు.″

వర్ధనరావు ఓ క్షణం ఆలోచించాడు.

″అయిడియా బాగానే ఉంది గురూజీ కానీ ఎందుకయినా మంచిది. మనం మారుతీరావుగాడిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలి. చాలాసార్లు ఇలాగే నా ప్లానులు బోలెడు భగ్నం చేసేశాడు దొంగ రాస్కెల్. ఓసారి ఉంగరం కాజేసినప్పుడు″

″డోంట్ వర్రీ మైడియర్ యంగ్ మాన్! వాడి ఆటలు మనదగ్గర సాగవు. వాడేమయినా అతిగా ప్రవర్తిస్తే వాడికి చక్కని గుణపాఠం ఉచితంగా లభించును.

″సరే వస్తాను″ బయటకు నడిచాడు వర్ధనరావు.

సరిగ్గా అదే సమయంలో శమంతకమణి గదిలో మారుతీరావు అతి రహస్యంగా దీప్ చంద్ సమాచారం వెల్లడిచేశాడు.

″మనింటికి వచ్చినాయన నిజంగా దీప్ చంద్ గారు కాదేమోనని నాకు అనుమానంగా వుందండీ.″

శమంతకమణి ఆశ్చర్యపోయింది.

″ఎందుకొచ్చింది నీకా అనుమానం?″

″దీప్ చంద్ గారు అగ్రిమెంట్ రద్దు చేసుకుంటున్నట్లు రాసిన ఉత్తరం ఒకటి నిన్న వచ్చిందండి మనకి.″

″దాన్దేముంది? రచయితలన్నాక బోలెడు వ్యాపకాలుంటాయ్. కనుక ఎగ్రిమెంట్లు రాయటాలు, రద్దవటాలు చాలా మామూలు విషయాలు మారుతీరావు! ఈ పిచ్చి అనుమానాలతో నీ బుర్ర పాడుచేసుకోకు.″

″ఎందుకయినా మంచిదండీ, ఓసారి మనం అనుమానం నివృత్తి చేసుకుంటే...″

″సరే! అందులో పెద్ద కష్టమేముందీ? రేపే సినీ డైరెక్టర్ కరుణాకర్ వస్తున్నారు కదా! అతనూ, దీప్ చందూ ఫ్రెండ్సేనని చెప్పాడుగా! ఆయనొచ్చాకయినా ఆ విషయం రుజువయిపోతుంది కదా!″

″అవుతుందండీ.″

″నువ్వింక వెళ్ళొచ్చు. అన్నట్లు రేపు స్టేషన్ కి వెళ్ళి ఆ సినిమా డైరెక్టరుగారిని

రిసీవ్ చేసుకుంటున్నావు కదూ!"

"చేసుకుంటానండీ."

అతను వెళ్ళిపోయాడు.

శమంతకమణి మారుతీరావుని చూసి జాలిపడింది.

"పాపం! ఆ డిటెక్టివ్ పుస్తకాలు మరీ ఎక్కువ చదివి చదివి అలా అయిపోతున్నాడు" అనుకుందామె.

* * * *

మర్నాడుదయం సింగారం ఊళ్ళో మద్రాస్ రైలుదిగిన సినీ డైరెక్టర్ కరుణాకర్ దగ్గరకొచ్చి వినయంగా నమస్కరించాడు మారుతీరావు.

"కరుణాకర్ గారు తమరేకదండీ!"

"అవునోయ్! శమంతకమణి కారు పంపించారా?"

"పంపించారండీ"

"వెరీగుడ్! నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నాను. పద."

నౌఖరు పరుగుతో వచ్చి అతని చేతిలోని సూట్ కేస్ అందుకున్నాడు. ముగ్గురూ స్టేషన్ బయటకెళ్ళి కారు ఎక్కారు.

అయిదునిమిషాల్లో 'ఆంధ్రప్రదేశ్ హౌస్'కి చేరుకుంది కారు.

శమంతకమణి పోర్టికోలో నిలబడి వుంది.

"రండి. నేనే శమంతకమణిని" అందామె సాదరంగా.

"మీ ఫోటో ఇంతకుముందు చాలాసార్లు పేపర్లో చూశానండీ" వినయంగా చెప్పాడు కరుణాకర్.

"ముందు మీరు స్నానం అదీ కానీండి. తరువాత మాట్లాడదాం" అందామె.

"ఓ! అలాగే!"

"అన్నట్లు మీకో సర్ ప్రైజ్ కూడా ఉందిక్కడ."

కరుణాకర్ ఆశ్చర్యంగా ఆమెవేపు చూశాడు.

"ఏమిటది?"

"మీ ఫ్రెండ్ ఒకతనిని మీరిక్కడ కలుసుకోబోతున్నారు."

కరుణాకర్ మొఖంలో రంగులు హడావుడిగా మారినయ్.

"నా ఫ్రెండా?"

"అవును."

"ఎవరతను?"

"ప్రఖ్యాత రచయిత దీప్ చంద్"

"ఐసీ! వస్తా" అంటూ మారుతీరావు వెనుక తనకు కేటాయించిన గడివేపు నడిచాడతను.

దూరంగా పూలమొక్కల చాటునుంచీ ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న భవానీశంకర్

తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు. శమంతకమణి, మారుతీరావు తప్పుకోగానే తను తిన్నగా ఆ కరుణాకర్ గదిలోకెళ్ళి విషయమంతా చెప్పేయాలి.

మరో అయిదునిమిషాల తర్వాత నెమ్మదిగా నడుస్తూ భవనం చేరుకున్నాడతను. హాల్లో ఎవ్వరూ కనిపించకపోయేసరికి ధైర్యంగా మేడమీద కెళ్ళాడు.

అప్పుడే నౌఖరు 'కరుణాకర్ గది'లోనుంచి బయటికొచ్చాడు.

"అదేనా అయ్యగారున్న గది?" అడిగాడతను.

"అవున్సార్!"

"లోపల ఇంకెవరయినా వున్నారా?"

అ"అవున్సార్!"

"ఎవరది?"

"మారుతీరావు గారండీ"

"దుర్మార్గుడు."

"ఏమన్నారు సార్."

"దుర్మార్గుడన్నాను. మారుతీరావుని కాదులే, ఆ సినిమా డైరెక్టర్ని."

"అలాగా సార్?"

"అవును. మేమిద్దరం మంచి స్నేహితులం."

"నిజంగానా సార్? అయితే ఆయనతో చెప్పి ఈసారి సినిమాలో నాకో చిన్న నౌఖరు వేషం..."

"తప్పకుండా వేద్దువుగాని మైడియర్ ఫెలో! నేనెంత చెప్తే అంతే మా కరుణాకర్. నువ్వు నిశ్చింతగా వుండు."

నౌఖరు వెళ్ళిపోయాడు.

భవానీశంకర్ అక్కడే కొద్దిసేపు తచ్చాట్లాడాడు. కొద్దిసేపటి తర్వాత మారుతీరావు బయటికొచ్చాడు. భవానీశంకర్ ని చూస్తూనే ఠక్కున ఆగిపోయాడతను. అతనిలో మళ్ళీ అనుమానం పాకింది.

"ఏం కావాలి సార్?" వినయంగా అడిగాడు.

"ఏమీ అక్కర్లేదు మైడియర్ మారుతీ! పొద్దున్నే ఇలా పచార్లు చేయటం మన ఆరోగ్యానికి మంచిది. మా ఇంట్లో నౌఖరొకడు అచ్చం నీలాగానే లావుగా ఉండేవాడు. ఛస్తే పచార్లు చేసేవాడు కాదు. చివరికేమయింది? హార్ట్ ఎటాక్ వచ్చి ఎగిరిపోయాడు. నిన్ను చూసినప్పుడల్లా నాకదే జాలిగా వుంటుంది."

మారుతీరావుకి భవానీశంకర్ చెప్పిన సంఘటన అంతగా నచ్చలేదు.

"అలాగా సార్!" అన్నాడు.

భవానీశంకర్ తన గదిలో కెళ్ళిపోయాడు అయిదునిమిషాల తర్వాత నెమ్మదిగా తలుపు తీసుకుని బయటికొచ్చి చూశాడు. మారుతీరావు జాడ ఎక్కడా కనిపించలేదు. కరుణాకర్ గది దగ్గరకు నడిచి తలుపు తట్టబోతుండగా అతని కళ్ళు దూరంగా హాల్లో కర్టెన్ కిందనుంచీ కనబడుతోన్న ఓ జత కాళ్ళమీద

పడినయ్. వాటి ఓనరు మారుతీరావు అని స్పష్టంగా తెలిసిపోతూనే వుంది. భవానీశంకర్ కి చటుక్కున ముందుకి నడిచి హాల్లో వున్న పెద్ద కుర్చీ ఎత్తి మెట్లమీదనుంచీ కిందకు విసిరేసి వడివడిగా తన గదిలోకెళ్ళి తలుపు వేసుకున్నాడు.

కుర్చీ పెద్ద శబ్దంతో మెట్ల మీద నుంచీ కిందకు దొల్లటం విన్న మారుతీరావు ఏం జరిగిందో తెలీక కర్టెన్ వెనుకనుంచీ బయటకొచ్చి మెట్లపైన నిలబడ్డాడు. ఆ కుర్చీ చేసిన శబ్దానికి తన లైబ్రరీ గదిలోనుంచి అప్పల్రాజూ, మనోచిత్రా హాల్లోకి వచ్చి నిలబడి, ఆ కుర్చీ ఎవరు పడేశారా అని పైకి చూశారు.

వెన్నెల వేట పేజి 32

మెట్లమీద మారుతీరావు కనిపించేసరికి అప్పల్రాజుకి సంగతి అర్థమయిపోయింది.

"ఎందుకు పడేశావు ఆ కుర్చీ?" కోపంగా అడిగాడతను.

"నేను కాదు సార్!"

"షటప్! అసలా కుర్చీతో నీకేం పని!"

"నేను కాదు సార్!"

"పడేసింది కాకుండా ఇంకా అబద్ధాలు."

"నేను కాద్సార్!"

"మరెవరు?"

"తెలీదు సార్!"

"నువ్వక్కడే వున్నావుగానీ కుర్చీ ఎవరు విసిరేశారో నీకు తెలీదు. అంతేనా?"

"అంతేసార్."

"ఇంకోసారిలాంటి పిచ్చివేషాలేశావంటే నిన్ను పోలీస్ కి హాండ్ ఓవర్ చేస్తాను."

మారుతీరావ్ కేం మాట్లాడాలో తోచలేదు.

ఆ కుర్చీ ఎవరు వేశారో తనకింకా మిస్టరీగానే ఉంది. దీప్ చంద్ అతని గదిలోనుంచి బయటికొచ్చి_ కరుణాకర్ గదిలోకెళ్ళి మాట్లాడితే బయటనుంచి ఆ మాటలు వినాలని తన ప్లాన్! అందుకే కర్టెన్ వెనుక దాక్కున్నాడు.

"ఇంకా నిలబడి అలా గుడ్లగూబలా చూస్తావేమిటి? ఆ కుర్చీ ముందు తీసుకెళ్ళి రిపేర్ చేయించు."

"అలాగే సార్!"

"రిపేర్ ఛార్జీలు ఈ నెల జీతంలో కట్ చేసెయ్."

"అలాగే సార్!"

"నేను మర్చిపోతాననుకుంటావేమో! ఇప్పుడే డైరీలో రాసుకుంటాను."

"అలాగే సార్."

కుర్చీ తీసుకుని వెళ్ళిపోయాడతను.

"వీడికి కొంచెం పిచ్చి ఉన్నట్లుంది అంకుల్__" అంది మనోచిత్ర అనుమానంగా.

"కొంచెమేం ఖర్మ! చాలా వుంది."

"ఇలాంటి వాడిని పి.ఏ.గా పెట్టుకుని నువ్వెలా వేగుతున్నావో నాకర్థం కావటంలేదు."

"నాకూ అంతే" అన్నాడు అప్పల్రాజు అయోమయంగా.

* * * *

నౌకరు వినయంగా భవానీశంకర్ గదిలోకొచ్చాడు.

"భోజనానికి టైమయింది సార్!"

"భోజనానికి ఆ కరుణాకర్ ని కూడా పిలుస్తున్నావా?"

"బయల్దేరుతున్నారండీ వారు కూడా."

"ఆ మారుతీరావ్ గాడు ఇంకా కర్టెన్ వెనుకే ఉన్నాడా?"

"ఏ కర్టెన్ వెనుకండీ?"

"ఏమీ లేదులే! నువ్వెళ్ళు."

అతను వెళ్ళిపోయాడు.

భవానీశంకర్ వెంటనే బయటికొచ్చి కర్టెన్ వేపు చూశాడు. మారుతీరావ్ కాళ్ళు కనిపించలేదు. వెంటనే కరుణాకర్ గది తలుపు తెరుచుకుని లోపలకు జొరబడ్డాడు. గది ఖాళీగా కనిపించింది. అంటే ముందే డైనింగ్ హాల్ కెళ్ళిపోయాడన్న మాట. ఏం చేయాలో తేలీలేదతనికి. ఆలోచిస్తూ తనూ డైనింగ్ హాల్ వేపు నడవసాగాడు.

"కమాన్_కమాన్ రైటర్! కమాన్!" అన్నాడు అప్పల్రాజు భవానీశంకర్ ని చూడగానే ఆనందంగా. అతనికి భవానీశంకర్ చాలా బాగా నచ్చాడు.

భవానీశంకర్ అతని మాటలు పట్టించుకోవటం లేదు. టేబుల్ దగ్గర శమంతకమణి పక్కనే కూర్చున్న కొత్త వ్యక్తిని ఆశ్చర్యంగా చూడసాగాడు.

"అరుగో_ మీ ఫ్రెండ్ దీప్ చంద్ గారొస్తున్నారు" అంది శమంతకమణి ఆ వ్యక్తితో. అతను భవానీశంకర్ వేపు భయంగా చూశాడు. భవానీశంకర్ కి గత్యంతరం లేకపోయింది.

"హలో మైడియర్ కరుణాకర్_" అన్నాడు ఆప్యాయంగా దగ్గరకు నడుస్తూ.

"హలో మైడియర్ దీప్ చంద్" అన్నాడు ఆ వ్యక్తి దీప్ చంద్ ని కౌగిలించుకుంటూ.

"ఎంతకాలానికి కలుసుకున్నాం" అన్నాడు భవానీశంకర్ చిరునవ్వుతో.

"చాలా కాలానికి కలుసుకున్నాం."

"నిజంగా ఆ నాటకాలేసే రోజులు ఒండర్ ఫుల్ గా ఉండేవి."

"అద్భుతం"

"ఎన్నోసార్లు నిన్ను కలుసుకోవాలనుకున్నానుగానీ ఇప్పటికి గానీ కుదరలేదు."

"నేనూ అంతే"

"నీ పిక్చర్స్ చూస్తూనే ఉన్నాను. సూపర్బ్."

"ఏదో అందరూ బాగున్నాయంటున్నారుగానీ_ నాకు మాత్రం అంత సంతృప్తి కలిగించటం లేదు."

"అహ్హహ్హహ్హా_"

"అహ్హహ్హహ్హా_"

వాళ్ళిద్దరివంకే పరిశీలనగా చూస్తున్న మారుతీరావ్ అనుమానం చాలావరకూ తొలగిపోయింది. శమంతకమణి మారుతీరావ్ వేపు చిరునవ్వుతో చూసింది. తనే కరెక్ట్ అన్నట్లు.

"కూర్చోండి భోజనం చేస్తూ మాట్లాడుకుందాం!" అంది శమంతకమణి. ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు.

భవానీశంకర్ మెదడు వేగంగా పనిచేయటం ప్రారంభించింది.

వీడెవడు? ఎవడయినా కావచ్చుకానీ కరుణాకర్ మాత్రం కాదు. కరుణాకర్ తనకు మంచి ఫ్రెండ్! వాడిని వెయ్యిమందిలో ఉన్నా ఇట్టే గుర్తు పట్టేయవచ్చు. వీడెవడో కరుణాకర్ పేరుతో వచ్చి నాటక మాడుతున్నాడు. అందుకే తనే దీప్ చంద్ అనేసరికి నమ్మేసి నిజంగా క్లాస్ మేట్ లా నటిస్తున్నాడు. తను వాడి మోసం బయటపెట్టవచ్చుగానీ_చాలా జాగ్రత్తగా ఆలోచించి చేయాల్సిన పని అది! ఎందుకంటే తనూ దీప్ చంద్ వేషంలో ఇక్కడ ఉంటున్నాడు. ఒకవేళ వాడికీ విషయం తెలిసి ఉన్నట్లయితే_ గొడవయిపోతుంది.

"కరుణాకర్ గారూ? మీ నెక్ట్స్ పిక్చర్ లో నాకో చిన్న వేషం ఇస్తారా? జయసుధ పక్కన ఓ నిమిషం_ వాళ్ళ ఫ్రెండ్ గా నటిస్తాను" అడిగింది మనోచిత్ర.

"ఓ! తప్పకుండా ఇస్తాను. అందులో పెద్ద ఇదేముందీ?..."

"నేనూ చిరంజీవితో ఏదయినా ఓ డైలాగ్ మాట్లాడే వేషం నాక్కూడా ఇస్తారా?" అడిగాడు వర్ధనరావ్.

"ఒకటేమిటి. పది డైలాగులు మాట్లాడు! నో ప్రాబ్లమ్."

"నేను సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా ఉన్నప్పుడు" అంటూ రాజకీయం ప్రారంభించేశాడు అప్పల్రాజు.

కన్యక వాళ్ళ విషయం పట్టించుకోవటం లేదు.

భోజనాలు ముగిసినయ్.

భవానీశంకర్ తన గదిలోకి నడిచాడు. సాయంత్రం లోపలే వాడితో మాట్లాడాలి. వాడెవడో, ఎందుకు కరుణాకర్ వేషంలో వచ్చాడో తేల్చుకోవాలి.

కొద్దిసేపు తర్వాత అతని గదిలోకి చప్పుడు కాకుండా నడిచాడు భవానీశంకర్.

గది మళ్ళీ ఖాళీగా కనిపించింది.

వెనక్కు తిరిగేసరికి ఎదురుగ్గా మారుతీరావ్ కనిపించాడు.

"హల్లో మారుతీ!"

"యస్సార్!"

"మా కరుణాకర్ గాడితో సరదాగా మాట్లాడదామని వచ్చాను."

"ఆయన ఫ్రంట్ గార్డెన్ లో కూర్చున్నారు సార్."

"ఐసీ! అయితే అక్కడికే వెళ్తాను."

బయటికి నడిచాడు భవానీశంకర్. గార్డెన్ మధ్యలో ఉన్న మల్లెల పందిరి కింద కూర్చుని సిగరెట్ తాగుతూ పక్కనే ఉన్న టేప్ రికార్డర్ లో పాటలు వింటున్నాడు కరుణాకర్.

భవానీశంకర్ ని చూడగానే నవ్వుతూ పలుకరించాడు.



"రా గురూ! రా! ఇలా కూర్చో. నిజానికి నేనే నీ గదికి వద్దామనుకున్నాను. కానీ భోజనం చేసిన వెంటనే కొంతమందికి కాసేపు నిద్రపోయే అలవాటు ఉంటుంది కదాని... జస్ట్ రిలాక్సింగ్."

"అయ్ సీ" అన్నాడు భవానీశంకర్ కుర్చీలో కూర్చుంటూ.

"ఇంకేమిటి విశేషాలు? నీ రచనా వ్యాసంగం ఎట్లా వుంది?"

"అద్భుతంగా వుంది!"

"అప్పల్రాజుగారి ఆత్మకథ బాగా సాగుతోందా?"

"సాఫీగా!"

"ఈ బిల్డింగ్ చాలా బావుంది!"

"అవును."

"ఈ తోటలూ, ఈ చెరువూ, చెట్లూ_అన్నీ చాలా బాగున్నాయ్!"

"అవును."

"అందుకే నా పిక్చర్ ఇక్కడ షూట్ చేయాలనుకున్నాను"

"మంచి ఐడియా"

కొద్దిక్షణాలు ఇద్దరు మౌనంగా ఉండిపోయారు. హఠాత్తుగా భవానీశంకర్ ముందుకి వంగి అతని మొఖంలోకి చూస్తూ అడిగాడు.

"ఎవర్నువ్వు?"

అతను కలవరపడలేదు. చిరునవ్వు నవ్వాడు.

"అదేమిటి గురూ! అలా అడుగుతావ్! నేనెవరో నీకు తెలుసుకదా"

"నీ నాటకం నా దగ్గరకాదు చెప్పు ఎవర్నువ్వు?"

"కరుణాకర్ ని గురూ! సినీ డైరెక్టర్ కరుణాకర్"

"కరుణాకర్ ఎవరో ఎలా వుంటాడో నాకు బాగా తెలుసు! నిజం చెప్పు!"

"ఓ. కరుణాకర్ నిజంగానే నీ ఫ్రెండ్ అన్నమాట"

"అవును!"

"అతనిని నువ్వు నిజంగానే గుర్తుపట్టగలవన్నమాట!"

"పూర్తిగా!"

"మరి ఇందాక భోజనాల దగ్గర ఎందుకావిషయం చెప్పలేదు?"

"నీ నాటకం అందరి ఎదురుగా బయటపెట్టటం ఇష్టంలేక"

"ఎందుకిష్టం లేకపోయింది?"

″జాలి! అంతే!″

″ఆల్ రైట్! కాదు_కూడదు అనేట్లయితే చెప్పేస్తాను. నా పేరు 'కరుణాకర్' కాదు″

″ఆ విషయం నాకూ తెలుసు! నువ్వెవరు?″

″అసలు పేరనవసరం బ్రదర్!″

″అలాగా!″

″అవును!″

″ఎందుకొచ్చావిక్కడికి?″

″అర్జంటుగా నెరవేర్చాల్సిన కొన్ని పనులున్నాయ్″

″ఏమిటవి?″

″వ్యక్తిగతమయిన రహస్యం అది! చెప్పటం కుదరదు″

″అయితే నీ విషయం శమంతకమణి గారికి చెప్పాల్సివస్తుంది″

″నువ్వాపని చేయలేవు గురూ!″

″ఎందుకని చేయలేను?″

కరుణాకర్ నవ్వాడు.

″ఎందుకో నీకు తెలుసు″

″నాకేం తెలీదు. నువ్వు అన్ని వివరాలు ఇప్పుడే ఇక్కడే

చెప్పకపోయినట్లయితే ఇప్పుడే నీ విషయం బయటపెడతాను"

"నీ మాటలు ఎవరూ నమ్మరు?"

"ఎందుకని?"

"ఇందాక నాతో పాత స్నేహితుడిలా మాట్లాడి ఇప్పుడు మళ్ళీ వెళ్ళి నేను కరుణాకర్ కాదంటే ఎవరు నమ్ముతారు"

"సరే నమ్ముతారో లేదో చూద్దాం! ఇప్పుడే అసలు సినీ డైరెక్టరుకి ఫోన్ చేసి పిలిపిస్తాను"

కరుణాకర్ ఓ క్షణం ఆలోచించాడు.

"నీ బ్రెయిన్ చాలా ఫాస్ట్ గురూ! ఒప్పుకుంటున్నాను. అలా చేసేట్లయితే నా పరిస్థితి ఇరకాటంలో పడుతుంది."

"అయితే చెప్పు త్వరగా!"

"ఏమిటది?"

"నువ్విక్కడికి కరుణాకర్ వేషంలో ఎందుకొచ్చింది"

"చెప్పక తప్పదంటావ్"

"యస్"

"ఓ.కే.! నీకు చెప్పటంలో పెద్ద నష్టం ఉంటుందనుకోను! అప్పల్రాజు రాస్తున్న ఆత్మకథ తాలూకూ ఆ డైరీలు, ఫోటోలు, ఉత్తరాలు ఎత్తుకుపోవడానికి"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"అవెందుకు నీకు?"

"నాక్కాదు! నన్నిక్కడికి పంపించిన ప్రస్తుత మంత్రి వరదాచార్యులు కోసం"

"అతనికెందుకవన్నీ?"

"అతని గురించిన కొన్ని దారుణమయిన రహస్యాలు అప్పల్రాజు ఆత్మకథలో రాసేస్తాడు కాబట్టి. అవి ప్రపంచానికంతా తెలిసిపోతే వరదాచార్యులు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది కాబట్టి. ఆ కథ రాయకుండా అవి ఎత్తుకుపోయి తగలబెట్టేయాలి"

"ఐసీ_"

అ"వి లేకపోతే అప్పల్రాజుకి రుజువులేమీ ఉండవ్ కనుక_ఆత్మకథ ప్రచురించే ప్రోగ్రామ్ రద్దయిపోతుంది."

"ప్లాన్ చాలా బావుంది"

"టెరిఫిక్ ప్లాన్"

"నీకు రెండుగంటలు టైమిస్తున్నాను. ఈలోగా "ఆంధ్రప్రదేశ్ హౌస్" వదలి వెళ్ళకపోతే నీ నాటకం శమంతకమణిగారికి చెప్పేస్తాను"

కరుణాకర్ నవ్వాడు.

"అదంతా తేలిక విషయం కాదు"

"ఎందుకని?"

"నువ్వూ నాలాగానే మారువేషంలో ఉన్నావు కాబట్టి"

భవానీశంకర్ నిశ్చేష్టుడయ్యాడు.

"నాది మారువేషమా? నీకు బ్రెయిన్ చెకప్ చాలా అవసరం బ్రదర్"

"అది శమంతకమణిగారే తేల్చుకుంటారు. ఎవరి బ్రెయిన్ పరీక్షలు చేయించాలో"

"కొద్దిక్షణాల తర్వాతగానీ భవానీశంకర్ మాట్లాడలేకపోయాడు.

"ఎవరు చెప్పారు నీకీవిషయం?"

"మారుతీరావ్"

"వాడికెలా తెలుసు?"

"చాలా రుజువులున్నాయట వాడి దగ్గర"

"మరెందుకని బయటపెట్టలేదు"

"నేను నిన్ను గుర్తుపడితే ఇంక అనుమానం అక్కర్లేదని శమంతకమణిగారు చెప్పారుట! అందుకని ఆగాడు"

"దర్టీగూస్"

"ఎవరు?"

"మారుతీరావ్!"

ఇద్దరూ కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు మళ్ళీ.

"ఇప్పుడు మనిద్దరం కలసి ఓ కార్యక్రమం రూపొందించుకుంటే చాలా

బాగుంటుందని నా అభిప్రాయం" అన్నాడు కరుణాకర్.

"ఏమిటది?"

"నువ్వు కూడా వాటికోసమే వచ్చావు కాబట్టి మనిద్దరం కలిసే వాటిని దొంగిలించే వ్యవహారం పూర్తిచేస్తే నాకొచ్చే డబ్బులు ఇద్దరం ఫిఫ్టీ_ఫిఫ్టీ తీసుకుందాం. అంటే చెరో యాభయ్ వేలు.

"నాకక్కర్లేదు! నేనొచ్చిన పనివేరు."

"ఐసీ_అంటే అవి నాకు దక్కకుండా నువ్వొక్కడివే కొట్టుకుపోవాలని ప్లాన్ వేస్తున్నావ్ కదూ. ఓ.కే. నీఇష్టం! ఎవరదృష్టం ఎలా వుందో ఎవరు చెప్పగలరు?"

"అవును"

వెన్నెల వేట పేజి 34

"ఆల్ రైట్ ఇంక నేను వెళతాను! చాలా అలసటగా వుంది. రాత్రంతా జర్నీ అంతకుముందు రాత్రింబవళ్ళు షూటింగ్ మా సినిమా వాళ్ళ గురించి నీకు తెలీందేముంది?"

"అవును"

"నన్నడిగితే చక్కని విశ్రాంతి కావాలనుకున్నవారికి "ఆంధ్రప్రదేశ్ హౌస్" అద్భుతమయిన ప్రదేశం ఏమంటారు?"

"ఎగ్జాక్ట్ లీ"

అతను వెళ్ళిపోయాడు. భవానీశంకర్ కొద్దిసేపటివరకూ ఆలోచనల్లో

మునిగిపోయాడు.

అతని దృష్టి హఠాత్తుగా కన్యకమీద పడింది.

ఆమె ఇంట్లోనుంచి బయటికొచ్చి తిన్నగా గార్డెన్ లోకి నడిచి ఓ చెట్టుకింద పడుకుని తను తెచ్చుకున్న ఇంగ్లీష్ నవల చదువుకోసాగింది.

భవానీశంకర్ చప్పుడు కాకుండా ఆమె దగ్గరకు నడిచి పక్కనే కూర్చుంటూ "హలో" అన్నాడు చిరునవ్వుతో.

ఆమె ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

"మీరా?" అంది ఆశ్చర్యంగా.

"నూటికి నూరుపాళ్ళూ నేనే మైడియర్ ఫ్రెండ్! ఎచ్చట కన్యక ఉండునో అచ్చట దిగ్రేట్ దీప్ చంద్ ఉండును__"

ఆమె చిరాగ్గా చూసింది.

"రూమ్ లో ఉంటే మీరు రోజూ వచ్చి ప్రాణం తీస్తున్నారని_ఎవరికీ కనబడకుండా ఇక్కడికొచ్చాను..."

"దీప్ చంద్ బారినుండి అనేక లక్షలమంది తెలుగు పాఠకులే తప్పించుకోలేక చచ్చినట్లు అతని నవలలు చదువుతున్నారు డియర్! ఇంక మీరెలా తప్పించుకుంటారు?"

"దయచేసి మీరు వెళ్ళండి! నేను కాసేపు ఏకాంతంగా ఉండాలి."

"సారీ డియర్ ఫ్రెండ్! దీప్ చంద్ ఉన్నచోట ఏకాంతం అనేది ఏ ప్రాణికీ

లభించదు! కావాలంటే మనం ఇక్కడికొచ్చి జాయినయినప్పటి నుంచీ సెన్సస్ తీసుకోండి! మీరెప్పుడైనా_ఒక్కక్షణం ఏకాంతం అనుభవించగలిగారా?"

"సరే! నేనే వెళ్తాను_"

"వృధా ప్రయాస డియర్! జస్ట్ ఇంపాజిబుల్! అయినా ది మోస్ట్ గ్లామరస్ సినిమా స్టార్ మీతో మాట్లాడుతూ గడపాలని కోరుతూంటే_మీరలా పారిపోతారేమిటి?"

"మీరు సినిమాస్టారా?"

"ప్రస్తుతానికి కాకపోవచ్చు! కానీ ఆ రోజు ఎంతోదూరం లేదు! ఇందాక వచ్చిన సినిమా డైరెక్టర్ కరుణాకర్ నన్ను చూసి అదిరిపోయి రెండు సినిమాల్లో హీరో వేషం ఇస్తానని ప్రామిస్ చేశాడు..."

"అయ్ డోంట్ బిలీవ్ హిమ్_"

"నేనూ నమ్మలేదు! అయినా అతనలా అనడానికి కారణం ఏమిటి? కేవలం అతిశక్తివంతమయిన మన గ్లామర్! అవునూ! నా వంక చూస్తున్నప్పుడు మిమ్మల్ని ఏదోశక్తి నావేపు లాగుతున్నట్లు అనిపించటం లేదూ? దాన్నే "మాగ్నెటిక్ గ్లామర్" అంటారు.

"నాకేమీ అనిపించటం లేదు_"

"లేదా!"

"కొంచెం కూడా లేదు."

"మరి మా కాలేజ్ లో ఆడపిల్లలందరూ అలా చెప్పేవారే?"

"బహుశా వాళ్ళ శరీరంలో ఇనుపరజను ఎక్కువగా ఉండి ఉంటుంది" నవ్వుతూ అందామె.

"అంతేనంటారా?"

"ఖచ్చితంగా అంతే!"

"బైదిబై మన భవిష్యత్తు గురించి రాత్రి ఓ అద్భుతమయిన కార్యక్రమం రూపొందించాను. మీకు చెప్పాలా అది."

"చెప్పనక్ఖర్లేదు."

"మనిద్దరికీ శాస్త్రయుక్తంగా వివాహం అయ్యాక మనం ఆఫ్రికా అడవుల్లోకెళ్ళి అక్కడ ఓ టెంట్ వేసుకుని__"

"నేను మిమ్మల్ని వివాహం చేసుకోవటం లేదు."

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"చేసుకోవటం లేదా?"

"లేదు..."

"ఎందుకని?"

"నాకిష్టం లేదు."

"వెరీ స్ట్రేంజ్ ఫీలింగ్ డియర్! ఇంతదూరం వచ్చాక ఇప్పుడిలా కాదనడం లేత హృదయాలకు మంచిది కాదు! సురేఖ అనే అమ్మాయి ఇలాగే ఓ యువకుడితో చాలా క్లోజ్ గా ఉంటూ ఓ రోజు హఠాత్తుగా "నువ్వంటే నాకిష్టం లేదు" అని స్టేట్

మెంటిచ్చింది. దాంతో శ్రీరాజ్ అనే ఆ యువకుడు సురేఖ ఫ్రెండ్ "యురేకా" అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ సంగతి తెలిసి సురేఖ ఆత్మహత్య చేసుకుంది..."

"ఎందుకు?"

"నాకిష్టం లేదు" అని చెప్తే శ్రీరాజ్ జీవితాంతం బ్రహ్మచారిగా గడుపుతానంటాడేమోనని ఆశపడింది. కానీ అతగాడేమీ మాట్లాడకుండా అర్జంటుగా 'యురేకా'ని పెళ్ళి చేసుకునేసరికి 'షాక్' తగిలి_"

"నేను నమ్మనీ కథని!"

"అఫ్ కోర్స్ కొంచెం కథలాగానే ఉంటుందనుకోండి! అందుకే అన్ని పత్రికలూ ఈ సంఘటనను 'నమ్మలేని నిజాలు' శీర్షికలో ప్రచురించాయి. పోనీ ఇంకో రియల్ ఫాక్ట్ చెప్తాను."

"అఖ్ఖర్లేదు_"

"ప్రసాద్ అనే మా ఫ్రెండొకడు 'హసీనా' అనే అమ్మాయిని ప్రేమించి..."

"నాకు చెప్పవద్దు_"

"...ప్రేమించి పెళ్ళి చేసుకోమని అడిగాడు. ఆ అమ్మాయి అచ్చం మీలాగానే "నాకిష్టం లేదు" అని చెప్పేసరికి వళ్ళుమండి అతగాడు కత్తితో పొడుచుకుని చచ్చిపోతూ తనని ఆ అమ్మాయే చంపిందని స్టేట్ మెంటిచ్చాడు..."

కన్యక ఆశ్చర్యపోయింది.

"తరువాతేమయింది?"

"హసీనా ఇప్పటికి కూడా తను తనని పెళ్ళిచేసుకోటానికి వప్పుకుని ఉంటే బాగుండేది కదాని బాధపడుతూంటుంది జైల్లో."

"ఇది కూడా కథే!"

"అయితే ఇంకో జరిగిన సంఘటన చెప్తాను."

"వద్దు_"

"రాజేశ్వర్ అనే మా బాచ్ మేట్ ఒకడు..."

"కన్యకా మేడమ్_"

ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూచారు.

మారుతీరావ్ నిలబడి ఉన్నాడక్కడ.

"మీకు ట్రంక్ కాల్ వచ్చింది మేడమ్."

కన్యక చప్పున లేచి భవనంలోకి పరుగెత్తి మారుతీరావ్ గదిలో ఉన్న ఫోన్ అందుకుంది.

"హలో!"

"హలో కన్యకా! నేను నీలను మాట్లాడుతున్నాను."

"హల్లో నీలా_"

"నీ లెటర్ నిన్నే చేరింది. అప్పట్నుంచీ ప్రయత్నిస్తున్నాను నీకు ఫోన్ చేయటం కోసం_"

"ఏమిటి, ఏమయినా విశేషమా?"

"అవునే! నువ్వు అక్కడ ప్రముఖ రచయిత దీప్ చంద్ తో కలసి వర్క్ చేస్తున్నానని రాశావు కదూ!"

"అవును_"

"ఆ దీప్ చంద్ ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు?"

"మా పిన్ని కూతురు విజ్జీలేదూ? దానిని వదిలేశాడు_"

కన్యక కేమీ అర్థం కాలేదు.

"ఏమిటి వదిలేయటం?"

"వదిలేయటం అంటే తెలీదూ?"

"వదిలేయటం అంటే తెలుసు. ఏదయినా వస్తువు పట్టుకోకుండా వదిలేస్తే కిందపడుతుంది."

"ఆ వదిలేయటం కాదే! సంసారం చేస్తూ చేస్తూ మధ్యలో వదిలేసి_ విడాకులిస్తా నంటున్నాడట."

వెన్నెల వేట పేజి 35

"వ్వాట్?" ఆశ్చర్యపోయింది కన్యక. "అంటే మీ విజ్జీని దీప్ చంద్ పెళ్ళి చేసుకున్నాడా?"

"ఆ మధ్యన ఇద్దరూ పెద్దాళ్ళకు తెలీకుండా గుళ్ళో పెళ్ళి చేసుకున్నారటలే!

నాకూ ఈ మధ్యే తెలిసింది."

"దీప్ చంద్_మీ విజ్జీ భార్యాభర్తలా?"

"సంసారం కూడా చేశాక_భార్యాభర్తలు కాకేమవుతారు?"

కన్యక నమ్మలేకపోతోంది.

"కానీ...ఈ విషయం...దీప్ చంద్ నాకు చెప్పలేదే?"

"భార్యను వదిలేసినవాడు ఇంకెందుకు చెప్తాడు?"

"దుర్మార్గుడు_"

"పరమ దుర్మార్గుడు. పాపం మా విజ్జీ ఎంతగా ఏడుస్తుందో నీకు తెలీదు"

"పాపం! అంత అమాయకురాలిని వదలటానికి మనసెలా వచ్చిందో_"

"రాతిగుండె! విజ్జీ వాడిని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించింది వాడి నవలలు చదివి."

"అయ్ పిటీ హర్! రచనలన్నీ మంచివి కానట్లే రచయితలందరూ మంచివాళ్ళుండరు"

"నువ్వో చిన్న సహాయం చేయాలి విజ్జీ కోసం"

"పెద్ద సహాయమయినా సరే చేస్తాను, విజ్జీ కోసం."

"ఆ దీప్ చంద్ కెలాగయినా నచ్చజెప్పి వాళ్ళ సంసారం నిలబెట్టాలి"

"మళ్ళీ మళ్ళీ వాళ్ళ సంసారంలో కలతలు రాకుండా సిమెంట్ కట్టడంలా

చేసేస్తాను."

"అబ్బ! నువ్వెంత మంచిదానివే కన్యకా!"

"చాల్లే పొగడకు."

"నీ మాటలు వింటే విజ్జీ నిజంగా ఎంత సంతోషిస్తుందో!"

"పూర్ గాళ్! తన సంసారం నిలబెట్టే బాధ్యత నాదేనని చెప్పు"

"ఈ మాట విందంటే ఆనందం పట్టలేక ఏడ్చేస్తుంది."

"ఏడవ్వద్దని చెప్పు. అంతా నేను చూసుకుంటాను."

"ఇంక వుంటానే."

"నేను దీప్ చంద్ తో అన్నీ మాట్లాడి, మళ్ళీ నీకు ఫోన్ చేస్తాను."

"నువ్ నిజంగా దేవతవే."

"చాల్లే. ఫోన్ పెట్టేసెయ్."

"కన్యకా డియర్!"

"ఉంటాను."

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

కన్యక తన గదిలోకి నడిచి మంచంమీద వాలిపోయింది. ఆమె మనసంతా వికలమయిపోయింది. దీప్ చంద్ లాంటి యువకుని వెనుక ఇంత క్రూరమయిన కథ వుందని తను అనుకోనేలేదు.

అతని తీయని మాటలకు పొంగిపోయి, అతని చక్కటి రూపానికి పరవశించి అతనికి మనసిచ్చింది. తను ఏదోకరోజు అతని ప్రేమను అంగీకరించాలనే నిశ్చయానికి వచ్చింది. కానీ యిప్పుడు ఈ విజ్జీ విషయం...

అబ్బ! మగాళ్ళెంత మోసగాళ్ళు! అందుకే ఏ మగాడినీ నమ్మదు తనోపట్టాన. విజ్జీ విషయమేమీ తన దగ్గర చెప్పకుండా తనను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాడు దీప్ చంద్. ఎంత దారుణం?

"మే ఐ కమిన్ మిస్ కన్యకా!" తలుపు తెరుచుకుని గడపలో నిలబడ్డ కరుణాకర్ ని చూసి చటుక్కున లేచి నిలబడింది కన్యక.

"యస్! ప్లీజ్ కమిన్!" అంది చిరునవ్వు తెచ్చుకుని.

అతనొచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"మా పిక్చర్ షూటింగ్ కోసం ఇల్లంతా చూస్తూ ఇటు వచ్చాను మిస్ కన్యకా! ఈ రూమ్ కూడా చాలా బాగుంది. ముఖ్యంగా బాల్కనీ లోంచి కనిపించే అందమయిన ఆ సీనరీ."

"అవును" అందామె పొడిగా.

"బైదిబై! నేనిక్కడకొచ్చిన రోజునుంచీ ఓ విషయం అనుకుంటున్నాను కన్యకగారూ! మీరేమీ అనుకోనంటే చెప్తాను."

"చెప్పండి. ఫరవాలేదు" ఆశ్చర్యపోతూ అందామె.

"నాకు చాలా ఆస్తిపాస్తులున్నాయి. మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి అయినా ఇంతకాలం పెళ్ళి చేసుకోలేదు. ఎందుకనో తెలుసా?" ఆమెవంక చూశాడతను.

కన్యక ఏమీ మాట్లాడలేదు.

"నాకు నచ్చిన అమ్మాయి ఇంతవరకూ దొరకలేదు మిస్ కన్యకా! కొంతమంది సినిమా హీరోయిన్స్ కూడా నన్ను చేసుకోవాలని ఉవ్విళ్ళూరారు. కానీ నా కిష్టం లేకపోయింది."

అతను మళ్ళీ కన్యక వంక చూశాడు. కన్యక చూపులు మరల్చుకుంది.

"ఇంతకాలానికి మీలో నాక్కావలసిన అంశాలన్నీ కనిపించాయి కన్యకగారూ! అందం, చదువూ, గుణగణాలూ...అందుకే మీరు అంగీకరిస్తే మిమ్మల్ని వివాహం చేసుకోవాలనీ..."

కన్యక ఉలిక్కిపడింది.

"మీరిప్పుడే జవాబు చెప్పాలని అనటంలేదు. తీరిగ్గా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకున్నాకే మాట్లాడదాం! వస్తాను మిస్ కన్యకా! థాంక్యూ" అనేసి బయటకు నడిచాడతను"

కన్యక కొద్ది క్షణాల వరకూ ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయింది. తనలాంటి మామూలు అమ్మాయి ఇంత గొప్ప సినిమా డైరక్టర్ ని ఆకర్షించిందంటే నమ్మశక్యం కావటంలేదు. ఏదేమైనా తను తొందర పడకూడదు. అన్నీ జాగ్రత్తగా ఆలోచించి ఈ కరుణాకర్ గురించి కూడా అన్నీ తెలుసుకుని అప్పుడుగాని ఓ నిర్ణయానికి రాకూడదు. మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయిందామె.

* * * *

టైమ్ సాయంత్రం నాలుగవుతోంది.

శమంతకమణి తన గదిలో కూర్చుని డిటెక్టివ్ నవల చదువుతోంది. "హంతకుడు నౌకరు వేషంలో ఆ లక్షాధికారి ఇంట్లో ప్రవేశించాడు. రాత్రి పన్నెండయింది. అతను కత్తి తీసుకుని లక్షాధికారి గది దగ్గరకెళ్ళాడు. నెమ్మదిగా తలుపు తట్టాడు. లక్షాధికారి నిద్రమత్తుతో వచ్చి తలుపు తెరిచాడు. మరుక్షణంలో హంతకుడి చేతిలో కత్తి లక్షాధికారి గుండెల్లో దిగబడింది. 'హా' అన్న ఆర్తనాదం ఇల్లంతా ప్రతిధ్వనించింది. నౌకరు మాయమయిపోయాడు.

శమంతకమణికి ముచ్చెమటలు పట్టినయ్. ఏ.సి. రూమ్ లో ఉన్నా కూడా చెమటలు పట్టేసినయ్.

"నమస్తే_నమస్తే" అంటూ లోపలికొచ్చాడు కరుణాకర్.

శమంతకమణి అదిరిపోయి అతనిని చూసి తేలిగ్గా గాలి పీల్చుకుంది.

"మీరా" అంది సర్దుకుంటూ.

"ఇల్లంతా చూసాను. రెండే రెండు గదులు షూటింగుకి సరిపోతాయనుకుంటాను. హాలు! అప్పల్రాజుగారి లైబ్రరీ రూమ్! ఈ రెండూ అద్భుతంగా వున్నాయ్" అన్నాడతను.

"అలాగా! చాలా సంతోషం!" అందామె.

"మా కెమేరామెన్ కి కూడా టెలిగ్రామిచ్చాను. రేపో, ఎల్లుండో వస్తాడు. అతనుకూడా ఓసారి చూసుకుంటే"

"ఏం పర్వాలేదు! ఈ ఇల్లు మీదనుకోండి"

"థాంక్యూ_థాంక్యూ"

"వచ్చే ఆదివారమే మా టైగర్స్ క్లబ్ మీటింగ్! మీకు గుర్తుందనుకుంటాను." అందామె.

"ఓ! యస్! ఎంగేజ్ మెంట్ డైరీలో రాసుకున్నాను. ఆ సభకు ముఖ్యఅతిథిగా ఉండాలని!"

"వాళ్ళంతా శనివారానికల్లా ఇక్కడకు చేరుకుంటారు"

"అయితే ఇల్లంతా చాలా హడావుడిగా ఉంటుందన్నమాట"

"కొంచెం హడావుడేమిటి? ఇల్లంతా క్లబ్ లా మారిపోతుంది"

"ఒండర్ ఫుల్ అకేషన్"

"ప్రతి సంవత్సరం జరుపుతాను ఈ మీటింగ్"

"చాలా మంచి అలవాటు"

కరుణాకర్ చిన్నగా దగ్గాడు.

"మీకో విషయం చెప్పాలని వచ్చాను"

"చెప్పండి"

వెన్నెల వేట పేజి 36

"మీరేమీ ఖంగారు పడనక్కరలేదు! ఎందుకంటే నేను చెప్పబోయే విషయంవల్ల! జరిగేనష్టం ఏమీలేదు"

"ఏమిటది?" అడిగిందామె ఆత్రుతగా.

″ఆ దీప్ చంద్ అనే రచయితున్నాడు చూడండి! అతనెవరో డూప్లికేట్! అసలు రచయిత దీప్ చంద్ ఇతను కాదు″

శమంతకమణి నిశ్చేష్టురాలయింది. ఆమె చేతిలోనుంచి డిటెక్టివ్ పుస్తకం జారిపోయింది.

″అతను దీప్ చంద్ కాదా?″

″ఏమాత్రం కాదు″

″మరెవరు?″

″ఎవరో ఓ గజదొంగ అని నా అనుమానం!″

″వాడెందుకొచ్చినట్లు మరి?″

″అదే తెలీదు. డబ్బు కోసం, నగల కోసం_దేనికయినా వచ్చి ఉండవచ్చు.″

″మైగాడ్. ఇప్పుడేమిటి చేయటం?″

″ఏమీ చేయనక్కరలేదు. వాడిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండటమే మనందరం చేయాల్సినపని! కనిపెట్టి_వాడిని సరిగ్గా ఆ పనిచేసే టైమ్ లో పట్టుకోవాలి″ శమంతకమణి ఆలోచనలో పడింది.

″అవునూ! మొన్న మరి భోజనాల దగ్గర మీరు అతనిని గుర్తుపట్టారు కదా! పాత స్నేహితుల్లాగా మాట్లాడుకున్నారు″ హఠాత్తుగా అడిగిందామె.

″కావాలనే నేను అలా నటించాను. అతనిని చూడగానే దీప్ చంద్ కాదని నాకు తెలిసిపోయింది. కానీ అతను ఎందుకలా మారువేషంలో ఉన్నాడో,

అసలతను ఎవరో తెలుసుకుందామనీ..."

"అయితే ఇప్పుడే పోలీస్ కి ఫోన్ చేస్తాను."

"అహహ, అలా తొందరపడకండి. వాడిని రెడ్ హాండెడ్ గా పట్టుకుందాం అందరం కలసి. అదీగాక వాడు దీప్ చంద్ కాదన్న రుజువులేమీ లేవు మనదగ్గర."

"అంతేనంటారా?"

"అవును. మీకు భయమేమీ అక్కర్లేదు. నేను నీడలా కనిపెడుతుంటాను వాడిని."

"సరే" అయిష్టంగానే అందామె.

"మీ మీటింగేదో అయిపోయాక వాడి సంగతి చూడవచ్చు."

"సరే."

కరుణాకర్ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. శమంతకమణి కొద్దిసేపటి వరకూ చలనం లేకుండా కూర్చుండిపోయింది అక్కడే.

* * * *

"గురూజీ!" దీనంగా పిలిచాడు వర్ధనరావు.

"యస్ మైడియర్ యంగ్ మాన్! ఏమిటి విశేషం. ఇలా అర్జంటుగా వేంచేశావ్?"

"మన ప్లాన్ ఎప్పుడు అమలు జరుపుదాం గురూజీ! ఆదివారమే టైగర్స్ క్లబ్

మీటింగ్! బోలెడుమంది అతిథులు వచ్చేస్తారు మళ్ళీ. ఈలోగానే ముగిస్తే.”

“పొరబాటు పడ్డావ్ బ్రదర్? ఆ మీటింగ్ రోజే ఆ హడావుడిలోనే మన కార్యక్రమం విజయవంతంగా అమలుచేయటానికి అవకాశాలున్నాయి.”

“అంతేనంటారా?”

“యస్!”

“అయితే ఆ రోజు వచ్చి ఊళ్ళో హోటల్లో రడీగా ఉండమని మావాడికి ఫోన్ చేయనా?”

“ఓ.యస్. నిరభ్యంతరంగా.”

“థాంక్యూ గురూజీ!”

“డోంట్ మెన్షన్ బ్రదర్.”

“వర్ధనరావ్ వెళ్ళిపోయాడు. భవానీశంకర్ టైమ్ చూసుకుని హడావుడిగా గార్డెన్ లోకి పరుగెత్తాడు.

అది కన్యక గార్డెన్ లో గడిపే టైమ్.

ఏకాంతంగా పూలమొక్కల మధ్య కూర్చున్న కన్యక అతనిని చూసి రోజులా చిరునవ్వు నవ్వకపోయేసరికి అతనికి ఆశ్చర్యం కలిగింది.

“వాటీజ్ ది మేటర్ మైడియర్ కన్యకాజీ! మీ పెదవుల మీద నృత్యం చేసే చిరునవ్వు ఈ రోజు కరువయిన కారణం ఏమిటి?” అన్నాడతను ఆమెకు సమీపంగా కూర్చుంటూ.

"ఇందాక మా ఫ్రెండ్ నీల ఫోన్ చేసింది."

"ఆమె ఫోన్ ఇలా అందమైన చిరునవ్వులను చెరిపేయగలదని నాకు తెలీలేదు మిస్ కన్యకా! తెలుస్తే ఆమెనుంచి వచ్చే ఫోన్ కాల్స్ నిషేదించమని టెలిఫోన్ డిపార్ట్ మెంట్ పై వత్తిడి తెచ్చేవాడిని!"

"నీల పిన్నికూతురు విజ్జీ గురించి అంతా చెప్పింది!"

"విజ్జీయా?"

"అవును."

"విజ్జీల గురించీ, బజ్జీల గురించీ ఆమె ఫోన్ లో ఎందుకు చెప్పినట్లు?"

"విజ్జీ అంటే మీకింకా తెలీలేదా?" అనుమానంగా అడిగిందామె.

"తెలీటమా? తెలీటం ఏమిటి డియర్?"

"విజ్జీ అంటే_ మీ విజ్జీ!"

"నా విజ్జీయా? నాకు విజ్జీలెవరూ లేరే?"

"నా దగ్గర కాదు మీ ఆటలు! మీ భార్య విజ్జీ గురించి అంతా చెప్పింది నీల."

భవానీశంకర్ ఆలోచనలో పడ్డాడు. అనుకోకుండా ఎదురయిన ఈ పరిస్థితినెలా తట్టుకోవాలా అనేదే తెలీటంలేదు. తన ప్రాణానికి ఆ దీప్ చంద్ భార్య విజ్జీ నీల పిన్నికూతురే అవ్వాలా? ఆ నీల ఇప్పుడే కొంపలు మునిగిపోయినట్లు కన్యకకు ఫోన్ చేసి ఆ విషయాలేవో రికార్డ్ పెట్టినట్లు చెప్పాలా?

"ఓ! అదా!" పొడిగా అన్నాడతను.

"ప్రేమించి పెళ్ళి చేసుకున్న మీ ఇద్దరూ ఇలా విడిపోవడం నాకేం బావుండలేదు."

"విడిపోవడమా?"

"అవును. మీరే విజ్జీని వదిలేశారని చెప్పింది నీల."

"నేనా?"

"అవును."

"అది నిజం కాదు."

"అంటే. విజ్జీయే మిమ్మల్ని వదిలేసిందా?"

"ఆ...ఆ...ఒకరకంగా చెప్పాలంటే_ యస్. విజ్జీయే ఇల్లొదిలి వెళ్ళిపోయింది."

"అలాగా! నీల అలా చెప్పలేదే!"

"చెప్పదు. ఎందుకంటే నీల దుర్మార్గులు కాబట్టి. నిజాలను దాచిఉంచే రాక్షసి కాబట్టి."

"నీల గురించి మీరలా మాట్లాడటం నాకిష్టంలేదు"

"ఆల్ రైట్. ఆ సంగతి వదిలేద్దాం! కేవలం మనగురించే మాట్లాడుకుందాం."

"మన గురించి మాట్లాడేదేమీ లేదు. విజ్జీ గురించే మాట్లాడాలి."

"విజ్జీ గురించి ఏముంది మాట్లాడటానికి."

"అసలెందుకు విడిపోయారు మీరు?"

"ఇద్దరం కలసి ఉండటం కుదరదు గనుక."

"చూడండి. నేను మీ వ్యక్తిగత జీవితంలో జోక్యం కలుగజేసుకోవటం సభ్యత కాదు గానీ. మీ స్నేహితురాలిని కాబట్టి మనమధ్య ఉన్న చనువుకొద్దీ మాట్లాడుతున్నాను."

"వెల్ కమ్ డియర్ వెల్ కమ్."

"మీరిద్దరూ మళ్ళీ ఒకటవ్వాలని నా కోరిక."

"ఓ! అదా! నో! ఇంపాజిబుల్ "విరిగిన మనసులు అతకవ్" అన్న సూక్తి మీరు వినలేదూ?"

"ఆ మాట మీద నాకు నమ్మకం లేదు."

"నాకు నమ్మకం కుదిరింది."

"కానీ పాపం విజ్జీ భోజనం, నిద్రా లేకుండా ఏడుస్తోందిట."

"నేను నమ్మను."

"ఎందుకని?"

"కొబ్బరిచట్నీ తీసుకుని నా మొఖంమీద కొట్టిన రాక్షసి అలా భోజనం నిద్రా లేకుండా ఏడుస్తుందంటే నేన్నమ్మను!"

"కొబ్బరిచట్నీ మీ మొఖంమీద కొట్టిందా?"

వెన్నెల వేట పేజి 37

"ఆరుసార్లు!"

"టూ మచ్_"

"వేడిగంజి నా కాళ్ళమీద పోసిన విషయం మీకు చెప్పానా?"

"మైగాడ్. వేడిగంజా?"

"అవును. నెలరోజులు చేతులతో నడిచాను."

"ఎంత ఇన్ హ్యూమన్?"

"బార్బారిక్."

"ఎందుకలా పోసింది?"

"నేను నా అభిమాని_ఓ అమ్మాయికి ఆటోగ్రాఫ్ చేశానని?"

"సిల్లీ. అందులో తప్పేముందీ?"

"అది తప్పని నానా గొడవాచేసి నా చేతి వేళ్ళు కొరికేసింది"

"కొరికిందా?"

"డాక్టర్ పధ్నాలుగు కుట్లు వేశాడు."

"అబ్బ!"

"అయినా నేను సహించాను. తనే అక్కడితో ఆగకుండా నా బట్టలూ, నా స్క్రిప్టులూ, నా పుస్తకాలూ అన్నీ పెద్ద కుప్పగావేసి, కిరసనాయిలు పోసి తగలేసి తనదారిన తను పుట్టింటికి వెళ్ళిపోయింది."

″నాకు నమ్మశక్యం కావటంలేదు.″

″అందరూ అదేమాట అంటున్నారు. కానీ మా పక్కఇంటివాళ్ళు మాత్రం అవన్నీ ప్రత్యక్షంగా చూశారు కాబట్టి నమ్మారు.″

″అయామ్ సారీ దీప్ చంద్ గారూ! నీల మాటలు నమ్మి తప్పంతా మీదేననుకున్నాను.″

″అయినా నీలమీద నాకు కోపమేమీ లేదు. తన కజిన్ సిస్టర్ అన్న అభిమానంతో మీకలా కల్పించి చెప్పివుంటుంది.″

″అవును.″

″అందుకే నా మనసు విరిగిపోయింది కన్యకగారూ! అప్పటినుంచీ విరిగిన ఈ మనసుకీ, అపశృతి పలికిన ఈ జీవితానికీ, గాయపడిన నా హృదయానికీ, రగులుతోన్న నా ఆవేదనకీ, చెదిరిపోయిన...″

″మరోసారి ఆ ప్రస్తావన తేనని హామీ ఇస్తున్నాను.″

″అది చాలదు కన్యకగారూ! జీవితాంతం మీరు నా సరసన నిలబడతానని చెప్పండి. అప్పటికిగానీ నాకు మనశ్శాంతి లభించదు.″

″నో! అది సాధ్యంకాని పని″ కలవరపాటుతో అంది.

″మొఖంమీద కొబ్బరిచట్నీ విసరటం, వేడిగంజి కాళ్ళమీద పోయటం, చేతివేళ్ళు కొరికేయటం లాంటివి చేయని దేవత ఈ ప్రపంచంలో మీరొక్కరే ఉన్నారు కన్యకా!″

″కానీ...నేను...నేను...కరుణాకర్ ని పెళ్ళిచేసుకోబోతున్నాను″ అతనినుంచి

తప్పించుకోడానికని అందామె.

భవానీశంకర్ షాక్ తిన్నట్లు ఆమెవేపు చూశాడు.

"కరుణాకర్ నా?"

"అవును."

"మీరు జోక్ చేస్తున్నారు."

"లేదు నిజమే చెప్తున్నాను."

"కానీ వాడుట్టి లోఫర్."

"అలా మాట్లాడకండి."

"ఇంటర్నేషనల్ క్రూక్."

"సరే నేను వెళుతున్నాను" ఆమె కోపంగా లేచి వెళ్ళిపోయింది.

"అయినాసరే వాడి గురించి నా అభిప్రాయం మాత్రం మారదు."

కన్యక అక్కడినుంచి వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది. భవానీశంకర్ పచ్చికమీద వరిగిపోయాడు. పరిస్థితి క్షణక్షణానికి క్లిష్టంగా తయారవుతోందనిపించిందతనికి. వెంటనే తను ఏదొక ఉపాయం ఆలోచించకపోతే కన్యక చేజారిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

దీర్ఘమయిన ఆలోచనలో పడిపోయాడతను.

* * * *

అప్పల్రాజు గదిలో ఫోన్ మోగింది.

"హలో! ఎక్స్ మినిష్టర్ అప్పల్రాజూ హియర్!" అన్నాడు అప్పల్రాజు.

"నేను మారుతీరావ్ ని మాట్లాడుతున్నాను సార్!"

"ఏమిటి సంగతి?"

"మీకు హైద్రాబాద్ నుంచి ట్రంక్ కాల్ వచ్చింది సార్! కనెక్ట్ చేస్తున్నాను" అంటూ కనెక్టు చేశాడతను.

"హలో!" అంది అవతలి గొంతు.

"హలో! నేను మాజీమంత్రి అప్పల్రాజుని మాట్లాడుతున్నాను."

"ఎట్లాగయితే అఘోరించావ్ లే బోడి మాజీ మంత్రి ఉద్యోగం."

అప్పల్రాజు ఉలిక్కిపడ్డాడు.

ఇంతవరకూ తననెవరూ ఇంత ఘోరంగా ఇన్సల్ట్ చేయలేదు.

"హలో! ఎవరది?"

"ఎవరైతే నీకెందుగ్గానీ, నీకో సంగతి చెప్దామని పిలిచాను."

"నువ్వెవరో ముందు చెప్పు."

"పిచ్చివాగుడు వాగకు. నేను చెప్పేది విను. నువ్వు 'ఆత్మకథ' అని ఓ పెద్ద గ్రంథం రాస్తున్నావట కదా!"

"అయితే ఏమిటి?"

"అందులో నీకు పరిచయమున్న వాళ్ళందరి గురించీ ఉన్నదున్నట్లు రాస్తున్నావట కదా?"

"యస్! రాస్తున్నాను. అయితే ఏమంటావ్?"

"రాస్తే నీ శాల్తీ గల్లంతవుతుందని చెప్తున్నాను."

అప్పల్రాజుకి కోపం వచ్చింది.

"నేనెవడికీ భయపడనన్న విషయం నీకు తెలుసుకోవాలని ఉంటే నేను మంత్రిగా చేసిన రోజుల్లో అసెంబ్లీలో ఉన్నవాడెవడినయినా సరే అడుగు."

"నీ బోడి ప్రతాపానికి రుజువులేమీ అక్కర్లేదుగానీ, నీకు మంచితనంగా చెప్తున్నాను. మర్యాదగా ఆ పుస్తకం రాయటం ఆపెయ్. లేపోతే అదెలా ఆపాలో మాకు తెలుసు."

"నీ బెదిరింపులకు ఇక్కడ బెదిరే వారెవ్వరూ లేరు. షట్ యువర్ మౌత్" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.

వెంటనే ఆ బెదిరింపు విషయం మారుతీరావ్ కి చెప్పాలనిపించి బటన్ నొక్కాడతను.

"హలో మారుతీ!"

"యస్సార్!"

"ఆ ట్రంక్ కాల్ చేసినవాడెవడో తెలుసా?"

"వల్లకాట్లో రామనాథయ్య అని చెప్పమన్నాడండీ."

"అదే, వాడేమన్నాడో తెలుసా?"

"తెలుసండి"

"నీకెలా తెలుసు?"

"ఫోన్ లో మీరు మాట్లాడుతుంటే విన్నానండీ."

"అప్పల్రాజు మండిపడిపోయాడు.

"నేనెవరితోనయినా ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు వినకూడదని నీకు అరడజనుసార్లు వార్నింగిచ్చాను కదా!"

"ఇచ్చారు సార్!"

"మళ్ళీ ఎందుకు విన్నావ్?"

"......."

"నిన్ను డిస్మిస్ చేస్తాను జాగ్రత్త! ఇదే లాస్ట్ వార్నింగ్"

"అలాగే సార్!"

"ఇంతకూ అసలు సంగతేమిటంటే ఆ నౌఖరుగాడిని ఇవాళ్టినుంచీ నా గది దగ్గరే పడుకోమను."

"అలాగే సార్!"

"వాడెవడయినా నన్ను ఎటాక్ చేయదల్చుకుంటే నేనూ సిద్ధంగా వుండాలి కదా!"

"ఉండాలండి"

"ఇంక పో నువ్వు! ఇంకోసారి ఫోనులో మాట్లాడుతున్నప్పుడు విన్నావంటే బయటకు స్వయంగా గెంటుతాను."

"అలాగే సార్!"

వెన్నెల వేట పేజి 38

మారుతీరావ్ బయటికొచ్చాడు. అతనికి అర్థమయిపోయింది. ఆంధ్రప్రదేశ్ హౌస్ చాలా ప్రమాదకరమయిన పరిస్థితిలో ఉంది. ఏ క్షణంలోనయినా దుండగులు దాడిచేసి అప్పల్రాజుగారు తయారుచేస్తున్న ఆత్మకథను రుజువులతోసహా సర్వనాశనం చేసేయవచ్చు.

హఠాత్తుగా ఓ అనుమానం అతనిలో నెమ్మదిగా పాకింది.

కొంపదీసి దీప్ చంద్ ఆ బాపతు కాదుగదా! ఠక్కున నిలబడిపోయాడతను అవును. అందుకే వాడు దీప్ చంద్ వేషంలో వచ్చివుంటాడు. ఇంకొక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా శమంతకమణి గదివేపు నడిచాడతను.

* * * *

కిరాతకరావ్ తన ముందున్న న్యూస్ పేపర్ కటింగ్స్ మరోసారి చదువుకున్నాడు.

"ప్రముఖ మాజీ మంత్రి శ్రీ అప్పల్రాజు ఆత్మకథ" అన్న న్యూస్ ఒకటి "మాజీమంత్రి శ్రీ అప్పల్రాజు ఆత్మకథ ప్రముఖ రచయిత దీప్ చంద్ సారధ్యం"

వెంటనే తను ఆ రచయిత దీప్ చంద్ ని కలుసుకుంటేగాని కొంత ఇన్

ఫర్మేషన్ దొరకదు. వెంటనే హోటల్ కౌంటర్ మీదున్న టెలిఫోన్ డైరెక్టరీ తీసుకుని 'ఆంధ్ర దీపిక' వారపత్రిక ఆఫీస్ కి ఫోన్ చేశాడు.

"హలో! రంగారావ్ హియర్!"

"నమస్కారం సార్! నా పేరు ఈశ్వర్రావ్ కొత్తగా పబ్లిషింగ్ హౌస్ పెట్టాను. దయచేసి రచయిత దీప్ చంద్ గారి అడ్రస్ తెలియజేస్తారా?"

"ఓ! కిషోర్ టాకీస్ పక్కసందులోనే మూడో ఇల్లు. బయట నేమ్ ప్లేట్ ఉంటుంది."

"థాంక్యూ సార్!"

"దట్సాల్ రైట్!"

కిరాతకరావ్ వెంటనే ఆటోలో దీప్ చంద్ ఇంటికి చేరుకున్నాడు. రెండు నిమిషాలు తలుపు కొట్టాక నిద్ర కళ్ళతో లేచివచ్చాడు దీప్ చంద్.

"ఎవరు?"

"నా పేరు హరిశ్చంద్ర సార్! కొత్తగా పబ్లికేషన్స్ మొదలుపెట్టాను."

"ట్వంటీ పర్సెంట్, ఎనిమిదివేల కాపీలు."

కిరాతకరావ్ కేమీ అర్థంకాలేదు.

"ఏమిటి సార్! ట్వంటీ పర్సెంట్, ఎనిమిదివేల కాపీలు?"

"నా నవలకు మీరివ్వాల్సిన రెమ్యునరేషన్."

"నేను మీ నవల వేయడానికి రాలేదు సార్!"

"అయితే తలుపెందుకు కొట్టినట్లు?" తలుపు మూసివేయబోయాడతను.

"సార్...సార్! ఒక్క నిమిషం ఆగండి"

"ఏమిటి? త్వరగా చెప్పు"

"మీరు మాజీ మంత్రి అప్పల్రాజుగారి ఆత్మకథ రాస్తున్నారని తెలిసింది. మీ ఇన్ ఫ్లుయెన్స్ ఉపయోగించి ఆ ఆత్మకథ నాకిప్పిస్తే, నేను మీకు ఎంతోకొంత మొత్తం ముట్టచెప్తాను."

దీప్ చంద్ చిరాగ్గా చూశాడు.

"నేను రాయటంలేదది. అదంతా కాన్సిల్ అయిపోయింది."

"కాన్సిల్ అయిపోయిందా?" దిగాలుపడి అడిగాడు కిరాతకరావ్.

"అవును. ఎన్టీఆర్ అంటే అంత గుడ్డిగా పడిచచ్చేవాడికి నేనెందుకు వర్క్ చేయాలి?"

"మరి ఆత్మకథ?"

"లెట్ ది 'ఆత్మకథా' గో టు హెల్. నా కనవసరం."

"అఫ్ కోర్స్! మీ కనవసరమే ననుకోండి"

"ఇంక నువ్వెళ్ళొచ్చు. టైమ్ వేస్ట్ నాకు" భళ్ళున తలుపులు మూసేశాడతను.

కిరాతకరావ్ నిరాశగా తనాఫీస్ వేపు నడవసాగాడు మళ్ళీ.

* * * *

శమంతకమణి కార్లో బాక్ సీట్లో కూర్చుని అబిడ్స్ రోడ్ కిరువేపులా ఉన్న బోర్డ్ లవంక చూస్తోంది. మారుతీరావ్ భయం భయంగా కారు నడుపుతున్నాడు. హఠాత్తుగా శమంతకమణి దృష్టి 'ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీ' అన్న బోర్డుమీద పడింది "స్టాప్" అంటూ గట్టిగా అరిచిందామె.

ఆ కేకకు అదిరిపోయి సడెన్ బ్రేక్ వేసేశాడు మారుతీరావ్. వెనకే వస్తున్న ఓ జీపు వాళ్ళ కారుని ఠకీమని కొట్టుకుంది. జీపు డ్రైవర్ మారుతీరావ్ ని నాలుగు తిట్టి వెళ్ళిపోయాడు.

శమంతకమణి ఇదంతా పట్టించుకోకుండా డోర్ తెరుచుకుని కారు దిగి డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీస్ లోకి నడిచింది.

కారుని ఆ ప్రక్కనే పార్క్ చేసి తనూ ఆమె వెనకే వెళ్ళాడు మారుతీరావ్.

ఆమెను చూడగానే కిరాతకరావ్ యధాప్రకారం ఫోన్ చేతిలోకి తీసుకుని హడావుడిగా మాట్లాడడం ప్రారంభించాడు.

"హలో! హోటల్ హెవెన్? ఆ! నేను ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీ చీఫ్ ని మాట్లాడుతున్నాను."

"........"

"ఆ! నమస్కారం. మీ హోటల్లో జరిగిన హత్యకేసులో హంతకుడెవరో కనుక్కున్నారు మా అసిస్టెంట్స్. మీరోసారి మా ఆఫీస్ కొస్తే అన్ని వివరాలూ ఇస్తాను. తరువాత వాడిని పోలీస్ కి అప్పచెప్దాం. ఓ.కే. ఓ.కే." అంటూ ఫోన్ పెట్టేస్తూ శమంతకమణిని అప్పుడే చూచినట్లు చూచి "రండి! కూర్చోండి! ఎవరు మీరు? ఏం కావాలి?" అనడిగాడు టైమ్ చూసుకుంటూ.

″నేను మాజీమంత్రి అప్పల్రాజుగారి మిసెస్ ని. నా పేరు శమంతకమణి! 'టైగర్స్ క్లబ్' ప్రెసిడెంట్ ని″ అంది శమంతకమణి.

కిరాతకరావ్ చేతిలోని ఫోన్ జారిపడిపోయి రెండుముక్కలయింది. వెంటనే తేరుకుని ″యస్! ఏంకావాలి మీకు?″ అనడిగాడు తనలోని కలవరపాటు తెలీనీకుండా.

″ఓ పెద్దసమస్య వచ్చిపడింది″ అంది శమంతకమణి.

″ఏమిటది?″

″మావారు ″ఆత్మకథ″ అనే పేరుతో తన జీవితచరిత్ర రాస్తున్నారు. ఆ పుస్తకంలో తనకు పరిచయమున్న అనేకమంది రాజకీయనాయకుల గురించి ఉన్నదున్నట్లు రాసేస్తున్నారు″

″యస్_తరువాత?″

″ఫోటోలు, ఉత్తరాలు, డైరీలు లాంటివి కూడా రుజువులుగా పబ్లిష్ చేస్తున్నారు″

ఆమె మాటలు పూర్తికాకుండా కిరాతకరావ్ మాట్లాడాడు.

″ఇప్పుడు వాటన్నిటినీ కొంతమంది రాజకీయనాయకులు తమ రహస్యాలు బయటపడతాయన్న ఉద్దేశ్యంతో దొంగిలించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అవునా?″

శమంతకమణి ఆశ్చర్యపోయింది. మారుతీరావు నోరు తెరచుకుని ఉండిపోయాడు.

″మీకెలా తెలుసీవిషయం?″ అడిగిందామె.

″ఈ వృత్తిలో మాకున్న ఎక్స్ పీరియెన్స్ వల్ల మేడమ్!″

ఆమెకు అతనిమీద విపరీతమైన గౌరవం కలిగింది.

″ఇప్పటికే ఓ వ్యక్తి మరోవ్యక్తి పేరుతో మా ఇంట్లోకి ప్రవేశించాడు. బహుశా అతను అందుకే వచ్చి ఉంటాడని మా అనుమానం″ అందామె.

″తప్పకుండా అందుకే వచ్చి ఉంటాడు! అందులో అనుమానం లేదు″ అన్నాడు కిరాతకరావ్.

″మీరు మీ ఆఫీస్ తరపున డిటెక్టివ్ ని పంపిస్తే ఆ డైరీలు, ఉత్తరాలు, ఫోటోలు అతను జాగ్రత్తగా కనిపెడతాడనీ ఎవరయినా వాటిని దొంగిలించటానికి ప్రయత్నిస్తే పట్టుకుంటాడనీ నమ్మకంతో మీదగ్గర కొచ్చాం″

″అయిదు నిముషాల్లో పట్టేస్తాం!″

″అంత తేలికా?″

″ఇలాంటి కేసులు వందలకొద్ది పట్టుకున్నారు మావాళ్ళు″

″అయితే మంచి సామర్థ్యం ఉన్న వ్యక్తిని చూసి పంపించండి″

″మీ కేస్ బాగా కాంప్లికేటెడ్ గా ఉంది కాబట్టి దీనిని మా అసిస్టెంట్స్ డీల్ చేయడంకంటే నేనే స్వయంగా వస్తే బాగుంటుందని నా ఉద్దేశ్యం″

వెన్నెల వేట పేజి 39

శమంతకమణి ఆనందపడిపోయింది.

"మీరే వస్తే మరీ సంతోషం! మాకు మరింత ధైర్యంగా ఉంటుంది"

"ఇవాళ సాయంత్రానికల్లా చేరుకుంటా మీఇంటికి"

"మీ ఫీజు"

"ప్రస్తుతం వెయ్యిరూపాయలు కట్టండి! మిగతాది పనయిపోయాక"

శమంతకమణి తన బాగ్ లో నుంచి వెయ్యి రూపాయలు తీసి ఇచ్చింది. మారుతీరావుకి పోయిన ధైర్యం తిరిగి వచ్చేసింది.

"సాయంత్రానికి తప్పక వస్తారు కదూ?"

"వచ్చి 'ఆత్మకథ' పబ్లిష్ అయ్యేవరకూ అక్కడే ఉంటాను. అర్థమయిందా?"

"అయింది, థాంక్యూ"

"మెన్షన్ నాట్! దిసీజ్ మైజాబ్"

వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే కిరాతకరావు పెదాలమీద చిరునవ్వు వెలిసింది.

చిన్న చిన్న మోసాలు చేసి జైలుకెళ్ళటం బాగుండలేదని ఒకే పెద్ద మోసం చేసి జీవితాంతం హాయిగా గడిపేందుకు అవసరమయినంత డబ్బు సంపాదించాలని వేసుకున్న ప్లాన్ ఇన్నిరోజుల తరువాత సక్సెస్ అవబోతుంది.

వెయ్యిరూపాయలు జేబులో వేసుకుని తలుపు తాళంవేసి రోడ్డుమీద కొచ్చాడతను. అప్రయత్నంగా అతని నోటివెంబడి 'విజిల్ పాట' వచ్చేసింది. ఆ పాట జైలునుంచి విడుదల అయినప్పుడల్లా పాడేవాడు అదివరకు.

* * * *

ధబేల్ మంటూ గదితలుపులు తెరుచుకునేసరికి ఉలిక్కిపడి మంచం మీదనుంచి లేచి కూర్చున్నాడు కరుణాకర్.

భవానీశంకర్ అతనిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"రా గురూ! రా! ఇంత ఫోర్స్ గా తలుపులు తెరచుకుంటే కొంచెం కంగారుపడ్డాను" అన్నాడతను.

భవానీశంకర్ అతని మంచం దగ్గరకెళ్ళి మంచంమీద కాలుపెట్టి అతని చొక్కా కాలర్ పట్టుకున్నాడు.

"కన్యక సంగతేమిటి?"

"అదా! గట్టిగా నవ్వుతూ అన్నాడతను "కన్యక చాలా అందమైన అమ్మాయి. మద్రాస్ సినిమా ఫీల్డంతా వెతికినా కూడా అంత అందమయిన అమ్మాయి కనిపించదు"

"అదిసరే! కన్యకతో ఏం చెప్పావ్ నువ్వు"

"ఏముంది? పెళ్ళి చేసుకుంటానని చెప్పాను"

భవానీశంకర్ అతనిని బలంగా డొక్కలో తన్నాడు. అమాంతం మంచం మీదనుంచి కిందపడిపోయాడు కరుణాకర్.

"కన్యక కావాల్సివచ్చిందా నీకు! రాస్కెల్! కరుణాకర్ పేరుతో మోసం చేస్తుంది చాలక పెళ్ళికూడా కావాలా?"

కరుణాకర్ బట్టలు దులుపుకుంటూ లేచినిలబడ్డాడు.

″అది నాయిష్టం! నువ్వెవరు కాదనడానికి?″ పిడికిళ్ళు బిగిస్తూ అడిగాడు.

″ఎవర్నో తర్వాత చెప్తాను. వెంటనే కన్యకతో పెళ్ళి ప్రపోజల్ రద్దు చేయకపోయావో నీ రహస్యం కాస్తా బయటపెడతాను″

″నాతోపాటు నీ రహస్యమూ బయటపడుతుంది″

″ఫర్వాలేదు! కళ్ళెదురుగా ఓ అమాయకురాలికి మోసం జరుగుతూంటే చూస్తూ ఊరుకోవడం కన్నా అదే మేలు″

″సరే. అయితే ఇప్పుడే నీ విషయం శమంతకమణిగారితో చెప్పేస్తాను″

భవానీశంకర్ బయటకు వెళ్ళబోయాడు.

″ఆమె నీ మాటలు నమ్మదు″ నవ్వుతూ అన్నాడు కరుణాకర్.

″ఎందుకని?″

″నువ్వు దీప్ చంద్ వేషంలో ఉన్న గజదొంగవని ఆమెకు ముందే చెప్పేశాను″

భవానీశంకర్ కి కోపం ఆగలేదు. పిడికిళ్ళు బిగించి అతని దగ్గరగా అడుగులు వేయసాగాడు. కరుణాకర్ వెనక్కు నడుస్తున్నాడు నెమ్మదిగా.

భవానీశంకర్ కి మరో పిడిగుద్దు వేయబోయేసరికి ఠక్కున గది తలుపులు తెరచుకున్నయ్ మళ్ళీ. మనోచిత్ర గడపలో నిలబడింది.

ఆమెను చూడగానే ఇద్దరూ కొట్టుకోబోతున్న వారల్లా చేతులు కలిపి కరచాలనం చేసుకున్నారు.

″ఎంత కాలానికి కలుసుకున్నాంరా! చాలా సంతోషంగా వుంది మనమిక్కడ

కలుసుకోవటం" అన్నాడు కరుణాకర్.

"అవును" అన్నాడు భవానీశంకర్.

"దీప్ చంద్ గారూ! ఓ నవల రాయటం మొదలుపెట్టేశాను. ఇప్పటికిప్పుడే యాభై పేజీలు రాశాను. ఓసారి చదివి ఎలా ఉందో చెప్పరూ?" అడిగింది మనోచిత్ర.

"డెఫినెట్ లీ డియర్! సాయంత్రం అయిదుగంటలకల్లా స్క్రిప్టు తీసుకొచ్చేసెయ్. గార్డెన్ లో కూర్చుని రీడింగ్ ఇద్దాంగాని"

"థాంక్యూ" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

"నీకిదే లాస్ట్ వార్నింగ్! కన్యకతో మళ్ళీ పెళ్ళి గిళ్ళి అన్నావో నువ్వు మసి అయిపోతావు జాగ్రత్త" అనేసి తన రూమ్ కి నడిచాడు భవానీశంకర్.

వర్ధనరావ్ సిగరెట్ తాగుతూ కూర్చుని ఉన్నాడక్కడ.

"గురూజీ! ఈ విషయం తెలుసా మీకు?"

"ఏమిటా విషయం బ్రదర్?"

"బావగారు రాస్తున్న బుక్ తాలూకూ మెటీరియల్ కాజేయటానికి ఎవరెవరో రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారట."

"సహజం బ్రదర్! చాలా సహజ గుణం అది!"

"కానీ వాటికి వాళ్ళు ఎత్తుకుపోతే మన సంగతేమిటి?"

"తొందరపడకు నాయనా! స్లో అండ్ స్టడీ విన్స్ ది రేస్."

"ఇంకో విషయం కూడా మీకు చెప్పాలి గురూజీ..."

"ఏమిటది?"

"అక్కయ్యవాళ్ళ 'టైగర్స్ క్లబ్' కాకినాడలో కొత్తగా ప్రారంభించిన శ్యామలారాణి అనే ఆవిడ వచ్చింది చూడండి!"

"యస్! నా నవలలంటే చాలా ఇష్టం ఆమెకి..."

"ఆమె కూడా కేవలం ఆ డైరీ వగైరాలు దొంగిలించటానికి వచ్చిందేమోనని అనుమానంగా ఉంది నాకు..."

"ఎందుకని?"

"నిన్న నేను నా గాళ్ ఫ్రెండ్ ని కలుసుకోటానికి ఊళ్ళోకి వెళ్ళినప్పుడు శ్యామలారాణిగారు అక్కడో హోటల్ నుంచి ఫోన్ చేస్తూ కనిపించింది..."

"ఫోన్లు చేసినంత మాత్రాన దొంగలనుకోవడం అంత ఆరోగ్యకరమయిన విషయం కాదు బ్రదర్..."

"కానీ ఫోన్ చేయాలనుకున్నప్పుడు మన ఆంధ్రప్రదేశ్ హౌస్ నుంచే చేయవచ్చుకదా!"

"ఏదయినా అర్జంట్ గా గుర్తుకొచ్చి ఫోన్ చేయవచ్చు కదా..."

"కాదు గురూజీ! ఆమె ట్రంక్ కాల్ చేసింది నెల్లూరుకి! ట్రంక్ కాల్ చేయదల్చుకున్నప్పుడు మనింట్లో నుంచే చేయవచ్చు కదా."

"అఫ్ కోర్స్! నీ ఆర్గుమెంట్ లో ఓ పాయింట్ ఉంది. కానీ... ఆడాళ్ళు ఇలా

దొంగతనానికి వచ్చారంటే..."

"అయ్యో నీకు తెలీదు గురూజీ_ ఈరోజుల్లో కొంపలు మునిగే పనులన్నీ ఆడాళ్ళే చేస్తున్నారు..."

"సరే! అయితే ఆమెమీద కూడా ఓ కన్నేసి ఉంచు! అన్నట్లు ఊళ్ళో నీకో గాళ్ ఫ్రెండ్ ఉందన్నావ్ కదూ? గిరీషో, శిరీషో."

"అవును గురూ! ఎందుకు?"

"సాయంత్రం ఆ అమ్మాయ్ తో ఓ ఫోన్ చేయించాలి."

"ఎక్కడికి?"

"మన ఆంధ్రప్రదేశ్ హౌస్ కి!"

"ఎందుకు?"

వెన్నెల వేట పేజి 40

భవానీశంకర్ వివరాలు చెప్పసాగాడు ఉత్సాహంగా.

* * * *

సరిగ్గా అదే సమయంలో ఆ ఇంట్లో ఉన్న అతిథులందరి గురించీ_కిరాతకరావ్ కి వివరాలందిస్తున్నాడు మారుతీరావ్.

"రచయిత దీప్ చంద్ గది ఆ మూల ఉంది!" అన్నాడు మారుతీరావ్.

ఆమాట వినగానే స్పృహతప్పినంత పనయింది కిరాతకరావ్ కి.

"ర...ర...రచయిత దీప్ చంద్ ఇక్కడ ఉన్నాడా?"

"అవును!"

"కానీ అతను ఆత్మకథ రాసే కాంట్రాక్ట్ రద్దుచేసుకున్నాడని..."

"అలా అని ఉత్తరం రాశాడుగానీ_మళ్ళీ మనసు మార్చుకుని వచ్చాడట..."

"ఐసీ!"

"అయితే అతను ఒరిజినల్ రచయిత దీప్ చంద్ కాదని నా ఉద్దేశ్యం." ఆ మాటతో కిరాతరావ్ ఉలిక్కిపడ్డాడు.

"అలాగా!"

"అవును! ముందు నాకే అనుమానం కలిగింది. తరువాత సినిమా డైరెక్టర్ కరుణాకర్ వల్ల అతను డూప్లికేట్ అని తెలిసిపోయింది."

"వెరీ డేంజరస్ ఫెలో అన్నమాట!"

"అసలు ఆత్మకథ తాలూకూ ఋజువులు దొంగిలించటానికే వాడు వచ్చాడేమోనని మా అందరి అనుమానం."

"వాడి పని నేను పడతాను!"

"రెడ్ హాండెడ్ గా పట్టి పోలీసుల కప్పగిస్తే బాగుటుందని మా అందరి అభిప్రాయం."

"అదంతా నాకొదిలేసేయండి."

మారుతీరావ్ సంతృప్తి పడ్డాడు.

″అయితే నేను డిటెక్టివ్ నన్న సంగతి ఎవరికీ తెలియనీయవద్దు.″

″లేదండీ! మీరు 'ఆత్మకథ' పుస్తకం పబ్లిష్ చేయాలనుకుంటున్న పబ్లిషర్ అని అందరికీ చెప్తున్నాం.″

″వెరీగుడ్! చాల తెలివిగల పనిచేశారు.″

ఇద్దరూ మళ్ళీ ముందుకి నడిచారు.

″ఇది కన్యకగారి గదండీ!″

″ఐసీ...″

″ఇటుపక్కది సినిమా డైరెక్టర్ కరుణాకర్ గారి గది.″

″ఓకే!″

″దాని పక్కగది శ్యామలారాణిగారిది.″

″శ్యామలారాణి గారంటే...″

″టైగర్స్ క్లబ్_కాకినాడ బ్రాంచి ప్రెసిడెంటండీ_ 'టైగర్స్ క్లబ్ మీటింగ్ కోసం వచ్చారు.″

ఇద్దరూ మేడ దిగి కిందికి వెళ్ళారు.

″ఇది వర్ధనరావ్ గారి గది. ఆ పక్కది మనోచిత్రగారి గది. అవతలిది శమంతకమణిగారి గది. ఈ పక్క మూడు గదులూ అప్పల్రాజుగారివి. ఆయన గది...లైబ్రరీ...ఇనుపపెట్టె ఉండేగది...″

″అంటే ఇప్పుడు ఆత్మకథ తాలూకూ రహస్యాలన్నీ ఆ ఇనుప పెట్టె

ఉండేగదిలో ఉంటాయన్నమాట!" అనుమానంగా అడిగాడు.

"ఆ విషయం ఎవరికీ తెలీదండీ! శమంతకమణిగారే ఈ మధ్య వాటిని కస్టడీలోకి తీసుకున్నారు."

"ఐసీ_కానీ వాటి గురించి ఖచ్చితంగా తెలిస్తేగానీ_నేను జాగ్రత్తగా కనిపెట్టి ఉండటం కుదరదుకదా"

"కుదరదండి!"

"సరే. శమంతకమణిగారినే అడిగి తెలుసుకుంటాను."

"అదే మంచిదండి"

కిరాతకరావ్ వడివడిగా శమంతకమణి గదివేపు నడిచాడు.

శమంతకమణి, శ్యామలారాణి కూర్చుని 'టైగర్స్ క్లబ్' మీటింగ్ కి ఏర్పాటు చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకుంటున్నారు.

"ముందు వందేమాతరం, తరువాత ఆహ్వానపత్రం, టైగర్స్ క్లబ్ సెక్రటరీ రాజేశ్వరీదేవి చదువుతుంది. ఆ తరువాత ఈ సంవత్సరంలో క్లబ్ నిర్వహించిన కార్యక్రమాల గురించి నివేదిక. అప్పుడు ప్రెసిడెంట్ స్పీచ్." అంటూండగానే కిరాతకరావ్ "మే అయ్ కమిన్" అంటూ గదిలోకి అడుగుపెట్టాడు.

"ఆత్మకథ పబ్లికేషన్ గురించి మీతో రెండుముక్కలు మాట్లాడాలి మేడమ్" అన్నాడతను చిరునవ్వుతో.

శమంతకమణి శ్యామలారాణి వేపు చూసి "ఒక్క నిమిషం" అంటూ బయటకు నడిచింది.

″అసలు విషయం ఏమిటంటే ఆ డైరీ, ఉత్తరాలు, ఫోటోలు ఎక్కడ దాచారు, ఎలా దాచారు. అనే విషయం నాకు చెప్తే, నేను జాగ్రత్తగా కనిపెట్టడానికి అవకాశం ఉంటుంది″ అన్నాడు కిరాతకరావ్.

శమంతకమణి ఓ క్షణం తటపటాయించింది.

″డిటెక్టివ్ ల దగ్గర మీరేమీ దాచనక్కర్లేదు! మీ రహస్యాలన్నీ మా రహస్యాలుగా భావిస్తాము.″

″అవన్నీ స్ట్రాంగ్ రూమ్ లో ఐరన్ ఓల్ట్ లో ఉన్నాయ్...″

″దాని తాళంచేతులు జాగ్రత్తగా దాచారా?″

″నాదగ్గరే ఉంటాయ్ అవి.″

″ఒకవేళ ఎవరి చేతిలోనయినా పడితే!″

″అవి ఎవరికీ ఇవ్వను!″

″ఐసీ_ఏర్పాటు బాగానే ఉంది. అయితే వాటికి కాపలాగా నేనే ఉంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం″

″అక్కర్లేదు″ ఖచ్చితంగా చెప్పేసిందామె. ″నేనయితే వాటిని జాగ్రత్తగా కాపాడగలనని అప్పల్రాజుగారు కూడా చెప్పారు.″

″ఓ కే. దట్సాల్ రైట్! నేనేమూల ఉన్నా వాటిని జాగ్రత్తగా చూస్తూండగలను.″

″మీకే గది కావాలో చెప్తే_ అది ఇస్తాను.

″ఏదయినా ఫర్లేదు! మీకే మాత్రం అనుమానం కలిగినా ఏమి అవసరం

వచ్చినా నేను మీకు అందుబాటులో ఉండటం అవసరం."

"అవును! ఆ మాట నిజమే! నా పక్కగదే బెటర్! ఇప్పుడే మీ లగేజ్ అందులో పెట్టించమని మారుతీరావ్ కి చెప్తాను."

"థాంక్యూ మేడమ్. మీరిక నిశ్చింతగా ఉండండి."

శమంతకమణి అతనివేపు సంతృప్తిగా చూసింది.

* * * *

కరుణాకర్ మనసు అంతగా బావుండలేదు. అయితే మనసు బాగోకపోయినంత మాత్రాన తన నిర్ణయాలను మార్చుకునే వ్యక్తి కాదతను. అంచేత భవానీశంకర్ బెదిరింపు మనసులో మెదులుతున్నా_దానిని లెక్కచేయకుండా సాయంత్రం కన్యకతో కలసి ఉద్యానవనంలో విహరించడానికి బయలుదేరాడతను. ఇద్దరూ పూలమొక్కల మధ్యనుంచి నడుస్తున్నారు.

"నేను చెప్పిన విషయం గురించి మీరేం నిర్ణయం తీసుకున్నారో చెప్తారా మిస్ కన్యకా?" అడిగాడు కరుణాకర్.

కన్యకకేం చెప్పాలో తెలీలేదు. నిజానికి అసలామె ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

"నేను ఎల్లుండే మద్రాస్ వెళ్ళిపోవాలనుకుంటున్నాను కన్యకగారు! ఆ తరువాత మళ్ళీ మీరెక్కడో, నేనెక్కడో! అందుకని ఈలోగానే మనం ఓ నిర్ణయానికొస్తే_నేను ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది."

కన్యక నిశ్శబ్దంగా వింటూందతని మాటలు.

ఇద్దరూ సిమెంటు బెంచీమీద కూర్చున్నారు. దూరంగా చెరువులో బోటుమీద

మనోచిత్ర షికార్లు చేస్తోంది. భవానీశంకర్ చెరువు ఒడ్డునే ఆమె బోటుతోపాటు నడుస్తూ_ నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

ఆ దృశ్యం చూసేసరికి కన్యక మనసులో ఓ విధమయిన... అశాంతి ప్రారంభమయింది. అయితే అంతలోనే మనసుని దిటవు పర్చుకోగలిగింది.

కరుణాకర్ ఆమె మౌనం నిరుత్సాహం కలిగిస్తోంది.

మరో నాలుగు రోజుల్లో టైగర్స్ క్లబ్ మీటింగ్! భవనానికి వెనుక వేపున పెద్దపెద్ద షామియానాలు రడీ అయిపోయాయ్. రాత్రి పన్నెండు గంటల వరకూ రకరకాలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసింది శమంతకమణి. ఆరోజే తను తన కార్యక్రమం నిర్వహించదల్చుకున్నాడు. అందరూ గాఢనిద్రలో ఉండగా స్ట్రాంగ్ రూమ్ లో జొరబడి ఐరన్ ఓల్ట్ తెరచి ఆత్మకథ తాలూకూ రుజువు లన్నింటినీ ఎత్తుకుపోతాడు.

వెన్నెల వేట పేజి 41

అంతే! తను లక్షాధికారి! అంత డబ్బు సంపాదించాక ఇంక తనకు కావల్సిందింకేం ఉంది? ఒకే ఒక్క కన్యక! అంతే! ఇంత అందమైన అమ్మాయి 'ఓ.కే.' అంటే చాలు! తన జీవితం ధన్యమయిపోతుంది. ఆమెను పెళ్ళి చేసుకుని హాయిగా జీవితం గడిపేస్తాడు. అంతకు ముందు తను గడిపిన దొంగ జీవితానికి స్వస్తి చెప్తాడు.

"కన్యకా!" ధైర్యం చేసి ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు కరుణాకర్.

సరిగ్గా అదే సమయంలో హడావుడిగా వచ్చి వారి వెనుకే నిలబడ్డాడు మారుతీరావు.

"సార్__"

కరుణాకర్ గాబరాగా కన్యక చేతిని వదిలేశాడు. ఇంతమంచి సమయంలో ఆ మారుతీరావు అలా వచ్చి "సార్" అంటూ అరచి చక్కని అవకాశాన్ని సర్వనాశనం చేయడం అతనికి విపరీతమైన కోపం కలిగించింది.

"ఏమిటి?" అన్నాడు కోపం అణచేసుకుంటూ.

"మద్రాస్ నుంచి ట్రంక్ కాల్ సార్."

కరుణాకర్ మరోసారి గాబరాపడ్డాడు.

"మద్రాస్ నుంచా?"

"అవున్సార్_"

"ఎవరు చేశారు?"

"మీ రెండో భార్యగారయిన పాలిస్టర్ పార్వతిగారంటండీ"

కరుణాకర్ మొఖం పాలిపోయింది. కన్యక మొఖంలోకి ఆశ్చర్యం, కోపం రెండూ తరుముకొచ్చినయ్.

"నీకేం మతిపోలేదు గదా! నా రెండో భార్యేమిటి?" కోపంగా అన్నాడు కరుణాకర్ ఆ షాక్ నుంచి చప్పున కోలుకుని.

"మీ రెండో భార్యగారేనండి! పాలిస్టర్ పార్వతి_ స్పష్టంగా_ చెప్పారు ఫోన్ లో" వినయంగా చెప్పాడు మారుతీరావు.

కన్యక షాక్ తిన్నట్లు లేచి నిలబడింది.

కరుణాకర్ ని చూడాలన్నా కూడా అసహ్యం కలుగుతోంది. మగాళ్ళంతా రాక్షసులు, మోసగాళ్ళు అన్న తన అభిప్రాయం మరోసారి రుజువయిపోయింది.

"షటప్!" గట్టిగా అరచాడు కరుణాకర్. "నా కసలు పెళ్ళే కాలేదు. రెండో భార్యేమిటి?"

మారుతీరావ్ కి మెదడంతా వేడెక్కిపోయింది. తను ఫోన్ లో స్పష్టంగా విన్నాడు ఆ అమ్మాయి చెప్పిన విషయాలు.

"ఆమెగారలాగే చెప్పారు సార్! కావాలంటే మీరేవచ్చి మాట్లాడండి" కరుణాకర్ ఛప్పున కన్యకవేపు తిరిగాడు.

"దిసీజ్ ఇంపాజిబుల్ మిస్ కన్యకా! ఈ మారుతీరావ్ కి చెముడనుకుంటాను. అందుకే అలా ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు."

"అదంతా నా కనవసరం"అంది కన్యక సీరియస్ గా.

"కన్యకా! ప్లీజ్ నా మాట విను! నాకు పెళ్ళే కాలేదసలు."

"దయచేసి ఇక్కడినుంచి వెళ్ళిపోండి. మీ మొఖం చూడటానికి కూడా నాకు అసహ్యంగా ఉంది"

"మిస్ కన్యకా_ నేను నిజం చెప్తున్నాను."

"అయ్ సే షటప్" గట్టిగా అరచి తనే అక్కడినుంచి చెరువువేపు వడివడిగా నడవసాగిందామె.

కరుణాకర్ కి కోపం ఆగలేదు.

"బ్లడీ ఫూల్! నీ పని తర్వాత చెప్తా" మారుతీరావ్ ని చూస్తూ అని భవనంవేపు త్వరత్వరగా నడిచి ఫోన్ అందుకున్నాడు.

"హలో" అన్నాడు కోపంగా.

"హలో" అంది అవతలి అమ్మాయి గొంతు.

"ఎవరు మాట్లాడుతోంది?"

"నీ రెండో భార్యను."

"నీ వేషాలు నా దగ్గర కాదు. నిజం చెప్పు! ఎవర్నువ్వు?"

"పాలిస్టర్ పార్వతిని."

"పాలిస్టర్ పార్వతేమిటి?"

"పాలిస్టర్ పార్వతంటే తెలీదా? అదీ ఓ పేరు. సిల్క్ స్మిత, నైలాక్స్ నళినిలాగా నా పేరు పాలిస్టర్ పార్వతి.

"మర్యాదగా నువ్వెవరివో చెప్తావా లేదా?"

"ఏడ్చావ్ లే ఫోన్ పెట్టేయఓయ్_420"

"ఎవర్నువ్వు"

"అహ్హహ్హ."

"ఫోన్ డిస్కనెక్ట్ అయింది. కరుణాకర్ భయంతో బిగుసుకుపోయాడు. ఆ అమ్మాయి ఎవరో తెలీదుగానీ తన విషయం తెలిసే అలా తనను ఫూల్ ని చేసింది. చాలాసేపటి వరకూ ఫోన్ చేతిలో పట్టుకునే శిలా విగ్రహంలా

నిలబడిపోయాడతను.

* * * *

"హలో కన్యకాజీ! అందాలు చిందాల్సిన మీ మొఖారవిందం_అలా చిన్నబోయి ఉండటానికి గల కారణం ఏమిటో తెలుసా?" ఆమె దగ్గరకొచ్చి అడిగాడు భవానీశంకర్.

కన్యక నిర్లిప్తంగా చూసిందతనివేపు. అతనితో కాసేపు మాట్లాడుతూ చక్కలిగిలి పెట్టగల అతని మాటలు వింటూ_ కొద్దిసేపు గడపాలనిపిస్తోందామెకి. అతని సాన్నిధ్యంలో అయితేనే, ఆ కరుణాకర్ తనకు చేయబోయిన మోసాన్ని మర్చిపోగలుగుతుంది. భవానీశంకర్ కీ కరుణాకర్ కీ ఎంత తేడా?

భవానీశంకర్ విజ్జీ నిర్లక్ష్య ప్రవర్తన భరించలేక ఆమెకు దూరమయి తనకు దగ్గరవ్వాలనుకున్నాడు.

కానీ కరుణాకర్ గాడు ఇద్దరు భార్యలుండగానే తనను మోసంచేయాలనుకున్నాడు.

"చెప్పండి కన్యకా! ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? ఇంటిమీద గాలి తిరిగిందా? అమ్మా నాన్నలను చూడాలని ఉందా?"

"కాదు."

"మీ పెంపుడు కుక్కగానీ, పిల్లిగానీ కలలో కొచ్చిందా?"

తల అడ్డంగా వూపిందామె.

"అదీకాదా? అయితే ఇంకేమయి వుంటుంది? ఆ! గుర్తుకొచ్చింది. నెలరోజుల

తర్వాత మనిద్దరం విడిపోవాల్సి వస్తుందని బాధపడుతున్నారు కదూ!"

"అదేంకాదు."

మనోచిత్ర పరుగుతో వచ్చిందక్కడికి.

"అయ్యో! మీరిక్కడున్నారా? మీ కోసం గార్డెన్ అంతా వెతుకుతున్నాను" అందామె భవానీశంకర్ తో.

"కన్యకోపాసన చేస్తున్నాను మైడియర్ మనోచిత్రా!"

"మరి నేను రాసినంతవరకూ నవల చదివేదా?"

"తక్షణమే ప్రారంభించు డియర్!"

"రండి ఆ బెంచీమీద కూర్చుందాం."

"మిస్ కన్యక మన నవలా పఠన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంటారు" చిరునవ్వుతో అన్నాడు భవానీశంకర్.

"మధ్యన నేనెందుకు?" చటుక్కున అనేసి నాలిక్కరచుకుందామె. మనోచిత్ర అతనితో అంత చనువుగా ఉండటం తనకు నచ్చలేదు. కానీ ఆ విషయం అలా బయటపడేలా ప్రవర్తించటం సిగ్గు కలిగించింది.

"నాక్కొంచెం పని వుంది" అనేసి అక్కడినుంచి వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయింది.

భవానీశంకర్ ఆమె ప్రవర్తన గమనించి తనలో తనే నవ్వుకున్నాడు. కన్యక మనసు మరింతగా తనవేపు తిప్పేయాలంటే మనోచిత్రను ఆయుధంగా

వాడుకోక తప్పదు.

"జెలసీ! దై నేమ్ ఈజ్ గాడ్" అనుకున్నాడతను ఆనందంగా.

రెండు పేజీల కథ చదివింది మనోచిత్ర.

"ఇంక చాలు మనోచిత్రాజీ! వండర్ ఫుల్ నేరేషన్. నవలంతా చదవక్కర్లేదు డియర్! రెండు లైన్లు చూస్తేచాలు. మీలో రచనాశక్తి ఉందో లేదో తెలిసిపోతుంది."

"అంటే నేను రచయిత్రి నవుతానంటారా?"

వెన్నెల వేట పేజి 42

"అంటారా ఏమిటి డియర్! తెలుగు సాహితీ లోకాన్ని యదేచ్ఛగా ఏలేస్తారు. ఈ నవల పబ్లిషవటం ప్రారంభించిన రెండో వారం నుంచీ మీ ఇంటిముందు పబ్లిషర్లూ, సినిమా ప్రొడ్యూసర్లూ, తెల్ల కాగితాల వ్యాపారస్తులూ 'క్యూ' కట్టడం ఖాయం."

కొద్దిక్షనాలు ఊహాలోకంలో తేలిపోయింది మనోచిత్ర.

"దీప్ చంద్! మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలీటంలేదు నాకు."

"అందుకు ఒకే ఒక్క మార్గముంది డియర్!"

"ఏమిటది?" ఆత్రుతగా అడిగిందామె.

"నీ అందాల పెదవులతో ఒక్కసారి నన్ను ముద్దుపెట్టుకోవటమే." ఆమె సిగ్గుపడింది.

"మీరు అడగాలేగానీ నా సర్వస్వం అర్పిస్తాను."

భవానీశంకర్ కంగారుపడ్డాడు.

"అయ్యయ్యో వద్దు మైడియర్ ఫ్రెండ్! 'సర్వం' అలా రిజర్వ్ లోనే వుండనీయండి. నాక్కావలసింది ఒకే ఒక ముద్దు. అదీ మీరు పెట్టుకోవటం."

"ఒక్కటేమిటి దీప్! వంద ముద్దులు పెట్టుకుంటాను."

"అయ్యో! ఆ మాట అనకు డియర్! గురుదక్షిణగా ఒక్క ముద్దు యిస్తే చాలు."

"సరే" అతనిమీదకు వంగబోయిందామె.

"నో...నో...నాట్ నౌ డియర్!" ఎప్పుడో ముద్దు కావాలనిపించినప్పుడు నేనే అడుగుతాను.

"ఓ!" నిరుత్సాహంగా అందామె.

"ఇంక వెళ్దామా డియర్!" లేచి నిలబడ్డాడు భవానీశంకర్.

ఇద్దరూ ఇంటివేపు బయల్దేరారు. మనోచిత్ర మనసంతా పరవశంతో నిండిపోయింది. హుషారుగా కబుర్లు చెప్పసాగింది.

* * * *

ఆ రాత్రి భోజనాలయ్యాక వర్ధనరావు భవానీశంకర్ గదిలోకొచ్చాడు.

"మన ప్లాన్ సక్సెస్ అయిందా గురూజీ" అడిగాడతను ఆత్రుతగా.

"సక్సెసేమిటి? కరుణాకర్ గాడికి కన్యక దగ్గర డిపాజిట్ గల్లంతయిపోయింది. మీ శిరీషకు నా ధన్యవాదాలు తెలియజేయ్ బ్రదర్. పాలిస్టర్ పార్వతిగా తన టెలిఫోన్ పాత్రలో జీవించిందామె."

ఇద్దరూ ఆనందంగా కరచాలనం చేసుకున్నారు.

* * * *

కిరతకరావ్ ఉదయం అయిదుగంటలకే లేచి వాకింగ్ చేయటం జైల్లో ఉన్నప్పుడు అలవాటయింది. అలవాటు ప్రకారం లేచి గార్డెన్ లో వాకింగ్ కి బయల్దేరాడతను.అంత అందమయిన భవనంలోనూ, ఉద్యానవనాల్లోనూ గడపడం అతనికిదే మొదటిసారి.

అసలు జీవితమంతా ఎలాంటి మోసాలు చేయకుండా పెద్దమనిషిలా గడపాలనే ఉంటుంది తనకు. ఎవరినీ 'బ్లాక్ మెయిల్ చేయకుండానే జీవితం గడపాలని కోరుకుంటాడు. కానీ డబ్బు అవసరం అవటంతో మళ్ళీ ఎవరో ఒకరిని బ్లాక్ మెయిల్ చేయడం. వాళ్ళు భరించినంత కాలం భరించి చివరకు పోలీస్ రిపోర్టివ్వడం, తను జైలుకెళ్ళటం జరిగిపోతూంటుంది. ఈ గాడినుంచి తప్పించుకోవాలనే "ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీ" అన్న బోర్డు పెట్టాడు.

తన కల ఫలించి ఇన్నాళ్ళకు ఈ అవకాశం దొరికింది. ఆత్మకథ తాలూకు రుజువులు తన చేతిలో పడితేచాలు. జీవితాంతం కాలుమీద కాలేసుకుని తిరగవచ్చు.

"కిరాతకరావ్!"

కిరాతకరావ్ పధ్నాలు గంగుళాలు గాలిలోకి ఎగిరి మళ్ళీ నేల చేరుకున్నాడు, వళ్ళంతా భయంతో గగుర్పొడిచింది.

తన ఒరిజినల్ పేరు ఎవరికి తెలిసింది? వెనక్కు తిరిగి చూశాడతను. శ్యామలారాణి చిరునవ్వుతో అతనిని చేరుకుంది. ఆమెను చూస్తూనే అతని పై

ప్రాణాలు పైనే పోయినయ్.

"నువ్వా?" అన్నాడు షాక్ నుంచి తేరుకుని.

"ఏం? భయమేస్తుందా?"

"అహహ...భయమనికాదు. నా పాత పేరుపెట్టి పిలిచేవారెవరా అని. ఇంతకూ నువ్విక్కడే వున్నావేమిటి రత్నా?"

"నన్ను రత్నా అని పిలవకు. ఇప్పుడు నా పేరు శ్యామలారాణి. డిటెక్టివ్ వేషంతో నువ్వెలా వచ్చావో, శ్యామలారాణి టైగర్స్ క్లబ్ ప్రెసిడెంట్, కాకినాడ బ్రాంచి పేరుతో నేనూ వచ్చాను" అందామె నవ్వుతూ.

కిరాతకరావ్ కి సగం ధైర్యం చేకూరింది.

"అయితే నువ్వూ నీ కార్యక్రమాలు మానలేదన్నమాట."

"నాలుగు కాలాలపాటు సరిపోయేంత డబ్బు దొరికితే కదా మానటానికి."

"ఆ మాట నిజమే అనుకో" ఒప్పుకున్నాడు కిరాతకరావ్.

"నిన్నే నీ గురించి విన్నాను. ఇవాళ ఉదయం నిన్ను చూశాక ఓసారి పలుకరిస్తే బావుంటుందనిపించింది."

"నగల వర్తకుడు చమన్ లాల్ ఇంట్లో పనిమనిషిగా చేరి రెండు మూడు లక్షల విలువచేసే నగలు పట్టుకుపోయావ్ కదా! మళ్ళీ మారు వేషాలేమిటి అప్పుడే?"

శ్యామలారాణి ముఖం చిన్నబోయింది.

"ఆ ఇన్స్ పెక్టర్ ప్రేమ్ కుమార్ గాడు వెంటనే మా ఇల్లు రైడ్ చేసి నగలు వెతికి

పట్టుకుని నన్ను ఆరునెలలు జైల్లోకి తోశాడుగా."

"వాడితో నిజంగానే చాలా చికాకుగా వుంది. నన్నూ ప్రతి విషయానికి స్టేషన్ కి పిలిపించి లక్ష ప్రశ్నలేసి చంపుతుంటాడు."

"ఏదేమయినా మనిద్దరం కలిసి చిన్నారావు గారింట్లో చేసిన మోసం మాత్రం భలే గొప్పగా చేశాం."

"అవును. మనిద్దరినీ నిజంగానే భార్యాభర్తలనుకున్నాడు పిచ్చి వెధవ" నవ్వుతూ అంది శ్యామలారాణి.

"నిజంగా భార్యాభర్తల్లాగానే సంసారం చేశాంగా ఆ వారం రోజులూ" అన్నాడతను. శ్యామలారాణి కొంచెం సిగ్గుపడింది.

"అవును" అంది నవ్వుతూ.

"ఆఖర్లో నువ్వు నన్ను కూడా మోసంచేసి డబ్బంతా కాజేసి పారిపోకుండా ఉన్నట్లయితే ఇప్పటికీ భార్యాభర్తలుగానే ఉండేవాళ్ళం."

"జరిగిందెందుకిప్పుడు?" అంది శ్యామలారాణి.

"పోనీ అ సూరిగాడితోనయినా సంసారం చేస్తున్నావా ఇప్పుడు?"

"వాడెక్కడికి పోతాడు? నేను తరిమికొట్టినా వదలటంలేదు నన్ను"

"అవును మరి! బంగారు పిచ్చుకను ఎవరు వదులుకుంటారు?"

ఇద్దరూ కొద్దిక్షణాలు పాతస్మృతుల్లో విహరించారు.

"అన్నట్లు ఇక్కడికెందుకొచ్చావిప్పుడు?" అడిగింది శ్యామలారాణి.

అనుమానంగా కిరాతకరావు ఓ క్షణం ఆలోచించాడు. తను ఆమెకు నిజం చెప్పటం చాలా ప్రమాదకరమయిన విషయం. అదివరలో అలా నిజాలు ఆమెకు చెప్పి చాలాసార్లు దెబ్బతిన్నాడు.

"శమంతకమణిగారి టైగర్స్ క్లబ్ మీటింగ్ కి చాలామంది లేడీస్ చాలా ఊళ్ళనుంచి వస్తున్నారు కదా! వాళ్ళందరికీ మెడలో నగలుంటాయ్ కనుక ఆ రాత్రి దొంగలూ, వగయిరాలు రాకుండా చూడ్డానికని నన్ను పిలిపించింది"

"హరికథ చెప్తున్నావా?" హేళనగా అంది శ్యామలారాణి.

"ఛ! నిజంగానే చెప్తున్నాను"

"నీ వేషాలు మన దగ్గరకాదు కిరాతకరావు! అప్పల్రాజు రాస్తున్న ఆత్మకథ తాలూకూ రుజువులు కాజేయటానికి చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి అందరిమీద నిఘావేసి ఉంచడానికి నిన్ను శమంతకమణి పిలిపించింది. అవునా!"

"అబ్బే కాదు"

"వెధవ్వేషాలు నాదగ్గర కాదని ఓసారి చెప్పాను"

"నిజంగానే కాదు శ్యామలా! నామాట నమ్ము!"

"సరే ఇప్పుడే నీ 'గతం' అంతా శమంతకమణిగారికి చెప్తాను"

కిరాతకరావు గాభరాపడ్డాడు.

"అదేమిటి? ఎందుకలాంటి పనిచేయటం?"

"అయితే త్వరగా నిజం చెప్పు! అయిదు నిమిషాలు టైమిస్తున్నాను నీకు"

కిరాతకరావు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"సరే చెప్పేస్తాను"

వెన్నెల వేట పేజి 43

"గుడ్ బాయ్! నీలాంటి చిన్నపిల్లల మనస్తత్వం గలవారంటే నాకిష్టం"

"నేనూ వాటికోసమే వచ్చాను"

"ఎవరు తీసుకురమ్మన్నారు?"

"ఎవరూ తెమ్మనలేదు"

"అదేమిటి? వాటిని కాజేసుకొస్తే లక్ష ఇస్తాం, రెండు లక్షలిస్తాం అంటూ ఎవరూ రాజకీయనాయకులు రాలేదా?"

"రావటమయితే వచ్చారుగానీ నేనే ఒప్పుకోలేదు"

"ఎందుకని?"

"ఆ వ్యాపారమేదో నేనే చేస్తే ఎక్కువలాభం ఉంటుందనిపించింది"

"నీ తెలివి తగలెయ్య! చాలా తెలివితేటలబ్బాయన్నమాట నీకీ మధ్య?"

"ఎంతకాలం ఇంకా తెలివిలేకుండా ఉండటం?"

"సెభాష్" అందామె మెచ్చుకోలుగా.

"ఇంతకూ నువ్వెందుకొచ్చావు?"

"వాటి కోసమే"

కిరాతకరావు మొఖం పాలిపోయింది. అప్పుడే పోటీ ప్రారంభమయిపోవటం అతనికి శుభసూచకంగా తోచలేదు.

"ఏమిటి నీ నోటిమాట పడిపోయినట్లుంది?"

"అదేంలేదు. నీకెందుకని?"

"మాజీ హోమ్ మినిష్టర్ గారొకాయన పోలీసుల ద్వారా నాక్కబురంపించి ఇలా ఈ వస్తువులు కాజేసుకొస్తే రెండు లక్షలు కాష్ ఇస్తానన్నారు. అంతేకాదు మళ్ళీ జన్మలో పోలీసులు నా జోలికి రాకుండా చూస్తానన్నారు"

"ఓహో చాలా పెద్ద ఆఫర్ అన్నమాట"

"చిన్న చిన్న ఆఫర్లు నేను అసలు ఒప్పుకోవటంలేదు"

"అయితే ఇప్పుడు పెద్ద తంటా వచ్చిపడిందే!"

"అంత డబ్బు ఊరికేరాదు. కొన్ని తంటాలు పడాల్సిందే" నవ్వుతూ అందామె.

"కానీ మనలో మనం పోటీపడడం నాకు నచ్చటం లేదు"

"ఎవరిదమ్ము ఎంతో చూసుకుందాం!" ఛాలెంజ్ చేస్తూ అందామె.

"అహహ అది మంచిపద్ధతి కాదు. ఇద్దరం జైల్లోకెళ్ళాల్సి వస్తుంది అనవసరంగా"

"నేనెందుకు వెళతాను? మాజీ హోమ్ మినిష్టర్ గారే నన్నిక్కడకి పంపించారు కదా!"

"అయినా పోలీసుల సంగతి నీకు తెలీందేముంది?"

"శ్యామలారాణి రాజీకొచ్చింది.

"ఇంతకూ నువ్వనేదేమిటి?"

"ఎలాగూ ఇద్దరం అదేపనిమీద వచ్చాం కాబట్టి ఇద్దరం కలిసి వ్యవహారం చేస్తే ఇద్దరం చెరిసగం పంచుకోవచ్చు"

"అంటే నాకొచ్చే రెండులక్షల్లో ఒక లక్ష నీకా?"

"పోనీ తొంభయ్ ఎనిమిది వేలు ఇవ్వు! అడ్జస్ట్ చేసుకుంటాను"

"అదేం కుదరదు లక్షన్నర నాకు యాభయ్ వేలు నీకు"

"ఇది అన్యాయం"

"సరే అయితే ఎవరిదారి వాళ్ళదే" అక్కడినుంచి వెళ్ళిపోబోయిందామె.

"శ్యామలా! ఆగు"

"ఏమిటి?"

"ఇంకొక్క పదివేలివ్వు పోనీ"

"చస్తే ఇవ్వను"

"నీది రాతి హృదయం"

"డబ్బు విషయంలో"

"సరే ఒప్పుకుంటున్నాను"

శ్యామలారాణి చిరునవ్వు నవ్వింది "అలా దారికిరా"

"అయితే మనిద్దరం కలిసే వాటిని కాజేస్తాం కదూ?"

"అవును! కానీ ఎలా కాజేయాలి అనే ప్లాన్ అంతా నాదే" అందామె నిక్కచ్చిగా.

"సరే అలాగే కానీ"

"ఈ పని టైగర్స్ క్లబ్ వార్షికోత్సవం నాటి రాత్రే జరగాలి. ఆ హడావుడిలో అందరూ వుండగా మనం వాటిని కాజేసి పారిపోవాలి"

"కానీ ఎలా కాజేయటం?"

"ఆ వివరాలు ఆరోజే చెప్తాను" అంది శ్యామలారాణి. ఆమెకు తెలుసు. అన్నీ ఇప్పుడేచెప్తే కిరాతకరావు తనకే టోకరా ఇస్తాడని.

"సరే"

"నేను వెళ్తున్నానిక" వెనక్కు తిరిగి వెళ్ళిపోయిందామె.

* * * *

మారుతీరావు ఆనందంగా అప్పల్రాజు గదిలో కొచ్చాడు. అప్పల్రాజుకి అప్పుడే హఠాత్తుగా పదేళ్ళక్రితం జరిగిన ఓ సంఘటన గుర్తుకొచ్చింది. తను ఫైనాన్స్ మినిష్టరుగా ఉన్నప్పుడు సోషల్ వెల్ఫేర్ మినిష్టరు ఒకామె ఆమె పేరేమిటో గుర్తులేదు. సుమతీబాయ్_సమతారాయ్ కవితా గాయ్_అలాంటి పేరేదో ఉండాలి. ఆమె ఓ అరబ్ దేశం ప్రెసిడెంట్, ఆయన సతీమణి ఇండియా పర్యటన కొచ్చినప్పుడు రెండుకోట్ల రూపాయలు ఖర్చుచేసినట్లు దొంగలెక్కలు రాసేసింది.

అది న్యూస్ పేపర్లవాళ్ళు ఏకేసేసరికి తను తన మనుషులను పంపి వివరాలు సేకరించాడు. ఈ సంఘటన వెంటనే ఆత్మకథలో రాసేయాలి. డైరీలో ఆ అరబ్ దేశం పేరు రాయకపోవటంచేత తను ఆరోజు ఉదయం దీప్ చంద్ కి ఆ సంఘటన గురించి సరిగ్గా చెప్పలేకపోయాడు.

మారుతీరావు అప్పల్రాజు పక్కనే నిలబడి "సార్" అంటూ వినయంగా పిలిచాడు.

"ఊ" అన్నాడు అప్పల్రాజు. ఇంకా ఆ అరబ్ దేశం పేరు గుర్తుకి తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూనే.

"చాలా ముఖ్యమయిన విషయం ఒకటి మీకు చెప్పాలి సార్!"

"ఊ!"

"దీప్ చంద్ అనే రచయిత ఇప్పుడు మన దగ్గరున్నాడు కదండీ!"

"ఆ?"

"ఆయన అసలు దీప్ చంద్ కాదండీ! ఆ పేరుతో నాటకమాడుతున్న దొంగ."

"అప్పల్రాజుకి ఠక్కున ఆ అరబ్ దేశం పేరు గుర్తుకొచ్చేసింది.

"ఆ దొరికింది! బసూదీ గరోబియా" అంటూ అరచాడు ఆనందంగా.

మారుతీరావ్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి సార్?"

"బసూదీ గరోబియా!"

"బసూదీ గరోబియా సార్."

"అవును. బసూది గరోబియా దేశం వాళ్ళది."

మారుతీరావ్ ఆశ్చర్యంగా చూశాడు.

దీప్ చంద్ వేషంలో ఉన్నాడు అసలు భారతదేశస్తుడే కాదన్న విషయం అతనికి కొంచెం భయం కూడా కలుగజేసింది.

"మీకీ విషయం ముందే తెలుసా సార్?"

"ముందేమిటి నీ మొఖం ఎప్పుడో తెలుసు! ఆ పేరు గుర్తురాక ఊరుకున్నాను."

"అలాగా సార్."

"అవును. నాకిప్పుడే గుర్తుకొచ్చింది."

"అయితే పోలీస్ రిపోర్ట్ ఇద్దామంటారా సార్."

"ఇప్పుడు రిపోర్టిస్తే లాభంలేదు. ఎప్పుడో సంగతది."

"కానీ వాడెందుకొచ్చాడో తెలుసుకుంటే..."

"పర్యటన కొచ్చాడు నాకు తెలుసు. వాడి భార్య పేరు తక్ దీనా_సమ్ దీనా అలా ఏదో ఉండాలి."

"కొంపతీసి వాడు విదేశీ గూఢచారి కాదు గదా సార్?"

"విదేశీ గూఢచారా?"

"అవున్సార్. ఈ రోజుల్లో వాళ్ళు ఎక్కువయి పోయారని పేపర్లో వేస్తున్నారు కదా?"

వెన్నెల వేట పేజి 44

"అయితే?"

"దీప్ చంద్ లా నటిస్తున్న వీడు కూడా ఆ బాపతేనేమోనని."

"దీప్ చంద్ లాగా నటిస్తున్నాడా?"

"అవున్సార్!"

"ఎవరు?"

"అదే సార్. బసూదీ గరోబియా నుంచి వచ్చాడన్నారే."

అప్పల్రాజు కేమీ అర్థం కావటం లేదు. ఈ మారుతీరావ్ ఎప్పుడూ తననిలా కన్ ఫ్యూజ్ చేసి_ గుర్తుకొచ్చిన విషయం మర్చిపోయేలా చేస్తుంటాడు. ఇంకాసేపు వీడితో మాట్లాడితే తనా అరబ్ దేశం పేరు మళ్ళీ మర్చిపోతాడు.

"బసూదీ గరోబియా" గట్టిగా రెండుసార్లు అనుకున్నాడతను.

"అవున్సార్" అన్నాడు మారుతీరావ్ మళ్ళీ.

అప్పల్రాజు కిక సహనం నశించిపోయింది.

"మారుతీరావు."

"యస్సార్."

"గెటవుట్."

మారుతీరావు ఆశ్చర్యపోయాడు. "ఏమన్నారు సార్?" అడిగాడు అనుమానంగా.

"అయ్ సే గెటౌట్" గట్టిగా అరచాడు అప్పల్రాజు. మారుతీరావు భయపడి గదిలోనుంచి బయటకు పరుగెత్తాడు.

"రోజురోజుకీ వీడి పిచ్చి ముదిరిపోతోంది" అనుకున్నాడు అప్పల్రాజు చికాకుగా."

భవానీశంకర్ భోజనం ముగించి తన గదిలోకి చేరుకున్నాడు. అతనికి కన్యక ప్రవర్తన చాలా ఇబ్బంది కలిగిస్తోంది. ఆమె అదివరలా తనతో చనువుగా మాట్లాడటం లేదు. తను నిజంగానే వివాహితుడని నమ్మేసిందామె. కాదని ఋజువు చేసుకునే అవకాశం బొత్తిగా కనిపించటంలేదు దగ్గర్లో.

ఫోన్ మోగటం మొదలుపెట్టింది.

ఛప్పున రిసీవర్ అందుకున్నాడతను.

"హలో_ దీప్ చంద్ హియర్"

"హలో నేను కన్యకను మాట్లాడుతున్నాను."

"హలో డియర్! ఎక్కడినుంచి?"

"నా గదిలో నుంచే!"

"సంగతేమిటి ఫ్రెండ్! ఈ సమయంలో_నేను గుర్తుకు రావటంలో గల

అంతరార్థమేమి?"

"ఒకసారి నా రూమ్ కి వస్తారా?"

"వస్తారా అని అడుగుతున్నారా? మీరు ఫోన్ పెట్టేలోగానే వాలిపోతాను మైడియర్_ డియర్."

పెట్టేసి వడివడిగా ఆమె గదికి చేరుకున్నాడతను.

"చూశారా! చెప్పినట్లే వాలిపోయాను." అంటూ గదిలోకి అడుగుపెట్టి అక్కడ కన్యకతోపాటు మరో యువతి కూడా కూర్చుని ఉండటం చూచి ఆశ్చర్యపోయాడు.

"రండి! కూర్చోండి" అంది కన్యక అతని మొఖ కవళికలకోసం జాగ్రత్తగా చూస్తూ.

భవానీశంకర్ కుర్చీలో కూర్చున్నాడు.

"కమాన్ మైడియర్ ఫ్రెండ్! అలా సైలెంట్ గా కూర్చుంటారేమిటి? మీ ఫ్రెండ్ ని పరిచయం చేయాల్సిన బాధ్యత మీమీదే ఉంది డియర్." నవ్వుతూ అన్నాడతను.

కన్యక అయోమయంగా చూసిందతనివేపు.

"పరిచయం చేయాల్సిందేనంటారా?"

ఆ యువతి మొఖంలో రంగులు మారిపోతున్నాయ్.

"కన్యకా!" అంది గాబరాగా లేచి నిలబడి.

"నువ్వు కూర్చో." అంది కన్యక ఆమెని వారిస్తూ.

"అది కాదు కన్యకా!..."

"మీరిద్దరూ ఇవాళ్టినుంచీ ఒకటయిపోవాలి. అర్థమయిందా?" అంది కన్యక భవానీశంకర్ తో.

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి...ఒ...ఒ...కటయి పోవాలా!"

"అవును! మీరు నా మాట కాదనరన్న నమ్మకం నాకుంది."

"కన్యకా! ప్లీజ్! ఓసారిలా రా" కన్యక చేయి పట్టుకుని పక్కకు లాక్కెళ్ళటానికి ప్రయత్నించిందా యువతి. కానీ కన్యక తన చేతిని విడిపించుకుంది.

"మీరనేది నాకేమీ అర్థం కావటం లేదు." అన్నాడు భవానీశంకర్ విస్తుపోతూ.

"చూడండి. తప్పు అనేది ఎవరయినా చేస్తారు... అంతమాత్రాన ఇంత కోపమా?"

భవానీశంకర్ కేం మాట్లాడాలో తెలీలేదు.

"కన్యకా! నా మాట విను ప్లీజ్" అంది ఆ యువతి.

"ష్_" అంది కన్యక ఆమెని వారిస్తూ.

"దీప్ చంద్ గారూ! మాట్లాడరేమిటి? మీరు చెప్పిన అబద్ధాలు నాకు తెలిసిపోయాయని భయపడుతున్నారా?"

"ఏమి అబద్ధాలు?" అయోమయంగా అడిగాడు.

″అదే_ మీ శ్రీమతి కొబ్బరి చట్నీ మొఖంమీద కొట్టడం, వేడిగంజి కాళ్ళమీద పోయటం″

″అవి అబద్ధాలేమిటి? క్లియర్ ఫాక్ట్స్ డియర్! నా డైరీలో కూడా రాసుకున్నాను. కావాలంటే మా పక్కింటి వాళ్ళదగ్గర సాక్ష్యం కూడా చెప్పిస్తాను.″

″దిసీజ్ నాన్సెన్స్″ అందా యువతి కన్యక వంక చూస్తూ.

″నాన్సెన్స్ కాదు మేడమ్! ఫాక్ట్స్! అఫ్ కోర్స్ చాలా నిజాలు నమ్మటానికి అనుకూలంగా ఉండవ్. అందుకే దానిని ″నమ్మలేని నిజాలు″ శీర్షికలో...″

″నేననేది అది కాదు.″ అందామె కోపంగా.

″ఏదయినా సరే మేడమ్! దయచేసి మీరు మాట్లాడకండి! ఇది కేవలం నేనూ_కన్యకా మాట్లాడుకోవాల్సిన విషయం_″ అన్నాడు భవానీశంకర్.

″అయ్యో! మళ్ళీ మొదటికొస్తున్నారు దీప్ చంద్! మీ ఇద్దరూ ఒకటవాలనే నా ప్రయత్నం...″ ఇద్దరిచేతులూ ఠక్కున కలిపేసి పట్టుకుంది కన్యక. కానీ ఆ యువతి చప్పున తనచేయి లాగేసుకుంది.

″ఇద్దరూ ఒకటవటమేమిటి డియర్! అసలు మేమిద్దరం ఎందుకు ఒకటవటం? రెండుగా ఉంటే ఏమిటి నష్టం...″ అడిగాడతను.

″జరిగిందేదో జరిగిపోయింది. దీప్ చంద్ గారూ ప్లీజ్! నా కోసం మీరు ఒకటవండి″

″అయ్యో కన్యకా...ఇతనెవరో నాకు తెలీదే...″ అంది ఆ యువతి కల్పించుకుంటూ.

కన్యక ఆమెవంక కోపంగా చూసింది.

″మీరిలా కనబడ్డ యువతీ యువకులందరినీ ఒకటిచేసే స్కీమ్ చేపట్టటం మంచిదే డియర్! మీ అభ్యుదయభావాలను నేనూ హర్షిస్తాను. వరకట్న నిర్మూలన, కుల నిర్మూలన అనేది మీధ్యేయమనీ_ ఆ తొందరలో అందరినీ ఇలా ఒకటిగా చేసేయడానికి ప్రయత్నిస్తున్నారనీ నా కర్థమయింది. కానీ ఇక్కడ సెంటిమెంట్ ఒప్పుకోవడం లేదు మైడియర్ ఫ్రెండ్! మీరూ నేనూ ఒకరికోసం ఒకరు పుట్టామని నా మనసు ఘోషిస్తోంది. ఆ యువతి బదులు మనిద్దరం ఒకటవడానికి నాకేం అభ్యంతరం లేదు.″ అన్నాడు భవానీశంకర్.

ఆ యువతి ఇంక లాభంలేదని కన్యకను బాల్కనీలోకి బలవంతంగా లాక్కెళ్ళింది.

″నేను చెప్పేదేమీ వినిపించుకోవేం?″ అందాయువతి అసహనంగా.

″ఏమిటి నువ్ చెప్పేది?″ చిరాకుగా అడిగింది కన్యక.

″అతను దీప్ చంద్ కాదసలు!″ అందామె గొంతు తగ్గించి రహస్యంగా.

″వాట్?″ అదిరిపడింది కన్యక.

″అవును! అతను దీప్ చంద్ కాదు!″

″అతను దీప్ చంద్ కాదా?″ విస్తుపోతూ అడిగింది.

″ఏమాత్రం కాదు!″

″నీకేం మతిపోలేదు కదా?″

"బాగుంది! నా భర్తను నేను గుర్తించలేనా?"

వెన్నెల వేట పేజి 45

"మరీ మాటలేమిటి? అతనే దీప్ చంద్."

"ఇతని పేరు కూడా దీప్ చంద్ కావొచ్చేమోగానీ రచయిత దీప్ చంద్ మాత్రం ఇతను కాదు."

"ఇతనే రచయిత దీప్ చంద్."

"అయ్యో కన్యకా! నీకెలా చెప్పేది! ఇలా ఎవరొకరిని తీసుకొచ్చి 'ఇతనే నీ భర్త...మీ ఇద్దరూ ఒకటయిపోండి' అంటే నేనేం చెప్పేది!"

కన్యక ఓ క్షణం ఆలోచించింది.

"అంటే ఇతను నీ హజ్బెండ్ కాదంటావ్?"

"కానప్పుడు కాదనక ఇంకేం చేయను?"

"మరితనెవరు?"

"ఏమో నాకేం తెలుసు?"

"ఒకవేళ దీప్ చంద్ పేరుతో ఇద్దరు రచయితలు లేరు కదా!"

"అలా ఎలా ఉంటారు?"

"ఎందుకుండరు?"

"ఉంటే ఉండవచ్చేమో గానీ_ నా భర్త మాత్రం ఇతను కాదు, కాదు

కాదు...కనుక మా ఇద్దరినీ బలవంతంగా ఒకటి చేయటానికి ప్రయత్నించకు..." నిస్పృహతో అందామె.

కన్యక ఆమెతోపాటు మళ్ళీ గదిలోకొచ్చింది.

"ఇలా బాల్కనీలో డిస్కషన్స్... ఎప్పుడూ మంచి ఫలితాలు ఇస్తాయని నాకు తెలుసు మిస్ కన్యకా! ఇంక మనిద్దరం ఒకటవడానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ ఉండదని నా అభిప్రాయం! యామ్ ఐ కరెక్ట్?"

ఉత్సాహంగా అడిగాడు భవానీశంకర్."

"మిస్టర్ దీప్ చంద్" కోపంగా పిలిచింది కన్యక.

"యస్ డియర్! 'మిస్టర్' అనేది తీసేస్తే నాకు చాలా బావుంటుంది..."

"మీ భార్య విజ్జీ మీమీద కొబ్బరి చట్నీ విసిరిందన్నారు కదూ?"

"ఎగ్జాక్ట్ లీ డియర్! ఆరుసార్లు."

"వేడిగంజి కాళ్ళమీద పోసింది కూడా...అవునా?"

"అవును!"

"మీ స్క్రిప్ట్ లూ, బట్టలూ, వస్తువులూ అన్నీ కుప్పగా పోసి తగలేసింది"

"మీకు చెప్పటం మర్చిపోయాను. నా అభిమానుల ఫోటోలు, ఉత్తరాలు కూడా ఆ మంటలో వేసేసింది."

"అయ్ సీ...అయినా మీ భార్య విజ్జీని మీరిప్పుడు గుర్తుపట్టలేరు కదూ?"

"ఎందుకు తెలీదు డియర్! వెయ్యిమంది అమ్మాయిల్లో నిలబడ్డా ఠకీమని

గుర్తుపట్టవచ్చు! రాక్షసిలా ఉంటుంది కదా."

"షటప్..." అంది ఆ యువతి హఠాత్తుగా కోపం తెచ్చుకుంటూ.

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"అరె! అదేమిటి? మధ్యలో మీకెందుకు కోపం వచ్చింది?"

"ఎందుకంటే ఈమే విజ్జీ కాబట్టి..." అంది కన్యక.

భవానీశంకర్ నోరు తెరచేశాడు. మాటలు బంద్ అయిపోయాయ్. మొఖానికి చెమటలు పట్టేసినయ్.

"ఈమె విజ్జీయా?"

"అవును!" అంది కన్యక అతని మొఖకవళికలు కుతూహలంగా పరిశీలిస్తూ.

"ఐసీ...గ్లాడ్ టు సీయూ మైడియర్ ఫ్రెండ్! అందుకే అతిథులను ముందే పరిచయం చేయాలి అని ఇందాక చెప్పాను...ఇప్పుడు చూడండి! ఎంబ్రేసింగ్ సిట్యుయేషన్."

"ఐసీ...విజ్జీ ఎక్కడున్నా తేలిగ్గా గుర్తుపడతానన్నారు కదా! మరిప్పుడు గుర్తుపట్టలేదేం?"

"చాలా మార్పులొచ్చినయ్ ఫ్రెండ్! ఆరునెలల్లో ఇన్ని మార్పులొస్తాయని నాకిప్పుడే తెలిసింది..."

"మీరు రచయిత దీప్ చంద్ కాదని విజ్జీ అంటోంది..."

భవానీశంకర్ చకచక ఆలోచించాడు.

"ఓ.కే. అది ఆమె అభిప్రాయం! కన్యకాజీ! మీకు మొన్నే మా ఇద్దరి గురించీ స్పష్టంగా చెప్పాను కదా! మా ఇద్దరి మనసులూ విరిగిపోయిన అద్దంలాంటివని! విరిగిన అద్దం ముక్కలు అతుక్కుంటాయా? నెవర్ డియర్, నెవర్! అందుకే...మేమిద్దరం తిరిగి ఒకటవటం ఇష్టంలేక_ ఒకరినొకరు గుర్తుపట్టనట్లు నటిస్తున్నాం..."

కన్యకను మతిపోయినట్లయింది. ఆమె కోపం అంతా విజ్జీ మీదకు మళ్ళిందిప్పుడు.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్?" ఆశ్చర్యంగా అంది విజ్జీ భవానీశంకర్ తో.

"డోంట్ గెట్ అప్సెట్ విజ్జీ...మనం నిజాలు మాట్లాడుకోవటం మంచిది... భార్యాభర్తలు... విడిపోయాక కూడా నిజాలు మాట్లాడుకోకపోతే ఎలా?" తాపీగా అన్నాడు భవానీశంకర్.

"కన్యకా! ఇతను చెప్పేదంతా అబద్ధం!" భయంగా అంది విజ్జీ.

కన్యకకి ఎవరిని నమ్మాలో తెలీటంలేదు. తనసలు ఈ వ్యవహారంలో తలదూర్చకుండా ఉంటే ఎంతో బావుండేదనిపిస్తోందామెకి. అనవసరంగా తనే నీలతో ఫోన్ లో మాట్లాడి విజ్జీని రప్పించింది...ఆమె సంసారం నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో.

"విజ్జీ! నేను నీలకు ముందే చెప్పాను. విజ్జీ తన కాపురం నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటేనే ఇక్కడకు పంపమని...తీరా ఇక్కడికొచ్చాక కూడా ఇంకా మీ పాత తగవులు గుర్తుంచుకుంటే ఎలా?" అసహనంగా అందామె.

విజ్జీకేం చేయాలో తోచలేదు.

ఛటుక్కున భవానీశంకర్ దగ్గరకు నడిచిందామె.

"ఏయ్ మిస్టర్! మర్యాదగా నిజం చెప్తావా...పోలీస్ కి ఫోన్ చేయమంటావా?"

భవానీశంకర్ చిరునవ్వు నవ్వాడు.

"భార్యాభర్తల వివాదాలు పోలీసులు తీర్చరు డియర్! కేవలం కోర్టులే సెటిల్ చేయాలి..."

"విజ్జీ...మీ ఇద్దరినీ ఒకటి చేయటానికి నిన్ను ఇక్కడికి పిలిపించానుగానీ, పోలీస్ కేస్ చేయటం కోసం కాదు" కోపంగా అంది కన్యక.

ఛటుక్కున విజ్జీ టేబుల్ దగ్గరకు నడిచి తన బాగ్ లోనుంచి ఓ పుస్తకం బయటకు తీసింది. అందులోనుంచి ఓ ఫోటో తీసి కన్యక మీదకు విసిరేసింది కోపంగా.

"ఇప్పుడు చెప్పు. ఎవరు మాట్లాడేది నిజమో"

కన్యక ఆ ఫోటో చేతిలోకి తీసుకుని చూసింది. విజ్జీ, మరో వ్యక్తితో వివాహపు దుస్తుల్లో పూలదండలతో దిగిన ఫోటో. అంటే...

అతనే దీప్ చంద్ అయ్యుంటాడనటంలో ఎలాంటి సందేహం లేదు. ఆ ఫోటో భవానీశంకర్ మీదకు విసిరిందామె.



"ఇంకా మీరు దీప్ చంద్ ననే అంటారా?" అంది కోపంగా.

భవానీశంకర్ ఫోటో చూశాడు.

"అఫ్ కోర్స్! మారిన పరిస్థితుల వల్ల నేనలా అనటం సమంజసంగా ఉండదు" అన్నాడు చిరునవ్వుతో.

"మరింతసేపూ మీరే దీప్ చంద్ అని ఎందుకు అబద్ధం చెప్పారు!"

"ఇది అన్యాయం కన్యకాజీ! మన ఎజెండాలో అంశం ఏమిటంటే నేను దీప్ చంద్ అవునా, కాదా అని. 'కాదు' అనే నిజాన్ని నేను అయిష్టంగానే ఒప్పుకుంటున్నాను. అంచేత ఇక్కడితో ఈ టాపిక్ ముగిసిపోవాలి కానీ మీరు నిబంధనల్ని అతిక్రమించి 'ఎందుకు' అని ప్రశ్న వేస్తున్నారు. ఆ ప్రశ్నకు అంత ప్రాముఖ్యత అనవసరమని నా అభిప్రాయం."

"అవసరమని నా అభిప్రాయం."

"ఐసీ! హిట్ అవుట్ ఆర్ గెటౌట్ పాలసీ అన్నమాట మీది?"

"అవును."

"ఇప్పుడే చెప్పక తప్పదంటారు."

"ఈ క్షణంలోనే."

"ఓ.కే. డియర్! మనసులు విప్పి మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని మీరంటున్నారు కనుక ఆల్ రైట్! కూలంకుషంగా మాట్లాడుకుందాం. రచయిత దీప్ చంద్ అన్న పేరు నేను వాడుకోటానికి చాలా ప్రబలమయిన కారణాలున్నాయి కన్యకాజీ! 'పరిస్థితుల ప్రాబల్యం' అనే మాట మీరు వినే వుంటారు"

"అసలు మీరెవరు?" తీక్షణంగా అడిగిందామె.

"అదికూడా యిప్పుడే సెటిలయి పోవాలంటారు?"

"అవును."

"సరే! మీరంత నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నప్పుడు అన్నీ క్లియర్ చేసేయటం మంచిది. నా పేరు భవానీశంకర్."

"భవానీశంకరా?"

"యస్!"

"ఇక్కడకొచ్చి ఇంతమందిని ఎందుకు మోసం చేస్తున్నారు?"

"మీరు క్విజ్ ప్రోగ్రాం అద్భుతంగా కండక్టు చేయగలరు కన్యకాజీ! మీ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదు. కానీ యిలాంటి విషయాలు ఏకాంతంలో, చిక్కని వెన్నెలలో మీకొక్కరికే చెప్తే బాగుంటుందని నా అభిప్రాయం."

"అక్కర్లేదు. ఇప్పుడే చెప్పండి."

"తప్పదంటారు."

"చెప్పి తీరాల్సిందే"

"ఆల్ రైట్! మీ కోరిక కాదనలేను. దీనికంతటికీ కారణం మీరు?"

కన్యకకు కోపం మళ్ళీ ముంచుకొచ్చింది.

"నేనా?"

"యస్ డియర్! సెంట్ పర్సెంట్ మీరే."

"మీకు పిచ్చి ఎక్కింది"

"అఫ్ కోర్స్! దానిక్కూడా కారణం మీరే."

"అంటే?"

"ఇదంతా మీ అందం చేసిన పని అందుకు రుజువులు కావాలని మీరడగవచ్చు కదా! అందుకే సిద్ధంగా వుంచుకున్నాను" అంటూ జేబులోంచి పర్స్ తీసి అందులోని ఓ కాగితం బయటకు లాగాడు. దానిని జాగ్రత్తగా మడతవిప్పి కన్యకకు చూపించాడు.

"చూశారా! ఈ కాగితంమీద ఒలకబోసిన అందం ఎవరిది?"

కన్యక కాగితం లాక్కుని చూసింది. 'తేజస్సు' మాసపత్రికలో ఫోటోఫీచర్ కోసం ప్రచురించిన తన ఫోటో అది.

"ఇంత అందాన్ని ప్రేమించకుండా వుండటం ఎవరితరం డియర్!"

"నీ చిక్కని అనుభూతుల చీకటిలో

నే పురి విప్పిన వెన్నెల నవుతా!"

"యస్ డియర్! ఆరోజు బఠానీలు తిన్నాక ఆ కాగితం పారేయబోతూ మీ ఫోటోవంక పిచ్చాడిలా చూస్తూండిపోయాను. నా చిక్కటి అనుభూతుల చీకటికి మీ పురివిప్పిన వెన్నెలే శరణ్యమని నా కర్థమయింది. అంతే ఆ క్షణం నుంచే మీకోసం వేట ప్రారంభించాను. ఆ కాగితం ఏ పత్రికలో ప్రచురించబడిందో తెలుసుకోవటం కోసం కొన్నాళ్ళు అన్ని పత్రికలూ వెతుకుతూ వాకబుచేస్తూ

చివరకు శరత్ బాబుగారి దగ్గరకు చేరుకున్నాను. అయితే మీ అడ్రస్ లభించకపోయేసరికి శరత్ బాబు గారిచ్చిన మీ ఫోటో తీసుకుని వారపత్రిక ముఖచిత్రంగా ప్రచురించాను. ఆ తరువాత కథ మీకు తెలుసు."

కన్యక నిశ్చేష్టురాలయి వింటూండిపోయింది. అతని మొఖంలోని సిన్సియారిటీ, అతను అందించిన పాత కాగితంలో తన ఫోటో ఆమెను కదిలించివేసినయ్. తను అంతకుముందు అనేక ప్రేమకథలు చదివింది. సినిమాలు చూసింది. కానీ ఇంత రొమాంటిక్ ఫీలింగ్ ఏ కథ విన్నప్పుడూ, చదివినప్పుడూ తనకు కలుగలేదు. తన ఫోటో చూసి అతనింత శ్రమపడి చివరకు తనను కలుసుకోవడం ఎంతో థ్రిల్లింగ్ గా వుంది.

విజ్జీ కూడా ఆశ్చర్యంగా వింటూండిపోయిందతని మాటలు.

"కానీ మీరీ దీప్ చంద్ పేరుతో యింతమందిని మోసం చేయటానికీ, మీరు చెప్పిన కథకూ ఏమీ సంబంధం లేదు" అంది కన్యక కోలుకుని.

"అఫ్ కోర్స్! సంబంధం కొంచెం తక్కువగా వున్నమాట నిజమే మైడియర్ ఫ్రెండ్! కానీ అస్సలు లేదనటం సమంజసం కాదు. నేనిలా దీప్ చంద్ ముసుగులో యిక్కడికి రావటం మాత్రం చాలా అకస్మాత్తుగా అనుకోకుండా జరిగిపోయింది. రచయిత దీప్ చంద్ మా ఆఫీస్ కొచ్చి అప్పల్రాజుగారి ఆత్మకథ రాసే విషయంలో తను మనసు మార్చుకున్నాడనీ, ఆ విషయం నేనే హోటల్ కెళ్ళి అప్పల్రాజుగారికి చెప్పాలనీ కోరాడు. అతని కోరిక ప్రకారం హోటల్ కెళ్ళేసరికి అప్పల్రాజు నన్నే దీప్ చంద్ అనుకున్నాడు. అతనికి 'నేను దీప్ చంద్ ని కాదు' అని చెప్పబోయే సమయంలో మీరు వచ్చేశారక్కడికి. మీరుకూడా ఆత్మకథ రాసే కార్యక్రమం కోసం ఎన్నిక చేయబడ్డారని తెలిసేసరికి మీతో కలిసి నెలరోజులు 'ఆంధ్రప్రదేశ్ హౌస్'లో

గడిపే అవకాశం తాలూకూ ఆకర్షణను తట్టుకోలేక దీప్ చంద్ గా తాత్కాలికంగా స్థిరపడిపోయాను. ఇందులో ఎవర్నీ మోసం చేయాలనే ఉద్దేశ్యమేమీ లేదు. అయామ్ సారీ! విజ్జీగారూ! మధ్యలో మీకు చాలా ఇబ్బంది కలిగింది."

"దట్సాల్ రైట్!" అందామె తేలికపడ్డ మనసుతో.

"ఇన్నాళ్ళు ఈ విషయం దాచాల్సి వచ్చినందుకు ప్లీజ్ ఎక్స్ క్యూజ్ మీ మిస్ కన్యకా!" ఆమెతో చెప్పి గదిలోనుంచి బయటికొచ్చేశాడతను.

* * * *

విజ్జీ బస్ లో కూర్చుంది. కన్యక కిటికీ బయట నిలబడి "అయామ్ రియల్లీ సారీ విజ్జీ! నీకు చాలా ట్రబులిచ్చాను" అంది దీనంగా.

"అయ్ కెన్ అండర్ స్టాండ్ కన్యకా? ఈ విషయం యింక మర్చిపో" అంది విజ్జీ.

బస్ బయల్దేరింది.

కన్యక ఇంటివేపు నడవసాగింది. ఆమె మనసంతా అల్లకల్లోలంగా ఉంది. భవానీశంకర్ దీప్ చంద్ పేరుతో అందరినీ మోసం చేయటం ఓ పక్క, తనకోసమే అంత సాహసం చేయటం మరోపక్కా కలగలుపు భావాలు సృష్టిస్తున్నాయి.

వెన్నెల వేట పేజి 47

ఇంతకూ ఇప్పుడేమిటి చేయటం? ఈ విషయం అప్పల్రాజు గారికి చెప్పెయాలా. లేకపోతే తను కూడా వాళ్ళను మోసం చెసినట్లవుతుంది కదా! అది తన కిష్టం లేదు.

"హాయ్ కన్యకా!" రోడ్డు పక్కనే వున్న ఇంటి కిటికీ లో నుంచి ఎవరో పిలవటం

వినిపించి ఆశ్చర్యంగా చూసింది కన్యక . శిరీష నవ్వుతూ కనిపించింది.

"రావే లోపలకు రా!' తలుపు తెరుస్తూ పిలిచిందామె.

"నువ్వి ఊళ్ళో ఉన్నావా?" లోపలికి నడుస్తూ అడిగింది కన్యక.

"అవును? మా డాడీకిక్కడికి ట్రాన్స్ ఫర్ అయింది. నువ్విక్కడ ఎందుకున్నావ్?"

"ఆంధ్రప్రదేశ్ హౌస్ లో అప్పల్రాజు గారి దగ్గర నెలరోజులు ఉద్యోగం."

"ఎన్ని రోజులయింది ఇక్కడ కొచ్చి?" ఆనందంగా అడిగింది శిరీష.

"పది రోజులు – ఈ పది రోజుల్లో ఇదే మొదటిసారి బయటకు రావటం."

ఇద్దరూ కాలేజ్ రోజుల్లో కెళ్ళిపోయి నిరూపించాడు చాలా సేపు.

'అవునే నువ్వు ఉద్యోగమూ, పెళ్ళీ పెటాకులూ ఏమీ లేకుండా ఏం చేస్తున్నావ్!" అడిగింది కన్యక.

"నా పెళ్ళిదో పెద్ద కథే"

"ఏమిటది? లవ్ ఎఫైర్!"

"అవును!"

"ఎవరతను?"

"వర్ధనరావు అనీ అప్పలరాజు గారి బావమరిది నువ్వు చూసే ఉంటావు కదూ?"

"ఓ! నీ సెలక్షన్ బాగానే ఉంది. మరింక కదేమిటి మధ్యలో.

"అతనికి ఉద్యోగం లేదు ఆస్తి లేదు. ఈ రెండింటిలో ఏదొకటి లేకుండా పెళ్ళి చేసుకోడానికి డాడీ వప్పుకోవటం లేదు."

"అయ్యో మరెలా?"

"దాని కోసం ఓ ప్లాన్ వేశాం లే! అది సక్సెస్ అయితే మా పెళ్ళి లేకపోతే ;లేదు"

"ఏమిటా ప్లాను?"

"మళ్ళీ ఎవరితోనూ అనవు కదా?"

"నామీద నమ్మకం లేకపోతే చెప్పొద్దులే"

"అప్పలరాజు గారు తన దగ్గరున్న అనేక డయిరీలు, ఉత్తరాలు, పొటోలు రుజువులుగా పెట్టుకుని ఆత్మకధ రాస్తున్నారు కదా! అది రాయకుండా వాటిని కాజేసి ఓ పబ్లిషర్ కిస్తే అతను యాభయ్ వేల రూపాయలు ఇస్తానన్నాడట! ఆ డబ్బు చూపిస్తే మా డాడీ మా పెళ్ళికి వప్పుకుంటారు"

"మైగాడ్ దొంగతనం చేస్తారా!"

"దాన్ని దొంగతనం అంటే నాకు బాగుండదు. ఎడ్జస్ట్ మెంట్. అంతే పైగా అప్పల్రాజు గారు ఆ పుస్తకం రాయకపోతే ప్రపంచాని కొచ్చి నష్టం ఏమీ లేదు."

"ఆఫ్ కోర్స్ నిజమే కాని ....." అంటూ టైం చూసుకుని 'అమ్మో అయిదయిపోయింది వస్తానే! తర్వాత కలుసుకుంటాను మళ్ళీ" బయటకు నడుస్తూ అంది.

* * * *

టైము తెల్లారుజామున అయిదు దాటింది . మారుతీరావు కారులో అప్పటికే హైదరాబాద్ పొలిమేరల్లో కొచ్చేశాడు. టైగర్స్ క్లబ్ మీటింగు కోసం చేయాల్సిన ఏర్పాట్ల కోసం హైదరాబాద్ చేరుకుంటున్నాడతను. సాధారణంగా ఎప్పుడూ శమంతకమణి వెంబడి బాడీగార్డులా రావటమే గానీ ఒంటరిగా కారులో విహరించటం అరుదు.

ముందు తన అన్నయ్య కొడుకు దీపక్ ఇంటికెళ్ళి కాసేపు గడిపి అప్పుడు మిగతా పనులు చూచుకొవాలని అతని ఆలోచన. దీపక్ ఇంటి ముందు కారాపి హారన్ కొట్టాడతను. అయినా తలుపులు తెరచుకోలేదు. కారు దిగి వెళ్లి గట్టిగా తలుపులు బాదాడు. అయిదు నిమిషాల తర్వాత దీపక్ తూలుతూ వచ్చి తలుపులు తెరిచి మళ్ళీ మంచం మీద పడిపోయాడు.

"ఏరా ఇంటి దగ్గర్నించి ఉత్తరాలొస్తున్నాయా?" అడిగాడు మారుతీరావు కుర్చీలో కూలబడుతూ.

"ఊఁ!"

"అమ్మా నాన్న బావున్నారా?"

"ఊఁ!"

"ఆఫీసుకి సరిగా వెళుతూన్నావా, ఎగ్గొడుతున్నావా?"

"ఊఁ!"

మారుతీరావు అతని వీపు మీద గట్టిగా చరిచాడు. దాంతో దీపక్ నెమ్మదిగా

కళ్ళు విప్పాడు. మారుతీరావు ముఖం ఎక్కడో చూచినట్లుందతనికి.

"ఎవరు?" అనడిగాడు మత్తుగా.

"ఏమిటి ? నేనెవరో కూడా తెలీటం లేదా?"

ఆ అరుపుతో ఇంకొంచెం స్పృహ తెచ్చుకున్నాడు దీపక్. మరోసారి మారుతీరావు ముఖం వేపు పరీక్షగా చూసి "బాబాయ్' అన్నాడు లేచి కూర్చుంటూ.

"ఇప్పటికీ తెలిసిందన్న మాట ఆ విషయం!"

"ఏ విషయం బాబాయ్?" పూర్తిగా స్పృహ లో కోస్తూ అడిగాడు.

"నా తలకాయ విషయం" అంటూ హటాత్తుగా ఆగిపోయి గోడకు వేలాడుతున్న దీపక్ కాలేజ్ గ్రూప్ ఫోటో వంక చూశాడు పరిశీలనగా. అతని చూపులు ఆ ఫోటోలో అందరి మధ్యా, అందరి కంటే స్టయిలుగా ఫోజిచ్చి నిలబడ్డ ఓ యువకుడి మీద కేంద్రీకృతమయినాయ్.

"ఒరేయ్ దీపక్! ఈ కుర్రాడేవరు?" అడిగాడు మారుతీరావు వేలు పెట్టి చూపిస్తూ.

దీపక్ కళ్ళు నులుముకుని ఫోటో దగ్గరకు నడిచి చూశాడు.

"వాడా. భవానీ శంకర్! నా క్లాస్ మేట్ అంకుల్"

"భవానీ శంకరా?" నోరు తెరిచేశాడు మారుతీరావు.

"అవును?"

"రచయిత దీప్ చంద్ కాడా వాడు?"

"రచయితా! వాడి ముఖం ఉత్తరాలు రాయటం కూడా రాదు వాడికి. వాడి పేరు భవానీ శంకర్! వెరీ గుడ్ ఫెలో"

మారుతీరావు చటుక్కున దీపక్ చేయి పట్టుకున్నాడు.

"ఓరే దీపక్! నువ్ అర్జంటుగా ఇవాళ మధ్యాహ్నం నాతో ఆంధ్రప్రదేశ్ హౌస్ రావాలి! ఈ రాత్రి కుండి రేప్పొద్దున్నే కార్లో వచ్చేద్దువు గాని మళ్ళీ."

వెన్నెల వేట పేజి 48

"ఎందుకు బాబాయ్!"

"చాలా అవసరం! అక్కడ ఈ భవానీ శంకర్ గాడు నాటకం ఆడుతున్నాడు వాడి అట కట్టించాలి."

దీపక్ కేమీ అర్థం కాలేదు. భవానీ శంకర్ ఏదో నాటకం వేస్తున్నా డెక్కడో అని కొంత అర్థమయింది. మళ్ళీ హంగో ఓవర్ లోకి వెళ్ళిపో సాగాడు నెమ్మదిగా.

'అల్ రైట్ బాబాయ్ అయాం రెడీ" అనేసి మంచం మీదకు వరిగిపోయాడు.

* * * *

కన్యక ఉదయం అయిదున్నర కల్లా నిద్ర లేచి బాల్కని లోకొచ్చి కూర్చునేసరికి "గుడ్ మాణింగ్ మైడియర్ ఫ్రెండ్! నిన్న సాయంత్రం మీకోసం తిరిగి తిరిగి విసిగి వేసారి పోయాను" అన్నాడు భవానీ శంకర్ అతని గది బాల్కని లోంచి కన్యక అతని మాటలు పట్టించుకోలేదు.

″మీరు మర్యాదగా తక్షణం ఆంధ్రప్రదేశ్ హౌస్ నుంచి వెళ్ళిపొండి. లేకపోతే మీరు దీప్ చంద్ కాదన్న విషయం ఇప్పుడే అప్పల్రాజు గారికి చెప్పేస్తాను.″ అందామె. భవానీ శంకర్ చిరునవ్వు నవ్వాడు.

″మీరింత శిలా హృదయులు కారని నాకు తెలుసు డియర్″

″సరే పోలీసులు చేతిలో పడి అవమానం పొందాలనుకుంటే మీ ఇష్టం″ కఠినంగా అందామె.

″నో నో నో అంత కోపం వద్దు మిస్ కన్యక! ఇంకొక్క 'రెండు రోజులు ' ఈ రహస్యం కాపాడండి చాలు! ఆ తరువాత గుడ్ బై కొట్టెస్తాను.″

″ఆయామ్ సారీ″

″కన్యకా! ప్లీజ్ ఈ కోరిక నాకోసం కాదు! గాడంగా ప్రేమించుకున్న రెండు హృదయాలను ఏకం చేయటం కోసమయినా మీరు వప్పుకోక తప్పదు

″లేత హృదయాలేవరు?″

″వర్ధనరావు, అతని ప్రియురాలు″

కన్యక ఆశ్చర్యపోయింది.

″వాళ్ళకూ మీకూ ఏమిటి సంబంధం?″

″వర్ధనరావు ప్రేమ విషయంలో నేనో పెద్ద సహాయం చేయాల్సి ఉంది.″

కన్యకకు అనుమానం వచ్చింది. ″అంటే ఆ డయిరీ, ఉత్తరాలు, పొటోలు మీరు దొంగాలేస్తున్నారా?″

భవానీ శంకర్ నిర్ఘాంతపోయాడు.

"మీ...మీ...మీకెలా తెలుసీ విషయం?"

"శిరీష చెప్పింది"

"శిరీష మీకెలా తెలుసు!"

"ఆమె నా క్లాస్ మేట్ ."

"మైగాడ్, అన్నాడు భవానీ శంకర్. ఇద్దరూ కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయారు.

"అయితే - మీ ప్రాణ స్నేహితురాలు శిరీష కోసమయినా మీరీ రహస్యం దాచక తప్పదు కన్యకాజీ! మనిద్దరి మనసులు కలసిపోయినా కూడా - ఒకటవడం కుదరక ఏంతో బాధపదుతున్నాం మనం! కనీసం వాళ్ళిద్దరి నయినా కలిసి ఆశీర్వదిస్తే సంతృప్తిగా ఉంటుంది. ఏమంటారు?"

"మన మనసులు కలవలేదు" కోపంగా అందామె.

"ఆ సుదినం ఎంతో దూరం లేదు డియర్! రేపో - ఎల్లుండో- అంతే!"

కన్యక చకచక ఆలోచించసాగింది. ఇదంతా ఆ శిరీష కోసమే కాబట్టి తనెందుకు అభ్యంతరం చెప్పాలి?

"సరే!" అంది అయిష్టంగానే.

"థాంక్యు డియర్" అన్నాడతను ఆనందంగా.

"హలో దీప్ ---' అంటూ కింద గార్డెన్ లో నిలబడి పిలిచింది మనో చిత్ర.

"హలో హనీ-'

"కమాన్ దీప్ - అలా గార్డెన్ లో తిరిగివద్దాం కాసేపు - అక్కడ మంచు ఎంత అద్భుతంగా కురుస్తుందో చుడండి."

"ఓ.కే. డియర్ ఇప్పుడే వస్తున్నాను."

కన్యకకు మనసంతా అదోలా అయిపొయింది మనోచిత్ర అతనితో ఎందుకంత చనువుగా ప్రవర్తిస్తుందో అర్థం కావటం లేదు. కొంపదీసి ఆమె అతనిని ప్రేమించటం లేదు కదా! తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చేసింది. ప్రేమిస్తే - ప్రేమించనీ! తనకెందుకు? కానీ ఆమె అనుకున్నంత తేలికగా ఆమె మనసురుకోలేదు. పర్యవసానంగా వాళ్ళిద్దరూ దూరంగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుంటే చాటు నుంచి చూస్తూ గడపాల్సి వచ్చింది కాసేపు.

* * * *

కిరతకరావు భోజనాలవగానే శమంతకమణిని కలుసుకున్నాడు.

'కూర్చోండి! ఎంతవరకూ వచ్చింది మీ పరిశోధన?"

"చాలా దూరం వచ్చేసింది మేడమ్! రేపు రాత్రే దొంగతనం జరగబోతుందని తెలిసింది నాకు."

శమంతకమణి భయపడిపోయింది. "రేపు రాత్రా!"

"అవును!"

"ఎవరు చేయబోతున్నారు?"

"ఎవరయినా కావచ్చు. ఆ కరుణాకర్, దీప్ చంద్."

"కరుణాకర్ కూడానా!" ఆశ్చర్యంగా అడిగిందామె.

"అవును! అతని బంధువుల్లో ఎవరో ఓ మంత్రి ఉన్నాడట! అతనే వీడి నిక్కడికి పంపించినట్లు మా అసిస్టెంట్స్ నాకు ఫోన్ లో చెప్పారు –"

"అయితే ఇప్పుడేమిటి చేయటం!" గాబరాగా అడిగిందామె.

"మీరేం ఖంగారు పడ నక్కరలేదు. నేనో మంచి ప్లాన్ ఆలోచించాను."

"ఏమిటది?"

వెన్నెల వేట పేజి 49

"ఆ డయిరీలు , ఉత్తరాలు, ఫోటోలు అన్నీ బ్రీఫ్ కేస్ లో పెట్టి స్ట్రాంగ్ రూమ్ లో ఐరన్ ఓల్డ్ లో దాచానన్నారు కదా? ఇప్పుడు మీరు చేయాల్సిందేమిటంటే ఆ బ్రీఫ్ కేస్ నా కిచ్చేసేయండి! అచ్చం అలాంటి బ్రీఫ్ కేస్ ఇంకోటి తీసుకుని దాన్నిండా కొన్ని నకిలీ డయిరీలు , పనికి రాణి ఉత్తరాలు , ఫోటోలు నింపి ఇనుప పెట్టెలో పెట్టేయండి. ఒకవేళ ఎవరయినా దాన్ని ఎత్తుకు పోయినా మనకేం ఫరవాలేదు ––––"

శమంతక మణి ఆనందంగా చూసిందతనిని. "అద్భుతమయిన ఉపాయం " అంది పొంగిపోతూ.

"అయితే రేపు ఉదయమే నాకు ఆ ఒరిజనల్స్ ఉన్న బ్రీఫ్ కేస్ ఇచ్చేయండి! దానిని నేనే జాగ్రత్తగా కాపలా కాస్తుంటాను––"

"సరే–"

కిరాతక రావ్ సంతృప్తిగా బయటి కొచ్చేశాడు.

ఇప్పుడిక తన నెవ్వరూ ఆపలేరు. వాటిని తనే దొంగలించుకుపోవటం ఖాయం. ఆఖరికి శ్యామలారాణికి కూడా దొరక్కుండా పారిపోగలడు. ఒక వేళ ఆమె దొంగిలించినా --నకిలీ బ్రీఫ్ కేస్ తీసుకుపోతుంది.

తన ప్లాన్ ఇంత తేలికగా విజయం సాధిస్తుందనుకోలేదు.

* * * *

మారుతీ రావ్ , దీపక్ లతో కారు ఆంధ్రప్రదేశ్ హౌస్ చేరుకునేసరికి సాయంత్రం అయిదయిపోతుంది.

"ఆహా! ఒండర్ ఫుల్ గార్డెన్స్ బాబాయ్! ఎక్కడికో పిక్నిక్ కి వచ్చినట్లుంది --- " అన్నాడు దీపక్ సంతోషంగా.

అతనిని మేడమీద గదిలోకి తీసుకెళ్ళాడు మారుతీ రావ్.

"నువ్వీ గదిలోనే ఉండు! బయటి కెళ్ళకు! ఈ త్రాత్రికే వాడి పని పడదాం" అనేసి బయటకు నడిచాడతను.

దీపక్ ఆ గదంతా ఓసారి కలియజూసి వేనుకవేపు తలుపులు తెరచి బాల్కనిలో కెళ్ళి నిలబడ్డాడు. పూలతోటలు - దూరంగా అస్తమిస్తోన్న సూర్యుడు - ఆకాశంలో మారిపోతున్న రంగులు -- ఆ సీనరీ పరవశం కలిగిస్తోందతనికి.

ఇంత అద్భుతమైన వాతావరణంలో - పక్కన మందుసీసా లేకపోవటం చాలా వెలితిగా అనిపించిందతనికి.

సరిగ్గా అప్పుడే తోటలు మధ్య నుంచీ విజిల్ వేసుకుంటూ హుషారుగా నడిచి

వస్తున్ననడిచి వస్తున్న భవానీ శంకర్ కనిపించాడతనికి . తన క్లాస్ మెట్ ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయిందతనికి.

"హలో ---- భవానీ -----" అంటూ ఆనందంగా పిలిచాడు. భవానీ శంకర్ బాల్కని వేపు చూచి ఆశ్చర్యపోయాడు.

"హాలో ......దీపక్-"

"కమాన్ గురూ ! కమాన్ ! కమాన్-"

దీపక్ అక్కడకు ఎలా వచ్చాడో ఎందుకొచ్చాడో ఏమాత్రం అర్థం కావటం లేదు భవానీ శంకర్ కి అతని గదిలోకి చేరుకున్నాడు వెంటనే.

"హౌ ఆర్ యు గురూ! నువ్విక్కడ ఉన్నట్లు మా బాబాయ్ చెప్పేవరకూ తెలీదు --"

"మీ బాబాయా?"

"అవును! మారుతీ రావ్ మా బాబాయేగా? కొంచెం ముసురుగాడనుకో! అయినా ఫర్లేదు ఒకరోజు కోసం అయితే అయ్ కెన్ మానేజ్-"

"నువ్వెందు కొచ్చినట్లు ఇక్కడికి?"

దీపక్ కాసేపు ఆలోచించాడు గానీ --తనేందు కొచ్చాడో ఓ పట్టాన గుర్తు రాలేదు.

"నువ్వేదో నాటకం వేస్తున్నావట, అది చుట్టానికని రమ్మన్నాడు"

భవానీ శంకర్ ఉలిక్కిపడ్డాడు.

"నాటకమా?"

"నాటకమో లేక బుర్రకదో హరి కదో - ఏదో కల్చరల్ ప్రోగ్రాం -- దాని గొడవెందుకులే గానీ ఇక్కడికి దగ్గరలో 'మందు' ఎక్కడయినా దొరుకుతుందా?"

భవానీ శంకర్ మెదడు వేగంగా పనిచేయసాగింది.

కేవలం తన గుట్టు బయట పెట్టడానికే మారుతీ రావ్ దీపక్ ని తీసుకొచ్చి ఉంటాడు.

"చెప్పు గురూ!" మనిద్దరం ---ఇంత అందమయిన సీనరీలో కలుసుకున్న ఈ శుభ సమయంలో - మందు కొట్టకపోతే ఎలా? దగ్గరలో ఎక్కడుంది మందు?"

"సింగారం ఊళ్ళో మెయిన్ రోడ్ మీదే షాప్స్ ఉన్నాయ్-"

'అల్ రైట్ - ఇప్పుడే వెళ్ళి రెండు బాటిల్స్ తెచ్చేస్తాను. నువ్వెక్కడికి వెళ్ళకు. ఇద్దరం కలసి సెలబ్రేట్ చేసుకుందాం!"

"ఒకే......"

దీపక్ పరుగుతో బయటి కెళ్ళిపోయాడు.

* * * *

అప్పల్రాజు గార్డెన్ లో కూర్చుని తన ఆత్మకథలో ఇరికించాల్సిన ఓ ఎమ్మెల్యే పేరు గుర్తు తెచ్చుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. డయిరీలో అతని పేరు ఉంది గానీ అది కామేశ్వరరావో , రామేశ్వరర్రావో అర్థం కావటం లేదు.

"కామేశ్వరర్రావ్, కామేశ్వర్రావు " అని రెండు సార్లు అనుకున్నాడతను. ఆ

పేరు లాగానే అనిపిస్తోంది. బహుశా అదే అయుంటుంది. ఓ నిమిషం ఆగి ఎందుకయినా మంచిదని "రామేశ్వర్రావు, రామేశ్వరరావు" అని మరో రెండుసార్లు అనుకున్నాడు. అదీ కరెక్ట్ గానే అనిపిస్తోంది. ఎలా ఇప్పుడు?

అప్పుడు వచ్చాడు మారుతీ రావు.

"సార్!"

"ఊ!"

"వాడి పేరు భవానీ శంకర్ అని తెలిసింది సార్!"

"భవానీ శంకరా" తన గుర్తున్న రెండు పేర్లూ కాకుండా మూడో పేరు ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోతూ అడిగాడు అప్పల్రాజు .

"అవున్సార్! వాడు రచయిత దీప్ చంద్ కాదు –"

మారుతీ రావ్ మాట్టాడేదే మాత్రం అర్థం కావటం లేదతనికి.

"వాడి పేరు కామేశ్వర్రావో, రామేశ్వర్రావో ––––ఈ రెండింట్లోనే ఉండాలి!" అన్నాడతను.

"కాదు సార్! భవానీ శంకర్!"

"షటప్! పిచ్చివాగుడు వాగకు!"

"అవున్సార్! ఆ విషయం ఋజువు చేయటానికే మా అన్నయ్య కొడుకుని తీసుకొచ్చాను. వాళ్ళిద్దరూ క్లాస్ మేట్స్!"

"దీపక్, భవానీ శంకర్...."

″భవానీశంకరెవరు?″

″వాడె సార్! దీప్ చంద్ – అంటే భవానీ శంకర్ – అంటే–″

″దీప్ చంద్ పేరు భవానీ శంకర్ అని కూడా ఉందా?″

″అది కాద్సార్ – వాడు దీప్ చంద్ పేరుతొ మనింటి కొచ్చాడు. అసలు దీప్ చంద్ వేరు . దీప్ చంద్ కాదండీ అంటే అసలు భవానీ శంకర్ పేరు దీప్ చంద్ – అహహ – దీప్ చంద్ అసలు పేరు – దొంగ పేరండీ!″

″షటప్ – పిచ్చివాగుడు వాగకు–″

″అవున్సార్ – నేను ఋజు చేస్తాను–″

అప్పల్రాజు మారుతీరావు మీద కోపం పెరిగిపోతోంది దాంతో పాటు అతని మానసిక పరిస్థితి మీద అనుమానం కూడా ఎక్కువయిపోతోంది. వెంటనే అతనికి సైక్రియాటిస్ట్ దగ్గర రెండు 'షాక్ ' లు ఇప్పించటం చాలా అవసరం అనిపించింది . ఓసారి మాటల్లో దీప్ చంద్ కూడా అదే మంచిదని చెప్పాడు.

వెన్నెల వేట పేజి 50

దీప్ చంద్ ని తనే హైదరాబాద్ వెళ్ళి కలుసుకున్నాడు. ఇద్దరూ గంటన్నర సేపు ఎన్టీఅర్  గురించి వాదించుకున్నారు కూడా. అలాంటి వాడిని పట్టుకుని ″అతను దీప చంద్ కాదు – భవానీ శంకర్ అనటం తనను ఇన్సల్ట్ చేస్తున్నట్లుంది.

″ఎలా ఋజు చేస్తావ్?″ కోపంగా అడిగాడతను.

″మా అన్నయ్య కొడుకు దీపక్ ని తీసుకొచ్చాను సార్! వాళ్ళిద్దరూ కలిసి ఒకే చోట చదువుకున్నారట...″

"సరే -------బుజు చేయక పోయావో -----నీ ఉద్యోగం గోవిందా- గుర్తుంచుకో"

"అలాగే సార్!"

"రాత్రి భోజనాలయాకనే ఆ దీపక్ ని తీసుకురా దీప్ చంద్ గదికెళ్దాం-"

"ఇంకెందుకు నిలబడ్డావిక్కడ - పో నువ్వు-"

మారుతీరావ్ ఉత్సాహంగా శమంతకమణి గడివేపు నడిచాడు.

* * * *

అదే సమయంలో కరుణా కర్ తన గదిలో కూర్చుని మాస్టర్ ప్లాన్ తయారు చేసుకుంటూన్నాడు.

మర్నాడు రాత్రి పన్నెండింటికల్లా కల్చరల్ ప్రోగ్రామ్స్ ముగిసిపోతాయ్. అతిధులంతా వెళ్ళిపోతారు. అందరూ నిద్రపోయాక సుమారు రెండు గంటలకు తను ఆపరేషన్ ప్రారంభిస్తాడు.

నెమ్మదిగా లేచి స్ట్రాంగ్ రూమ్ దగ్గరకెళ్ళి - తన దగ్గరున్న తాళం చేతుల్తో తలుపులు తెరచి - ఇనప్పెట్టేలో ఉన్న బ్రీఫ్ కేస్ తీసుకుని పారిపోతాడు, అంతే ! వెరీ సింపుల్!

ఈ పని తను ఎప్పుడో చేయగలిగేవాడు. కానీ ఆ స్ట్రాంగ్ రూమ్ కి ఇనప్పెట్టెకి సరిపోయే తాళం చేతులు తయారుచేసుకోవడానికి ఇంతకాలం పట్టింది.

కరుణాకర్ పెదాల మీద నవ్వు వెలిసింది. ఇంతకాలానికి - తను లక్షాధికారి కాబోతున్నాడు.

* * * *

శమంతకమణి మనసు మనసులో లేదు. దీప్ చంద్ పేరుతొ ఉన్న ఆ మోసగాడు మర్నాడు రాత్రే స్ట్రాంగ్ రూమ్ లోని బ్రీఫ్ కేస్ ఎత్తుకు పోవాలని నిర్ణయించుకున్నట్లు కిరతకరావు చెప్పిన వార్త ఆమెకు భయం కూడా కలుగజేస్తోంది. ఒకవేళ తను అడ్డుపడితే వాడు తనను కాల్చి చంపెస్తాడేమో అన్న అనుమానం కొత్తగా మొదలయింది. చాలా నవలల్లోనూ, సినిమాల్లోనూ సాధారణంగా అలాగే జరుగుతుంటుంది.

ఏదేమయినా ఈ విషయమంతా ఎవరితోనయినా చర్చించి మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవాలను కుందామే. కానీ ఎవరితో మాట్లాడటం? ప్రస్తుత పరిస్థితుల్లో తను నమ్మదగిన వ్యక్తీ ఎవరు?

అప్పల్రాజు లాభం లేదు. అయోమయం! వర్ధనరావ్ సరేసరి! ఏ మాత్రం నమ్మటానికి వీల్లేదు. ఓసారి తన ఉంగరం కాజేసి అమ్మేశాడు. మనో చిత్ర అనవసరం ; ఇకపోతే శ్యామలారాణి ఒక్కర్తే బాగా నమ్మదగిన వ్యక్తిగా కనిపించిందామెకి. ఆమెతో ఈమధ్యే తనకు పరిచయమయినా – చాలా గాడ స్నేహం ఏర్పడిపోయింది తమ మధ్య. కాకినాడ లో చాలా పెద్ద కుటుంబం అట వాళ్ళది. 'టైగర్స్ క్లబ్" యూనివర్శిటి ఏర్పాట్లలో తనకు సహాయం చేయడానికని ముందే వచ్చేసింది.

వెంటనే శ్యామలా రాణి గదికి చేరుకుందామే.

"ఇప్పుడే విజయనగరం టైగర్స్ క్లబ్ ప్రెస్ డెంట్ నుంచీ టెలిగ్రాం వచ్చిందండీ! ఆమె షూటింగ్ రావటం కుదరదట–" అంది శ్యామలా రాణి.

"పోనీలే గానీ ----నీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి!" అంది శమంతకమణి.

"ఏమిటది?"

"మావారు ఆత్మకథ రాస్తున్న విషయం నీకు తెలిసిందేగా?"

'అవును! మీరే చెప్పారు - అది రాయకుండా చెయ్యాలని చాలా మంది రాజకీయ నాయకులూ ప్రయత్నాలు చేస్తున్నట్లు -"

"దీప్ చంద్ ఎవరనుకుంటున్నావ్? ఎవరో దొంగట! ఆ స్క్రిప్టు తాలుకూ డయిరీలు , ఉత్తరాలు , ఫోటోలు కొట్టేయటానికే వచ్చాడు -"

"అరె! అదేమిటి? అతను రచయిత దీప్ చంద్ కాదా!" తెలీనట్లు అడిగిందామె.

"కాదని మన డిటెక్టివ్ కిరతరావ్ ఖచ్చితంగా చెప్పాడు . అంతేకాదు సినిమా డైరెక్టర్ కరుణా కర్ కూడా వాడు దీప్ చంద్ కాదని అన్నాడు.."

"మరి వాడిని ఎందుకు పోలీస్ కివ్వలేదు?"

"కాదని ఋజువు లేమీ లేవుగా మన దగ్గర! అందుకే మారుతీరావు వాళ్ళ అన్నయ్య కొడుకుని తీసుకొచ్చాడు. ఇవాళ రాత్రికి వాడి బండారం బయటపడి పోతుంది గదా! అప్పుడు పోలీస్ కిచ్చేస్తాను-"

"ఇంతకూ ఇప్పుడేమిటీ చేయటం?" అడిగింది శ్యామలారాణి.

"డిటెక్టివ్ ఓ అయిడియా చెప్పాడు-"

శ్యామలా రాణిలో అనుమానం తలెత్తింది.

"ఏమన్నాడు?"

శమంతకమణి కిరాతకరావు చెప్పిన ఉపాయం వివరించింది. శ్యామలారాణి నిర్ఘంతపోయింది తనకు తెలీకుండా కిరతకరావు ఎంత మోసం తల పెట్టాడో తెలిసిపోయింది. తనను కూడా మోసం చేసి వాటిని దొంగిలించుకు పోవాలని ప్లాన్ వేశాడన్నమాట! వాడికి తగిన శాస్తి ఎలా చేయాలో తనకు తెలుసు.

"నాకు ఆ డిటెక్టివ్ మీద కూడా అనుమానంగా ఉంది" అందామె.

శమంతకమణి ఉలిక్కిపడింది.

"డిటెక్టివ్ మీద అనుమానమా?"

"అవును! వాడి ఫోటో ఎప్పుడో పేపర్లో "ఆచూకీ తెలిపినవారికి బహుమతి" కాప్షన్ కింద చుసిన గుర్తు-"

శమంతకమణికి నోట మాట రాలేదు.

'అంటే-"

"వాడు పాటకేడి అని కూడా అనుమానం!"

"మైగాడ్!" గుండెలు బాదుకుందామే. "అయితే ఇప్పుడెం చెయ్యాలి?"

"మీకేం భయమక్కరల్లేదు, నేను చెప్పినట్లు చేయండి! వాడికి రేపు బ్రీఫ్ కేస్ లో పనికిరాని చెత్తంతా పెట్టి అవే ఒరిజనల్స్ అని ఇచ్చేయండి! వాడు అది తీసుకు పారిపొయినా మనకేమీ నష్టం ఉండదు-"

″మరి ఒరిజనల్స్ ఉన్న బ్రీఫ్ కేస్ ?″

″అది నాకివ్వండి!″ దానిని జాగ్రత్తగా దాచే బాధ్యత నాది!″

శమంతకమణి ఓ క్షణం ఆలోచించింది. ఆ ఉపాయం బాగానే ఉన్నట్లనిపించిందామెకి. శ్యామలా రాణి మీద తనకు పూర్తి నమ్మకం ఉంది. గనుక ఇంక తనకే భయం లేదు.

″సరే! అలాగే చేస్తాను-″ అని గదిలోంచి బయటికొచ్చిందామే.

* * * *

ఆ తరువాత శ్యామలా రాణి , కిరతకరావులు గార్డెన్ లో ఓ మూల సమావేశమయ్యారు.

″రేపు మనం వాటిని ఎలా కాజేయ్యాలో ప్లాన్ చెప్తాన్నావు కదా?″ అడిగాడు కిరాతకరావు.

వెన్నెల వేట పేజి 51

″రాస్కెల్ ! నాకే టోకరా ఇవ్వాలని నువ్ ప్లాన్ వేసుకుని ఏమీ తెలీనట్టు నన్నడుగుతున్నావా?″ అనుకుందామే.

కానీ పైకి మాత్రం ″సరే! చెప్తున్నా విను! రాత్రి రెండు గంటలకు బయట గేటు దగ్గర కారు తీసుకుని సిద్దంగా ఉండు. నేను బ్రీఫ్ కేస్ తో సహా బాల్కనీలో నుంచి బయటకు దూకి పరుగెత్తు కోస్తాను. ఇద్దరం కలిసి కారులో పారిపోదాం!″ అందామె.

″కానీ మనకు కారేక్కడిది?″

"అది కూడా చెప్పాలా? అప్పల్రాజు కారు ఎలాగోలా గారేజ్ లో నుంచి బయటకు తీయాలి! ఆ ఏర్పాట్లన్నీ నీవి! ఎలా చేస్తావో , ఏం చేస్తావో నా కానవసరం-----"

"అల్ రైట్! అలాగే చేద్దాం!" అన్నాడు తలూపుతూ.

* * * *

మారుతీరావు భోజనాలవగానే హడావుడిగా అప్పల్రాజు గదిలోకి నడిచాడు. అప్పటికే శమంతకమణి అక్కడకు చేరుకుంది.

"సార్! పదండి! వాడెవడో తేల్చుకుందురు గానీ!" అన్నాడు మారుతీరావ్ ఆనందంగా.

"ఎక్కడికి? ఎవడి సంగతి తేల్చుకునేది!" ఆశ్చర్యంగా అడిగాడు అప్పల్రాజు.

శమంతకమణి చిరాకు పడింది.

"అదే! ఆ దొంగ వెధవేవడో రచయిత దీప్ చంద్ నంటూ మనింట్లో మకాం వేశాడు కదండీ. వాడి సంగతి తెల్చుకోదానికే" అంది కసురుకుంటూ.

అప్పల్రాజు కి అర్ధమయింది.

'అయితే వాడు అసలు దీప్ చంద్ కాదంటారు?"

"కాదు సార్! అతని పేరు భవానీ శంకర్ అనీ, తనతో పాటు కాలేజిలో చదివాడనీ ---ఇద్దరూ మంచి స్నేహితులన్నీ మావాడు చెప్తున్నాడు -------"

"ఎవరు మీ వాడు?"

"మా అన్నయ్య కొడుకే సార్! పేరు దేపక్-----"

"ముందు పదండి! అనుమానాలు తర్వాత తీర్చుకుందురు గాని" అంది శమంతకమణి.

అందరూ మేడమీదకు బయల్దేరారు.

మారుతీరావ్ దీపక్ గది ముందాగి తలుపు తట్టాడు. దీపక్ సింగారం మెయిన్ రోడ్ మీద వైన్ షాప్ నుంచీ తెచ్చుకున్న మందులో ఆఖరి భాగం కూడా గడగడ తాగేసి తూలుతూ వెళ్ళి తలుపు తెరచాడు.

"దీపక్! పద వాడి గదికి వెళ్దాం!" అన్నాడు మారుతీరావ్.

"ఎవరి గదికి?"

"అదే - భవానీ శంకర్ గదికి?"

"ఏ భవానీ శంకర్?"

"అదేమిట్రా! పొద్దున్న మీ రూమ్ లో - వాడి ఫోటో చూపించాను కదా?"

"ఏ పొద్దున్న?"

మారుతీరావ్ కి చిరాకేసు కొచ్చింది. "త్వరగా పద! అప్పల్రాజు గారు కూడా వచ్చేశారు!"

"ఏ అప్పల్రాజు?"

మారుతీరావ్ అతని భుజం మీద చేయి వేసి బలవంతంగా భవానీ శంకర్ గదిలోకి ఈడ్చు కెళ్ళాడు.

భవానీ శంకర్ వాళ్ళందరినీ చూస్తూ ఆశ్చర్యం నటించాడు.

"ఏమిటి సార్ - ఇలా వచ్చారు?" అన్నాడు అప్పల్రాజు తో.

అప్పల్రాజు శమంతకమణి వేపు చూశాడు. శమంతకమణి మారుతీరావు వేపు చూసింది.

మారుతీరావ్ దీపక్ భుజం మీద ఉత్సాహంగా చరిచాడు.

"చెప్పరా దీపక్! వీడెవడో చెప్పు --" భావానీశంకర్ వంక చూపుతూ అన్నాడు.

దీపక్ తూలుతూ ఓ అడుగు ముందుకేసి భవానీ శంకర్ వేపు చూశాడు.

"వీడెవడో నాకు తెలీదు ---"

మారుతీరావ్ షాక్ తిన్నట్లయి పోయాడు.

"ఏమిట్రా అది! వాడు నీ క్లాస్ మేట్ అని పొద్దున్న చెప్పావుగా?"

"నేను చెప్పలేదు----"

"నీకు పిచ్చెక్కిందా----- వాడి పేరు భావానీశంకర్ అని అనలేదూ?"

"భవానీ శంకరా? అసలా పెరేప్పుడూ వినలేదు......."

"ఒరేయ్! నీకేమయినా మతి పోయిందా! మీ ఇద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్ అని అన్నావు కదా!"

"అసలు వాడిని నా లైఫ్ లో చూళ్ళేదింతవరకూ-"

మారుతీరావ్ కి చెమటలు పట్టేసినాయ్.

"మరి వాడితో దిగిన ఫోటో నీ రూమ్ లో ఎందుకుంది?"

"నా దగ్గర అస్సలు ఫొటోలే లేవు."

"ఒరే దీపక్ - పొద్దున్న నువ్ చెప్పిన విషయాలు గుర్తు తెచ్చుకోరా!" బ్రతిమాలుతూ అన్నాడతను.

"ఏ పొద్దున్న?"

"ఇవాళ పొద్దున్న"

"ఏ ఇవాళ?"

'అబ్బా! తల పట్టుకున్నాడు మారుతీరావ్. "ఒరే దీపక్ ------ఇవాళ పొద్దున్న నేను నీ రూమ్ కి రాలేదూ?"

"నా రూమ్ కి ఎవ్వరూ రాలేదు - ఇంకో విషయం! నన్ను ఒరేయ్ అనకు!"

"ఏమిటి? నిన్ను ఒరేయ్ అనకూదదడూ?"

"ముక్కూ మొహం తెలీని వాళ్ళంతా 'ఒరేయ్ అంటే తంతాను."

"ముక్కు మొహం తెలీని వాళ్ళా? నేనెవరో నీకు తెలీదూ?"

"నా జీవితంలో ఇదే మొట్టమొదటి సారి నిన్ను చూడటం!"

మారుతీరావ్ అదిరి పడ్డాడు.

"ఏమిట్రా! నన్ను చూడటం ఇదే మొదటిసారా?" పళ్ళు కొరుకుతూ అన్నాడు

మారుతీరావు.

"అవును! ఇంకో సంగతి! నువ్విప్పుడు రెండోసారి కూడా "రా" అనేశావు నన్ను! ఇదే ఆఖరి వార్నింగ్! మూడోసారి 'రా' అన్నావంటే తంతాను."

అప్పల్రాజు కి కోపం ముంచుకొచ్చేసింది వాళ్ళ తతంగం చూస్తుంటే.

"మారుతీరావ్! నిన్ను డిస్మిస్ చేస్తున్నాను! ఇంట్లో నుంచి బయటకు పో ముందు...."

"అది కాద్సార్ ......వీడు ....."

"షటప్! ఎవడ్నో కిరాయి వెధవను పట్టుకొచ్చి మీ అన్నయ్య కొడుకని అబద్ధం చెప్తావా! పైగా ఆ జంటిల్మన్ దీప్ చంద్ ని దొంగంటావా?"

శమంతకమణి కేం చేయాలో పాలుపోవటం లేదు .

"ఇంకోసారి లాంటి తిక్క పనులు చేయకు....." అంది మారుతీరావుతో.

'అది కాదు మేడమ్...."

"ఇంకా అపు! దీప్ చంద్ గారూ.....క్షమించాలి! ఇదంతా ఈ మారుతీరావ్ చేసిన పని...."

"ఏం ఫర్లేదు మేడమ్! అనుమాన నివృత్తి చేసుకోవటం భారతీయుల జన్మ హక్కు!"

మారుతీరావ్ దీపక్ ని బయటకు ఈడ్చుకోచ్చాడు.

"సారీ మిస్టర్ దీప్ చంద్ !" అన్నాడు అప్పల్రాజు నొచ్చుకుంటూ.

"దట్సాల్ రైట్ సార్! పాపం మారుతీరావు నేమీ చేయకండి. వాడికి కొంచెం - ట్రీట్ మెంట్ ఇస్తే చాలు, బాగయిపోతాడు."

వెన్నెల వేట పేజి 52

"ట్రీట్ మెంటా?"

"అవును! మెంటల్ ట్రీట్ మెంట్ ; రెండే రెండు 'షాక్' లు ఇప్పిస్తే చాలు, ఓ.కే. అయిపోతాడు."

"అంతేనంటావు!"

"అవున్సార్!"

"దాని కోసం డిస్ మిస్ చేయనవసరం లేదంటావు!"

"ఏమాత్రం అవసరం లేద్సార్! ఎవరికి ప్రమాదం కలుగజేయాడు గనుక - వదిలేయవచ్చు - జస్ట్ రెండు షాకులు ఇస్తే చాలు."

"అల్ రైట్, డాక్టర్ రాజారావుని పిలిపిస్తాను --"

"బెస్ట్ సైక్రియాటిస్ట్ గాంధీని పిలవండి సార్ - అయిదు నిమిషాల్లో మారుతీరావు మనందరిలా మాములు మనిషయిపోతాడు-"

"ఓ.కె. ఇప్పుడే ఫోన్ చేస్తాను -" బయటకు నడిచాడతను.

అంతవరకూ గది బయటే నిలబడ్డ వర్ధనరావు పరుగుతో లోపలి కొచ్చాడు.

"అమ్మయ్య ఎక్కడ కొంప మునుగుతుందోనని భయపడి చచ్చాను గురూ! ఆ దీపక్ గాడెవడో గానీ - భలే దెబ్బ కొట్టాడులే - ఆ మారుతీ గాడికి-"

"గూబ పగిలెట్లు కొట్టాడు బ్రదర్–"

"ఎలా మానేజ్ చేశావు వాడిని ?"

మంచి 'మందు' దొరికే ప్రదేశం ఎక్కడుందో చెప్పటమే కాకుండా – నేనే ఓ బాటిల్ తెప్పించి గంట క్రితమే బహుకరించాను వాడికి!"

"సూపర్బ్ అయిడియా, ఇంతకూ రేపు మన కార్యక్రమం ఏమిటి గురూ?"

""వెరీ ఈజీ స్కీమ్ బ్రదర్! రేపు రాత్రి మీటింగ్ కార్యక్రమాలు ముగిసి అందరూ నిద్రపోయాక – నేను ఎవరూ లేకుండా చూసి స్ట్రాంగ్ రూమ్ లో వెళ్తాను."

"ఎలా? బయట మారుతీరావు గారు కాపలా ఉంటాడుగా?"

"వాడు మత్తులో కెళ్ళేందుకు కొన్ని మార్గాలు సేకరించానులే–"

"అద్భుతం –"

"లోపలి కెళ్ళాక నువ్విచ్చిన డూప్లికేట్ తాళం చెవితో ఇనప్పెట్టి తెరచి లోపలున్న బ్రీఫ్ కేస్ తీసి ఆ గది కిటికీ లోనుంచి బయట గార్డెన్ లోకి విసిరేస్తా."

"ఎందుకలా విసిరేయటం?"

"లోపల ఎవరయినా నన్ను బ్రీఫ్ కేస్ తో చూస్తే ప్రమాదం గనుక – నువ్వు అప్పటివరకూ ఆ గది బయట గార్డెన్ లో దాక్కుని ఉంటావు కాబట్టి ఆ బ్రీఫ్ కేస్ నేను విసరగానే తీసుకెళ్ళి చెరువు దగ్గరున్న సిమెంట్ బెంచీ కింద చెట్ల గుబురులో దాచేసి – విజిలేసుకుంటూ ఇంటిలో కోస్తావు – అంతే!– ఆ దొంగతనం తాలుకూ గొడవంతా సద్దుమణిగాక మనం ఆ బ్రీఫ్ కేస్ ని చెరువు వెనుక ఉన్న గోడ మీద నుంచీ తీసుకెళ్ళి పబ్లిషర్స్ కిచ్చేస్తాం, దాంతో కథ కంచికి,

మనం మనింటికీ – ఎలా వుంది?"

"సింప్లీ సూపర్బ్ గురూజీ."

"గుడ్ నైట్–"

వర్ధనరావు వెళ్ళిపోగానే భావానీశంకర్ మంచం మీద వాలిపోయాడు.

* * * *

మర్నాడు ఆంధ్రప్రదేశ్ హౌస్ చాలా సందడిగా తయారయింది.

చాలా ఊళ్ళ నుంచీ విచ్చేసిన టైగర్స్ క్లబ్ మెంబర్స్ – రంగు రంగుల చీరలతో ఆ అందమయిన పూలతోటల్లో తనివితీరా విహరిస్తున్నారు.

భవానీశంకర్ , కన్యకా అలవాటు ప్రకారం లైబ్రరీ హాల్లో అప్పల్రాజు దగ్గర సమావేశమయ్యారు.

"ఇవాళ మన స్క్రిప్టు వర్క్ కి శెలవు" అన్నాడు అప్పల్రాజు.

'అలాగా" ఆశ్చర్యంగా అన్నాడు భవానీశంకర్.

"యస్, ఈ పదిరోజుల్లోనే సగం స్క్రిప్ట్ వర్క్ అయిపొయింది. దీప్ చంద్! నువ్వు చాలా ఫాస్ట్ రైటర్ వి!" పోగిడాడతను.

అతనికి నిజంగానే దీప్ చంద్ మీద గౌరవం ఏర్పడిపోయింది. చాలా విషయాల్లో ఇద్దరి అభిప్రాయాలు ఏకీభవిస్తున్నాయ్.

అదే కాకుండా అంతవరకూ రాసిన స్క్రిప్ట్ ఎక్కడే ఫోటో ప్రింట్ చేయాల్సిందీ – ఏ అద్యాయంలో ఎవరి కీలకమయిన ఉత్తరం ప్రచురించాల్సింది – అన్నీ

ప్రతిభావంతంగా నిర్ణయించాడతను.

'ఆఫ్ కోర్స్! ఈ రోజుల్లో రచయితలు చాలా ఫాస్ట్ గానే ఉండాల్సార్! లేకపోతే కొంపలు మునిగిపోతాయి. ఒసారేం జరిగిందో మీకు తెలుసా?" అడిగాడు భవానీ శంకర్.

"ఏం జరిగింది?"

"ఓ రచయిత ఆ మధ్య ఓ ఇంగ్లీష్ నవల చదివి చాలా బాగుందని బోలెడు సంబరపడి దానిని కాపీ కొట్టి సీరియల్ గా రాయలనుకున్నాడు. కానీ ఆతను ఫాస్ట్ రైటర్ కాకపోవటం చేత ఏం జరిగింది? వేగంగా రాయగల మరో రచయిత దాన్నీ నవలగా రిలీజ్ చేసేసి - సినిమా గా కూడా తయారయే ఏర్పాట్లు చేసేశాడు ...."

"మైగాడ్....." అడిరిపోయాడు అప్పల్రాజు.

"అంచేత మా ఫీల్డ్ లోనూ, సినిమా ఫీల్డ్ లోనూ చాలా ఫాస్ట్ గా ఉండాలి! లేకపోతే మసి అయిపోతాము. ఓ.కే - మిస్ కన్యకా ---ఇంక మనం వెళ్దామా?"

ఆమె మౌనంగా లేచి అతనితో పాటు బయటికొచ్చింది.

"హాయ్ దీప్ " అంది మనో చిత్ర. "మీ కోసమే ఎదురు  చూస్తున్నాను-"

"ఏమిటీ ప్రోగ్రాం డియర్?"

"గార్డెన్ లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం --ఏమంటారు?"

"పదండి కన్యాకా జీ!"

కన్యకకు వాళ్ళిద్దరి చనువూ చిరాకేసు కొచ్చింది.

"మీరు వెళ్ళండి! నాక్కొంచెం పని ఉంది."

"అల్ రైట్! " మనో చిత్ర తో పాటు గార్డెన్ వేపు నడిచాడతను. కన్యక తన గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది గానీ అలా వాళ్ళిద్దరూ అక్కడ ఎంత చనువుగా మసులుతున్నారో అన్న ఆలోచన నిలవనీయటం లేదు. కాసేపు గడిపేసరికి ఇంక భరించలేక తనూ గార్డెన్ కి బయలుదేరింది. ఆమెను దూరం నుంచే గమనించిన భవానీ శంకర్ మనో చిత్ర తో "కమాన్ డియర్ – ఆ రోజు గురు దక్షిణ అడిగానే – త్వరగా ఇవ్వు–' గాఢంగా మూడు పెట్టేసుకుంది. ఆ దృశ్యం చూసిన కన్యక టక్కున ఆగిపోయింది. కాళ్ళూ చేతులూ వణికాయ్. చివాలున వెనక్కు తిరిగి గదికి చేరుకుంది.

* * * *

సాయంత్రం ఆరుగంటలయ్యేసరికల్లా టైగర్స్ క్లబ్ వార్షికోత్సవం ప్రారంభమయి పోయింది. ఆంధ్రప్రదేశ్ భవనం వెనుక ఏర్పాటు చేసిన షామియానాలో అతిధులు ఆశీనులయ్యారు. శమంతకమణి వార్షిక నివేదికను డిటెక్టివ్ నవల్లా చదువుతోంది.

భవానీ శంకర్ నిద్రలేచి బాల్కనీలో కొచ్చి నిలబడ్డాడప్పుడే , దూరంగా గార్డెన్ లో సిమెంట్ బెంచీ మీద వంటరిగా కూర్చున్న కన్యకను చూసేసరికి అమితమయిన ఉత్సాహం కలిగిందతనికి. ఉదయం ఆమె చూసిన దృశ్యం చాలా అద్భుతమయిన ఫలితాలు సాధించి ఉండవచ్చు.

వెంటనే ఆమె దగ్గరకు బయలుదేరాడు.

అతనిని చూస్తూనే కోపంగా లేచి నిలబడిందామె.

'అరె! ఏమిటలా నిలబడ్డారు! కూర్చోండి డియర్! మీతో తీయగా, హాయిగా, ఈ చల్లని గాలిలో – కబుర్లు చెపుతూ తరించాలని వచ్చాను.″

″మీతో కబుర్లు చెప్పటానికి ఆ మనో చిత్ర ఉందిగా! ఆమెతోనే మాట్లాడండి....″

అక్కడి నుంచి వెళ్ళి పోబోయిందామె.

భవానీ శంకర్ చటుక్కున ఆమె చేయి పట్టుకుని ఆపేశాడు.

″మనో చిత్రతో తీయగా , హాయిగా కబుర్లా? ఎలా సాధ్యం డియర్ మనసులో 'వెన్నెల ' ను – అంటే మిమ్మల్ని నింపుకుని మరో అమ్మాయితో – యూ ఆర్ మిస్టేకన్ ఫ్రెండ్ – మనో చిత్ర – జస్ట్ నా అభిమాన పాఠకురాలు అంతే″

వెన్నెల వేట పేజి 53

కన్యకకు వళ్ళు మండిపోయింది.

″అభిమాన పాఠకురాళ్ళను మీరు ముద్దులు కూడా పెట్టుకుంటారు కదూ?″

″ఓ! అయితే ఉదయం ఆ సీన్ మీరు చూశారన్న మాట. వెరీ శాడ్ అభిమాన రచయితలను పాఠకురాండ్రు అలా ముద్దు పెట్టుకోవడం చాలా సహజం డియర్. ఇంకా మనదేశంలో చాలా తక్కువ ఇది. ఇదే విదేశాల్లో అయితే–″

″నాకేం చెప్పనక్కరలేదు. యూ ఆర్ ఏ లయర్–″

″నో–నో–నో–– మనో చిత్రది కేవలం అభిమానం డియర్ ఆమెకు నేను దీప్

చంద్ ని కాదని తెలుస్తే – మళ్ళీ నావంక చూడదు –"

కన్యకి గుండె వేగంగా కొట్టుకుంది అవును తనే ఈ విషయం మనో చిత్రకు చెప్పాలి. దాంతో ఆమె బెడద వదిలిపోతుంది తనకు.

* * * *

శమంతకమణి స్టేజి మీద కూర్చునే ప్రతి అయిదు –నిమిషాలకొసారి స్ట్రాంగ్ రూమ్ గదిని మారుతీరావు, డిటెక్టివ్ కిరతకరావ్ జాగ్రత్తగా కాపలా కాస్తున్నదీ లేనిదీ తెలుసుకుంటుంది.

స్టేజీ మీద– మైక్ ముందు నిలబడి "సినిమాల్లో దొంగతనాలు దృశ్యాలు " అనే అంశం గురించి మైక్ దగ్గర కెళ్ళి మాట్లాడసాగాడు కరుణాకర్ .

మరి కాసేపటికి సంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కర్నూల్ కి చెందిన టైగర్ క్లబ్ మెంబర్ కూతుళ్ళు ఇద్దరూ హటాత్తుగా భరతనాట్యం ప్రారంభం చేశారు. దాంతో కొంతమంది అతిధులు పరారయిపోయారు.

రాత్రి పదకొండు గంటల కల్లా ఇంచుమించుగా అతిధులంతా వెళ్ళిపోయారు. మిగిలిన ఒకరిద్దరికీ వేరే గదులు కేటాయించింది శమంతకమణి. ఆ తరువాత తన గదికొచ్చి రెండు బ్రీఫ్ కేస్ లు తీసుకొని వాటిల్లో పాత డిటెక్టివ్ పుస్తకాలు పెట్టి లాక్ చేసేసి అందులో ఒకటి కిరతకరావు కిచ్చింది.

"జాగ్రత్తగా కాపాడాలి?" అందామె మరోసారి హెచ్చరిస్తూ.

"మీరు నిశ్చింతగా ఉండండి. మాలాంటి పెద్ద డిటెక్టివ్ లకు ఇది ఉఫ్ మని ఊదేసే కేసు" అన్నాడు కిరతకరావు పొంగిపోతూ. తన పని ఇంత తేలిగ్గా –

ఇంత డైరెక్టుగా అయిపోతుందని తనెప్పుడూ అనుకొనే లేదు.

అతను బ్రీఫ్ కేస్ తీసుకుని వెళ్ళిపోగానే శ్యామలారాణి తన గదికి పిలిపించిందామె.

"ఇదిగో ఈ బ్రీఫ్ కేస్ జాగ్రత్తగా చూచుకోవాలి ?" అందామె.

"మీకు రేపు పువ్వుల్లో పెట్టి వాపస్ చేస్తాను" అంది శ్యామలా రాణి.

'ఆ డిటెక్టివ్ నకిలీ సరుకున్న బ్రీఫ్ కేస్ ఇచ్చేశాను -" అంది శమంతకమణి.

"వాడది తీసుకు పారిపోతే - తిక్క వదిలిపోతుంది"

"నేను తెలివి తక్కువ దద్దమ్మ ననుకున్నాడు, దొంగ వెధవ?" అందామే.

'అవును" అంగీకరించింది శ్యామలా రాణి.

"నేను బాగా డిటెక్టివ్ పుస్తకాలు చాదువుతానన్న విషయం వాడికి తెలీదు -"

"బుర్ర నిండా బూడిదే వాడికి"

"జాగ్రత్త" మరోసారి హెచ్చరించింది శమంతకమణి.

"నా దగ్గర ఎవరి ఆటలూ సాగవు లెండి-" చెప్పి తన గదికి చేరుకుందామే.

శ్యామలా రాణి కూడా వెళ్ళిపోయాక తన గదిలో మంచం మీద పడుకుని తనలో తనే నవ్వుకుంది శమంతకమణి.

"ఇలాంటి విషయాల్లో సొంత మనుషులను కూడా నమ్మకూడదు" అంతకు ముందే ఓ డిటెక్టివ్ పుస్తకంలో రచయిత రాయటం చదివిందామె.

అందుకే తన తమ్ముడు వర్ధనరావు ని కూడా నమ్మదల్చు కోలేదీ విషయంలో మరికాసేపట్లో సన్నని గురక పెట్టసాగిందామె.

* * * *

'తానికటి తలచిన దైవ మొకటి తలుచును' అనే సూత్రం మీద – అంతకు ముందు కిరతకరావు కెప్పుడూ నమ్మకం లేదు గానీ  ఆరోజు శమంతకమణి ఇచ్చిన బ్రీఫ్ కేస్ తన రూమ్ కి తీసుకెళ్ళి – దాన్ని తెరచి అందులో ఆమె చెప్పినట్టు డయిరీలు వగైరాలు కాకుండా పాత డిటెక్టివ్ నవలుండటం చూశాక మాత్రం – వెంటనే నమ్మకం కలిగిందతనికి. తను ఎన్నో తంటాలు పడి అప్పల్రాజు గారేజ్ తాళం చెవి, కారు ఇగ్నిషేన్ 'కీ' అన్నీ సంపాదించాడు. ఈ బ్రీఫ్ కేస్ తీసుకుని ఒంటిగంట అవకముందే శ్యామలరాణి కూడా 'చెయ్యి' ఇచ్చి పారిపోదామనుకున్నాడు గానీ – కథ అడ్డం తిరిగింది. ఇప్పుడేమిటి చేయటమా అన్న ఆలోచనలో పడిపోయాడతను.

* * * *

ఒరిజనల్ షెడ్యుల్ ప్రకారం భవానీ శంకర్ నెమ్మదిగా తన గదిలో నుంచి బయటికొచ్చాడు. మెడ మెట్లు దిగి హాల్లో కొచ్చి స్ట్రాంగ్ రూమ్ వేపు చూశాడు. ట్యూబ్ లైట్ వెలుతురులో మారుతీరావు ఆ పక్కనే కుర్చీలో కూర్చుని కునికి పాట్లు పడుతూ కనిపించాడు. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అతని దగ్గర కెళ్ళి చటుక్కున అతని నోరు మూసివేసి ముక్కు దగ్గర మత్తు మందు ఉంచాడు. గట్టిగా కేకలు వేయటానికి మారుతీరావు విశ్వప్రయత్నం చేసాడు గానీ ఫలితం లేకపోయింది. నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడు. వర్ధనరావు సప్లయి చేసిన డూప్లికేట్ తాళం చెవితో స్ట్రాంగ్ రూమ్ తలుపు తెరచి లోపలకు అడుగు

పెట్టడతను. లోపలున్న ఓల్డ్ దగ్గర కేల్లెసరికి బయట ఇంకెవరో అడుగుల చప్పుడు వినిపించింది. చటుక్కున అల్మారా వెనుకకు వెళ్ళి నిలబడిపోయాడతను. మరుక్షణం తాళం చెవితో తలుపు తెరవడానికి కొన్ని ప్రయత్నాలు చేశాక – తలుపులు తెరచుకొని లోపలి కొచ్చాడు కిరతకరావు. వెనుకే తలుపులు మూసివేసి టార్చ్ లైట్ వెలిగించి తన దగ్గరున్న పెద్ద తాళం చేతుల గుత్తి తీసుకుని వరుసగా ఒక్కొక్కటే ఉపయోగించి ఇనుపపెట్టే తెరవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అయిదు నిమిషాల తర్వాత ఇనుపపెట్టి చిన్న శబ్దంతో తెరచుకుంది. లోపలి బ్రీఫ్ కేస్ తీసుకుని తను తెచ్చిన నకిలీ బ్రీఫ్ కేస్ ఇనప్పెట్టేలో ఉంచాడు. ఇనపెట్టే మూసివేసే సమయంలో ఇంకెవరో రూమ్ తలుపులు తాళం చెవితో తెరవడానికి ప్రయత్నం చేస్తున్న శబ్దాలు వినిపించసాగాయి. కిరాతకరావుకి చెమటలు పట్టేయ సాగాయి. ఇంతా శ్రమపడి సంపాదించిన బ్రీఫ్ కేస్ ని ఏ పరిస్థితుల్లోనూ వదులుకోడానికి వీల్లేదు. ముందు దీనిని ఇంకెవరూ చూడని ప్రదేశంలో దాచేయాలి. టార్చ్ లైట్ తో గదంతా పరీక్షించాడతను. కానీ దానిని సురక్షితంగా దాచాగాలిగిన స్థలం ఎక్కడా కనిపించలేదు. అతని దృష్టి గది కిటికీ మీద పడింది. వెంటనే ఆ కిటికీ తెరచి బ్రీఫ్ కేస్ ని కిటికీ లోంచి బయటకు విసిరేశాడు. గొడవంతా సర్దు మణిగాక తీసుకెళ్ళి ఆ బ్రీఫ్ కేస్ తీసుకుని పారిపోవచ్చు –

తలుపులు నెమ్మదిగా తెరచుకో సాగినాయి. కిరతకరావు చటుక్కున తలుపు చాటున నక్కాడు.

తలుపులు తెరచుకుని మరో ఆకారం లోపలి కొచ్చింది. అల్మారా లోపల కూర్చోవటం – వల్ల గదిలో ఏం జరుగుతుందో భవానీ శంకర్ కేమీ తెలీటం లేదు.

ఎవరో మూడో వాడు గదిలో కొచ్చినట్లు మాత్రమే తెలుస్తోంది. అల్మారా తలుపు నెమ్మదిగా తెరచి చూడసాగాడు.

ఆ వ్యక్తి ఎవరో కాదు కరుణాకర్.

మారు తాళం చేతులతో ఇనప్పెట్టె తెరచి బ్రీఫ్ కేస్ తీసుకుని గదిలో నుంచి బయటకు నడవసాగాడు.

భవానీ శంకర్ చటుక్కున అల్మారాలో నుంచి బయట కొచ్చేశాడు. అప్పుడే తలుపు చాటున నక్కిన కిరతకరావు కూడా బయటకు పరుగెత్తాడు. ఇంక ఆలస్యం చేస్తే బ్రీఫ్ కేస్ చేయి జారిపోతుందని తెలిసిపోయింది భవానీ శంకర్ కి. హాల్లోకి పరుగెత్తి టక్కున లైట్ స్విచ్ వేశాడు. హటాత్తుగా లైట్ వెలిగేసరికి వాళ్ళిద్దరూ ఖంగారు పడిపోయారు.

"తల వెనక్కు తిప్పవద్దు – నుంచున్న చోటి నుంచీ కదలవద్దు – కదిలారో ఈ పిస్టల్ గుండుతో చస్తారు –' అన్నాడతను.

కిరతకరావు కరుణాకర్ లు శిలా ప్రతిమల్లా నిలబడిపోయారు . భవానీ శంకర్ తన చేతినే పిస్టల్ లా ఉంచాడు వాళ్ళ వేపు.

వెన్నెల వేట పేజి 54

"సినీ డైరెక్టర్ సాబ్ , ఇలాంటి సీను చాలా సినిమాల్లో చూసే ఉంటావు. మర్యాదగా ఆ బ్రీఫ్ కేస్ ని సోఫాలో విసిరేసేయ్ బ్రదర్, ఆఫ్ కోర్స్ – నీ ప్రాణాల మీద నీకు ఆశ వుంటేనే!" కరుణాకర్ బ్రీఫ్ కేస్ ని సోఫాలో కి విసిరేశాడు.

ఇదిలా ఉండగా భవానీ శంకర్ చేతిలో స్పృహ తప్పినట్లు నటించిన

మారుతీరావు పరుగుతో వెళ్ళి అప్పల్రాజు నీ, శమంతకమణి నీ నిద్ర లేపేశాడు.

"ఆ దీప్ చంద్ దొంగతనం ప్రారంభించేశాడు!" అన్నాడతను ఒగారుస్తూ.

అప్పల్రాజు గన్ తీసుకుని శమంతకమణినీ, మారుతీరావునీ వెంబడేసుకుని హాల్లోకి కొచ్చాడు.

భవానీ శంకర్ బ్రీప్ కేస్ తీసుకోడాని కని రెండడుగులు ముందు కేసేసరికి "హాండ్సప్" అని అరిచాడు వెనుక నుంచీ!

భవానీ శంకర్ కూడా చేతులేత్తేశాడు గానీ వెనుక ఉన్నది అప్పల్రాజు అని తెలిశాక చేతులు దించేశాడు. మారుతీరావు పరుగుతో వచ్చి బ్రీఫ్ కేస్ తీసుకెళ్ళి శమంతకమణి కిచ్చేశాడు.

"నేను చెప్పలే\ద్సార్! దీప్ చంద్ 'దొంగ' అనీ" అన్నాడు మారుతీరావు విజయగర్వంతో.

"ఆహ్హాహ్హా!' నవ్వాడు భవానీ శంకర్. "నీ మానసిక పరిస్థితి రోజు రోజుకీ క్షీణేస్తోంది మారుతీరావు! కేవలం ఈ బ్రీఫ్ కేస్ దొంగలించ కుండా అపటమే నేను చేస్తున్న మహత్కార్యం!"

"నేనూ అంతే, ఈ కరుణాకర్ బ్రీఫ్ కేస్ తీసుకు పోతుంటే వెంబడించాను – " అన్నాడు కోరతకరావు చేతులు దించేస్తూ.

"ముందు చేతులు పైకెత్తు"– అన్నాడు అప్పల్రాజు కోపంగా,

కిరతకరావు మళ్ళీ చేతులు పైకెత్తాడు.

"మారుతీరావు' పిలిచింది శమంతకమణి.

″యస్, మేడమ్!″

″వెంటనే పోలీసుకి ఫోన్ చెయ్.″

″ఓ.కే. మేడమ్-″ అంటూ ఫోన్ చేయడానికి రెండడుగులు వేశాడో లేదో.

″అందరూ తమ చేతుల్లోని ఆయుధాలు కింద పడేసి – చేతులు పైకెత్తండి. లేకపోతే చస్తారు ″ అంటూ ఓ మూల నుంచీ స్త్రీ గొంతు వినిపించింది.

అప్పల్రాజు గన్ కింద పడేశాడు. కరుణాకర్ తన పిస్టల్ ని సోఫాలోకి విసిరేశాడు. ″నువ్వా″ విస్తుబోతూ అంది శమంతకమణి  తన వెనుక పిస్టల్ పట్టుకుని నిలబడ్డ శ్యామలా రాణి ని చూసి.

'అవును″

″నువ్వు కూడా ----″

″ష్ – అరవకు , ఇప్పుడు 'దొంగలా దొరలా ' అన్న విషయం మాట్లాడటానికి రాలేదు నేను' కఠినంగా అంది శ్యామలా రాణి, ″కిరతకరావు! నన్ను మోసం చేయడానికి ప్రయత్నించావు కదూ?″

కిరతకరావు తడబడ్డాడు? 'అబ్బే – అదేం కాదు – బయట కారు ....″

″నోర్ముసుకో వెంటనే – లేకపోతే చస్తావ్-″

కిరతకరావు నోరు మూతబడిపోయింది.

″మారుతీ రావు! ఆ బ్రీఫ్ కేస్ ఇలా తెచ్చివ్వు -----″వన్ – టూ- త్రీ ---- అనే లోగా!″

మారుతీరావు వణుకుతూ శమంతకమణి దగ్గరున్న బ్రీఫ్ కేస్ లాక్కోబోయాడు. శమంతకమణికి కోపం ముంచు కొచ్చింది.

"రాస్కెల్! అది అడమన్నట్లు ఆడుతున్నావా నువ్వు! సిగ్గు లేదూ!"

'అది కాదు మేడమ్------"

"వన్-" అరచింది శ్యామలా రాణి.

మారుతీ రావు మళ్ళీ బ్రీఫ్ కేస్ లాక్కోటానికి ప్రయత్నించాడు! ఈసారి శమంతకమణి బ్రీఫ్ కేస్ తో అతని నెత్తి మీద కొట్టింది.

"ఇడియట్! ఇంతకాలం మా ఇంటిలో ఉప్పు తిని - ఆ దొంగముండ చెప్పినట్లు ఆడతావా?"

"ఇంట్లో ఉప్పంతా వీడు తింటున్నాడా! అదీ సంగతి! అందుకే కూరల్లో ఉప్పు చాలటం లేదు మనింట్లో -' అన్నాడు అప్పల్రాజు కూరలు గుర్తు తెచ్చుకుంటూ.

"మేడమ్ - త్వరగా ఇవ్వండి- లేకపోతే ఆమె నన్ను కాల్చేస్తుంది ------"

"టూ--' అంది శ్యామలా రాణి.

మారుతీరావు ఇంక రిస్క్ తీసుకోదల్చుకోలేదు'.

శమంతకమణిని వెనక్కు ఒక్క తోపు తోసి బ్రీఫ్ కేస్ లాక్కున్నాడు . శమంతకమణి వెనక్కు వెల్లకిలా పడిపోయింది.

"ఓరి రాస్కెల్ - బ్రూట్ - నిన్నేం చేస్తానో చూడు!" అందామె. లేచి కూర్చుంటూ. మారుతీరావు అదేమీ వినిపించుకోకుండా బ్రీఫ్ కేస్ తీసుకెళ్ళి

శ్యామలా రాణి ముందు ఉంచాడు.

శ్యామలా రాణి ఆనందంగా బ్రీఫ్ కేస్ తీసుకుంటుండగా భవానీ శంకర్ ఒక్క అడుగు ఎగిరి చేతిమీద తన్నాడు. పిస్టల్ ఆ తాకిడికి ఎగిరి సీలింగ్ మీద కొట్టుకుని కింద పడింది. ఆ అవకాశం గమనించి ఆమె చేతిలోని బ్రీప్ కేస్ చటుక్కున లాక్కున్నాడు కరుణాకర్ వెంటనే బయటకు పారిపోవడనికని సింహద్వారం బోల్ట్ తీసి తలుపులు తెరచాడు.

"హలో" అన్నాడు వర్ధనరావు చిరునవ్వుతో లోపలి కోస్తూ.

కరుణాకర్ ఉక్కిరిబిక్కిరయ్యాడు. రాత్రి రెండు గంటల వేళ కూడా ఇలా తలుపులు తెరిచే సరికి జనం లోపలికు జోరబడతారని అతను ఊహించలేదు.

ఖంగారుగా రెండడుగులు వెనక్కు వేశాడతను.

"వెల్ డన్ మైడియర్ వర్ధన్! వెంటనే వాడి చేతిలోని బ్రీఫ్ కేస్ లాక్కో" అన్నాడు భవానీ శంకర్.

వర్ధనరావు కేమీ అర్థం కాలేదు. తను భవానీ శంకర్ ప్లాన్ ప్రకారం స్ట్రాంగ్ రూమ్ బయట గార్డెన్ లో కాపలా కాసి – కిటికీ లో నుంచి అనుకున్న ప్రకారం కిందపడ్డ బ్రీఫ్ కేస్ తీసుకెళ్ళి – చెరువు పక్కనున్న సిమెంట్ బెంచి కింద చెట్ల గుబుర్లలో దాచేశాడు.

మళ్ళీ ఇప్పుడింకో బ్రీఫ్ కేస్ కోసం ఈ హడావుడేమిటి మరి?

"హరీ అప్ గురూజీ! ది ఫేమస్ రైటర్ దీప్ చంద్ చెప్పిన ఆదేశాల ప్రకారం ఆ బ్రీఫ్ కేస్ నాకు అందజేయ్" అన్నాడతను కరుణాకర్ తో కరుణాకర్ కేం చేయాలో

తెలీలేదు. బ్రీఫ్ కేస్ అతనికి అందిస్తున్నట్లు నటించి వర్ధనరావు ముఖం మీద దానితోనే కొట్టి పారిపోవటమే బెస్ట్ ప్లాన్ అనిపించిందతనికి.

కానీ బెస్ట్ ప్లాన్ సఫలం అవలేదు. బ్రీఫ్ కేస్ వర్ధనరావు ని చేరుకోకుండానే వర్ధనరావు కాలితో ఒక్క తన్ను తన్నేసరికి – అది ఎగిరి ఆ హాల్ మధ్యలో పడి – అందులోని డిటెక్టివ్ పుస్తకాలన్నీ గదంతా చిందర వందరగా పడినాయ్.

ఒక్క కిరతకరావు తప్ప అందరూ నిర్ఘాంతపోయారు. వాళ్ళు ఆ షాక్ లో ఉండటం చూచి ఇదే అదనని కిరతకరావు బుల్లెట్ లా బయటకు పరుగెత్తాడు! స్ట్రాంగ్ రూమ్ బయట గార్డెన్ లోకి తను విసిరేసిన బ్రీఫ్ కేస్ తీసుకుని కారులో పరారయిపోవడానికి అదే అద్భుతమైన అవకాశం అనిపించిందతనికి. చీకటిలో ఒకటి రెండు సార్లు కిందపడి మళ్ళీ లేచి తను బ్రీఫ్ కేస్ పడేసిన చోటు కెళ్ళి వెతికాడు. అయితే స్ట్రాంగ్ రూమ్ ప్రక్కన లేదు గానీ మరో పది గజాల అవతల కనిపించింది. తక్షణం దానిని తీసుకుని తను అంతకుముందే సిద్ధంగా ఉంచిన అప్పలర్రాజు కారు దగ్గరకు పరుగెత్తాడు.

కిరతకరావు బుల్లెట్ లాగా బయటకు పరుగెత్తాక శ్యామలా రాణి స్పృహలోకి కొచ్చింది. తనూ అతని వెనుక బుల్లెట్ లా పరుగెత్తి అతనితో పాటు కారులో పరారవకపొతే పోలీసుల చేతిలో చిక్కటం తప్పదనిపించింది బ్రీఫ్ కేస్ ఎలాగూ దొరకదిక.

వెన్నెల వేట పేజి 55

మరుక్షణం అందరూ చూస్తుండగానే ఓ మూల పడివున్న తన పిస్టల్ అందుకుని గాల్లోకి ఓసారి కాల్చి బయటకు పరుగెత్తింది.

గారేజ్ బయట కారు సిద్ధంగా కనిపించిందామేకి. వెంటనే బాక్ డోర్ తెరచుకుని కార్పులో కుర్చుని కిరతకరావు ఎమయ్యాడా చుట్టూ చూడసాగింది. మరుక్షణంలో కిరతకరావు ఓ బ్రీఫ్ కేస్ తో సహా రావటం – బ్రీఫ్ కేస్ పక్కన పెట్టుకుని కారు వేగంగా నడుపుకుపోవడం జరిగిపోయింది. ఆమెకు అర్ధమయిపోయింది. కిరతకరావు తనకన్నా తెలివిగా వ్యవహరించి ఒరిజినల్ బ్రీఫ్ కేస్ సంపాదించాడు. అతనికింత తెలివితేటలూ ఎలా వచ్చాయో అర్ధం కాలేదామెకి.

* * * *

ఇలా దొరికిన దొంగలంతా బులెట్స్ లా బయటకు పారిపోతూ కారు కూడా దొంగలించు కెళ్ళి పోవటం శమంతకమణికి చిన్నతనంగా అనిపించింది.

"అలా డెబి మొఖం వేసుకు చూస్తావేం – ఇడియట్! పోలీస్ కి ఫోన్ చెయ్" అరిచింది శమంతకమణి.

ఆ అరుపుతో కరుణాకర్ కూడా ఆ లోకంలో కొచ్చి మరో కొత్త బుల్లెట్ లా బయట చీకటిలో దూసుకు పోయాడు.

మారుతీరావు హడావుడిగా ఫోన్ చేయసాగాడు.

'ఇంతకూ వాళ్ళు అసలు బ్రీఫ్ కేస్ తీసుకు పోయాడంటావా?" అడిగింది మనో చిత్ర.

"పదండి చూద్దాం!" అంది శమంతకమణి. అందరూ స్ట్రాంగ్ రూమ్ చేరుకున్నారు. గది తలుపులు ఇనపెట్టే తలుపులు తెరిచే ఉన్నాయ్ లోపల ఖాళీ!

"అది డిటెక్టివ్ గాడి పనే!" అందామె కసిగా.

'అవును!" అన్నాడు భవానీ శంకర్.

"దొంగ వెధవలు ఇల్లంతా నిండిపోయారు" అందామె.

"కిక్కిరిసి పోయింది ఇల్లు వాళ్ళతో" అన్నాడు భవానీ శంకర్.

"హోస్ ఫుల్ అని బోర్డు పెట్టాల్సి వచ్చేది - ఇంకో రోజాగితే -" అన్నాడు వర్ధనరావు. మరో పది నిమిషాల్లో పోలీసు జీప్ వచ్చి ఆగింది . ఇన్స్ పెక్టర్ సరాసరి స్ట్రాంగ్ రూమ్ దగ్గర కొచ్చేశాడు.

"ఏం జరిగింది ?" అడిగాడతను.

బ్రీఫ్ కేస్ ఎత్తుకు పోయారు-" చెప్పింది శమంతకమణి.

"బ్రీఫ్ కేసా?"

"అవును!"

"ఎంత డబ్బుంది అందులో-"

"డబ్బు లేదు-"

"మరి? నగలున్నాయా?"

"అవి కూడా లేవు-"

"ఇంకేమున్నాయ్ మరి?"

"పాత డయిరీలు, ఉత్తరాలు, ఫోటోలు-"

"వాటి కోసం ఇంత రాత్రి వేళ నా నిద్ర చెడగొడతారా? మండిపడుతూ అన్నాడతను. తనకు దొరక్క దొరక్క ఆరోజు రాత్రే ఫారిన్ విస్కీ బాటిల్ ని ఒకడు లంచంగా ఇవ్వటం అది మొత్తం తాగేసి తను నిద్రపోవడం – మధ్యలో ఆ రాస్కెల్ మారుతీరావు గాడు ఫోన్ చేసి ఆ విస్కీ తాలుకూ "మజా' అంతా సర్వనాశనం చేసేయటం సహించలేకపోతున్నాడతను.

'అవి చాలా విలువయినవి" అన్నాడు అప్పల్రాజు.

"ఎవరి డయిరీలు వాళ్ళకు విలువయినవే కావచ్చు! మిగతా వాళ్ళకు మాత్రం పరమ చెత్తవి అవి' అన్నాడతను కసిగా.

"డోంట్ సే లైక్ దట్ " అన్నాడు అప్పల్రాజు కోపంగా.

"అల్ రైట్! ఎవరేత్తుకు పోయారని?"

"డిటెక్టివ్ కిరతకరావు ఆ సినిమా డైరెక్టర్ కరుణాకర్ గారూ కలసి –"

"శ్యామలా రాణి కూడా" చెప్పింది శమంతకమణి.

"ఎవరు వాళ్ళు?"

"మా ఇంటిలో అతిధులు" అందామె.

'అంటే అసలు ఒరిజినల్ గా దొంగలు" అన్నాడు మారుతీరావు.

ఇన్ స్పెక్టర్ కి వాళ్ళ మాటలేమీ అర్థం కావటం లేదు. తనో పిచ్చాసుపత్రిలో అడుగుపెట్టి నట్లనిపిస్తోంది చూస్తుంటే!

"దొంగలయితే డబ్బు, నగలు ఎత్తుకుపోతాడు గానీ పాత డయిరీలు ,

ఫోటోలు, ఎందుకు ఎత్తుకు పోతారు?" చిరాకుగా అడిగాడు.

"అవి చాలా విలువయినవి గనుక" అన్నాడు అప్పల్రాజు మళ్ళీ.

"అవి అమ్మితే డబ్బు బోలెడు వస్తుందండీ" అంది శమంతకమణి.

"పాత డయిరీ లమ్మితే డబ్బొస్తుందా! దిసీజ్ మియర్ నాన్సెన్స్! నా డయిరీలు బోలెడు సార్లు రోడ్డు మీద పడిపోయినాయి గానీ – వారం రోజుల తర్వాత నేనే వాటిని చూసే వరకూ ఎక్కడ పడ్డాయో – అక్కడే ఉన్నాయి – ఒక్కరూ కూడా పట్టించు కోలేదు–"

అవి వేరు" అన్నాడు మారుతీరావు.

"హలో ఫ్రెండ్స్" అంటూ తూలుతూ మెట్లు దిగివచ్చాడు దీపక్. "ఏమిటంత రాత్రివేళ మీటింగ్ అన్నట్లు బాబాయ్ – ఇప్పుడు మందెక్కడయినా దొరుకుతుందా?" మారుతీరావు నడిగాడతను.

"హూ ఈజ్ ఈజ్ ఫెలో?" కోపంగా అడిగాడు ఇన్స్ పెక్టర్ .

"మా అన్నయ్య కొడుకండీ! దీపక్–'

వీడింకా ఇక్కడే ఉన్నాడా? నిన్నే హైదరాబాద్ పంపించేయమన్నానుగా?" కోపంగా అడిగాడు అప్పల్రాజు.

"నిన్నంతా – ఎంత లేపుదామని ప్రయత్నించినా నిద్ర లేవలేదండీ" వినయంగా చెప్పారు మారుతీరావు.

"యస్ బాబాయి అందుక్కారణం వుంది. మొన్న రాత్రి కొట్టిన స్టఫ్ బ్రహ్మాండంగా ఉంది. అలాంటి మందు నేనింతవరకూ తాగలేదంటే నమ్ము–"

మారుతీరావు అతనిని బలవంతంగా అతని గదిలోకి లాక్కెళ్ళి పోయాడు.

అంతవరకూ వాళ్ళ మాటలు వింటున్న కన్యక ఇంక తను చూచిన నిజం చెప్పేయటం చాలా ఉత్తమ మనిపించింది. ఆ బ్రీఫ్ కేస్ ని భవానీ శంకర్, వర్ధన రావులు కలసి కాజేయటం తన కిష్టం లేదసలు తిన్న ఇంటి వాసాలు లేక్కపెట్టినట్టే అవుతుంది. తన ఫ్రెండ్ శిరీష ప్రేమ సక్సెస్ అవాలన్న కోరికతో - ఆ రహస్యాన్ని అలా దాచింది గానీ మరో కారణంతో కాదు. ఇప్పుడు దాని కోసం ఇంత గొడవ జరుగుతుంటే తను ఏమీ తెలీని దానిలా నటించడం చాలా గిల్టిగా అనిపిస్తోంది. జరిగిందేదో జరిగిపోయింది. ఆ బ్రీఫ్ కేసుని వర్ధనరావె అంతకు ముందు కొద్దిసేపటి క్రితం తీసుకెళ్ళటం - చెరువు పక్కనే ఉన్న సిమెంట్ బెంచీ క్రింద పెట్టడం - వెన్నెలలో తన గదిలో నుంచి స్పష్టంగా కనిపించింది. ఆ విషయం బయట పెట్టేస్తే గాని తనకు మనశ్శాంతి ఉండదు.

"ఆ బ్రీఫ్ కేస్ ఎక్కడికీ పోలేదు!" అందామె హటాత్తుగా.

అందరికీ మతి పోయినట్లయింది.

ఇన్ స్పెక్టర్ అదిరిపడ్డాడు.

"ఎక్కడికి పోలేదా?" కన్యక నడిగాడతను ఆత్రుతగా.

"లేదు"

"పోకపోతే ఎక్కడుంది?"

"చెరువు దగ్గరున్న సిమెంట్ బెంచి కింద --"

ఆ మాట వింటూనే వర్ధనరావు స్ప్రింగ్  లా ఎగిరాడు.

"ఇంపాజిబుల్!" అన్నాడు గాభరాగా.

ఇన్ స్పెక్టర్ తన తల రెండు చేతుల్తోనూ పట్టుకున్నాడు. ఇంకెక్కడి ఫారిన్ విస్కీ! ఈ పిచ్చాళ్ళతో ఇంకాసేపు మాట్లాడితే పూర్తిగా దిగిపోతుందంతా! చచచ! ఇలాంటి వాళ్ళ మూలాన పోలీస్ ఉద్యోగం పూర్తిగా నిషా కోల్పోతుంది.

"ఏమిటి నువ్వలా అరచావు?" వర్ధనరావు నడిగాడతను.

వెన్నెల వేట పేజి 56

"ఆ బ్రీఫ్ కేస్ అక్క డెందుకుంటుంది సార్! ఉండదు"- అన్నాడు వర్ధనరావు.

"ఉంటుంది!" అంది కన్యక.

"ఉండదు!"

"ఉంటుంది....."

"స్టాపిట్!' గట్టిగా అరిచాడు ఇన్స్ పెక్టర్.

"అవున్సార్! బ్రీఫ్ కేస్ అక్కడుండటం అసాధ్యం!"

ఇన్స్ పెక్టర్ ఓ క్షణం ఆలోచించాడు. 'అతని మాటలు సమంజసం గానే కనిపించి మెచ్చుకోలుగా చూశాడతని వేపు.

కరెక్ట్! బ్రీఫ్ కేస్ లు చెరువుల దగ్గరా పార్కుల దగ్గరా ఎందుకుం టాయ్" అన్నాడతను.

"ఎందుకంటే ఆ బెంచీ కింద పెట్టటం నేను చూశాను--"

ఇన్ స్పెక్టర్ మళ్ళీ చిరాకేసు కొచ్చింది. దొరక్క దొరక్క తనకు ఫారిన్ బాటిల్

దొరికితే ఏమిటా తద్దినం?

"ఇంత రాత్రప్పుడు మీరు చెరువు దగ్గర కెందు కెళ్ళారు?"

"నేను వెళ్ళలేదు. నా గది బాల్కనీ లోంచి చూశాను-----"

"ఏం చూశారు"

"బ్రీఫ్ కేసు సిమెంట్ బెంచి కింద పెట్టటం!"

"ఎవరు పెట్టారు?"

"వర్ధనరావు...."

వర్ధనరావు వణికిపోయాడు.

"నేనా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును" అంది కన్యక.

"ఇంపాజిబుల్! నేనసలు ఇంట్లో లేనుగా! ఇప్పుడే సింగారంలో సెకెండ్ "షో" సినిమా చూసి వచ్చాను ...." అన్నాడతను.

"అల్ రైట్ - అల్ రైట్--" అరిచాడు ఇన్స్ పెక్టర్, "పదండి! ఆ చెరువు దగ్గర కెళ్ళి చూద్దాం!"

అందరూ పెద్ద ఊరేగింపుగా చెరువు దగ్గర కెళ్ళారు.

ఇద్దరు కానిస్టేబుల్స్ సిమెంట్ బెంచి కింద చెట్ల గుబుర్లన్నీ వెతికారు. వర్ధనరావు కాళ్ళూ చేతులు వణికి పోతున్నాయ్. తనిక దొరికిపోవటం ఖాయం!

"ఏమీ లేద్సార్!" రెండు నిమిషాల తర్వాత అన్నారు కానిస్టేబుల్స్.

వర్ధనరావుకి మతి పోయినట్లయింది. దాంతో పాటు ఏడుపు కూడా వచ్చేసింది.

"లేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"లేదు...."

"లేకపోవట మేమిటి?" ఇందాకే ......" అని నాలిక్కరుచుకుని తనూ బెంచి కింద వెతికాడు. అతని ముఖం పాలిపోయింది. తను ఆ బెంచీ కింద బ్రీఫ్ కేస్ పెట్టి గంటయినా కాలేదింకా! ఇంతలో ఏమయి పోయినట్లు?"

"వాట్ మిస్! ఇతను ఆ బ్రీఫ్ కేస్ ఇక్కడ ఉంచటం మీ కళ్ళారా చూశానన్నారు కదా!"

"అన్నాను......" అంది కన్యక.

"అయితే ఏది మరి?"

కన్యక టార్చ్ లైట్ తీసుకుని ఆ చుట్టుపక్కలున్న పొదలన్ని కూడా వెదకటం ప్రారంభించింది. ఆమెతో పాటు భవానీ శంకర్, మారుతీరావ్, శమంతకమణి కూడా తీవ్రమైన గాలింపు మొదలుపెట్టారు. పది నిమిషాలయిపోయింది.

"స్టాప్ దిస్ నాన్సెన్స్ " అరిచాడు ఇన్ స్పెక్టర్.

అందరూ వెతకడం ఆపేశారు.

"నేనొచ్చింది మీ చెట్లూ పుట్టలు వెతకటానిక్కాదు. సినిమా డైరెక్టరంరారోకళ్ళు,

డిటెక్టివ్ అంటా రొకళ్ళు - దీప్ చంద్ వేషంలో ఉన్నది వాడెవడో చంద్ర శేఖర్ అంటా డొకడు ఫోనులో - బ్రీఫ్ కేస్ పోయిందంటా దొకళ్ళూ  లేదు సిమెంట్ బెంచీ కింద ఉండతారు మరొకళ్ళు అదేమో ఎక్కడా కనిపించదు. వాటీజ్ దిస్ నాన్సెన్స్?" అరిచాడతను.

అప్పల్రాజు కి వళ్ళు మండిపోయింది.

"ఇన్ స్పెక్టర్ ! యూ కెన్ గో నౌ!" అన్నాడు శాంతంగా.

"మీరే పిలిపించారు నన్ను...."

"యూ కెన్ గో నౌ...."

"అల్ రైట్ - ఇంకోసారి పిలుస్తే చూడండి! ఛస్తే రాను-"

"యూ కెన్ గో నౌ-"

ఇన్ స్పెక్టర్ కోపంగా తన జవాన్లను వేసుకెళ్ళి పోయాడు. అందరూ మళ్ళీ ఊరేగింపుగా ఇంట్లో కొచ్చారు.

"సారీ మిస్టర్ దీప్ చంద్! నిన్ను వీడు దొంగ అన్నందుకు సారీ!" మారుతీ రావ్ వంక కోపంగా చూస్తూ అన్నాడు అప్పల్రాజు.

"దట్సాల్ రైట్ సార్! కానీ వెంటనే అతనికి షాక్ లు ఇప్పించటం చాలా అవసరం...."

"బాగా ముదిరి పోయిన దశకు చేరికుందంటావ్...."

"అవున్సార్....అందుకే ఇందాక శమంతకమణి గారిని కిందకు తోసి

పడేశాడు...."

"అవును! దొంగ వెధవ! వీడిని డిస్మిస్ చేయించేస్తాను-" అందామె ఆ విషయం గుర్తుకు రాగానే.

"వద్దు మేడమ్! అంత పెద్ద శిక్ష అనవసరం --కేవలం రెండు 'షాక్' లు ఇస్తే బాగయిపోతాడు! ఇంకేం ప్రాబ్లం ఉండదు...." జాలిగా అన్నాడు భవానీ శంకర్. "సైక్రియాట్రిస్ట్ గాంధీని పిలిపించండి.

అప్పల్రాజు టైం చూచుకున్నాడు . ఉదయం మూడు గంటలయి పోయింది.

"అల్ రైట్ - ఉదయం మాట్లాడుకోవచ్చు - నిద్ర పాడయిపోయింది. పదండి!" అన్నాడతను.

అందరూ ఎవరి గదులకు వాళ్ళు చేరుకున్నారు. అప్పలరాజు కి మాత్రం వెంటనే నిద్ర పట్టింది గానీ మిగతా వారెవరికీ నిద్ర పట్టలేదు.

"ఆ బ్రీఫ్ కేస్ ఎవరు కాజేసుజుపోయారు?" అని ఆలోచిస్తుంది శమంతకమణి.

"దీప్ చంద్ బండారం ఎలా బయట పెట్టడమా?" అని ఆలోచిస్తుండిపోయాడు మారుతీ రావ్.

"వర్ధనరావు బెంచి కింద పెట్టిన బ్రీఫ్ కేస్ అంతలోనే ఏమయిపోయిందా?" అని ఆలోచిస్తుండి పోయింది కన్యక.

అసలు వర్ధనరావుకి బ్రీఫ్ కేస్ ఎలా దొరికిందా అని భవానీ శంకర్ ఆలోచిస్తున్నాడు.

తను స్వయంగా తన చేతుల్తో సిమెంట్ బెంచీ కింద పెట్టిన బ్రీఫ్ కేస్ గంట

వ్యవధిలో ఎలా మాయమయిపోయిందా అని వర్ధన రావు ఆలోచిస్తున్నాడు.

"వెధవ ఇల్లు! వెధవ ఊరు - మందు కూడా కడుపు నిండా దొరకదు -' అని విసుక్కుంటున్నాడు దీపక్.

వాళ్ళలా ఆలోచిస్తుండగానే చటుక్కున తెల్లారిపోయింది. అందరూ లేచి రడీ అయి కాఫీ ఫలహారాల కోసం డైనింగ్ హాల్ చేరుకున్నారు.

"ఓ.కే. రైటర్ దీప్ చంద్!' ఆత్మకథ రాయటం ఇంక కుదరదు గనుక - మీరు వెళ్ళిపోవచ్చు- " అన్నాడు అప్పలరాజు.

వెన్నెల వేట పేజి 57

"అల్ రైట్ సార్-"

"మీరు కూడా వెళ్ళిపోవచ్చు మిస్ కన్యకా"

"యస్సార్-" అన్యమనస్కంగా అందామె. ఇంత హటాత్తుగా ఈ వాతావరణం నుంచి దూరమవాలంటే ఏదో తెలీని బాధగా ఉందామేకి. భవానీ శంకర్ తో పాటు మాట్లాడుతూ అతను చేసే తమాషాలు చూస్తూ - నవ్వుకుంటూ, కోపగించుకుంటూ అతన్ని నిందిస్తూ , అంతలోనే ప్రేమిస్తూ - గడిపే ఈ జీవితం ఎంతో మధురంగా ఉంది. బహు కొద్ది రోజులే కావచ్చు , కానీ తన జీవితమంతా అపూర్వంగా హృదయంలో దాచుకోవాల్సిన విలువయిన రోజులు!

"మీ ఇద్దరికీ నిస్తానన్న మొత్తం మాత్రం మాట ప్రకారం ఇచ్చేస్తాను -" అన్నాడు అప్పల్రాజు.

భవానీ శంకర్ ఆశ్చర్యపోయాడు.

"డోంట్ బాదర్ సార్! మన వర్క్ అవలేదు కనుక - మీరు నాకేమీ ఇవ్వనవసరం లేదు"-

కన్యక మనసంతా భవానీ శంకర్ మీద గౌరవంతో నిండిపోయింది. అతను దీప్ చంద్ పేరుతొ ఇక్కడికి రావడంలో - ఒకవేళ అప్పల్రాజు ఇస్తానన్న పాతికవేల రూపాయల మీద ఆశ కూడా ఉందేమో అని అనుకుంది తను. కాని ఇప్పుడు తెలిసింది. అతను కేవలం తన కోసమే - ఇక్కడి కొచ్చాడు - అదీ ఇంత రిస్క్ తీసుకుని.

"నాకు డబ్బేమీ వద్దండి!" అంది కన్యక నెమ్మదిగా.

"నాన్సెన్స్ - వద్దేమిటి - ఇస్తాను! ఎలా తీసుకోరో చూస్తాను-" అన్నాడు అప్పల్రాజు.

హటాత్తుగా దీపక్ వచ్చేశాడక్కడికి.

"హలో ఫ్రెండ్స్ ! అయామ్ సారీ! ఆలస్యంగా జాయిన్ అవుతున్నందుకు -' అంటూ భవానీ శంకర్ ప్రక్కనే కూర్చున్నాడు.

"హలొ భవానీ! నువ్వు కనిపించలేదేం గురూ? రాత్రంతా నీ కోసం తెగ వెతికాను-" అన్నాడతను.

శమంతకమణి ఉలిక్కిపడింది.

"అతని పేరు భవానియా?"

"యస్ మేడమ్! భవానీ శంకర్! వెరీ గుడ్ ఫెలో! కాలేజ్ లో మేమిద్దరం లాస్ట్

బెంచిలో కూర్చునే వాళ్ళం-"

మారుతీరావ్ ఎగిరి గంతేశాడు.

"చూశారా - చూశారా - నేను చెప్పలేదూ - అసలు పేరు భవానీ శంకర్- దీప్ చంద్ కాదు-"

అప్పల్రాజు కోపంగా దీపక్ వేపు చూశాడు.

"ముందు ఈ దీపక్ ను బయటకు పంపించు - " అన్నాడు మారుతీరావ్ తో.

దీపక్ ఆశ్చర్యపోయాడు.

"సంగతేమిటి సార్! ఎనీ థింగ్ రాంగ్?" అడిగాడు అప్పలరాజుని.

"లేకపోతే ఏమిటా పిచ్చివాగుడు ! అప్పుడేమో - దీప్ చంద్ ని అసలు నీ జన్మలో చూడలేదన్నావ్ - ఇప్పుడేమో - క్లాస్ మేట్ భవానీ శంకర్ అంటున్నావ్ - ' కోపంగా అన్నాడు అప్పలరాజు.

"భవానీ శంకర్ ని నేను జన్మలో చూడ లేదన్నానా?"

"యస్-"

"ఇంపాజిబుల్-"

భవానీ శంకర్ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

'అప్పల్రాజు గారూ ! మీరు క్షమిస్తానంటే ఓ విషయం చెప్తాను అన్నాడు వినయంగా.

అప్పల్రాజు చిరాకుగా చూశాడు భవానీ శంకర్ వేపు.

"వాటీజ్ దట్?"

"నేను – దీపక్ చెప్పినట్లు – నిజంగా దీప్ చంద్ ని కాదు–"

"వ్వాట్?"

"అవున్సార్ ! నా పేరు భవానీ శంకరే! ఆరోజు దీప్ చంద్ నా దగ్గర కొచ్చి తను ఈ స్క్రిప్ట్ రాయదల్చుకోలేదనీ – ఆ విషయం మీకు తెలియ జేయమనీ చెప్పి – నన్ను మీ హోటల్ రూమ్ కి పంపించాడు, తీరా నేను వచ్చేసరికి మీరు నన్నే దీప్ చంద్ అనుకుని మాట్లాడటం మొదలు పెట్టారు...."

"అయితే ఆ పాతిక వేల కోసం మమ్మల్ని మోసం చేశావన్న మాట.....అంది శమంతకమణి.

"కాదు మేడమ్! పాతికవేల కంటే ....అసలు డబ్బు కంటే ఆ మాట కొస్తే ఈ ప్రపంచ మంతటి కంటే విలువయిన ఓ వస్తువు కోసం – దీప్ చంద్ పేరుతొ వచ్చాను.....

"ఏమిటా వస్తువు?"

"కన్యక–"

అందరూ కన్యక వేపు చూశారు.

కన్యక ముఖం సిగ్గుతో ఎరుపెక్కి పోయింది. వాళ్ళ చూపులు భరించలేక తల వంచేసుకుంది.

"కన్యక కోసమా?"

″అవును?″

″కన్యక కోసం .....దీప్ చంద్ వేషం ఎందుకు?″

″కన్యక కు సమీపంగా ఉండి ఆమె ప్రేమను పొందాలి కనుక....మీరు హోటల్లో నన్నే దీప్ చంద్ అనుకోవటం – అప్పుడే కన్యక మీ దగ్గరకు సెక్రటరీ గా వస్తోందని తెలియటం .....మూలాన ఆ అయిడియా బాగానే ఉందని ఆ పాత్రలోకి షిఫ్టయిపోయాను....″

మనో చిత్ర ముఖం బాధతో నిండిపోయింది. ″ఇంత మోసం చేస్తారా?″ అంది కోపంగా.

″అన్ ఇంటేన్షనల్ డియర్.... కేవలం కన్యక కోసం మాత్రమే ....″

అతని చెంప మీద గట్టిగా కొట్టి అక్కడి నుంచి కన్నీరు తుడుచుకుంటూ తన గడివేపు పరుగెత్తిందామె. ఆ దృశ్యం కన్యకకి విపరీతమయిన అనందం కలిగించింది.

″పోలీస్ కి ఫోన్ చేద్దాం!″ అన్నాడు మరుతీరావ్.

″షటప్....″ అన్నాడు అప్పల్రాజు ″మిస్టర్ భవానీ శంకర్! మీలాంటి డేరింగ్ ఫెలోస్ అంటే నా కిష్టం!″ అసలు మీరు రచయిత కందంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. నా అత్మకథను అంత చక్కగా డిక్టేట్ చేయగలిగి ....మీరు రచయిత ఎందుకు కాలేదసలు?″

″ఎందుకంటే రచయిత అవాలంటే ఓ పత్రిక మన చేతిలో ఉండాలి గద్సార్! అప్పుడే దాన్నిండా పబ్లిసిటీ చేసుకుంటూ – అర్జంటుగా రచనలు చేసుకోడానికి

వీలవుతుంది."

"రచయితవాలంటే ఓ పత్రిక చేతిలో ఉండాలా? అల్ రైట్! నేనే పెడతానో పత్రిక! నువ్వే దానికి ఎడిటర్! ఒకే!"

"ఒకే - సార్- థాంక్యూ వెరీ మచ్-"

అందరూ అక్కడి నుంచి బయల్దేరారు.

వెన్నెల వేట పేజి 58

భవానీ శంకర్ తో పాటు అతని గదిలోకి పరుగెత్తాడు వర్ధనరావు.

"గురూ, నేను బెంచి కింద పెట్టిన ఆ బ్రీఫ్ కేస్ ఏమయినట్లు అసలు,

"అదేమయిందో తర్వాత ఆలోచిద్దాం బ్రదర్, అసలు నీకా బ్రీఫ్ కేస్ ఎలా దొరికింది?"

"అదేమిటి! నువ్వే కిటికిలో నుంచి గార్డెన్ లోకి విసిరేస్తానని - విసిరేశావు కదా?

"నేను వేయలేదు బ్రదర్!"

"మరెవరు పడేశారు?"

"అదే ,మిస్టరీ-"

"సరే పోనీ - దేవుడే నా ప్రేమ సక్సెస్ అవాలని విసిరేశాడనుకో గురూ, మళ్ళీ గంటలో ఎలా మాయమయి పోయినట్లు?"

"అది ఇంకా పెద్ద మిస్టరీ-"

ఇద్దరూ తలలు చేత్తో పట్టు కూర్చున్నారు.

"విచారించకు బ్రదర్, బెటర్ లాక్ నెక్స్ట్ టైం"

"అంటే నా ప్రేమ గతి అంతేనా గురూజీ"

"డోంట్ వర్రీ బ్రదర్ - అప్పలరాజు గారు పెట్టబోయే పత్రికలో నువ్వు నా అసిస్టెంట్ ఎడిటర్ వి కనుక - శిరీష ఫాదర్ చచ్చినట్టు వప్పుకుంటాడు-"

"మరి అంతవరకూ?"

"అంతవరకూ గార్డెన్ లో డ్యూయెట్ పాడుకోండి బ్రదర్. అద్భుతమైన గార్డెన్స్ ఉన్నాయి ఇక్కడ."

"కారు రడీ సార్" అన్నాడు మారుతీరావు వినయంగా వచ్చి.

* * * *

సింగారం ఊరు దాటగానే కారు ఆపేశాడు కిరతకరావు . కారు దొంగాలించుకుని వెళ్ళటం ప్రమాదం కనుక - కారు అక్కడే వదిలేసి బ్రీఫ్ కేస్ తో నడిచి కొంత దూరం వెళ్ళి ఏదొక లారీలో హైదరాబాద్ చేరుకోవాలని అనుకున్నాడతను! అయితే 'తానొకటి తలచిన దైవమొకటి తలచును' స్కీమ్ టక్కున అమలులో కొచ్చింది మళ్ళీ. కారు దిగేలోగానే 'కదలకు" అన్న గొంతు వినిపించింది వెనుక సీటులోంచి ఆ గొంతుతో పాటు శ్యామలా రాణి తాలుకూ పిస్టల్ కూడా అతని మెడకు చల్లగా తగిలింది.

"నువ్వా' అన్నాడతను.

"నన్ను మోసం చేయటం చాలా కష్టం కిరతకరావ్, నీ తెలివి తేటలు చాలా

పెరిగినాయ్ కానీ నన్ను మాత్రం ఎప్పటికీ మించలేవు" అంది శ్యామలా రాణి.

"రత్నా-"

"నా పేరు శ్యామలా రాణి అని ఓసారి చెప్పాను-"

"శ్యామలా రాణి - జరిగిందేమిటంటే....'

'అనవసరం --ఆ బ్రీఫ్ కేస్ ఇటివ్వు -- 'వన్ - టూ - త్రీ -- అనే లోగా!"

'మనిద్దరం ఫిఫ్టీ - పిఫ్టీ - తీసుకుందాం పోనీ -'

'వన్-'

'పోనీ - నీ ఇష్టమొచ్చి నంత వాటా ఇవ్వు!'

'టూ-'

కిరతకరావు రిస్క్ తీసుకోదల్చుకోలేదు. బ్రీఫ్ కేస్ అమాంతం పైకెత్తి ఆమె కందిస్తున్నట్లు నటించి, కావాలనే దాని మూత ఓపెన్ చేశాడు. వెంటనే శ్యామలా రాణి వళ్ళో కుప్పగా పడిపోయినాయ్ డిటెక్టివ్ పుస్తకాలు, ఇద్దరూ కారు లైటు వెలుగులో తెల్లముఖం వేసుకుని వాటివంక చూస్తుండిపోయారు కొద్ది క్షణాలు.

'ఇది - శమంతకమణి నా కిచ్చిన బ్రీఫ్ కేస్ - నీకెలా వచ్చింది? అడిగిందామె కోలుకుని.

'కాదు - ఇనపెట్టేలో నుంచి నేనే తీశానిది . కాని ఎవరో గదిలో కోస్తున్న శబ్దం వినిపించేసరికి కిటికీ లో నుంచి బయట గార్డెన్ లో పడేశాను-" అన్నాడు కిరతకరావు.

"ఊహు కాదు! నేనే అది నకిలీ సామానున్న బ్రీఫ్ కేసని తెలుసుకుని రాత్రి రెండింటికీ నా కిటికీ నుంచి గార్డెన్ లోకి విసిరి పారేశాను అందామె.

ఇద్దరికీ ఆసలెం జరిగిందో అర్థం కాలేదు.

'ఇంక పద – నడిచి పోదాం – లేకపోతే పోలీసులు ఈ కారు కోసం వెతుకుతూ రావచ్చు–' అన్నాడతను.

ఇద్దరూ దిగులుగా నడవసాగారు వెన్నెలలో.

* * * *

భవానీ శంకర్ మేడ దిగి బయట పోర్టికోలో కొచ్చాడు. అప్పటికే కారులో కూర్చుని ఉంది కన్యక.

అప్పలరాజు , శమంతకమణి, మనో చిత్ర, నౌకర్లు, వర్ధనరావ్ అంతా నిలబడి ఉన్నారక్కడ.

'ఒ వారం పది రోజుల్లో హైదరాబాద్ వస్తాను రైటర్! అప్పుడు మాట్లాడదాం – మనం పెట్టబోయే వీక్లీ విషయాలన్నీ –' అన్నాడు అప్పలరాజు.

"వెల్ కమ్ సార్!"

"మరి నీ అడ్రసేమిటి?

"కేరాఫ్ కన్యక....'

'ఓ! అయితే అంతా సేటిల్ట్ అన్నమాట!"

"కంప్లీట్లీ సేటిల్డ్ సార్–"

'వెల్! కారీ అన్–"

"థాంక్యు సర్–'

నమస్కారం చేశాడతను. మనో చిత్ర పరుగుతో వచ్చిందక్కడికి. "ఆయామ్ సారీ!" అంది భవానీ శంకర్ తో.

"దట్సాల్ రైట్ డియర్! మన వారపత్రికలో రెండు సీరియల్స్ ఒకేసారి నీవే వేసేస్తాం కనుక రడీగా ఉండు – " చెప్పాడతను.

కారు బయలుదేరింది. కొద్ది దూరం వెళ్ళిందో లేదో "డ్రైవర్ కారాపు!" అంది కన్యక . కారాగింది.

ఎదురుగ్గా శిరీష సైకిల్ మీద వస్తూ కనిపించింది.

డోర్ తెరచుకుని దిగి నిలబడ్డాడు భవానీ శంకర్, కన్యక.

"హలో – " సైకిల్ దిగి ఆనందంగా పలుకరించింది శిరీష. "ఎక్కడికి వెళుతున్నారు?"

"ఇంటికి" అంది కన్యక.

వెన్నెల వేట పేజి 59

"అప్పుడేనా?"

"అవును, మనకింకా పనేముందిక్కడ! రాత్రి ఆ డయిరీ వగైరాలు – ఎవరో ఎత్తుకు పోయారు కదా!"

శిరిష గట్టిగా నవ్వేసింది.

"ఎవరో ఏమిటి? నేనే కొట్టేశానవి-"

కన్యకతో పాటు భవానీ శంకర్ కూడా ఉలిక్కిపడ్డాడు.

"నువ్వా?"

"అవును!"

"నువేలా కాజేశావ్?"

"అదే మన గ్రేట్ నెస్! భవానీ శంకర్ గారూ, వర్ధన రావ్ కలసి వాటిని రాత్రి ఎలా కాజేయదల్చుకుంది - నాకు చెప్పాడు వర్ధనరావ్, కానీ అంత విలువయిన వాటిని అలా చెరువు దగ్గర సిమెంట్ బెంచీ క్రింద దాయటం - ప్రమాదకరం అనిపించింది నాకు. ఎలాగయినా ఆ రాత్రికే ఆ బ్రీఫ్ కేస్ ని అక్కడి నుంచి తీసివేస్తే బాగుంటుందనిపించి పబ్లిషర్ కి ఫోన్ చేశాను. అతను సాయంత్రానికల్లా వచ్చేసాడు. ఇద్దరం కలసి రాత్రి రెండు దాటాక చెరువు వెనుక ఉన్న గోడ దూకి వెళ్ళి అది తీసుకొచ్చేశాం - పబ్లిషర్ వెంటనే యాభయ్ వేలు కాష్ ఇచ్చి వాటన్నిటిని తెల్లారే వరకూ చలిమంట వేసుకుని వెళ్ళిపోయాడు-'

కన్యకు నోట మాట రాలేదు.

"వెల్ డన్ మైడియర్ శిరిషా! వెల్ డన్! ఆమె భుజం తట్టాడు భవానీ శంకర్ ఆనందంగా.

'థాంక్యు - ఇంక వస్తాను కన్యకా! ఈ విషయం వర్ధనరావ్ కి చెప్పాలి! లేకపోతే హార్ట్ ఫెయిలయిపోతుందతనికి!"

"యస్ డియర్! హరియప్! ఈపాటికి ఫస్ట్ స్ట్రోక్ వచ్చి ఉంటుంది.'

ఆమె వెళ్ళిపోయింది.

కారు మళ్ళీ బయల్దేరింది.

కన్యకకు జరిగినదంతా తలచుకుంటే నవ్వాగలేదు. హటాత్తుగా విరగబడి నవ్వేయసాగింది ఎంత ప్రయత్నించినా అపుకోవటం సాధ్యం కావటం లేదు.

"హలో వాట్ హాప్పేన్డ్ ఫ్రెండ్! ఏమిటి మీ అదుపు తప్పిన ఆనందానికి కారణం?" ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడతను.

"యూ ఆర్ రియల్లీ మాడ్ -' అందామె ఇంకా నవ్వుతూనే.

'ఆఫ్ కోర్స్ డియర్! వప్పుకుంటాను అయాం మాడ్ ఆఫ్టర్ యూ-"

కన్యక మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ఇలాంటి మాడ్ ఫెలో జీవితం గడపటం నిజంగా ఎంత థ్రిల్లింగ్ గా ఉంటుంది? అనుక్షణం - ఏదొక హడావుడి - ఏదొక సందడి - ఏదొక సరదా - ఏదొక తమాషా - ఏదొక వింత.

ఇతనిలాంటి వ్యక్తి కోసమే ఇంతకాలంగా తను ఎదురు చూస్తోంది. తను కోరుకునేది అలాంటి జీవితమే!

చప్పటి సాదా రొటీన్ సంసారం కాదు తనక్కావలసింది.

పెళ్ళయ్యాక కూడా ప్రియుడి లాగానే మసలగల మనస్తత్వం అతని కుండాలి. అదే భవానీ శంకర్!

నవ్వుతూ కన్నీరు తుడుచుకుంటూ అతని భుజం మీద తల వాల్చిందామె.

"మైడియర్ వెన్నెలా! నీకోసం ప్రారంభించిన వేట ఇప్పటికి ముగిసింది!' ఆమె చెవిలో చెప్పాడతను.

అదే సమయంలో మాజీ మంత్రి అప్పలరాజు లైబ్రరీ గదిలోకి హడావుడిగా జొరబడ్డారు ఇద్దరు వ్యక్తులు.

"నమస్కారం సార్! మమ్మల్ని సైక్రియాట్రిస్ట్ గాంధీగారు పంపించారు."

"సైక్రియాట్రిస్ట్ గాంధీయా?"

"అవున్సార్!"

"ఎందుకు పంపించారు?"

"మీ దగ్గరెవరో పేషెంట్ ఉన్నారట! రెండు 'షాక్' లు ఇవ్వాలని చెప్పారట మీరు –"

"ఓ మారుతీ రావు! మా సెక్రటరీ మారుతీరావు కి రెండు 'షాక్ ' లు ఇవ్వాలని సజెస్ట్ చేశాడు ఆ రైటర్ – తీసుకెళ్ళండి! ఆ మూల గదిలో ఉంటాడు–"

వాళ్ళిద్దరూ సెల్యూట్ కొట్టి మారుతీరావు గదిలో కెళ్ళారు. మరుక్షణంలో గట్టిగా కేకలు పెడుతూ , కాళ్ళూ చేతులు కొట్టుకుంటున్న మారుతీరావుని వాళ్ళిద్దరూ లాక్కుపోవటం ఆనందంగా గమనించాడు అప్పల్రాజు.

సమాప్తం